ఈనాడు

విజయవాడ 22-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 13

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

జీఎస్టీ సంస్కరణలకు జై

రాష్ట్రాల మంత్రుల కమిటీ అనుకూలం

ఆదాయ నష్టంపై లెక్కలు తేల్చాలని కోరిన విపక్ష పాలిత రాష్ట్రాలు



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జీఎస్టీ సంస్కరణలకు రాష్ట్రాల మంత్రుల కమిటీ సూత్ర ప్రాయంగా ఆమోదం తెలిపింది. అయితే రేట్ల తగ్గింపువల్ల కలిగే ఆదాయ నష్టంపై లెక్కలు తేల్చాలని, వాటిని ఎలా పూడ్చుకోవాలో తెల పాలని విపక్ష పాలిత రాష్ట్రాలు కోరాయి. కేంద్రం ప్రతిపాదనలపై గురువారం బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి అధ్యక్ష తన మంత్రుల కమిటీ సమావేశమైంది. సామాన్యులకు మేలు కలిగేటట్లయితే జీఎస్టీ రేట్ల కోత తమకు ఆమోదయోగ్యమేనని కమిటీ అభిప్రాయపడింది. (మిగతా 11లో)

రాష్ట్రానికి 'మోలర్-మేర్స్క్' సంస్థ

పోర్టు లాజిస్టిక్స్ రంగంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి

10 వేల మందికి ఉపాధి

మారిటైం బోర్డుతో ఎంఓయూ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల్లో లాజిస్టిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి.. పోర్టుల నిర్వహణకు ఎ.పి. మోలర్-మేర్స్క్ (ఏపీఎం) టెర్మినల్ సంస్థ ఆసక్తి చూపింది. డెన్మార్క్‌కు చెందిన ఈ సంస్థ పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలు, ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌లను పలు దేశాల్లో నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని ఓడరేవుల్లో ఆధునిక టెర్మినల్స్, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థల ఏర్పాటుకు దశలవారీగా రూ.9వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు (మిగతా 11లో)

నాలా చట్టం రద్దు

ముసాయిదాకు మంత్రివర్గ ఆమోదం

- పట్టణాల అభివృద్ధికి ఛార్జీల వసూళ్లు
- ఆ నిధితో పట్టణాల్లో రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణం
- పర్యాటక ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేయాల్సిందే
- లేకుంటే భూకేటాయింపులు రద్దు
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు



ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో నాలా చట్టం రద్దు ముసాయిదా బిల్లును మంత్రిమండలి ఆమోదించింది. ఈ చట్టం రద్దు నేపథ్యంలో మరిన్ని పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ చట్టాలకు సవరణలు చేసేందుకు నిర్ణయించింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మళ్లించే విధానంలో ఏక రూప ప్రక్రియను తీసుకురానున్నారు. పట్టణాభివృద్ధి సంస్థల్లో ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఛార్జీలు వసూలు చేస్తారు. అలా వచ్చే మొత్తాన్ని ఆయా ప్రాంతాల్లో పెద్ద పెద్ద రోడ్లు, ఫ్లై ఓవర్లు, ప్రాంతీయ పార్కులు, ఇతర నగర సౌకర్యాలు కల్పించేందుకు ఖర్చు చేస్తారు. ఇందు కోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994లోని సబ్ సెక్షన్ 3లో సబ్ సెక్షన్ 60 కింద అదనంగా మరో క్లాజ్ చేరుస్తూ ఆర్డినెన్స్ రూపొందించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలియజేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్లకు వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అభివృద్ధికి భూములు కేటాయించే విధానాల్ని మార్చబోతున్నారు. భూములు కేటాయించే క్రమంలో ఆయా సంస్థల అనుభవం, డీపీఆర్‌ల మూల్యాంకనం, ప్రాజెక్టు అమలు కాలపరిమితి వంటివి పరిగణనలోకి తీసుకుంటారు. దరఖాస్తుదారు అంచనా వేసిన ప్రాజెక్టు వ్యయంలో 50% నెట్‌వర్త్ ఉండాలి. పేరెంట్ కంపెనీకి 76% వాటా ఉండాలి. కన్సార్షియంలో గరిష్ఠంగా ముగ్గురు సభ్యులు ఉండాలి. ప్రధాన సభ్యునికి 51%, మిగిలిన ఇద్దరికి కనీసం చెరో 20% వాటా ఉండాలి. పర్యాటక ప్రాజెక్టులకు భూమి అప్పగించిన మూడు నెలల్లోపు పనులు ప్రారంభించాలి. పెద్ద ప్రాజెక్టులను రెండేళ్లలోగా, మెగా ప్రాజెక్టులను మూడేళ్లు, అంతకన్నా మెగా ప్రాజెక్టులను నాలుగేళ్లలోగా పూర్తి చేయాలి. లేకపోతే కేటాయించిన భూములను రద్దు చేసేలా విధానం మార్చబోతున్నారు.

అమరావతిలో అభివృద్ధికి..

- అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు ఆమోదించాలని నిర్ణయం. ఆ సిఫార్సులకు అనుగుణంగా సీఆర్‌డీఏ కమిషనర్ తగిన చర్యలు తీసుకునేందుకు అనుమతి.
- రాజధాని ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటయిన విట్, ఎస్ఆర్ఎం విద్యాసంస్థల విస్తరణకు మరో 100 ఎకరాల చొప్పున భూ కేటాయింపులకు ఆమోదం. ఎకరం రూ.2 కోట్లకు కేటాయిస్తారు.
- అమరావతిలో ల్యాండ్ (మిగతా 11లో)

నాలా రద్దుతో ప్రజలు, వ్యాపారుల వెతలకు తెర
స్థిరాస్తి వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఊరట
అనుమతుల్లో జాప్యానికి శాశ్వత పరిష్కారం 3లో

ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించను
మంత్రివర్గ సమావేశంలో సీఎం హెచ్చరిక 2లో
ఎమ్మెల్యేల నియంత్రణ బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని స్పష్టీకరణ

కుప్పం, దగదర్తిల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు 2లో
పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం

నేడు కేంద్ర ఆర్థిక మంత్రితో చంద్రబాబు భేటీ
దిల్లీ చేరుకున్న సీఎం 11లో



ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ, శరద్‌పవార్, రాంగోపాల్ యాదవ్, తిరుచ్చి శివ తదితరులు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

సోనియా సహా పలువురు నేతల హాజరు

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీతో పాటు ఇతర మిత్రపక్షాల నేతల సమక్షంలో ఆయన నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అయిన రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి సమర్పించారు. నామినేషన్ పత్రాలపై సుమారు 160 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. పత్రాలను పరిశీలించిన రిటర్నింగ్ (మిగతా 11లో)

రాజ్ కెసిరెడ్డి ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం



- పిటిషన్ వేసేందుకు సిట్‌కు అనుమతినిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు
- మద్యం ముడుపుల సొత్తుతో.. హైదరాబాద్‌లో భూములు కొన్న నిందితుడు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తుతో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి.. హైదరాబాద్ నడిబొడ్డున, చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్న భూములు, స్థలాలు, బినామీ పేరిట నెలకొల్పిన ఓ కంపెనీ బ్యాంకు ఖాతాలోని డబ్బు జప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. పుస్తక ధర ప్రకారం ఆ భూములు, స్థలాల విలువ రూ.10.29 కోట్లు. మార్కెట్ విలువ రూ.50 కోట్ల పైమాటే. బినామీ కంపెనీ బ్యాంకు ఖాతాలోని రూ.3 కోట్లు కలిపి మొత్తంగా రూ.13.29 కోట్ల విలువైన స్థలాలు, భూములు, డబ్బు జప్తు కోసం న్యాయస్థానంలో పిటిషన్ వేసేందుకు సిట్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్ కెసిరెడ్డి 2021 ఆగస్టు నుంచి 2022 ఫిబ్రవరి మధ్య 7 నెలల్లో హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా (మిగతా 11లో)

జప్తు కోరేవి...

- భాగ్యనగరం చుట్టుపక్కల 30.20 ఎకరాలు
- గచ్చిబౌలిలోని 326 చదరపు గజాల స్థలం.. వీటి మార్కెట్ విలువ రూ.50 కోట్లపైనే
- బినామీ కంపెనీ బ్యాంకు ఖాతాలోని రూ.3 కోట్లు కూడా

తెలుగువారైన వెంకయ్యనాయుడు, బాలయోగిలకు మద్దతిచ్చారా?
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్న 3లో

రాజ్యాంగ వ్యవస్థలు పనిచేయకుంటే న్యాయస్థానాలు చేతులు కట్టేసుకోవాలా?
కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు 10లో

కేరళలో సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత

పార్లమెంటు నిరవధిక వాయిదా
చివరిరోజూ కొనసాగిన నినాదాలు 11లో

జులైలో శ్రీవారి లడ్డూ విక్రయాల్లో రికార్డు!



ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమలలో ఈ ఏడాది జులై 12న రికార్డు స్థాయిలో 4,86,134 లడ్డూలు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే రోజు 3.24 లక్షలు విక్రయించగా అది 35 శాతం వరకు పెరగడం విశేషం. దీంతో ఆ ఒక్కరోజులోనే లడ్డూల విక్రయం ద్వారా రూ.2.43 కోట్లు సమకూరింది. గత ఏడాది జులై నెలలో లడ్డూల ఉత్పత్తి (చిన్నవి 160-180 గ్రాములు) 1,04,57,550 ఉండగా ఈ ఏడాది జులైలో 1,25,10,300కు పెరిగింది. గత జులైలో 1,04,03,719 లడ్డూలు అమ్ముడుపోగా ఈ ఏడాది జులైలో 1,24,40,082 అమ్ముడుపోయాయి. దీంతో పాటు భక్తుల రద్దీ పెరిగినప్పుడు సరిపడా అవసరాల కోసం బఫర్ స్టాక్ కింద 4 లక్షలు పెట్టుకున్నారు.

ఎరువులు ఏమైనట్లు?

- రాష్ట్రానికి కోటా మేరకు వచ్చినట్లు గణాంకాలు
- పీఏసీఎస్, డీసీఎంఎస్, ఆర్ఎస్‌కేల్లో నిల్వలు నిల్
- మార్కెట్‌లో బస్తాకు రూ.200 వరకు అధికం
- పక్కదారి పడుతున్నా.. కఠిన చర్యలు కరవు



ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో యూరియా, డీఏపీ ఎరువుల ధరలను వ్యాపారులు పెంచేశారు. కొన్నిచోట్ల రైతులకు అందుబాటులో ఉంచడం లేదు. యూరియా బస్తా రూ.266 చొప్పున అమ్మాల్సి ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.350-375 వరకు వసూలు చేస్తున్నారు. డీఏపీ బస్తా రూ.1,350 కాగా, రూ.1,550 తీసుకుంటున్నారు. దీంతో రైతులు ప్రాథమిక సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు(డీసీఎంఎస్), రైతు సేవా కేంద్రాలకు(ఆర్ఎస్‌కే) వెళ్తున్నారు. అక్కడేమో స్టాక్ అరకొరగా ఉంది. పైగా పీఏసీఎస్‌లపై కొత్తగా నియమించిన త్రిసభ్య సంఘాల సిఫార్సులు అధికం కావడంతో 200 టన్నుల ఎరువులు వచ్చినా ఒక్కరోజులోనే ఖాళీ అవుతున్నాయి. కేటాయింపులు ఎక్కువగా తీసుకొని, రైతులకు సరిపడా అందించడంలో మార్క్‌ఫెడ్ వైఫల్యం కన్పిస్తోంది. భారీగా ఎరువులు పక్కదారి పడుతున్నట్లు కేంద్రం హెచ్చరిస్తున్నా, కఠిన చర్యలు లేవు.

సాగు తగ్గినా, పెరిగిన అమ్మకాలు

ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో ఈ ఏడాది ఇప్పటికి 65%లోపే పంటలు సాగయ్యాయని వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రసాయన ఎరువులు ఎక్కువగా వాడే మిరప, పత్తి సాగు కూడా తగ్గిపోయింది. (మిగతా 11లో)

వ్యవసాయశాఖలో ఒప్పంద ప్రాతిపదికన సేవలందించే 1,389 మంది ఎంపీఈవోల పదవి కాలాన్ని ప్రభుత్వం ఏడాది పొడిగించింది. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు వీరు కొనసాగుతారని ప్రభుత్వం పేర్కొంది.

అధికార భాషా సంఘానికి కృష్ణారావు పేరు ఖరారుపై బుద్ధప్రసాద్ హర్షం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్ర అధికార భాషా సంఘానికి 'మండలి వెంకట కృష్ణారావు రాష్ట్ర అధికార భాషా సంఘం'గా పేరు పెడుతూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంపై అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించను

- మంత్రివర్గ సమావేశంలో సీఎం హెచ్చరిక



మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారులు

ఈనాడు, అమరావతి: పార్టీ ఎమ్మెల్యేల్లో కొందరి వివాదాస్పద ప్రవర్తన వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. వారు పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో, దానికి ముందు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ దగ్గర జరిగిన తెదేపా మంత్రుల బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలోనూ... కొందరు ఎమ్మెల్యేల వివాదాస్పద వైఖరిపై చర్చ జరిగింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అటవీశాఖ ఉద్యోగుల మీద చేయిచేసుకోవడంపై లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అటవీశాఖ అధికారుల తప్పుంటే, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలే తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడమేంటని ప్రశ్నించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, కొలికపూడి శ్రీనివాస్, అబ్దుల్ నజీర్, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌లపై వచ్చిన ఆరోపణలు, వారి వివాదాస్పద వైఖరిని లోకేశ్ ప్రస్తావించినట్లు తెలిసింది. జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు తమ పరిధిలోని ఎమ్మెల్యేలతోనూ మాట్లాడాలని.. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే సహించబోమన్న విషయాన్ని వారికి స్పష్టం చేయాలని పేర్కొన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలను నియంత్రించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని స్పష్టంచేశారు. "స్త్రీశక్తి లాంటి పథకాలు ప్రజల్లోకి బాగా వెళ్లాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల గెలుపుతో పార్టీ కేడర్‌లో ఉత్సాహం పెరిగింది. పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేందుకు మనం కృషిచేస్తుంటే... కొందరు ఎమ్మెల్యేలు అనవసర వివాదాల్లో చిక్కుకోవడం వల్ల అదే హైలైట్ అవుతోంది" అని లోకేశ్ మండిపడినట్లు సమాచారం. హత్యకేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌కు పెరోల్ కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు సిఫార్సు చేయడం చర్చకు వచ్చింది. పెరోల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనితకు ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. కొందరికి దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడం వల్ల తమపై ఒత్తిడి పెరుగుతోందని ఎమ్మెల్యేలు ప్రస్తావించగా... వారిలో అర్హులెవరో తనిఖీ చేయించి త్వరలో పునరుద్ధరిద్దామని లోకేశ్ చెప్పినట్లు సమాచారం.

దస్త్రాల క్లియరెన్స్‌లో అధికారులతో పోటీ పడాలి

మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు దస్త్రాల క్లియరెన్స్‌కి ఎంత సమయం తీసుకుంటున్నారో మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చదివి వినిపించారు. మొత్తం 124 మంది జాబితాను ఆయన చదివారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు తాను 3,366 ఫైళ్లు క్లియర్ చేశానని, ఒక్కో దస్త్రానికి సగటున మూడురోజులు సమయం తీసుకున్నానని సీఎం చెప్పారు. అత్యధికంగా ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఒక్కో దస్త్రానికి 43 రోజులు తీసుకుంటున్నారని తెలిపారు. పౌరసరఫరాల శాఖలో సగటున ఒక్కో దస్త్రానికి 33 రోజులు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రి చెప్పగా... ఆ లెక్క తప్పని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తన దగ్గర దస్త్రాలేవీ పెద్దగా పెండింగ్‌లో ఉండవని, ఎండీయూ వాహనాల దస్త్రం బ్యాంకులతో ముడిపడి ఉన్నందున ఎక్కువ సమయం పట్టిందని సీఎం దృష్టికి తెచ్చారు. దస్త్రాల క్లియరెన్స్‌కి పట్టే సమయం.. మంత్రుల పనితీరుకు ప్రామాణికం కాదని చంద్రబాబు ప్రస్తావించినట్లు తెలిసింది. లెక్కల్లో పొరపాటు దొర్లితే పరిశీలిద్దామని పేర్కొన్నట్లు సమాచారం. మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, నారాయణ ఒకరోజు, లోకేశ్, సత్యకుమార్ యాదవ్ 2 రోజులు, పయ్యావుల కేశవ్ 15 రోజులు, బీసీ జనార్దన్‌రెడ్డి 10 రోజులు, ఆనం రామనారాయణరెడ్డి 9 రోజులు తీసుకున్నారని సీఎం వివరించారు. అధికారుల్లో వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధానకార్యదర్శి బుడితి రాజశేఖర్ అందరికంటే వేగంగా సగటున 18 గంటల్లో ఫైల్ క్లియర్ చేస్తున్నారని సీఎం తెలిపారు. కార్యదర్శులు, విభాగాధిపతుల్లో అత్యధికులు సగటున 2, 3 రోజుల్లోనే దస్త్రాలు క్లియర్ చేస్తున్నారని, మంత్రులు వారితో పోల్చి చూసుకుని, పోటీపడాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్, క్వాంటమ్ వ్యాలీపై ఆ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ప్రజంటేషన్ ఇచ్చారు. మనమిత్ర యాప్, క్వాంటమ్ వ్యాలీపై పవన్‌కల్యాణ్ కొన్ని ప్రశ్నలు వేసి, సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

అభివృద్ధి ఛార్జీలు పంచాయతీలకు ఇవ్వాలి: పవన్ కల్యాణ్

నాలా చట్టం రద్దుచేశాక.. వ్యవసాయ భూముల్ని వ్యవసాయేతర అవసరాలకు మార్చేలా అనుమతులకు అభివృద్ధి ఛార్జీలు ఎంత వసూలుచేయాలి? దానిలో స్థానిక సంస్థలకు ఎంత కేటాయించాలన్న విషయంలో చర్చ జరిగింది. 4% అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు తెలిసింది. ఆ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల పరిధిలో వసూలుచేసే మొత్తాన్ని పంచాయతీలకు ఇవ్వాలని, తద్వారా పంచాయతీలు బలోపేతం అవుతాయని సూచించారు. దానిపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ, అందుకు తగ్గట్లు మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

కుప్పం, దగదర్తిల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు

- అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐబీఎం ఫిజికల్ క్వాంటమ్ కంప్యూటర్
- మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం
- వెల్లడించిన సమాచార శాఖ మంత్రి పార్థసారథి



ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తిల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ రెండింటినీ పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన ముయిసాదా ఆర్ఎఫ్‌పీని ఆమోదించింది. హడ్కో రుణంతో భూసేకరణ, యుటిలిటీల బదిలీ ప్రక్రియ పూర్తిచేయడం, ప్రతిపాదిత విమానాశ్రయం కోసం మౌలిక సదుపాయాల కల్పన ప్రతిపాదనలకు మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రతిపాదించగా మంత్రిమండలి ఆమోదించింది. సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన దివంగత చంద్రయ్య కుమారుడు వీరాంజనేయులుకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు, అంతర్జాతీయ టెన్నిస్ ప్లేయర్ శ్రీ సాకేత్ సాయి మైనేనికి క్రీడా కోటా కింద డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం ఇచ్చేందుకు ఏపీ చట్టం-1994లోని సెక్షన్ 4ను సవరించేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. అధికార భాషా కమిషన్ పేరును 'మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా కమిషన్'గా మార్చే ప్రతిపాదనను ఆమోదించినట్లు వెల్లడించారు.

ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు

✦ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఈఓఐ) ఆధారంగా అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌లో ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్ ఇన్‌స్టలేషన్‌కు చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు వల్ల దేశంలోనే తొలిసారిగా ఒక ఫిజికల్ క్వాంటమ్ కంప్యూటర్ కలిగిన రాష్ట్రంగా ఏపీ నిలుస్తుంది.

✦ చిత్తూరు జిల్లా కుప్పం మండలం బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 7.74 ఎకరాల ప్రభుత్వ భూమి కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు ఉచితంగా అందజేత.

✦ గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 12.96 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.5.18 కోట్ల కేంద్ర నిధులతో యోగా, నేచురోపతి కేంద్రీయ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఆయుష్ శాఖ కమిషనర్‌కు భూముల అప్పగింత.

✦ అమరావతిలోని ఏపీసీఆర్డీయే కార్యాలయ భవనంలో నిర్మాణ పనులు, ఫినిషింగ్, ఐసీటీ, బాహ్య అభివృద్ధి పనులను రూ.160 కోట్లతో నిర్వహించేందుకు ఇటీవల పిలిచిన టెండర్లలో, ఖరారు చేసిన వాటిని ర్యాటిఫై చేసేందుకు ఆమోదం.

✦ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని 50 పడకల సీహెచ్‌సీ రూ.33.94 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రిగా ఉన్నతీకరణ. అదనంగా 56 పోస్టుల మంజూరు. చిత్తూరు జిల్లా నారావారిపల్లెలోని 30 పడకల సీహెచ్‌సీ 50 పడకల ఆస్పత్రికి ఉన్నతీకరణ. అదనంగా 18 పోస్టుల మంజూరు.

✦ మైలవరం మండలం వడ్డిరాల, దొడియం గ్రామాల్లో ఏపీ సౌర విద్యుత్తుసంస్థ ద్వారా అదానీ సౌర ఇంధన సంస్థకు 33 ఏళ్ల అద్దె ప్రాతిపదికన 1,200 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు. మార్కెట్ విలువలో 10% లీజుగా చెల్లిస్తారు. ఐదేళ్ల తర్వాత 10% పెంచుతారు.

✦ సముద్ర, అనుబంధ కార్యకలాపాలకు పెరుగుతున్న డిమాండును తీర్చేందుకు ఏపీ సముద్ర విధానానికి సవరణ. అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల పదవీవిరమణ సమయంలో గ్రాట్యుటీగా రూ.లక్ష, రూ.40వేలు చెల్లించేందుకు ప్రభుత్వం ఇటీవల అత్యవసరంగా జారీ చేసిన ఉత్తర్వులను ర్యాటిఫై చేసింది.

టెండర్ కమిటీ ద్వారా మద్యం ధరల ఖరారు

సబ్‌కమిటీ సిఫార్సుల మేరకు మద్యం బ్రాండ్ల అంచనా విలువలు ఖరారు చేసే ప్రతిపాదనలకు ఆమోదం. టెండర్ కమిటీ ద్వారా ప్రాథమిక ధరలను ఖరారుచేయాలనే ప్రతిపాదనకు ఆమోదం. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో ఆ బ్రాండ్ల ధరలు పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటారు.

✦ గ్రామ, వార్డు సచివాలయాల్లో డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ నుంచి విద్య అంశాన్ని తొలగించి వార్డు సంక్షేమం, అభివృద్ధి కార్యదర్శికి అప్పగించే ప్రతిపాదనకు ఆమోదం. గ్రామ సచివాలయాల్లో ఉన్న విధానం వార్డు సచివాలయాల్లోనూ అమలు. ప్రస్తుతం మండలం, పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా పరిధిలో సంస్థాగత క్యాడర్‌ను ఆమోదిస్తూ 1,785 గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను తిరిగి కేటాయించారు. దీంతో ఏఎన్ఎంలు, వార్డు ఆరోగ్య కార్యదర్శుల పోస్టులు ఖాళీ అవుతున్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా 944 పోస్టులను సృష్టిస్తున్నారు. దీంతో మొత్తం 2,788 పోస్టులవుతున్నాయి. ఇందులో ఖాళీలను డిప్యుటేషన్‌పై లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు మంత్రిమండలి ఆమోదం.

✦ వ్యర్థ పదార్థాల పునర్వినియోగ విధానం 4.0 ప్రతిపాదనకు ఆమోదం.

మాకు స్థలమివ్వండి.. క్వాంటమ్ కంప్యూటర్‌ను వాడుకోండి!

- క్వాంటమ్ వ్యాలీలో ఏర్పాటుకు ఐబీఎం ప్రతిపాదన
- రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీకి ఐబీఎం సంస్థ రూపొందించిన క్వాంటమ్ కంప్యూటర్ రాబోతోంది. ఆ సంస్థ కంప్యూటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. క్వాంటమ్ వ్యాలీలో కంప్యూటర్ ఏర్పాటు కోసం ఐటీ శాఖ ఇటీవల ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఆర్ఎఫ్‌పీ) ఇచ్చింది. దీనికి ఐబీఎంతో పాటు మరో సంస్థ స్పందించింది. రెండు సంస్థలు దాఖలు చేసిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం.. ఐబీఎం ప్రతిపాదన మెరుగ్గా ఉన్నట్లు అభిప్రాయపడింది. కంప్యూటర్ ఏర్పాటు చేసేలా సంస్థకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఐబీఎం ప్రతిపాదనకు ఆమోదం

✦ అమరావతి క్వాంటమ్ వ్యాలీలో నిర్మించే భవనంలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని, దీనికి ప్రభుత్వం సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని ఐబీఎం సంస్థ ప్రతిపాదించింది. దాని నిర్వహణకు సిబ్బందిని సొంతంగా సమకూర్చుకోనున్నట్లు పేర్కొంది. ఈ కేంద్రం నిర్వహణకు అవసరమైన విద్యుత్, కూలింగ్ ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరింది. దీనికి ప్రతిగా రాష్ట్ర పరిశోధన సంస్థలు, ప్రభుత్వం ఎలాంటి ఛార్జీలూ చెల్లించకుండా ఏడాదిలో 365 గంటల పాటు క్వాంటమ్ కంప్యూటర్ వాడుకోవచ్చని పేర్కొంది. ఐబీఎం ప్రతిపాదనను పరిశీలించి, కేటాయించిన స్పేస్‌కు అద్దె, కూలింగ్ వ్యవస్థ నిర్వహణకు అయ్యే ఖర్చు భరించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 150 క్యూబిట్‌ల సామర్థ్యం ఉన్న క్వాంటమ్ కంప్యూటర్‌ను సంస్థ ఏర్పాటు చేయనుంది.

✦ రెండో సంస్థ 8 క్యూబిట్‌ల సామర్థ్యం ఉన్న కంప్యూటర్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఈ కంప్యూటర్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పేర్కొంది. నిర్వహణకు అయ్యే ఖర్చును కూడా భరించాలని ప్రతిపాదించింది. కంప్యూటర్ కొనుగోలు చేయాలంటే కనీసం రూ.8 కోట్లు భరించాల్సి వస్తుందని అంచనా. దీంతో రెండో సంస్థ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించింది.

ఎమ్మెల్యే దగ్గుపాటిని తీవ్రంగా మందలించిన సీఎం

ఈనాడు, అమరావతి: వరుస వివాదాల్లో చిక్కుకుని, అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మందలించారు. గురువారం మంత్రివర్గ సమావేశం ముగిశాక.. దగ్గుపాటిని సీఎం తన ఛాంబర్‌కు పిలిపించారు. ఇటీవల అనంతపురంలో చోటు చేసుకుంటున్న వివాదాలు, వాటిలో ఎమ్మెల్యే పాత్రపై వివిధ మార్గాల్లో సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి... ఎమ్మెల్యేపై తీవ్రంగా మండిపడినట్లు సమాచారం. ఎమ్మెల్యే వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా వినేందుకు కూడా సీఎం ఇష్టపడలేదని తెలిసింది. తనకు అన్నీ తెలుసునని, ఏమీ చెప్పాల్సిన అవసరం లేదని, పద్ధతి మార్చుకోకపోతే ఉపేక్షించబోనని తీవ్ర స్వరంతో హెచ్చరించినట్టు సమాచారం. ఎంతో మంది సీనియర్లు పోటీ పడ్డా, వారిని కాదని ఎన్నికల్లో టికెట్ ఇచ్చామని, తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి ఎంతో బాధ్యతగా ఉండాల్సిందిపోయి, తరచూ వివాదాల్లో చిక్కుకోవడం ఏమిటని సీఎం మండిపడ్డారు. ఇకపై ఎలాంటి ఫిర్యాదులూ రావడానికి వీల్లేదని, పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే సహించబోనని స్పష్టంచేశారు.

ఖర్గేను కలిసిన వైకాపా ఎంపీ మేడా రఘునాథరెడ్డి



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ రఘునాథరెడ్డి

ఈనాడు, దిల్లీ: వైకాపా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి గురువారం మధ్యాహ్నం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో కలిశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి మద్దతిస్తామని వైకాపా ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీ సభ్యుడు కాంగ్రెస్ అధ్యక్షుడిని కలవడం ప్రాధాన్యం సంతరించుకొంది. అయితే.. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీయేనని మేడా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖర్గే ఇదివరకు కర్ణాటక హోంమంత్రిగా ఉన్నప్పటి నుంచి తనకు పరిచయం ఉందని, ఆ పరిచయం మేరకే ఇప్పుడు కలిసినట్లు స్పష్టం చేశారు. ఒక స్నేహితుడిగా మాత్రమే కలిశానని, దీనిపై అత్యుత్సాహం చూపాల్సిన అవసరం లేదన్నారు. దీనికి రాజకీయాలు ఆపాదిస్తూ పత్రికీకరణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ పరిణితి ఉన్నవారెవ్వరూ ఈ భేటీపై సంకుచిత ప్రచారాలు చేయరు అన్నారు. గతేడాది కాలంలో తనపై అనేకమార్లు ఇలాంటి ప్రచారాలు చేశారని ఆరోపించారు. తాను వైకాపా పార్టీ ఎంపీనని, జగన్ వెంటే తన ప్రయాణమని ప్రకటించారు.

రూ.51.75 కోట్లతో సీహెచ్‌సీల్లో వసతులు

ఈనాడు, అమరావతి: రోగుల తాకిడి, పెరుగుతున్న అవసరాల దృష్ట్యా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముందుగా తొమ్మిది సీహెచ్‌సీల్లో అదనపు వసతులకు రూ.51.75 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. ఆముదాలవలస, చోడవరం, కంకిపాడు, పొన్నూరు, కనిగిరి, ఉదయగిరి, చెన్నూరు, పత్తికొండ, కళ్యాణదుర్గం సీహెచ్‌సీల్లో ఓపీ, ఐపీ సేవలను పరిగణనలోకి తీసుకుని ఓపీ, డయగ్నోస్టిక్ బ్లాకులు, రక్తపరీక్ష కేంద్రాలు, అదనపు వార్డులు, ప్రసూతి గదులు, తదితర సౌకర్యాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని 173 సీహెచ్‌సీల్లోనూ అవసరాలకు తగ్గట్టుగా సదుపాయాలు కల్పిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారుల పనులపై నివేదిక ఇవ్వండి

అధికారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశం

ఈనాడు, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో రహదారుల అనుసంధాన పనులపై నివేదికను సమర్పించాలని అధికారులను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. ఇప్పటివరకు ఎన్ని గిరిజన గ్రామాలకు అనుసంధానం పూర్తయింది? అభివృద్ధి పనుల పురోగతి ఎలా ఉంది అనే వివరాలు పొందుపరచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల పనులూ నిర్దేశిత సమయంలో పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయంలో ఆమె గురువారం గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కేవలం రహదారుల నిర్మాణానికి రూ.1,300 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇప్పటికే 1,100 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాం. నీటి సదుపాయం లేని గ్రామాలకు తక్షణమే ప్రణాళికలు రూపొందించాలి. బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి' అని కోరారు.



ఆ ఆణిముత్యాలను ఎప్పుడూ కోల్పోకండి

విశ్వసనీయత, జవాబుదారీతనం..
ఈ రెండూ అరుదైన ఆణిముత్యాలు! ఎలాంటి
పరిస్థితుల్లోనూ వాటిని కోల్పోకండి. ఇచ్చిన మాటకు
కట్టుబడి ఉండటం, పరిస్థితులు అనుకూలంగా
లేకపోయినా క్రమశిక్షణతో పనిచేయడం, తుది
గడువులోగా పనులు పూర్తిచేయడం వంటివి నిలకడగా
చేస్తే.. ఎదుగుదల విషయంలో మీరు చాలామంది
కంటే ముందంజలో ఉంటారు.

– అదితి చౌదరీ, న్యాయవాది

గ్రహం అనుగ్రహం

22–8–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
చతుర్దశి: ఉ. 11-53 తదుపరి అమావాస్య
ఆశ్లేష: మ. 1-16 తదుపరి మఖ
వర్జ్యం: మ. 2-05 నుంచి 3-41 వరకు
అమృత ఘడియలు: రా. 11-40 నుంచి 1-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-07 వరకు
తిరిగి మ. 12-28 నుంచి 1-18 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.47; సూర్యాస్తమయం: సా.6.20

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	36.3	28.0
తిరుపతి	36.2	26.1
రాజమహేంద్రవరం	36.0	24.5
ఒంగోలు	35.7	26.5
నరసాపురం	35.2	27.6
విజయవాడ	35.2	25.5
గుంటూరు	34.0	28.0
విశాఖపట్నం	33.4	27.0
శ్రీకాకుళం	33.0	28.0
విజయనగరం	33.0	26.0
కడప	33.0	25.0
తాడేపల్లిగూడెం	32.4	27.4
అనంతపురం	32.2	23.5
కర్నూలు	32.0	23.2

శ్రీవారికి 121 కిలోల బంగారం!

- ఓ పారిశ్రామికవేత్త భూరి విరాళం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



ఇటీవల ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి 121 కిలోల బంగారాన్ని విరాళంగా ఇచ్చేందుకు ముందుకొచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇలాంటి భారీ విరాళాలు తితిదే చేపట్టే విద్య, వైద్యం వంటి సేవలు, ఎన్నో సత్కార్యాలకు దోహదం చేస్తాయని చెప్పారు. పీ4 కార్యక్రమానికి వస్తున్న స్పందన ఎంతో సంతృప్తినిస్తోందని 'ఎక్స్' వేదికగా గురువారం వెల్లడించారు. 'పరోపకారం పరమ ధర్మమని భారతీయ సంస్కృతి చెబుతోంది. సమాజానికి సేవ చేయడం మన ధర్మం. అందుకే మనది పుణ్యభూమి. నలుగురూ బాగుండాలనే నాడు 'జన్మభూమి' కార్యక్రమం చేపట్టి మార్పునకు శ్రీకారం చుట్టాను. సంపాదించడం కంటే, దాన్ని తిరిగి సమాజానికి ఖర్చు చేయడమే ఎక్కువ తృప్తి, నిజమైన సంతోషాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఇదో గొప్ప ఆదర్శంగా నిలిచి ఎన్నో మార్పులకు నాంది పలకాలని ఆకాంక్షిస్తున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'తిరుమల శ్రీవారి భక్తుడు ఓ కంపెనీ స్థాపించి విజయవంతమయ్యారు. అందులో 60 శాతం వాటా అమ్మితే ఆయనకు సుమారు రూ.6-7 వేల కోట్ల సొమ్ము వచ్చింది. ఈ సంపద అంతా స్వామివారు ఇచ్చిందేనన్న ఆలోచనతో తిరుమలేశుడికి 121 కిలోల బంగారం ఇచ్చేందుకు ముందుకొచ్చారు' అని సీఎం వివరించారు. శ్రీవారు నిత్యం 120 కిలోల ఆభరణాలు ధరిస్తారు. ఈ భక్తుడు కూడా సుమారు అంతే స్వర్ణాన్ని కానుకగా సమర్పించేందుకు ముందుకొచ్చారు. దీని విలువ రూ.140 కోట్ల పైనేనని అంచనా.

- ఈనాడు, అమరావతి

నాలా రద్దుతో ప్రజలు, వ్యాపారుల వెతలకు తెర

- స్థిరాస్తి వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఊరట
- అనుమతుల్లో జాప్యానికి శాశ్వత పరిష్కారం

ఈనాడు, అమరావతి: వివిధ నిర్మాణాలకు అనుమతుల్లో తీవ్ర జాప్యంతో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారుల సమస్యలకు వ్యవసాయేతర భూముల ఎసెస్‌మెంట్ (నాలా) చట్టం రద్దుతో పరిష్కారం లభించనుంది. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఇక ఉండదు. పుర, నగరపాలక సంస్థలు, పంచాయతీలు, పట్టణాభివృద్ధి సంస్థల నుంచి నిర్మాణాలకు అనుమతులు తీసుకోవడం సులభతరం కానుంది. వేగవంతమైన వాణిజ్య విధానం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో భాగంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకునేందుకు నాలా చట్టం కింద అనుమతుల జారీలో జాప్యం వల్ల స్థిరాస్తి, పారిశ్రామిక రంగాల పురోగతిపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఒక్కో అనుమతి కోసం తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయం నుంచి ఆరు నెలల సమయం పడుతోందన్నది వ్యాపారుల అభిప్రాయం. దీనిపై ప్రభుత్వం వివిధ దశల్లో పరిశీలించాక నాలా రద్దు చేసింది. గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీన్ని ఆమోదించింది. దీనిపై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తర్వాత ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వనుంది.

ఇక 'ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఛార్జీలు'

నాలా చట్టం రద్దు ద్వారా ప్రభుత్వ ఆదాయానికి నష్టం లేకుండా 'ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఛార్జీలు' వసూలు చేయాలని నిర్ణయించింది. పుర, నగరపాలక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, పంచాయతీలు.. ఛార్జీలు వసూలు చేసి వివిధ నిర్మాణాలకు అనుమతులివ్వనున్నాయి. ఛార్జీలు ఎంత వసూలు చేయాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఎకరానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ధర ఆధారంగా లెక్కించే మొత్తం విలువపై పర్సంటేజ్ (శాతం) నిర్ణయించి వసూలు చేయాలా? లేక చదరపు మీటర్‌కు ఇంత చొప్పున అని నిర్ణయించాలా? అన్న సందిగ్ధం ఉంది. నాలా రద్దుపై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపాక ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోనుంది.

సేవా కేంద్రాల నిర్వహణకు సభ్యుల అర్హతల సడలింపు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన డిజి లక్ష్మి పథకంలో భాగంగా ఏర్పాటు చేయబోయే సాధారణ సేవా కేంద్రాల నిర్వహణకు స్వయం సహాయక సంఘాల సభ్యుల అర్హతలు సడలించారు. వివాహంతో సంబంధిత స్టేట్ లెవెల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో స్థిరపడిన మహిళలతో సేవా కేంద్రాల నిర్వహణకు అర్హులన్న నిబంధనలో మార్పులు చేశారు. వివాహంతో సంబంధం లేకుండా స్థానికులై ఉంటే చాలని స్పష్టం చేసింది. 18 నుంచి 40 మధ్య వయస్సులై కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉంటే సరిపోతుంది. డిగ్రీ తప్పనిసరన్న నిబంధనను ప్రభుత్వం సడలించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా డిజి లక్ష్మి పథకంలో కియోస్క్‌లు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమీకరణకు 10 మంది అధికారులతో ప్రభుత్వం కమిటీ వేసింది.

నాలా చట్టం రద్దుతో స్థిరాస్తి వ్యాపార రంగంలో ఉత్తేజం

- నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్

ఈనాడు, అమరావతి: వ్యవసాయేతర భూముల ఎసెస్‌మెంట్(నాలా) చట్టాన్ని రద్దు చేసి మున్సిపల్, ఇండస్ట్రియల్ అనుమతులతో ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఛార్జీలు అమలు చేయడాన్ని జాతీయ స్థిరాస్తి వ్యాపార అభివృద్ధి మండలి (నరెడ్కో) స్వాగతిస్తోందని ఏపీ ఛాప్టర్ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పరుచూరి కిరణ్‌కుమార్, సెక్రటరీ జనరల్ మాదిరి సీతారామయ్య అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్థిరాస్తి వ్యాపార రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని వారు అభిప్రాయపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్‌లకు నరెడ్కో తరఫున గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

హెలికాప్టర్‌పై టూరేద్దామా?

ఆసక్తిగల సంస్థలను ఆహ్వానించిన పర్యాటకాభివృద్ధి సంస్థ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో హెలి పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మూడు ప్రాంతాల నుంచి ప్రయోగాత్మకంగా హెలికాప్టర్లు నడిపేలా ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. వీటినుంచి వచ్చే ప్రతిపాదనలపై ఎక్కడెక్కడ హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. హెలి పర్యాటకం ఇప్పటివరకు కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే ఉంటోంది. విశాఖపట్నం, మచిలీపట్నం, అరకు ఉత్సవాల్లో వీటిని ప్రైవేటు ఏజెన్సీలతో నిర్వహించారు. ఇప్పుడు నిరంతరం హెలికాప్టర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. విజయవాడ నుంచి శ్రీశైలం, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, అరకు నుంచి విశాఖపట్నం మధ్య హెలికాప్టర్లు నడపాలని ప్రభుత్వం యోచిస్తోంది. విజయవాడ, హైదరాబాద్ నుంచి రోజూ వేల మంది శ్రీశైలం వెళుతున్నారు. రెండువైపులా హెలికాప్టర్ సేవలు ప్రవేశపెడితే గిరాకీ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

మూడుచోట్ల మినీ విమానాశ్రయాలు

ప్రభుత్వం ఆశిస్తున్నట్లుగా మూడుచోట్ల నుంచి ప్రైవేటు ఏజెన్సీలు హెలికాప్టర్లను నడిపేందుకు ముందుకొస్తే విజయవాడ, విశాఖపట్నం, శ్రీశైలం, అరకులో మినీ విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నారు. విమానాశ్రయాల్లో ఉండే దాదాపు అన్ని సదుపాయాలూ వీటిలో కల్పించనున్నారు. హెలి పర్యాటకం అభివృద్ధికి అనేక రాష్ట్రాలు ఇదే విధానం అమలుచేస్తున్నాయి. ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు కల్పించిన చోట దిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన చాపర్ ఏజెన్సీలు హెలికాప్టర్లు నడుపుతున్నాయి.

వారివి వితంతు పింఛన్లుగా మార్పు

ఈనాడు, అమరావతి: అనారోగ్య, దివ్యాంగుల కేటగిరీ పింఛన్లపై వైద్యారోగ్యశాఖ తనిఖీలో అనర్హులుగా తేలిన వారిలో వితంతువులు ఉంటే వారి వివరాలు సేకరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఆ మహిళలకు రూ.4 వేల వితంతు పింఛను అందించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

మెగా డీఎస్సీ మెరిట్ జాబితా నేడు

- అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి



ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ మెరిట్ జాబితాను శుక్రవారం విడుదల చేయనున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా కోటా మెరిట్ జాబితా పూర్తయినందున మెరిట్ జాబితా విడుదలకు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. "మెరిట్ జాబితా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతాం. అభ్యర్థులు ఈ వెబ్‌సైట్ నుంచి మాత్రమే సమాచారం పొందాలి. వివిధ కేటగిరీల సంబంధించిన పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా 'జోన్ ఆఫ్ కన్సిడరేషన్'లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్ అందించనున్నాం. అభ్యర్థులు సంబంధిత ఐడెంటెడ్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. పరిశీలనకు హాజరు కావడానికి ముందే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. పరిశీలన సమయంలో సమర్పించాల్సిన సర్టిఫికెట్ల వివరాలతో కూడిన చెక్ లిస్టును వెబ్‌సైట్‌లో ఉంచుతాం. ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థి హాజరు కాకపోయినా.. సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోయినా తగిన విద్యార్హతలు లేనట్లుగా పరిగణించి, ఆ తర్వాత ఉన్న అభ్యర్థికి అవకాశం ఇవ్వడం జరుగుతుంది" అని తెలిపారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు..

"ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు, కొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా చేస్తున్న వదంతులను నమ్మొద్దు. దుష్ప్రచారాలను నమ్మి మోసపోవద్దు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి పేర్కొన్నారు.

డీఎస్సీ–2003 టీచర్లకు పాత పింఛన్ అమలు చేయాలని సీఎంకు వినతి

డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని సీఎం చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు, డీఈఓ పూల్‌లోని ఉపాధ్యాయుల సమస్యలు, స్కూల్ అసిస్టెంట్లను జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించే అంశాలను వినతిపత్రంలో పేర్కొన్నారు.

తెలుగువారైన వెంకయ్యనాయుడు, బాలయోగిలకు మద్దతిచ్చారా?

రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్న



కిషన్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల తరఫున పోటీ చేస్తున్న తెలుగు వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని ఎంపీలు మద్దతివ్వాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఇదివరకు తెలుగువారైన వెంకయ్యనాయుడికి మద్దతివ్వాలని రేవంత్‌రెడ్డి ఇలాగే పిలుపునిచ్చారా? లోక్‌సభ స్పీకర్‌గా తెలుగు వ్యక్తి జీఎంసీ బాలయోగిని పెట్టినప్పుడు కాంగ్రెస్ మద్దతు పలికిందా?' అని నిలదీశారు. కిషన్‌రెడ్డి గురువారం దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. యూరియా ఇచ్చిన వారికి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిస్తామని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ప్రకటనను విలేకరులు ప్రస్తావించగా కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఆయన మద్దతు ఎవరు కోరారు? మాకు వారి మద్దతే అవసరం లేదు. రైతులకు యూరియా సరఫరా చేస్తున్నది కేంద్రమే తప్ప.. రాహుల్‌గాంధీ కానీ, రేవంత్‌రెడ్డి కానీ బయటి నుంచి తేవడం లేదు' అని స్పష్టం చేశారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికే వైకాపా మద్దతు

- 25న జగన్ రాజమహేంద్రవరం పర్యటన రద్దు
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



బొమ్మూరు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికే వైకాపా మద్దతు ఉంటుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు వైకాపా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకరు, శాసనసభ స్పీకరు వంటి పదవులు అన్నీ పార్టీలకు అతీతంగా రాజ్యాంబద్ధ పదవులని బొత్స పేర్కొన్నారు. వాటిని గౌరవించాలనేది పార్టీ పుట్టినప్పటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయమన్నారు. ఈ నెల 25న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసేందుకు జగన్ రావాల్సి ఉండగా పర్యటన రద్దు అయిందన్నారు. రాష్ట్రంలో 7 లక్షల నుంచి 8 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' సరిగా జమకాలేదని ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం ప్రయత్నిస్తుంటే కూటమి ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. జగన్ సారథ్యంలో పోరాటం ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ నెల 30న విశాఖపట్నంలో జరిగే జనసేన పార్టీ సమావేశంలో దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దాసరి కిరణ్‌పై మరో కేసు

- కంపెనీలో వాటా ఇస్తానని నమ్మబలికి.. ఆ డబ్బులు సినిమాకు వెచ్చింపు
- సినిమా లావాదేవీలు, వైకాపా నేతల ప్రమేయంపై పోలీసుల దృష్టి



దాసరి కిరణ్‌కుమార్

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – పటమట: సినీ నిర్మాత దాసరి కిరణ్ కుమార్‌పై మరో కేసు నమోదైంది. తన రియల్ ఎస్టేట్ సంస్థలో వాటా ఇస్తానని డబ్బులు తీసుకుని ఇవ్వకుండా మోసం చేశాడంటూ కిరణ్‌కుమార్ సమీప బంధువైన గాజుల మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడలోని పటమట స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేశారు. ఇచ్చిన అప్పు తీర్చాలని అడిగేందుకు విజయవాడలోని కిరణ్ కార్యాలయానికి వెళ్లిన మహేష్ దంపతులపై అనుచరులతో దాడి చేయించిన ఘటనలో కిరణ్‌పై ఈ నెల 18న కేసు నమోదయింది. విజయవాడ పోలీసులు బుధవారం హైదరాబాద్‌లో అతణ్ని అదుపులోకి తీసుకున్నారు. కిరణ్‌తోపాటు అతని అనుచరులు నాగతేజ, దుర్గాప్రసాద్, గౌతమ్, సాయిచైతన్యలను అరెస్ట్ చేశారు. వీరిని గురువారం 4వ ఏసీఎంఎం యు.రామ్మోహన్ ముందు హాజరుపరిచారు. ఈ కేసులో హత్యాయత్నం సెక్షన్ వర్తించదంటూ మేజిస్ట్రేట్ వారి రిమాండ్‌ను తిరస్కరించారు. నిందితులకు 41ఏ నోటీసివ్వాలని పోలీసులను ఆదేశించారు.

ఆ డబ్బు.. సినిమా నిర్మాణానికి మళ్లింపు

కిరణ్ బెంజి సర్కిల్ సమీపంలో మాతా టవర్స్ ఐదో అంతస్తులో ఆనంద నిలయం డెవలపర్స్, చైతన్య కిరణ్ హౌసింగ్ కంపెనీ అనే రెండు రియల్ ఎస్టేట్ సంస్థల కార్యాలయాలు నడుపుతున్నాడు. వాటిలో 10 శాతం వాటా ఇస్తానని బావ వరుసయ్యే మహేష్‌ను నమ్మించాడు. మహేష్ 2022 నుంచి 2024 వరకు దఫదఫాలుగా ఆనంద నిలయం కంపెనీతోపాటు కిరణ్ బ్యాంకు ఖాతాలకు రూ.2.5 కోట్లు బదిలీ చేశాడు. ఈ సొమ్మును కిరణ్ 'వ్యూహం' సినిమా నిర్మాణానికి ఖర్చు చేశాడు. తన డబ్బులు, వాటాల సంగతేంటని ప్రశ్నిస్తే తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో మహేష్ ఫిర్యాదు మేరకు ఐపీసీ 420 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. రియల్ ఎస్టేట్ కంపెనీ, కిరణ్ ఖాతాల నుంచి ఎక్కడికి నగదు వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కిరణ్ ఇలా పలువురి వద్ద నగదు తీసుకుని దాన్ని 'వ్యూహం' సినిమా నిర్మాణానికి మళ్లించినట్లు తేలింది. వైకాపా హయాంలో చక్రం తిప్పిన కీలక నేత కుమారుడు కూడా సినిమా నిర్మాణానికి నిధులు సమకూర్చినట్లుగా భావిస్తున్నారు.

మద్యం కేసులో నిందితులకు బెయిలివ్వొద్దు

- ఏసీబీ కోర్టులో ముగిసిన వాదనలు.. 28న తీర్పు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే.. కేసు దర్యాప్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రాసిక్యూషన్ జేడీ రాజేంద్రప్రసాద్ ఏసీబీ కోర్టులో గురువారం వాదనలు వినిపించారు. అందువల్ల బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. మద్యం ముడుపుల కేసులో నిందితులు రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, దిలీప్‌లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విజయవాడలోని ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. జేడీ వాదనలు వినిపిస్తూ.. రాజ్ కెసిరెడ్డి ఆస్తులను సీజ్ చేస్తూ ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసిందన్నారు. మద్యం ముడుపులకు సంబంధించి ఇటీవల రూ.11 కోట్లు నగదు సీజ్ చేశారని, కేసు దర్యాప్తు కీలక దశలో ఉందన్నారు. రూ.వేల కోట్లు అక్రమ మార్గంలో అంతిమ లబ్ధిదారుడికి చేరాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రాజ్ కెసిరెడ్డి దీనిలో కీలకంగా వ్యవహరించినట్లు ఈ కేసులో సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్లలో తెలుస్తోందన్నారు. పిటిషనర్లకు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు.

దర్యాప్తునకు సహకరిస్తామన్న నిందితులు

నిందితులపై సిట్ అధికారులు ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేశారని.. సిట్ దర్యాప్తునకు సహకరిస్తారని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసుతో నిందితులకు సంబంధం లేదని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయాధికారి.. ఈ నెల 28న తీర్పు వెల్లడిస్తామన్నారు.

★ సిట్ అధికారులు సీజ్ చేసిన రూ.11 కోట్ల నగదుపై నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది.

ఆర్టీజీఎస్‌లో అవేర్ 2.0 డ్యాష్ బోర్డు ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అవేర్ 2.0 వ్యవస్థ (ఏపీ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రీసెర్చ్ సెంటర్) ద్వారా ప్రజలకు ముందస్తుగా అందించే సమాచారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించాలని నిర్ణయించింది. దీని ద్వారా వాతావరణంతో పాటు నదులు, జలాశయాల్లో నీటి నిల్వలు, భూమిలో తేమ, గాలి నాణ్యత, భూగర్భ జలాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు వేగంగా లభిస్తుంది.

ఈనాడు

బీమా ధీమా లేని బతుకులు

సామాన్యులకోసం సర్కారీ వైద్యశాలల్లో చక్కటి చికిత్సలు అందిస్తున్నట్లు ప్రభుత్వాలు చాలా గొప్పగా చెబుతుంటాయి. వాస్తవంలో మాత్రం చాలాచోట్ల ఆ ఆసుపత్రులు 'ఆకారం పుష్టి...' అన్నట్లు అఘోరిస్తున్నాయి. అరకొర వసతులు, చాలీచాలని సిబ్బందితో అవి కునారిల్లుతున్నాయి. దాంతో అనారోగ్య పీడితుల్లో చాలామంది అనివార్యంగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడి వైద్య వ్యయభారాల ధాటికి ఏటా దాదాపు ఆరుకోట్ల మంది పేదరికంలోకి జారిపోతుండటం- దేశీయంగా ప్రజారోగ్య రంగమెంతగా జబ్బుపడిందో కళ్లకుకడుతోంది. ఆసుపత్రి ఖర్చులకు కుటుంబాలు తలకిందులు కాకుండా ఆరోగ్య బీమా కాపాడుతుంది. కానీ, 'లాన్సెట్'లో తాజాగా ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం, ఇండియాలో 70 శాతం ప్రజలకు ఎలాంటి వైద్య బీమా లేదు. జనారోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు విదిలిస్తున్న అరకొర నిధుల కారణంగా వైద్య వ్యయంలో 45శాతాన్ని ప్రజలు సొంతంగా భరించాల్సి వస్తోంది. ప్రపంచ సగటు(18శాతం)తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. వాతావరణ మార్పులు, గతితప్పిన జీవనశైలి వల్ల ఇటీవలి కాలంలో వ్యాధుల తాకిడి పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య బీమా విస్తరణలో మందకొడితనం- జాతి శ్రేయస్సుకు శరాఘాతమవుతుంది!

వచ్చే ఇరవై రెండేళ్లలో భారతీయులు అందరినీ బీమా రక్షణ ఛత్రం కిందకు తీసుకురావాలన్నది కేంద్రం సంకల్పం. ఆ లక్ష్యసాధనలో భాగంగా పేదలు, ఏడు పదుల వయసు పైబడినవారికోసం రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన, జన్ ఆరోగ్య యోజనలను తెచ్చింది. దురదృష్టవశాత్తు మన దేశంలో చాలామందికి అసలు ఆరోగ్య బీమా గురించి అవగాహనే లేదు. 'ఆయుష్మాన్' కార్డు కలిగిన లబ్ధిదారులకు కూడా చాలా ఆసుపత్రులు నగదు రహిత చికిత్సను నిరాకరిస్తున్నాయి. ఆపత్కాలంలో ఆదుకునే ఆరోగ్య బీమా ప్రీమియాలపై పన్నుల బాదుడు మూలంగా ప్రజాప్రయోజనాలు ఇంకా దెబ్బతింటున్నాయి. 18 శాతం జీఎస్టీ విధింపు మూలంగా ప్రభుత్వ పథకాలకు నోచుకోని మధ్యాదాయ వర్గాలు వైద్య బీమా తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నాయి. కాలం కలిసిరాక పెద్ద జబ్బేదైనా చేసినప్పుడు చికిత్సల కోసం అవి ఇల్లు గుల్లచేసుకుంటున్నాయి. జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా ప్రీమియాలపై సుంకాలను తొలగిస్తేనే- ఆరోగ్య బీమా సదుపాయాలు అందరికీ చేరువవుతాయి!

కాగితాలపై ఘనంగా కనిపించే నిబంధనల్లో అత్యధికం క్షేత్రస్థాయిలో చెల్లనికాసులు అవుతుండటం ప్రజాభారత ప్రారబ్ధం. వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ వైద్య బీమాను విక్రయించడంతో పాటు అన్నిచోట్లా పూర్తిగా నగదురహిత వైద్యం అందించాలన్న 'ఐఆర్‌డీఏఐ' ఆదేశాలూ ఇలాగే నీటిపై రాతలవుతున్నాయి. రకరకాల కొర్రీలతో బీమా సంస్థలు క్లెయిములను యథేచ్ఛగా తిరగ్గొడుతున్నాయి. నిరుడు అలా అవి రూ.15వేల కోట్ల విలువైన 29శాతం అభ్యర్థనలను తోసిపుచ్చాయి. ముఖ్యంగా మానసిక సమస్యలకు చికిత్స తీసుకునే వారికి బీమా కంపెనీలు అత్యధిక సందర్భాల్లో నిర్దాక్షిణ్యంగా మొండిచెయ్యి చూపుతున్నాయి. మన దేశంలో 15-49 ఏళ్ల వయసులోని స్త్రీలలో 29.8శాతం, పురుషుల్లో 33.3శాతానికే ఏదో ఒక వైద్యబీమా ఉన్నట్లు అంచనా. ఆ కొద్దిమంది పాలసీదారులకు కూడా సరైన సేవలు అందకపోతే- కొత్తవారు బీమా తీసుకోవడానికి ఎలా ముందుకొస్తారు? యూకే, జర్మనీ, స్వీడన్, అమెరికా తదితర దేశాలు ప్రజారోగ్య పరిరక్షణకు జీడీపీలో 10శాతం, అంతకు మించి వెచ్చిస్తున్నాయి. ఇండియాలో అది రెండుశాతం కంటే తక్కువకే పరిమితమవుతోంది. కేటాయింపులు పెంచి, ప్రభుత్వాసుపత్రులను పటిష్ఠం చేస్తేనే జనభారతానికి ఆరోగ్య భాగ్యం ఒనగూడుతుంది!



మనం సంపాదన మీద పెట్టినంత దృష్టి ఆరోగ్యం మీద పెట్టడం లేదు. కానీ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు, అది బాగుంటే ఆ తరవాత ఏవైనా, ఎంతైనా సంపాదించవచ్చు.

– డాక్టర్ అరవింద్ లాల్, వ్యాపారవేత్త

దేహభ్రాంతి

ధర్మాచరణకు, దైవాన్వేషణకు శరీరమే సాధనం. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనసు ఉంటుంది. అంటే మనసు ప్రశాంతంగా ఉండాలన్నా, మంచి ఆలోచనలతో నిండాలన్నా శారీరక ఆరోగ్యం బాగుండాలి. మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ కలిగిన జీవనవిధానం ఆరోగ్యాన్ని క్రమబద్ధం చేస్తాయి. అయితే శరీరం పట్ల ఈ జాగ్రత్త దేహభ్రాంతిగా మారకూడదు. విజ్ఞులైనవారు మేనిని కేవలం ధర్మసాధనంగా మాత్రమే భావిస్తారు.

సమస్త సృష్టిలో మరే జీవికీ సాధ్యపడని ఆలోచన, వివేకం, వివేచన మానవుల సొంతం. నిరంతర సాధన, ధర్మవర్తన ద్వారా ఈ జన్మను సద్వినియోగం చేసుకుని మోక్షానికి అర్హమైనదిగా మలచుకోవాలి. వ్యాకులత, దుఃఖం, రోగాలు.. చివరికి మరణం ఇవన్నీ శరీరానికి సహజంగా సంభవించేవే. కాబట్టి వీటిపట్ల మితిమీరిన ఆందోళన అనవసరం. ఈ విషయం తెలిసినా కొందరు- నా శరీరం వేరు, దైవం వేరు అనే ద్వైతభావం కలిగి ఉంటారు. దీనికి కారణం దేహభ్రాంతి. ఇది ఉన్నంతవరకు ఏకాత్మ భావం అలవడదు. ఈ దేహం శాశ్వతం కాదన్న సత్యం నిరంతరం మనసులో మెదులుతుండాలి.



అహంకారానికి కారణం కూడా దేహాభిమానమే. నేను, నాది అనే భావన 'నేనే' అనే అహానికి దారితీస్తుంది. దీన్ని క్రమంగా తగ్గించుకోవాలి. ఈ దేహం ముత్యపు చిప్ప వంటిది. విలువైన ముత్యం ఏర్పడటానికి చిప్పే ఆధారం. కానీ ముత్యం లభించాక చిప్పకు విలువ ఉండదు. అలాగే విలువైన ఆత్మ గురించి తెలుసుకున్నవారు దేహానికి ప్రాధాన్యం ఇవ్వరు. దేహాభిమానం ఉన్నంతవరకు మోహసంద్రంలోంచి బయట పడలేరని వేమన కూడా హెచ్చరిస్తాడు.

అంతర్యామి

భగవాన్ రమణమహర్షికి రాచపుణం లేచినప్పుడు ఆయన బాధపడలేదు. శరీరం మాత్రమే తన కర్మఫలాన్ని అనుభవిస్తోందనుకున్నారు. ఒకసారి వాసుదేవానంద సరస్వతి స్వామివారికి అతిసార వ్యాధి వచ్చినప్పుడు భక్తులు అడిగారట.. 'ఎంతోమంది రోగులకు సాంత్వన కలిగించే మీరు వ్యాధితో బాధపడటమేమిటి స్వామీ' అని. దానికి ఆయన 'శరీరమే తాము అని భ్రమించేవారికి, బాధలను అధిగమించలేనివారికి ఉపశమనం అవసరం. ఆత్మస్వరూపులు ఇలాంటివాటికి చింతించరు. దేహాన్ని నేనుగా భావించడంలేదు' అని సమాధానమిచ్చారట!

'తనువు తనువటంచు దపియించు జనులార! తనువులు స్థిరమని తలపరాదం'టాడు వేమన. కేవలం ఇంద్రియాల ద్వారా లభించే సుఖాలకు అలవాటు పడి దేహమే నిత్యమనే భ్రాంతిలో బతుకుతుంటారు చాలామంది. 'పచ్చికుండ వంటిది మేను' అన్న తత్వకవుల హెచ్చరికలోని అంతరార్థాన్ని గ్రహించలేరు. ఎన్నో జన్మల పుణ్యఫలం వల్ల మానవ రూపం లభిస్తుందంటారు పెద్దలు. దాన్ని భగవత్ ప్రసాదంగా స్వీకరించాలి. సద్వినియోగం చేసుకోవాలి. వ్యామోహాలు, రాగద్వేషాలు, భోగలాలస, ఇంద్రియ చాపల్యాలకు దూరంగా ఉండటమే దేహభ్రాంతి అనే భవరోగానికి దివ్యమైన ఔషధం.

– శ్రీమత్కందాళ బాలసరస్వతి

ముందే హెచ్చరిస్తుంది...



అంతరిక్షంలో భారత్ మరోసారి జయకేతనం ఎగురవేసింది. శ్రీహరికోట నుంచి జులై 30న భారతీయ జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్‌పై 'నైసార్' (నాసా-ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్) ఉపగ్రహం విజయవంతంగా నింగికి ఎగసింది. భూపరిశీలన నిమిత్తం భారత్, అమెరికాలు సంయుక్తంగా దీన్ని ప్రయోగించాయి. ఈ ఉపగ్రహం రూపకల్పన, నిర్మాణం, టెస్టింగ్, ప్రయోగాల్లో నైసార్ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్రారావు కీలక పాత్ర పోషించారు. ఆమెతో 'ఈటీవీ భారత్' ప్రతినిధి డాక్టర్ అనుభ జైన్ ముఖాముఖి...

నైసార్ ఉపగ్రహం ప్రత్యేకతలు ఏంటి? దీంతో సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి?

ప్రపంచంలోనే మొదటిసారిగా జంట ఫ్రీక్వెన్సీల సింథటిక్ ఎపర్చర్ రాడార్(సార్)లను నైసార్ ఉపగ్రహంలో అమర్చాం. అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా అందించిన ఎల్ బ్యాండ్ రాడార్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో సమకూర్చిన ఎస్-బ్యాండ్ రాడార్లను నైసార్‌లో పొందుపరిచాం. ఎల్ బ్యాండ్ రాడార్‌ను అమెరికాలోని జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీలో, ఎస్ బ్యాండ్ రాడార్‌ను అహ్మదాబాద్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్‌లో తయారు చేశారు. ఈ రెండు రాడార్ల సాయంతో నైసార్ ఎలాంటి వాతావరణంలోనైనా, రాత్రీపగలు తేడా లేకుండా భూ ఉపరితలాన్ని పరిశీలించగలదు. నింగి నుంచి అత్యంత సునిశితమైన హై రిజల్యూషన్ చిత్రాలను తీసి పంపుతుంది. సెంటీమీటరు పరిధిలో నేలను కూడా ఫొటోలో బంధించగలదు. పన్నెండు రోజులకోసారి భూమిపై ఉండే ప్రాంతాలను ఫొటోలు తీస్తుంది. దీనివల్ల వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు. వరదలు, తుపానులు, ఇతర ప్రకృతి ఉత్పాతాల గురించి నిరంతర సమాచారాన్ని నైసార్ అందిస్తుంది. వ్యవసాయానికి విలువైన సమాచారాన్ని సమకూరుస్తుంది.



నైసార్ ప్రయోగంతో ఇండియా తన అంతరిక్ష వైజ్ఞానిక పటిమను మరోసారి చాటుకుందని చెప్పవచ్చా?

మన తొలి ఉపగ్రహం ఆర్యభట్టను 1975లో ప్రయోగించాం. ఈ ఏడాది ఏప్రిల్‌తో భారతీయ అంతరిక్ష కార్యక్రమం 50 ఏళ్ల పూర్తి చేసుకుంది. స్వల్పవ్యయ వేగ నైసార్ ప్రయోగం అంతరిక్ష రంగంలో ఇండియా సాంకేతిక సామర్థ్యానికి, సాధించిన అనుభవానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇందులోని అత్యాధునిక రాడార్లు, హై డేటా రేట్ కేఏ బ్యాండ్ ట్రాన్స్‌మిటర్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కేఏ బ్యాండ్ ఎక్కువ వేగం, అధిక పరిమాణంలో డేటాను బదిలీ చేయగలదు. ఇది ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్, 5జీ సేవలు, ఇతర హైడేటా రేట్ కమ్యూనికేషన్ అప్లికేషన్లకు అత్యంత అనువైంది. నైసార్ ఉపగ్రహం రోజుకు 80 టెరాబైట్ల డేటాను సేకరిస్తుంది. దీన్ని భూమికి పంపడానికి శక్తిమంతమైన డౌన్ లింక్ సిస్టం అవసరం. నైసార్‌లో అమర్చిన కేఏ బ్యాండ్ ట్రాన్స్‌మిటర్ సెకనుకు 3 గిగా బైట్ల సమాచారాన్ని పంపగలదు. ఇందులోని సింథటిక్ ఎపర్చర్ రాడార్ తడవకు 240 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని అత్యంత స్పష్టంగా ఫొటోలు తీస్తుంది.

ప్రకృతి ఉత్పాతాల సమయంలో ఎలా ఉపయోగపడుతుంది? విపత్తులను నైసార్ ముందే గుర్తిస్తుందా?

భారత్ ఉష్ణమండలంలో ఉంది. హిమాలయాల్లో శీతల వాతావరణం ఉంటుంది. ఇలాంటి భిన్న వాతావరణాలకు నెలవైన మనదేశం విభిన్నమైన తీవ్రస్థాయి వైపరీత్యాలను ఎదుర్కొంటోంది. వెంటవెంటనే వరదలు, అనావృష్టి సంభవిస్తాయి. వీటిని నైసార్ ముందే పసిగట్టి హెచ్చరిస్తుంది. నేలలోని తేమలో వచ్చే తేడాలపై నిఘా వేసి అనావృష్టి గురించి అప్రమత్తం చేస్తుంది. అడవుల నరికివేతను తెలియజేస్తుంది. తద్వారా నివారణ చర్యలు తీసుకోవడానికి తోడ్పడుతుంది.

నైసార్ కార్యకాలం ఎంత? ఆ ఉపగ్రహం ఎంత కాలంపాటు సేవలు అందిస్తుంది?

ఈ ఉపగ్రహం ఐదేళ్లపాటు సేవలు అందించగలదు. నాసా కేవలం మూడున్నరేళ్ల కార్యాచరణనే దృష్టిలో పెట్టుకున్నా, ఇస్రో నిర్ణీత కక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టినందువల్ల అంచనా వేసినదానికన్నా ఎక్కువ కాలమే నైసార్ కక్ష్యలో తిరుగుతుందని భావిస్తున్నాం. ఇందులోని ఎల్ బ్యాండ్, ఎస్ బ్యాండ్ రాడార్లు విడివిడిగానూ, కలిసికట్టుగానూ పని చేయగలవు. ఇస్రో అందించిన ఎస్ బ్యాండ్ రాడార్ భూ ఉపరితలంపై అడవుల విస్తృతి, పంటల విస్తీర్ణం, అడవుల క్షీణతను తెలిపే చిత్రాలను పంపుతుంది. నాసా ఎల్ బ్యాండ్ రాడార్ భూగర్భంలోకి సైతం తొంగిచూడగలదు. అది భూమి కుంగిపోవడం గురించి హెచ్చరిస్తుంది. ఈ రెండు రాడార్లు కలిసి మూడున్నరేళ్లపాటు భూ ఉపరితలంపైన, భూగర్భంలో వచ్చే మార్పులను అందజేస్తాయి. తద్వారా సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరిస్తాయి.

నైసార్ సేకరించే సమాచారాన్ని ఎక్కడ ఉంచుతారు? ఆ డేటా అందరికీ అందుబాటులో ఉంటుందా?

భూమిపై ఉండే జీవావరణ, పర్యావరణ వ్యవస్థలు, హిమానీనదాలు, జలరాశుల గురించి నైసార్ ఉపగ్రహం సేకరించే సమాచారం ఇస్రో భూనిధి, నాసా క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రతి పన్నెండు రోజులకోసారి సమాచార ప్రసారం జరుగుతుంది. ఈలోగా పాత, కొత్త సమాచారాలను పోల్చిచూసి ఏవైనా మార్పులుంటే కనిపెట్టవచ్చు. నైసార్ ఉపగ్రహం భూమిపై ఏదైనా ప్రాంతం మీదుగా పయనిస్తున్నప్పుడు, ఆ సమయంలో అక్కడ ఏదైనా ప్రకృతి వైపరీత్యం సంభవిస్తుంటే వెంటనే హెచ్చరిస్తుంది. ఉదాహరణకు వరదలు వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో సహాయ చర్యలకు మార్గదర్శకత్వం వహిస్తుంది. ఆ ప్రాంతానికి సంబంధించిన చిత్రాలను, ఇతరత్రా సమాచారాన్ని భూమికి ప్రసారం చేస్తుంది.

భారత్, అమెరికా నిపుణుల సమన్వయం ఎలా సాగింది?

నైసార్ డిజైన్, నిర్మాణంలో ఇస్రో, నాసా పరస్పరం సహకరించుకున్నాయి. అయితే, రెండు సంస్థల కార్యనిర్వహణ శైలిలో, సాంకేతిక అంశాల నిర్ధారణలో కొన్ని తేడాలు కనిపించాయి. ఎప్పటికప్పుడు వాటిని అధిగమిస్తూ ముందడుగు వేశాం. భారతీయ ఇంజినీర్లు అమెరికాకూ, అమెరికన్ ఇంజినీర్లు ఇండియాకూ వచ్చి ఎల్ బ్యాండ్, ఎస్ బ్యాండ్ రాడార్ల కూర్పును పూర్తి చేశారు. రెండు దేశాల మధ్య పగలూ రాత్రి భేదాలున్నా చక్కని సమన్వయంతో పని పూర్తి చేశారు. నైసార్ ఉచితంగా అందించే సమాచారాన్ని అంతర్జాతీయ శాస్త్రజ్ఞులు సమర్థంగా ఉపయోగించుకుంటూ మానవాళి శ్రేయస్సుకు తోడ్పడతారని ఆశిస్తున్నాం. ●



కాస్త నవ్వండి...

చాలాకాలం క్రితం న్యూయార్క్‌లోని ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ యజమాని తన దుకాణం ముందు ఇలా బోర్డు పెట్టించాడు... 'ఈ పండుగ అమ్మకాల రద్దీ వల్ల మా సిబ్బంది బాగా అలిసిపోయి ఉన్నారు. అందుకని వాళ్లు మీకు దాన్ని ఇవ్వలేకపోయినట్టయితే, మీ దగ్గరున్నదాన్ని వాళ్లకిచ్చి వెళ్లగలరా? ఎందుకంటే ఎవరి దగ్గరైతే ఇంకొకరికి ఇవ్వడానికి చిరునవ్వులు మిగలవో, వారికే వాటి అవసరం ఎక్కువ'! క్రిస్మస్ సీజన్ కావడంతో దుకాణంలో సిబ్బంది చాలా ఒత్తిడికి గురవుతున్నారని గ్రహించిన యజమాని షాపు బయట బోర్డు మీద ఇలా రాసి పెట్టించాడు. అది చూసిన కొనుగోలుదారుల ముఖాల్లో అప్రయత్నంగానే చిరునవ్వులు వెల్లివిరిసేవి. అవి దుకాణంలో సిబ్బంది పట్ల సహానుభూతితో వ్యవహరించేందుకు దారితీసేవి.

'చిరునవ్వు నవ్వలేని మనిషి దుకాణం తెరవకూడదు' అని చైనాలో ఓ లోకోక్తి ఉంది. అయితే నవ్వు ముఖం వ్యాపార రంగానికే అవసరమనుకుంటే పొరపాటు. ఏ మనిషికైనా, అతడు ఏ పనిచేస్తున్నా చిరునవ్వు మంచి స్నేహితుడిలా తోడ్పడుతుంది.

'నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును...' అన్నారు గుర్రం జాషువా. 'నువ్వు నవ్వితే ఈ లోకం నీతోపాటు నవ్వుతుంది, నువ్వేడుస్తుంటే మాత్రం నువ్వొక్కడివే ఏడుస్తావు' అంటాడు బీర్బల్. ఎవరైనా నవ్వడం లేదూ అంటే వారిలో ఏదో లోపం ఉందన్న మాట. అసలు నవ్వని వాళ్లు, సంగీతాన్ని విని ఆనందించలేని వాళ్లు ప్రమాదకరమైన వ్యక్తులని ఒక భావన. అందుకే 'నమ్మకు నవ్వలేనివాడిని...' అన్నారు దేవరకొండ బాలగంగాధర తిలక్. జూలియస్ సీజర్ నాటకంలో కేషియస్ గురించి చెబుతూ షేక్స్పియర్- 'హి హియర్స్ నో మ్యూజిక్, సెల్‌డమ్ హి స్మైల్స్' అంటారు. ఎవరినైనా ప్రభావితం చేయడానికి సులువైన పద్ధతుల్లో చిరునవ్వు ముఖ్యమైంది అన్నది డేల్ కార్నెగీ సూచన. 'హౌ టు విన్ ఫ్రెండ్స్ అండ్ ఇన్‌ఫ్లుయెన్స్ పీపుల్' అనే పుస్తకంలో అనేక దృష్టాంతాలతో చిరునవ్వు ప్రభావాన్ని వివరిస్తారాయన. గొప్ప వ్యక్తిత్వం గలవారికి, విజేతలకు చిరునవ్వు సహజాలంకారం. ఒంటిమీద ఖరీదైన దుస్తులు, వజ్రాల ఆభరణాలు ఉన్నా మనసును ప్రతిబింబించేది ముఖాన చిరునవ్వే. అది ఎన్నో మాటలు చెప్పగలదు. ఒక్క చిరునవ్వు ఎదుటివారితో నువ్వంటే నాకిష్టం, నీ సాన్నిహిత్యం నాకు ఆనందాన్ని కలిగిస్తుంది.. అని సూచించగలదు.

పసిపాపల బోసినవ్వులు ఎంత స్వచ్ఛంగా ఉంటాయో మనకు తెలుసు. వాళ్లు సంతోషంగా పెరగాలంటే తల్లిదండ్రులు హాయిగా నవ్వగలిగిన వారై ఉండాలి. అలాంటి వాళ్లు వ్యాపారంలోనే కాదు ఏ రంగంలోనైనా రాణించగలరు. ఎదురుగా ఉన్నప్పుడే కాదు, ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడూ గొంతులో నవ్వు ధ్వనిస్తే- వినేవారికి ఎంత బాగుంటుంది! నవ్వు సహృదయతకు సంకేతం. మనల్ని విమర్శించేవారికి, నిష్కారణంగా నిందించేవారికి మర్యాదపూర్వకమైన చిరునవ్వును మించిన సమాధానం ఏముంటుంది?

– సూర్య

కమ్మేస్తోంది...

శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం, బయోమాస్ దహనం వంటి వాటివల్ల బ్లాక్ కార్బన్ వాతావరణంలోకి ఎక్కువగా విడుదలవుతోంది. గాలిలో సూక్ష్మధూళికణాలు దట్టంగా పరచుకోవడానికి ఇది కూడా ప్రధాన కారణం. బ్లాక్ కార్బన్ సౌర వికిరణాన్ని పెద్దమొత్తంలో గ్రహించడం వల్ల భూతాపం కట్టుతప్పుతోంది. వాతావరణంలో అది భారీగా పోగుపడటం వల్ల శ్వాసకోశ, గుండె జబ్బులు సైతం ముమ్మరిస్తున్నాయి. 2022లో ప్రపంచవ్యాప్తంగా ఆయా రంగాల వల్ల ఎంత మొత్తంలో బ్లాక్ కార్బన్ వాతావరణంలోకి చేరిందంటే...


(లక్షల టన్నుల్లో)

భవననిర్మాణం	21
రవాణా	10
విద్యుదుత్పత్తి	9.09
పరిశ్రమలు	6.30
వ్యర్థాలు	2.78
వ్యవసాయం	2.37
అంతర్జాతీయ వాణిజ్యం	0.82
అంతర్జాతీయ పౌర విమానయానం	0.05

(ఆధారం: కమ్యూనిటీ ఎమిషన్స్ డాటా సిస్టమ్ గణాంకాలు-2024)

స్నేహం కాదది... పక్కా వ్యాపారం!

ఇటీవల అమెరికా, పాకిస్థాన్‌లు చేరువవుతున్నాయి. పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విందు ఇవ్వడం, ఆ రెండు దేశాల నడుమ ఇంధన వాణిజ్య ఒప్పందం కుదరడం, అణుయుద్ధంపై మునీర్ వదరబోతు వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు వరసగా చోటుచేసుకున్నాయి. అమెరికా, పాక్ సంబంధాల్లో వచ్చిన ఆకస్మిక మార్పుల వెనక ఎలాంటి ప్రయోజనాలు దాగి ఉన్నాయనేది కీలకం.



చరిత్రను పరిశీలిస్తే భౌగోళిక-రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాల కోసమే అగ్రరాజ్యం పాకిస్థాన్‌ను చేరదీసిందనే విషయం అర్థమవుతుంది. ఇస్లామాబాద్ సైతం తన ఆర్థిక, భద్రత అవసరాల కోసమే అమెరికాతో స్నేహాన్ని ప్రదర్శించిందనే సంగతీ తెలుస్తుంది. వ్యాపారం తరహాలో ఉండే ఇలాంటి సంబంధాలు దీర్ఘకాలం కొనసాగలేవు. అవసరాల మేరకు మారిపోతుంటాయి. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో దక్షిణాసియా, పశ్చిమాసియాల్లో సోవియట్ ప్రభావాన్ని అడ్డుకునే గోడగా పాక్‌ను అమెరికా వాడుకుంది. డెబ్భయ్యవ దశకంలో కొంతకాలం చైనాతో దౌత్య సంబంధాలకు మార్గంగా ఉపయోగించుకుంది. ఎనభయ్యవ దశకంలో అఫ్గానిస్థాన్‌లో ముజాహిదీన్లకు మద్దతు ఇచ్చేందుకు పాక్‌ను పావుగా వాడుకుంది. అరవై, తొంభయ్యవ దశకాల్లో మాత్రం ఇరుదేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. 2001లో అమెరికాలో అల్ ఖైదా దాడి తరవాత అగ్రరాజ్యం చేపట్టిన ఉగ్రవాదంపై పోరుతో పాక్ ప్రాధాన్యం మళ్లీ పెరిగి 2011దాకా కొనసాగింది. మరోవైపు, పాకిస్థాన్-చైనా సంబంధాలు 1960ల నుంచీ వ్యూహాత్మక విశ్వసనీయతతో భౌగోళిక, ఆర్థిక కోణాల్లో పరస్పర ఆధారితంగా, సుస్థిరంగా కొనసాగాయి. పాకిస్థాన్‌కు దౌత్య, ఆర్థిక, సైనిక, సాంకేతిక, అణు, రక్షణ రంగాల్లో చైనా పూర్తిస్థాయిలో మద్దతు అందించింది.

వ్యూహాత్మక బంధం కాదు...

అమెరికా, పాకిస్థాన్‌లు మళ్లీ చేరువయ్యేందుకు పరస్పర ప్రయోజనాలే కారణమవుతున్నాయి. ఆర్థిక సమస్యలతో కునారిల్లుతున్న ఇస్లామాబాద్‌కు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుంచి సాయం అందాలన్నా, ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్స్ ఆంక్షలను తప్పించుకోవాలన్నా అమెరికా సహకారం కావాలి. బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు, తెహ్రీకే తాలిబన్ దాడులను ఎదుర్కొనేందుకూ వాషింగ్టన్ తోడ్పాటు అవసరం. అగ్రరాజ్యంతో సంబంధాలు మెరుగైతే, చైనాపై ఆధారపడటాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చు. టెక్నాలజీ, క్రిటికల్ మినరల్స్ లాంటి రంగాల్లో అమెరికా పెట్టుబడులను ఆకర్షించవచ్చు. అన్నింటికన్నా ముఖ్యంగా భారత్‌తో ఉద్రిక్త పరిస్థితులను సమతుల్యం చేసుకోవడానికి పాక్‌కు అమెరికాతో అనుబంధం చాలా అవసరం. అమెరికా వైపు నుంచి చూస్తే- మధ్యఆసియా, ఇరాన్‌లలో నెలకొన్న పరిస్థితులు; ఈ ప్రాంతంలో పెరుగుతున్న రష్యా, చైనాల ప్రాబల్యం దృష్ట్యా వాటిని ఎదుర్కోవడానికి పాక్ అవసరం పడుతుంది. మధ్యఆసియా, పశ్చిమాసియా, దక్షిణాసియా, అరేబియా ప్రాంతాల్లో తిరిగి పట్టు బిగించడానికీ అది కీలకమవుతుంది. పాకిస్థాన్‌లో అస్థిర పరిస్థితులు నెలకొంటే, అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముంది. దీన్ని నిరోధించాలన్నా, అణ్వాయుధ టెక్నాలజీ, ముడిపదార్థాలు ఇరాన్‌లాంటి దేశాలకు అందకుండా చూడాలన్నా పాక్ తమ కనుసన్నల్లో ఉండాల్సిందేనని అమెరికా కోరుకుంటోంది. అందుకని అమెరికా, పాకిస్థాన్‌లు చేరువ కావడాన్ని లావాదేవీలతో కూడిన సంబంధంగానే చూడాలి. పరస్పర విశ్వాసంతో కూడిన దీర్ఘకాలిక వ్యూహాత్మక బంధంగా దీన్ని భావించలేం.

మరోవైపు అమెరికా, పాకిస్థాన్‌ల సాన్నిహిత్యం తనపై ప్రభావం చూపనంతవరకు చైనా ఆందోళన చెందదు. ఆ రెండు దేశాల సంబంధాలు పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరిస్తాయని, తనపై భారాన్ని కొంతమేర తగ్గిస్తాయని చైనా భావిస్తోంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో రాజకీయంగా పాకిస్థాన్ ఒంటరితనం తగ్గి, ఆ దేశం పట్ల పాశ్చాత్య ప్రపంచంలో విశ్వాసం పెరిగితే... అక్కడి తన పెట్టుబడులు లాభదాయకంగా మారుతాయనేది చైనా ఆశ. ఇలాంటి అంచనాలు నిజమయ్యేలా ఇటీవల అమెరికా బలూచిస్థాన్ వేర్పాటువాద గ్రూపులను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటిస్తూ, నిషేధం విధించింది. ఈ చర్యలు బలూచిస్థాన్‌లో చైనాకు మేలు చేస్తాయి.


అమెరికాకే నష్టం

ట్రంప్ పాకిస్థాన్‌లోని రాజకీయ నాయకత్వానికి బదులు నేరుగా సైన్యాన్నే సంప్రదించడంలో ఆశ్చర్యమేమీ లేదు. చారిత్రకంగా పాక్ విదేశాంగ, భద్రతా విధానాలను ఆ దేశ సైన్యమే నిర్ణయిస్తోంది. కాబట్టి, నేరుగా సైన్యంతోనే సంప్రదింపులు చేపట్టడం లావాదేవీల ఆధారిత సంబంధాలనే ప్రతిబింబిస్తోంది. భారత్-అమెరికా మధ్య ఉన్నవి మాత్రం వ్యూహాత్మక సంబంధాలే. ఇండియా... తన ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకోకపోవడం, తమ వ్యవసాయ ఉత్పత్తులకు ద్వారాలు తెరవకపోవడం అమెరికాను అసంతృప్తికి గురిచేస్తోంది. ఇండియాతో సంబంధాలు చెడగొట్టుకుంటే- ఇండో పసిఫిక్ ప్రాంతంలో అగ్రరాజ్య దీర్ఘకాలిక ప్రయోజనాలకు ముప్పుతప్పదు. ఇది అంతర్జాతీయ సంబంధాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. ముఖ్యంగా భారత్ చైనాల మధ్య... 'బ్రిక్స్' కూటమిలో రష్యా, చైనా, భారత్, బ్రెజిల్ దేశాల మధ్య సంబంధాలను పెంచే అవకాశముంది. ఫలితంగా, అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలకు దారితీయవచ్చు. అమెరికాకు ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ వాంఛనీయం కాదు.

– డాక్టర్ గద్దె ఓంప్రసాద్

అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన కేంద్రం, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్, జేఎన్‌యూ

కొండల్లో పుస్తకాల గుడి



హాయ్ ఫ్రెండ్స్..! సాధారణంగా లైబ్రరీలు ఎక్కడుంటాయి? 'అదేం ప్రశ్న అసలు. లైబ్రరీలు ఇంకెక్కడ ఉంటాయి? స్కూళ్లు, కాలేజీలు, ఊళ్లలో చక్కగా గదుల్లో.. అందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తారు' అంటారు కదూ! కానీ ఈ లైబ్రరీ మాత్రం కొండల్లో ఉంటుంది. దాని విశేషాలేంటంటే..

చిత్రాన్ని చూసి ఇదేదో ఏఐ బొమ్మలా ఉందే అనుకోకండి. ఇది నిజంగానే లైబ్రరీ. చైనా అనగానే మనందరికీ రకరకాల వింతలు గుర్తొస్తాయి కదా. ఇప్పుడు ఈ ప్రత్యేకమైన గ్రంథాలయం కూడా చైనాలోని మియాన్హువా అనే మారుమూల గ్రామానికి దగ్గర్లో ఉంది నేస్తాలూ. పెద్ద కొండను ఒకవైపు పుస్తకాలు అమర్చడానికి వీలుగా చెక్కి.. అక్కడ వేల పుస్తకాలు పెట్టారు. పైకి కిందకీ వెళ్లడానికి కలపతో మెట్లు కట్టారు. కూర్చోవడానికి కుర్చీలు, బాల్కనీలు కూడా ఏర్పాటు చేశారు. మనం ఎప్పుడూ వెళ్లే లైబ్రరీలకు పూర్తి భిన్నంగా ఉంటుంది ఇది. ఈ ఒక్క చోటుకు వెళ్తే చాలు, నచ్చిన పుస్తకాలు చదువుకోవచ్చు అలాగే.. చక్కని టూరిస్టు ప్రాంతాన్ని చూసిన ఆనందం కూడా కలుగుతుంది. ఇటీవల చైనా సోషల్ మీడియాలో ఈ లైబ్రరీకి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. దాంతో ఇది సిటీకి దూరంగా ఉన్నా సరే చాలామంది వెళ్తున్నారట. ఉదయం కంటే.. సాయంత్రం వెళ్లడానికే ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారట. అక్కడ హోటల్, ఫుడ్ కోర్ట్ కూడా ఉన్నాయి తెలుసా! మరో విషయం ఏంటంటే.. వర్షం కురిసినప్పుడు మాత్రం కొన్ని సెక్షన్లు మూసేస్తారట. రాతి కొండల్లో పచ్చని ప్రకృతి మధ్యలో ఈ లైబ్రరీ భలే ఉంది కదా నేస్తాలూ! ★

హాయ్! బుజ్జీ!!

గడుల్లో గప్‌చుప్!

ఇక్కడ ప్రతి చతురస్రంలో ఒక్క అక్షరం తప్ప మిగతావి రెండుసార్లు వస్తాయి. ఆ ఏకాకి అక్షరాలను కలిపి రాస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ఓసారి ప్రయత్నించండి.

1	వా	వీ	వే	దు	దృ	ది	3
	వ	వే	వి	ది	దు	దీ	
	వీ	వా	వ	దృ	దీ	ద	
2	డ	డై	డీ	లీ	లు	లా	4
	డు	డో	డ	లూ	లీ	లూ	
	డీ	డై	డో	లా	లు	ల	

దొరికినా దొరలే.. దాచింది ఘనులే..

✶ బెజవాడకు రూ.కోట్లలో దొంగ సరకు ✶ తాజాగా పట్టుబడిన 10 టన్నుల రాగి

ఈనాడు, అమరావతి


రైల్వే స్టేషన్ వద్ద.. రాగి రేకుల సరకుతో ఉన్న మినీ డీసీఎం

'దిల్లీ నుంచి రైలులో విజయవాడకు పన్నులు చెల్లించకుండా తీసుకొచ్చిన 10 టన్నుల రాగి రేకులను గుట్టుగా మూడు మినీ డీసీఎంలలో ఎక్కించి బుధవారం రాత్రి 10 గంటలకు నగరంలోకి తరలిస్తుండగా.. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. వాహనాలను రైల్వేస్టేషన్ సమీపంలోనే రోడ్డు పక్కన ఆపించగా.. డ్రైవర్లు తాళాలు వేసి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో ఆ సరకు అలాగే శుక్రవారం రాత్రి వరకూ రోడ్డుపక్కనే ఉంది. తాళాలు వేసేయడంతో ఆ వాహనాలను అధికారులు.. కార్యాలయానికి తీసుకెళ్లే అవకాశం లేక.. అక్కడే వదిలేశారు. సరకు విలువ ఎంతనేది లెక్కగట్టే వీలు లేదు. ఈలోగా తెరవెనుక లాబీయింగ్ చేసుకుని.. వాహనాలను అక్కడి నుంచి తీసుకెళ్లే వచ్చునేది అక్రమార్కుల పన్నాగం. గతంలోనూ చాలాసార్లు ఇలాగే చేశారు.'

పన్ను చెల్లించకుండా తరలించే సరకు ఏదైనా.. దానిని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, గోదాముకు తీసుకెళ్లి అధికారులు పంచనామా చేస్తారు. ఏ సరకు, మార్కెట్ విలువ ఎంతనేది లెక్కిస్తారు. దాని ఆధారంగా కట్టాల్సిన పన్నును రెట్టింపు జరిమానాతో కలిపి భారీగా కట్టిస్తారు. ప్రస్తుతం దొరికిన 10 టన్నుల రాగి రేకుల మార్కెట్ విలువ కనీసం రూ.కోటిపైనే. దీనిపై 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. జరిమానాతో కలిపితే 36 శాతం కట్టాలి. ప్రభుత్వ ఖజానాకు కనీసం రూ.30 లక్షలుపైగా పన్ను కింద చెల్లించాలి.

అంతా దళారుల కనుసన్నల్లో...

వ్యాపారులే దిల్లీ, ముంబయి, చెన్నై నగరాల్లో కొని.. ఓ దళారీకి అప్పగిస్తారు. అతడు.. ట్రాన్స్‌పోర్ట్ సహా అంతా తానే చూసుకుని ఆ సరకును భద్రంగా విజయవాడకు రైళ్లలో తెచ్చి.. వ్యాపారుల గోదాములకు తరలిస్తున్నాడు. వారంలో కనీసం రూ.2 కోట్లకు పైగా సరకు రైళ్లలో విజయవాడకు తెచ్చి.. నగరంలోకి.. చేరుకుంటున్నట్టు తెలుస్తోంది. వీటిని తీసుకొచ్చే దళారులు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు.

చక్రం తిప్పిన ఓ ఉద్యోగి...


కృష్ణలంక డీసీటీవో ఆధ్వర్యంలో సిబ్బందితో వెళ్లి ఈ రాగి రేకులను పట్టుకున్నారు. కానీ.. వాణిజ్య పన్నుల శాఖలో ఓ అటెండర్ స్థాయి ఉద్యోగి ఈ అక్రమార్కులకు సహకరిస్తూ.. అక్కడి నుంచి డ్రైవర్లను తాళాలు వేసి వెళ్లిపోమని యజమానికి సలహా ఇవ్వడం వల్లే.. అలా చేశారని తెలుస్తోంది. దిల్లీ నుంచి తెచ్చిన రాగి రేకులతో ఆలయాలు, గోపురాలకు నగిషీలు, పళ్లాలు, పాత్రలు తయారు చేస్తారు. నిత్యం భారీగా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, సెల్‌ఫోన్ బ్యాటరీలు, కవర్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్యాటరీ బొమ్మలు, రెడీమేడ్ దుస్తులు, కుక్కర్లు, మిక్సీలు.. దొంగ దారుల్లో తెస్తున్నారు.

కొలువు పేరుతో.. నిలువు దోపిడీ!

నగర మహిళకు.. ఇంటి పట్టునే ఉండి ఉద్యోగం చేయొచ్చని మెయిల్ వచ్చింది. అందులో నెంబరుకు ఫోన్ చేశారు. వివిధ ఇంటర్వ్యూలు పూర్తయ్యాక ఎంపిక చేశారు. ఆమెకు ఓ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు. ఆమెకు చేతిరాతల స్క్రిప్ట్ పంపి.. వివరాలు కంపోజ్ చేసి పంపమన్నారు. తర్వాత అప్పగించిన పని సకాలంలో చేయకపోవడంతో తమకు నష్టం జరిగిందనీ, పరిహారం చెల్లించమని వారు నోటీసిచ్చారు. దీనికి భయపడి రూ.2.5 లక్షలు చెల్లించారామె.

భవానీపురంలో కొందరికి.. తాడేపల్లివాసి రవీంద్ర వర్మ బ్యాంకు ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో వసూలు చేసి మోసం చేశాడు. వీరిని నమ్మించడానికి మొగల్రాజపురంలో ఓ బ్యాంకు ప్రధాన శాఖలో రెండు వారాలు శిక్షణ కూడా ఇప్పించాడు. ఆతర్వాత బ్యాంకు లెటర్ హెడ్‌పై నియామక పత్రాన్నీ అందించాడు. ఆనక ఎన్నాళ్లున్నా సమాచారం లేకపోవడంతో రవీంద్రవర్మకు ఫోన్ చేయగా.. స్విచాఫ్ చేశాడు.

ఈనాడు, అమరావతి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వివిధ హోదాల్లో ఉద్యోగాలు.. ఇంటి పట్టునే ఉండి ఆన్‌లైన్‌లో ఉపాధి పొందవచ్చు. ప్రముఖ కంపెనీల్లో కొలువులని.. వస్తున్న ప్రకటనలు చూసి పలువురు యువత, మోసగాళ్ల చేతిలో చిక్కి అల్లాడుతున్నారు. వారి మాటలు నమ్మి పెద్ద మొత్తంలో డబ్బులు సమర్పించుకొని మోసపోతున్నారు. ఉద్యోగంపై ఆశతో అడిగినంత ఇచ్చుకుని, ఆనక కొలువు దక్కక నిలువునా మోసపోతున్నారు.

ఆఫ్‌లైన్.. ఆన్‌లైన్‌లోనూ..

వివిధ మార్గాల్లో అభ్యర్థుల వివరాలు సేకరిస్తున్న బోగస్ ఏజెన్సీలు యువతను సంప్రదిస్తాయి. బహుళజాతి సంస్థలో ఉద్యోగమని ఊరిస్తాయి. తర్వాత టెలిఫోన్ ఇంటర్వ్యూ అని.. ఆ తంతు ముగిస్తాయి. రిజిస్ట్రేషన్ ఫీజు పేరిట రూ.2-5 వేలు వసూలు చేస్తారు. ఆపై పరీక్ష ఫలితాలని ఓ లింక్ పంపిస్తారు. దీనికీ డబ్బు వసూలు చేస్తారు. అంతా చెల్లించి ఫలితం అనుకూలంగా వస్తే.. మళ్లీ బేరసారాలు మొదలెడుతున్నారు. అభ్యర్థి స్థాయి మేరకు రూ.1-3 లక్షలు బాదేస్తున్నారు. చివరకు నకిలీ నియామక పత్రాన్ని పంపిస్తున్నారు.

వలలో చిక్కుకోవద్దు...

ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మొద్దు. వారితో ఫోన్‌లో మాట్లాడే కంటే ముఖాముఖి చర్చించుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలి. ఉద్యోగం కోసం ఏవైనా డిపాజిట్లు కట్టాల్సి వస్తే.. తమ సంస్థల పేరున చెల్లించాలని చెబుతాయి. అంతేకానీ.. వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో చెల్లించమని అడగవు. లంచం ముట్టచెబితే ప్రభుత్వ ఉద్యోగమని చెప్పే మాటలు నమ్మి డబ్బు చెల్లించకపోవడం మంచిది. ఆన్‌లైన్‌లో వచ్చే లీగల్ నోటీసులకు స్పందించాల్సిన పని లేదు.

కృష్ణమ్మ ఉరకలు!

రెండోరోజూ మొదటి ప్రమాద హెచ్చరికే..

ఈనాడు, అమరావతి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తోంది. గురువారం రోజంతా 5 లక్షల క్యూసెక్కుల పైనే వరద వచ్చి చేరింది. కృష్ణ డెల్టా కాలువలకు 15,027, తూర్పు ప్రధాన కాలువకు (కేఈ) 8,993, కృష్ణ ప్రధాన కాలువకు (కేడబ్ల్యూ) 6,034 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రెండో రోజు కూడా మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగింది.

గురువారం ప్రవాహం క్యూసెక్కుల్లో..

సమయం	రాక	పోక
ఉదయం–6	5,04,696	4,93,822
ఉదయం–9	5,12,565	5,00,213
మధ్యాహ్నం–12	5,14,215	5,00,213
మధ్యాహ్నం–3	5,14,215	5,00,213
సాయంత్రం–5	5,15,240	5,00,213
రాత్రి–8	5,02,535	4,87,508
రాత్రి–11 గంటలు	4,96,318	4,81,194

ఎనిమిది రోజుల్లో రెండోసారి... ప్రకాశం బ్యారేజీ దగ్గర వరద ప్రవాహం ఈ సీజన్‌లో 8 రోజుల వ్యవధిలో రెండోసారి 5లక్షల క్యూసెక్కులు దాటింది. మొదటిసారి ఆగస్టు 14న ఉదయం 9 గంటలకు మొదటిసారి 5లక్షల క్యూసెక్కులు దాటి.. మధ్యాహ్నం ఒంటి గంటకు గరిష్ఠంగా ఇన్‌ఫ్లో 5,65,807, ఔట్‌ఫ్లో 5,65,201 క్యూసెక్కులుగా చేరింది. అదే రోజు రాత్రికి తగ్గుముఖం పట్టింది. మళ్లీ గురువారం ఉదయం 5 గంటలకు రెండోసారి 5 లక్షల క్యూసెక్కులు దాటింది. సాయంత్రం 5 గంటలకు గరిష్ఠంగా ఇన్‌ఫ్లో 5,15,240 క్యూసెక్కులకు చేరగా 5,00,213 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు.


రైలు వంతెన వద్ద పరవళ్లు

కాలుష్య రహిత.. వేడుకలకు జైకొట్టాలి


సమీక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ. వేదికపై కమిషనర్ ధ్యానచంద్ర, జేసీ ఇలక్కియా

ఈనాడు, అమరావతి: వినాయక చవితి వేడుకలను ఈ ఏడాది రసాయన రంగులు, ముడిపదార్థాలకు దూరంగా పర్యావరణహితంగా నిర్వహించుకునేలా ప్రజలను చైతన్యం చేసే బాధ్యత అధికారులదేనని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మట్టి గణపతినే పూజించి.. పర్యావరణాన్ని కాపాడుకుందామనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. రసాయనాల వినియోగంతో జలవనరుల నాణ్యత తగ్గడంతోపాటు... వృక్ష జంతు జాతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, నగరపాలక, విద్యుత్తు, కాలుష్య నియంత్రణ మండలి, వైద్యారోగ్యం, అగ్నిమాపకశాఖ అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు.

దిశానిర్దేశం ఇలా...

❖ విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రదేశాల్లో.. రాకపోకలకు.. ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా ఉండేలా చూడాలి. ❖ అత్యధిక శబ్దాలు వచ్చే సౌండ్ సిస్టమ్స్ వాడకుండా నిర్వాహకులకు అవగాహన కల్పించాలి. ❖ పంచాయతీ కార్యదర్శి నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరూ అప్రమత్తంగా ఉండాలి. ❖ ఊరేగింపుల్లో అగ్ని ప్రమాదాలు, విద్యుత్తు షాక్‌లు కొట్టకుండా ముందే తగిన జాగ్రత్తలపై దృష్టిపెట్టాలి. ❖ నిమజ్జనం వేళ.. శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులు పర్యవేక్షించాలి. ❖ అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలి.

దారంతా చిల్లు.. దాటలేక ఘొల్లు


గొల్లపూడి బైపాస్ కూడలిలో దుస్థితి...

నగరంలోకి భారీ వాహనాలు రాకుండా జాతీయ రహదారికి నేరుగా వెళ్లేందుకు గొల్లపూడి నుంచి బైపాస్ రహదారిలోకి మళ్లిస్తారు. అక్కడ నుంచి సితార సెంటర్ వరకు ఈ రోడ్డు భారీ, నగరవాసుల వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఈ రహదారి ప్రారంభమైన గొల్లపూడి సమీపంలో నుంచి సుమారు అర కిలోమీటరు వరకు గుంతలు పడి భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. ఇక కార్లు, ద్విచక్ర వాహనదారులకు నరకం కనబడుతోంది.

– ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, గొల్లపూడి


గుంతల దారిలో ప్రయాణం బిక్కుబిక్కు

వర్ణశోభితం!

దసరా ఉత్సవాలు సమీపిస్తున్న వేళ.. ఇంద్రకీలాద్రి దిగువన పరిసరాలు అందంగా, ఆహ్లాదంగా ముస్తాబు చేస్తున్నారు. దుర్గగుడి నుంచి కుమ్మరిపాలెం వరకు ఉన్న ఉపరితల వంతెన పిల్లర్లపై రకరకాల ఆకృతులను.. విభిన్న రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

- ఈనాడు, అమరావతి



సింగిల్ విండో అనుమతులపై హర్షం

విజయవాడ(గాంధీనగర్): హిందువులు సామూహికంగా నిర్వహించుకునే గణేష్ నవరాత్రుల పండగకు సింగిల్ విండో పద్ధతిలో.. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో ఎన్‌వోసీ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం గాంధీనగర్‌లోని సమితి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్తు ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మట్టి విగ్రహాలనే పూజించాలని ప్రజలకు సూచించారు. వేడుకలు విజయవంతం చేయడానికి జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. నవరాత్రుల ప్రారంభం నుంచి సెప్టెంబరు 4న నిర్వహించే నిమజ్జనం వరకు.. సమితి అందుబాటులో ఉంటూ.. సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. హిందూ సమాజం వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, నాగలింగం శివాజీ, దుర్గాప్రసాద్, రాఘవరాజు, త్రిమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ యూజీ కౌన్సెలింగ్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య, దంత వైద్య కళాశాలల్లోని ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల ప్రవేశానికి చేపట్టిన ప్రత్యేక ఎన్‌సీసీ కేటగిరీ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. 576 మంది అర్హత సాధించగా.. 446 మంది అభ్యర్థులు ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు.

అదే పంథా.. ఎరువుల దందా

యూరియా, డీఏపీ విక్రయాల్లో దోపిడీ

బస్తాకు రూ.100-200 అదనపు వసూలు

మొవ్వ మండలంలో కూచిపూడి, పెదపూడి, కోసూరు, నిడుమోలు, కాజ గ్రామాల్లో రూ.266కు అమ్మాల్సిన యూరియా బస్తా రూ.370కి అమ్ముతున్నారు. దుకాణాల్లో మరో అనధికారిక నిబంధన ఉంది. రూ.600 విలువైన గుళికలు కొంటేనే యూరియా బస్తా ఇస్తున్నారు. లేదంటే అదీ లేదు. ఇటీవల ఈ మండల రైతులు రోడ్డెక్కినా దిద్దుబాటు చర్యల్లేవు.

నందిగామ మండలంలో అధిక దుకాణాల్లో యూరియా, డీఏపీ అడ్డగోలుగా అమ్ముతున్నారు. డీఏపీ బస్తా రూ.1,350కు అమ్మాల్సి ఉండగా రూ.1550కి అమ్ముతున్నారు. ఇదేమంటే 3 నెలలుగా ఎరువులు లేవంటున్నారు. ఇష్టమైతే కొనండి.. లేకుంటే లేదని తెగేసి చెబుతున్నారు. గురువారం మాగల్లు రైతు రూ.1550 చెల్లించి డీఏపీ బస్తా కొన్నారు.

ఈనాడు, అమరావతి

ఉమ్మడి కృష్ణాలో యూరియా, డీఏపీ అమ్మకాల్లో వ్యాపారుల దందాకు అడ్డుకట్ట పడడం లేదు. రైతుల అవసరాలే ఆసరాగా కృత్రిమ కొరత సృష్టిస్తూ నల్లబజార్లో అమ్మేస్తున్నారు. ఈ ఏడాది అసలే ఎరువుల ధరలు పెరిగి... రైతులపై పెట్టుబడి భారం పెరగగా ఈ దందా గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.

అన్నదాతకు భారం... ఉమ్మడి జిల్లాలో 2.08 లక్షల హెక్టార్లలో ఖరీఫ్‌లో వరి వేశారు. యూరియా, డీఏపీ 80 శాతంపైగా సహకార సంఘాలకు, ఎరువుల డీలర్లకు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. సరిపడా నిల్వలు అందక.. రైతులు రోడ్డెక్కి అధిక మొత్తానికి నల్లబజార్లో కొంటున్నారు. చాలా సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు నిండుకున్నాయి. దీంతో వ్యాపారులు యూరియా రూ.100, డీఏపీకి రూ.200 అదనంగా గుంజుతున్నారు.

కావాలంటే కొర్రీలు... యూరియా, డీఏపీ కావాలంటే ఈ ఏడాదికి ఇతర ఎరువులు, పురుగు మందులు తమ దగ్గరే కొనాలని కొందరు వ్యాపారులు నిబంధన పెడుతున్నారు. ఒప్పుకొన్న వారికి యూరియా, డీఏపీ ఇస్తున్నారు. ఇలా ఒప్పందం చేసుకున్నా.. అదనపు వసూళ్లు మామూలే. గుడివాడ, గుడ్లవల్లేరు, మొవ్వ, కంకిపాడు, పామర్రు, మచిలీపట్నం, నందిగామ, జగ్గయ్యపేట మండలాల్లో ప్రస్తుతం ఇలాగే రైతులను దోచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేసి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకున్నది లేదు.


మొవ్వలో యూరియా కోసం వ్యవసాయ అధికారిణిని నిలదీస్తున్న రైతులు


నేటి నుంచి సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ (యూపీఎస్సీ) నేతృత్వంలో సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలను ఈ నెల 22, 23, 24, 30, 31వ తేదీల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో పరీక్షల ఏర్పాట్లపై గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 106 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. లబ్బీపేట (రెడ్ సర్కిల్)లోని బిషప్ అజరయ్య బాలికల కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించకూడదని చెప్పారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయ లేకుండా చూడాలని, పరీక్షా కేంద్రానికి బస్సులు నడపాలన్నారు. పరీక్షల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. జేసీ ఎస్.ఇలక్కియా, యూపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ, తనిఖీ అధికారి సునీల్‌కుమార్ అగర్వాల్, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో చైతన్య, అజరయ్య బాలిక కళాశాల ప్రిన్సిపల్ సంధ్య, వైస్ ప్రిన్సిపల్ సునీత పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులొచ్చేశాయ్!

మండలాలకు చేరిక.. 25న పంపిణీ

ఈనాడు, అమరావతి: కూటమి సర్కారు చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. సాంకేతిక హంగులతో ముస్తాబైన రేషన్ కార్డుల్లో 50 శాతంపైగా గురువారం మండలాలకు చేరాయి. ఈనెల 25న కార్డుల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.



❖ **11,26,179 మందికి:** కూటమి అధికారం చేపట్టక ముందు ఉమ్మడి జిల్లాలో 11,12,800 రేషన్ కార్డులు ఉన్నాయి. తాజా మార్పులు, చేర్పుల్లో 13,465 మందికి కొత్తగా కార్డులు వచ్చాయి. 86 మంది తమకు కార్డులు అవసరం లేదని సరెండర్ చేశారు. దీంతో మొత్తం కార్డుల సంఖ్య 11,26,179కి చేరింది. ప్రస్తుతం వీరందరికీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నారు. ప్రింటింగ్ కార్యాలయం నుంచి కార్డులు జిల్లా కేంద్రాలకు.. అక్కడ నుంచి మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. గురువారం రాత్రి వరకు 7,39,834 కార్డులు మండల కేంద్రాలకు చేర్చారు. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దాదాపు కార్డులన్నీ మండలాలకు చేరతాయి.


❖ **పంపిణీకి ఏర్పాట్లు:** తహసీల్దార్ కార్యాలయాల చేరిన కార్డులను సచివాలయాలకు తరలిస్తారు. ఆపై సిబ్బంది ద్వారా నేరుగా కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు. ప్రాధాన్యం మేరకు కొన్ని చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి.. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు... కార్డుల పంపిణీని ప్రారంభించే వీలుంది. పంపిణీ మార్గదర్శకాలపై పౌరసరఫరాల సంస్థ కమిషనర్ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జేసీలకు వీసీ ద్వారా దిశానిర్దేశం చేస్తారు.

❖ **అంతా స్మార్ట్‌గా:** త్వరలో స్మార్ట్ ఈ-పోస్ మిషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. ఇప్పుడిస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుడి వివరాలు వస్తాయి. వెరసి గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవు. సిమ్, వైఫై, హాట్‌స్పాట్, బ్లూ టూత్, టచ్ స్క్రీన్ వంటి ఆధునిక సదుపాయాలతో, ఆండ్రాయిడ్ సాంకేతికతతో పని చేస్తుంది. వేలిముద్ర పడకున్నా యంత్రంలో కెమెరా ద్వారా ఐరిస్ స్కాన్ చేయవచ్చు. తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ సాంకేతిక సొబగులు అద్దుకోనుంది.

బంగారం అమ్మించి.. అప్పు చేయించి..

✶ సైబర్ వలలో విశ్రాంత ఉపాధ్యాయుడు ✶ డిజిటల్ అరెస్టు పేరిట రూ.18.50 లక్షలు బురిడీ

ఈనాడు, అమరావతి



డిజిటల్ అరెస్టు పేరిట ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని భయపెట్టి.. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి మరీ.. రుణం తీసుకునేలా ఒత్తిడి చేశారు. అదీ చాలక.. మరికొందరి వద్ద అప్పులు చేయించి సైబర్ మోసగాళ్లు డబ్బులు కొట్టేశారు. బెంగళూరు పోలీసు, సీబీఐ పేరుతో విస్సన్నపేటకు చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని సైబర్ నేరగాళ్లు బెదిరించి ఏకంగా రూ.18.50 లక్షలు బదిలీ చేయించుకున్నారు.

బెంగళూరు పోలీసులమని చెప్పి..

విస్సన్నపేటకు చెందిన ఓ వ్యక్తి... ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎనిమిదేళ్ల కిందట పదవీ విరమణ పొందారు. ఈనెల 17న ఆయనకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఎయిర్‌టెల్ నుంచి మాట్లాడుతున్నామనీ, మీ సిమ్ రెండు గంటల్లో డీయాక్టివేట్ అవుతుందనీ, బెంగళూరులో మీ పేరున ఎఫ్ఐఆర్ నమోదైందని అవతల వ్యక్తి చెప్పాడు. ఆ తర్వాత వీడియోకాల్ వచ్చింది. పోలీస్‌స్టేషన్ సెట్‌లో ఉన్న ఓ వ్యక్తి పరిచయం చేసుకుని.. తాను బెంగళూరులోని గాంధీనగర్ స్టేషన్ ఎస్సైనని చెప్పాడు. ఈ ఏడాది జనవరి 2న... మీ ఆధార్‌తో బెంగళూరులో సిమ్ తీసుకున్నారని చెప్పాడు. ముంబయిలో మీ పేరున ఖాతా తెరిచి ఉందనీ, ఇందులోకి ఓ నేరస్థుడి నుంచి రూ.30 లక్షలు బదిలీ అయ్యాయన్నాడు. ఈ డబ్బు మీ ఖాతాలో పడిందో లేదో తనిఖీ చేయాలని ఎస్సై వేషధారణలోని వ్యక్తి అన్నాడు. సీబీఐ కార్యాలయంలో ఉన్న ఇన్‌స్పెక్టర్‌ను లైన్‌లో కలుపుతానని వీడియోకాల్‌లో కనెక్ట్ చేశాడు. మేం చెప్పిన ఖాతాకు రూ.30 లక్షలు బదిలీ చేస్తే.. పరిశీలించాక మీవేనని తేలితే తిరిగి పంపిస్తామన్నారు.

డబ్బులు లేవన్నా ఒత్తిడి చేసి...

తన వద్ద అంత డబ్బు లేదని ఆయన బతిమిలాడినా వారు వినలేదు. ఇంట్లోని బంగారు నగలు తాకట్టు పెట్టి రుణం తీసుకోమని రెండు గంటల పాటు ఒత్తిడి తెచ్చారు. సోమవారం విస్సన్నపేటలోని కెనరా బ్యాంకుకు వెళ్లి నగలు తాకట్టు పెట్టి రూ.13.50 లక్షలు రుణం తీసుకుని మోసగాళ్లు చెప్పిన ఖాతాకు అదే బ్యాంకు నుంచి నగదును బదిలీ చేశారు. మిగిలిన డబ్బు పంపమన్నారు. దీంతో చేసేది లేక కనిపించిన వారినల్లా అడిగి.. రూ.5 లక్షలు సమకూర్చుకున్నారు. మంగళవారం మళ్లీ బ్యాంకుకు వెళ్లి ఈ డబ్బును మోసగాళ్లు సూచించిన మరో ఖాతాకు బదిలీ చేశారు. ఇంకా పంపమని అడుగుతుండడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

వరదనీటి నిర్వహణ చర్యలపై సంతృప్తి

తుళ్లూరు: కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్ గురువారం అమరావతిలో పర్యటించారు. ఉండవల్లిలోని రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, కొండవీటివాగు వరద పంపింగ్ స్టేషన్ల పనితీరును ఆయన పరిశీలించారు. అమన్‌దీప్ గార్గ్‌కు అమరావతిలో వరద నీటి నిర్వహణకు చేపట్టిన చర్యలను సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ వివరించారు. ఏడీసీఎల్ ఆధ్వర్యంలో వరద నీటి నిర్వహణకు అమరావతిలో ప్రస్తుతం అమలవుతున్న, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలు, ప్రణాళికలపై సూపర్‌వైజరీ కమిటీ తరపున పరిశీలనకు వచ్చిన అమన్‌దీప్ గార్గ్ సంతృప్తి వ్యక్తం చేశారు. సీడ్‌యాక్సెస్ రహదారి సమీపంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం, గ్రీనరీ, ఎల్‌పీఎస్ జోన్ల అభివృద్ధి పనుల గురించి సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఆయనకు వివరించారు. రాజధానిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారుల కోసం నిర్మించిన భవన సముదాయాలను సందర్శించారు. అనంతవరంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌లోకేటెడ్ నర్సరీని సందర్శించిన అమన్‌దీప్ గార్గ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయంలో సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులతో సమావేశమయ్యారు. కమిటీలో ఉన్న మరో ముగ్గురు సభ్యులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. అమరావతిలో నిర్మిస్తున్న భవన నిర్మాణాల పురోగతి, రాజధాని ప్రాంత వాసులకు అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తుల నిర్వహణకు చేపట్టిన పనులు, కార్మికులు, మహిళల భద్రతా చర్యలను వివరించారు.


సీఆర్డీఏ అధికారులతో చర్చిస్తున్న అమన్‌దీప్ గార్గ్

కట్లేరు ఉగ్రరూపం.. నిలిచిన ప్రయాణం



ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద ఎనిమిది రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం కూడా అటుగా ప్రయాణాలు సాగక ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఈ నెల 13, 14న కురిసిన భారీ వర్షాలకు కట్లేరుకు పోటెత్తిన వరద నీరు వంతెన వద్ద మళ్లింపు రహదారిని ధ్వంసం చేసింది. వరద తాకిడికి రోడ్డుకు భారీగా గండ్లుపడి రాళ్లు, సిమెంట్ పైపులు దిగువకు కొట్టుకుపోయాయి. దీంతో కట్లేరులో వరద తగ్గినా గండ్ల ద్వారా నీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు సైతం వాగు దాటే పరిస్థితిలేదు. పాలకులు, అధికారులు చొరవచూపి మళ్లింపు రోడ్డుకు ఏర్పడిన గండ్లు పూడ్చిస్తేనే రాకపోకలకు అవకాశం ఉంటుంది. - న్యూస్‌టుడే, గంపలగూడెం

చెస్.. ఒక పాఠ్యాంశం కానుంది



చెస్ బోర్డుపై ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న రవినాయుడు, శ్రీనివాసరాజు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో పాఠశాల విద్యలో చెస్ ఒక పాఠ్యాంశంగా రానుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 25వ తేదీ వరకు జరిగే ఎస్ఆర్ఆర్ ఫిడే ఇంటర్నేషనల్ ఓపెన్, బ్లిట్జ్ చెస్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెస్‌ను పాఠశాల విద్యలో ప్రవేశపెట్టే విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో ఉందని, భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళిక సిద్ధమవుతున్నాయని ప్రకటించారు. రాష్ట్రంలోని శాప్ ఇండోర్ స్టేడియాల్లోనూ చదరంగ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సిద్ధార్థ అకాడమీ ఉపాధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ పెనుమత్స శ్రీనివాస రాజు మాట్లాడుతూ టోర్నీ నిర్వహణకు తనవంతు ఇతోధికంగా ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చానన్నారు. టోర్నీలో దేశంలోని సుమారు 15 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో పాటు కెనడా, కెన్యా, రష్యా, ఇంగ్లండ్, యూఎస్ఏ దేశాల నుంచి మొత్తం 410 మంది క్రీడాకారులు తలపడుతున్నారని నిర్వాహకులు ప్రకటించారు. ఆంధ్రా చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, సిద్ధార్థ అకాడమీ సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్, శాప్ పాలక మండలి సభ్యుడు ఎస్. సంతోష్‌కుమార్, ఆంధ్రా చెస్ సంఘం సీఈవో కేవీవీ శర్మ, ఎన్ఎం ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం రాష్ట్ర యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/డజను రూ.లలో)

ఎన్ఈసీసీ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ -197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, రిటైల్ 138 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 252.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఉదయం వేళ విజయవాడ ఫారం కోడిగుడ్ల ధర: 100 గుడ్లు రూ. 505 ...

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న పార్వతమ్మ

గొల్లపూడి, న్యూస్‌టుడే: విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో గురువారం ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు వృత్తుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత, తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారిలు హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ☛ ఏపీ ఆరె కటిక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా హనుమంతకారి హరికృష్ణారావు బాధ్యతలు తీసుకుని ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రేమ.. కాదు.. భ్రమ..!

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

● అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నివసించే బాలిక (16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రేమ పేరుతో ఓ యువకుడు బాలికను తీసుకువెళ్లిపోయాడని గుర్తించి.. అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

● నగరానికి చెందిన ఓ బాలిక (8) ఆరుబయట ఆడుకుంటోంది. ఓ వృద్ధుడు.. తన ఇంట్లోకి పిలిచి చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. చుట్టుపక్కల వారు గమనించి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. పోక్సో యాక్ట్ కింద కేసు కట్టి జైలుకు పంపించారు.

సమాజంలో మంచి చెడులపై అవగాహన లేని కౌమార వయసు అత్యంత ప్రమాదకరమైంది. సినిమాల ప్రభావంతో కొందరు బాలబాలికలు ప్రేమ అనే ఆకర్షణకు లోనవుతున్నారు. ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోతున్నారు. తర్వాత జరిగే పర్యవసానాలు, చట్టాల తీవ్రత తెలియక.. అనేక మంది బాలలు, యువకులు పోక్సో చట్టానికి బలవుతున్నారు. ఇష్టపడి బాలిక వచ్చినాసరే.. తప్పు యువకుడిదే. లైంగికంగా వేధించినా, అత్యాచారం చేసినా.. పోక్సోలో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. ఈ తరహా నేరాలకు కఠినమైన శిక్షలు ఉంటాయి. తెలిసీ తెలియని వయసులో కలిగేది ప్రేమ కాదని, ఆ భ్రమలో నుంచి బయటపడాలని పోలీసులు, సైకాలజిస్టులు సూచిస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో పోక్సో నమోదు..

సంవత్సరం	కేసులు
2022	79
2023	76
2024	59

శిక్షలు కఠినం..

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ప్రేమ పేరుతో వేధించినా నేరమే. బాలిక ఇష్టపడిందని ఆమెతో శారీరకంగా కలిసినా తప్పే. దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ఇలాంటి ఘటనల్లో నిందితులపై పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారు. సెక్షన్ల బట్టి శిక్షలు ఉంటాయి. లైంగికంగా వేధిస్తే 3 సంవత్సరాలు, ఆపైగా.. యావజ్జీవ ఖైదు విధించవచ్చు. వేధించి హత్యకు పాల్పడినా, అత్యాచారం చేసినా మరణశిక్ష విధించే అవకాశాలున్నాయి. ఇంతటి కఠినమైన చట్టం గురించి కౌమార వయసులో ఉన్నవారు తెలుసుకోవాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

భవిష్యత్తుపై దృష్టి పెట్టండి..



ప్రేమ అనే భ్రమ నుంచి నేటి యువత బయట పడాలి. బాలికలను ప్రేమ పేరుతో లోబరుచుకున్నా, లైంగికంగా వేధించినా, శారీరకంగా కలిసినా... 20 ఏళ్ల నుంచి జీవితకాల జైలు శిక్ష పడుతుంది. టైం పాస్ పేరుతో బాలికల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవు. వారిపై షీట్ పెట్టేందుకు వెనుకాడం. ప్రతి ఒక్కరూ భవిష్యత్తు గురించి ఆలోచించుకుని.. బాగా చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలి. తల్లిదండ్రుల ఆశలు.. ఆశయాలను నెరవేర్చండి. - **ఎస్.వి.రాజశేఖరబాబు, కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్**

దంత సంరక్షణ క్రీడాకారులకూ కీలకమే



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, వేదికపై డా.అతుల్ సర్వే, గిరీషా తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడాకారుల సమగ్ర ఆరోగ్యానికి దంత సంరక్షణ కూడా కీలకమేనని రాష్ట్ర యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ డెంటిస్ట్రీ(ఐఏఎస్‌డీ) ఆధ్వర్యంలో 'క్రీడా దంత సురక్ష- ఛాంపియన్స్ విన్నింగ్ స్మైల్స్'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మన యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రతిభకు కనబరుస్తారన్నారు. ముందుగా డాక్టర్ శ్రీవల్లిరెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ ప్రత్యేక వర్క్‌షాపులో క్రీడాకారులకు క్రీడల్లో నోటి ఆరోగ్య ప్రాధాన్యం, విరిగిన పళ్ల అత్యవసర నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. క్రీడాకారులకు ఓరల్ హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించగా.. రాబోయే నెలల్లో బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్) సర్టిఫికేషన్ శిక్షణ కూడా నిర్వహిస్తామని డాక్టర్ శ్రీవల్లిరెడ్డి తెలిపారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరీషా, నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

నందిగామ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రాం ఫంక్షన్‌హాలులో గురువారం జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘ 10వ మహాసభ నిర్వహించారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఐసీడీఎస్ ప్రాజెక్టులను బలోపేతం చేయాలని కోరారు.

సంఘ అధ్యక్షురాలిగా గజలక్ష్మి .. జిల్లా అంగన్‌వాడీ సంఘ అధ్యక్షురాలిగా టి.గజలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శిగా సుప్రజ, కోశాధికారిగా జానీరత్నకుమారి, ఉపాధ్యక్షులుగా సరళ, మధుకుమారి, పద్మ, సహాయ కార్యదర్శులుగా ఉమాదేవి, రాణి, పుష్పకుమారి, వెంకట్రావమ్మ, ఎస్.కె.అల్లాబి, నాగమణి, జ్యోతి, ఫాతిమా, హసీనా ఎన్నికయ్యారు. సంఘ గౌరవాధ్యక్షుడు డి.వి.కృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, శ్రామిక మహిళా కన్వీనర్ కమల, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో ప్రకటన.. స్టాక్స్‌లో పెట్టుబడులు..

రూ.20 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

సూర్యారావుపేట: సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు మోసపూరితమైనవి.. వాటిలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దంటూ పోలీసులు, సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నా.. సైబర్ నేరగాళ్ల ఆకర్షణీయమైన మాటలను జనం నమ్మి మోసపోతున్నారు. తాజాగా ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.20లక్షలు పెట్టుబడులు పెట్టి మోసపోయారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నగర శివారు ప్రసాదంపాడుకు చెందిన ఓ వ్యక్తి ఈ నెల 6న ఫేస్‌బుక్ చూస్తుండగా.. దానిలో 'స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ ఇన్వెస్ట్‌మెంట్' అనే ప్రకటన చూశారు. దాన్ని క్లిక్ చేయగానే 'ఎస్-67 మోతీలాల్ ఓస్వాల్ సంపత్తి వెల్త్ క్లబ్' అనే గ్రూప్‌కు అనుసంధానమయ్యారు. అందులో పెట్టుబడులపై వచ్చే లాభాల వివరాలను చూసి ఆకర్షితులయ్యారు. 'మార్వెల్ మేట్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. వారు చెప్పినట్లు విడతల వారీగా రూ.20.03 లక్షలు పంపించారు. యాప్‌లో లాభాలు వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా కుదరలేదు. మోసపోయినట్లు గుర్తించి.. పోలీసులను ఆశ్రయించారు. ఆయన 6 ఖాతాలకు డబ్బులు పంపించారు. వాటిలో 5 ఖాతాల వివరాలను పోలీసులు గుర్తించారు. అవి ఉత్తరాఖండ్ ఉదంసింగ్‌నగర్ నైనిటాల్ బ్యాంకు, ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లా బ్యాంక్ ఆఫ్ బరోడా, తమిళనాడు కోయంబత్తూర్‌లోని కరూర్ వైశ్యా బ్యాంకు, పశ్చిమ బంగా రాయ్‌గంజ్ ఐడీబీఐ బ్యాంకు, విశాఖ జిల్లా యలమంచిలి బ్యాంకు ఆఫ్ బరోడా శాఖలుగా గుర్తించారు. ఆయా ఖాతాలను స్తంభింపచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి ఎంఎస్ఎంఈ సమస్యలు



మాట్లాడుతున్న భాస్కరరావు, పక్కన రాధిక, రాజశేఖర్, వెంకటరావు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఒడిదొడుకుల్లో ఉన్నాయని.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేద్దామని ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. గురువారం విజయవాడలోని ఫెడరేషన్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ సంఘాల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో 78 సభ్య సంఘాలు ఏర్పాటయ్యాయని, సమస్యలపై చర్చించారు. అమెరికా సుంకాలతో ఆక్వా, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, ఆటో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, అనుబంధ సంఘాల ఛైర్మన్ బి.వెంకటేశ్వర్లు సమావేశం తీర్మానాలు వెల్లడించారు. రాష్ట్రంలో డీజిల్ ధరలు పెరగడం, విద్యుత్ ఛార్జీల భారం ఎక్కువగా ఉందన్నారు. యూనిట్‌కు రూ.7 నుంచి రూ.8 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఎంఎస్ఎంఈలకు రుణాల మంజూరులో జాప్యం జరుగుతోందని, ఎంఎస్ఎంఈలకు వర్తించే ప్రోత్సాహకాలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను ఒకే మొత్తంలో చెల్లించాలని వారు కోరారు.

దిగుమతుల సుంకం తగ్గించాలి.. అంతర్జాతీయ మార్కెట్లో భారత ఉత్పత్తులపై పోటీ పడేందుకు ముడిసరుకు దిగుమతులపై సుంకం తగ్గించాలని నాయకులు కోరారు. జీఎస్టీలో 5 శాతం, 5 నుంచి 12 శాతం శ్లాబులు ఉండాలని కోరారు. మన రొయ్యలను మనమే వినియోగించుకునేలా చేసి, అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్లు వెతకాలని సూచించారు. యూరోప్ దేశాలకు ఉచిత వ్యాపార ఒప్పందాన్ని ఆధారంగా తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్ఎంఈ నుంచి మెరుగైన సహకారం కోసం ప్రభుత్వ సహా కమిటీలో ఏపీ ఛాంబర్స్‌ను చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తమ పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి సెప్టెంబరు 10న అవార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ చాంబర్ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కౌన్సిల్ వైస్ ఛైర్మన్ రాధిక, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-20/16, టమాటా-44, బెండ-24, పచ్చిమిర్చి-26, కాకర-20, బీర-30/35, క్యాబేజి-22, క్యారెట్-36/46, దొండ-16, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-26, దోస-20, సొర-18/15, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-26, మునగ-5/6, కంద-40, బీట్‌రూట్-30, కీరదోస-36, బీన్స్-68, క్యాప్సికమ్-65, నిమ్మ (డజను)-30/24, నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - **ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

న్యాయస్థానానికి నటుడు పృథ్వీరాజ్ హాజరు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విడాకులు, మనోవర్తి కేసు విచారణ సందర్భంగా సినీనటుడు పృథ్వీరాజ్ గురువారం విజయవాడ న్యాయస్థానానికి విచ్చేశారు. భార్యతో ఆయనకు ఉన్న విబేధాల కారణంగా విజయవాడ ఫ్యామిలీ కోర్టులో కేసు నడుస్తోంది. క్రాస్ ఎగ్జామినేషన్ నిమిత్తం పృథ్వీరాజ్ న్యాయస్థానానికి రావాల్సి ఉంది. అయితే ఆలస్యంగా రావడంతో క్రాస్ ఎగ్జామినేషన్ జరగలేదు. దీనిపై ఆయన న్యాయవాదులతో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు.

వల్లభనేని వంశీ కేసు 25కు వాయిదా

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : బెయిల్ నిబంధనలు సడలించమని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఈ నెల 25కు వాయిదా వేశారు. వల్లభనేని వంశీపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాగా.. ఆయా కేసుల్లో బెయిల్‌పై ఉన్నారు. బెయిల్ నిబంధనల ప్రకారం ఆయన ప్రతి రోజూ ఏదో ఒక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాల్సి వస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతున్నానని, తనకు ఇచ్చిన బెయిల్ నిబంధనలను సడలించాలంటూ వంశీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణకు వచ్చింది. ఈ కేసులో డిఫెన్స్ తరపున వాదనలు వినిపించేందుకు గడువు కావాలంటూ వంశీ న్యాయవాదులు వాయిదా కోరారు. దీన్ని అనుమతిస్తూ వాదనల కోసం ఈ నెల 25కు వాయిదా వేశారు.

పరువు నష్టం కేసు సెప్టెంబరు 3కు..

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వేసిన పరువు నష్టం కేసును విజయవాడ ప్రజాప్రతినిధుల న్యాయస్థానం సెప్టెంబరు 3వ తేదీకి వాయిదా వేసింది. తన పరువుకు భంగం కలిగించారంటూ ఆయన... వైకాపా నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డిపై పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు విజయవాడ ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. గురువారం విచారణకు రాగా.. కాకాణి గోవర్దన్‌రెడ్డి తరపు న్యాయవాదులు ఆబ్సెంట్ పిటిషన్ వేయడంతో కేసును సెప్టెంబరు 3కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

కొమ్మా కోట్లు ముందస్తు బెయిల్ పిటిషన్ 22కు..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గన్నవరం తెదేపా కార్యాలయం డీటీపీ ఆపరేటర్ సత్యవర్ధన్ అపహరణ, బెదిరించిన కేసులో నిందితుడైన కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కొమ్మా కోట్లు విజయవాడ ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు నమోదైన నాటి నుంచి ఆయన పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ముందస్తు బెయిల్ కోసం ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో కొమ్మా కోట్లు పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణను ఈ నెల 22వ తేదీ శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : వృద్ధురాలి నుంచి డబ్బులు లాక్కునేందుకు ప్రయత్నించి.. ఆమెను కొట్టి చంపిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000ల జరిమానా విధిస్తూ విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి గురువారం తీర్పు చెప్పారు. గొల్లపూడి దుర్గమ్మ (70) విజయవాడ లెనిన్ కూడలిలోని పార్కులో ఉంటున్నారు. చుట్టుపక్కల కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కడపకు చెందిన ఆళ్ల విజయశంకర్ (34) తన భార్యాపిల్లలను వదిలేసి విజయవాడలో ఉంటున్నాడు. 2024, ఫిబ్రవరి 20వ తేదీ రాత్రి పార్కులో ఉన్న దుర్గమ్మ వద్దకు వెళ్లి, డబ్బులు లాక్కోబోయాడు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో పారిపోయాడు. అదే రోజు అర్ధరాత్రి 12 గంటల సమయంలో మళ్లీ పార్కు వద్దకు వచ్చి దుర్గమ్మను కొట్టాడు. డబ్బులు లాక్కునేందుకు ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించి వచ్చేసరికి పారిపోయాడు. బాధితురాలిని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గవర్నర్‌పేట పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జ్ఞానాంబ వాదించారు. 11 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో విజయశంకర్‌కు యావజ్జీవ ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.


మక్కా యాత్రకు వీసాలు ఇప్పిస్తానని మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్‌లో పరిచయమైన ఓ వ్యక్తి మాటలు నమ్మి టూర్స్ అండ్ ట్రావెల్స్ వ్యాపారి రూ.లక్షల్లో మోసపోయారు. వివరాల్లోకి వెళితే.. లబ్బీపేటకు చెందిన ఓ వ్యక్తి.. టూర్స్ అండ్ ట్రావెల్స్ వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు ఆన్‌లైన్‌లో తయ్యబ్ నవాజ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను మక్కాలో ఉంటానని, మక్కా యాత్రకు వీసాలు సమకూరుస్తానని నవాజ్ చెప్పడంతో ఆయన మాటలు నమ్మారు. తన కస్టమర్ల వీసాల కోసం రూ. 13 లక్షలు నవాజ్ చెప్పిన రెండు బ్యాంకు ఖాతాలకు పంపించారు. తర్వాత నుంచి ఫోన్ కాల్స్‌కు నవాజ్ స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి.. సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేశారు. వారి నుంచి వచ్చిన సమాచారం మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. డబ్బులు వెళ్లిన ఖాతాల వివరాలను పోలీసులు గుర్తించారు. అవి దిల్లీకి చెందిన ఇండస్ ఇండ్ బ్యాంక్ బరకాంబ శాఖ, ఉత్తర్‌ప్రదేశ్ రాంపూర్ యాక్సిస్ బ్యాంకు ఖాతాలుగా గుర్తించారు.

పశు సంవర్ధక శాఖ అధికారికి 'సైబర్' ఝలక్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్న ఒక అధికారికి సైబర్ నేరగాళ్లు ఝలక్ ఇచ్చారు. అతని బ్యాంకు ఖాతా నుంచి తెలియకుండానే.. రెండు విడతల్లో రూ. 99,998లు కాజేశారు. గత ఏడాది డిసెంబరు 9న ఈ సంఘటన జరగ్గా.. దీనిపై బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సదరు అధికారికి ఎస్‌బీఐలో ఖాతా ఉంది. దాని నుంచి రూ.49,999లు రెండు సార్లుగా విత్‌డ్రా అయినట్లు ఆయన గుర్తించారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి.. డబ్బులు విత్‌డ్రా చేసినట్లు తేలింది. దీనిపై ఆయన సైబర్ క్రైం పోర్టల్ 1930కు ఫిర్యాదు చేయగా.. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు.


వేతనాలు చెల్లించడం లేదని అదృశ్యం



మంద చిరంజీవి

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక పీహెచ్‌సీలో గౌరవ వేతనంతో స్వీపర్‌గా పని చేస్తున్న మంద చిరంజీవి అదృశ్యం కావడంతో బంధువులు గురువారం ఆసుపత్రి ఎదుట నిరసన చేపట్టారు. పోలీసులు తెలిపిన, సేకరించిన సమాచారం మేరకు..మంద చిరంజీవి గత 30 ఏళ్లుగా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ఆసుపత్రికి వచ్చిన ఆమె పెండింగ్‌లో ఉన్న వేతనం విషయమై అప్పర్ డివిజన్ క్లర్క్(యూడీసీ) శ్రీనివాసరావుతో చర్చించగా రూ.25 వేలు వేతన బకాయి కింద ఆమె ఖాతాలో వేసినట్లు చెప్పారు. చాలా కాలంగా జీతం రావాల్సి ఉండగా తక్కువ వేతనమే చెల్లించారని ఆమె మనస్తాపానికి గురై భర్తకు ఫోన్ చేసి తన గురించి వెతకొద్దని ఇంటికి రావడం లేదని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో యూడీసీ వేతనం చెల్లించకుండా వేధింపులకు గురి చేయడంతో ఆమె మనస్తాపానికి గురై అదృశ్యమయ్యారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై కే. సతీష్‌కుమార్ చేరుకుని విచారణ చేపట్టారు. చిరంజీవి భర్త ఏసుదాసు ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యురాలు కె.ప్రసన్న రాణిని వివరణ కోరగా స్వీపర్‌ను వేధించామనే ఆరోపణలు అవాస్తవమని, సిబ్బంది ఎవరూ ఆమెను ఏమీ అనలేదని తెలిపారు.

22, 23 తేదీల్లో జాతీయ స్థాయి హ్యాక్‌థాన్



ప్రచార పత్రాల ఆవిష్కరణలో కార్యదర్శి శ్రీనివాస్, ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : యువ పారిశ్రామికవేత్తలను ఆవిష్కృతం చేసే లక్ష్యంతో కోడింగ్ హ్యాక్‌థాన్ ఈనెల 22, 23 తేదీల్లో తమ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి తెలిపారు. కొత్తపేటలోని కళాశాల కార్యాలయంలో కోడ్ స్పార్క్- 2025 నిర్వహించే జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ ప్రచార పత్రాలను కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువతలోని ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి కోడింగ్ హ్యాక్‌థాన్ అండగా నిలుస్తుందని చెప్పారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు వారికి నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 330 బృందాలు పాల్గొంటాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కె.రామకృష్ణ, కంప్యూటర్స్ విభాగాధిపతి రవీంద్ర పాల్గొన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 22న మైలవరం పట్టణంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జి.రమేష్‌బాబు తెలిపారు. అయ్యప్పనగర్, సిద్ధిపేట, బస్టాండ్ ఏరియా, రామకృష్ణకాలనీ, బందగర, ఎస్వీఎస్ నగర్, పొందుగల రోడ్, పోస్టాఫీసు రోడ్, మార్కెట్ రోడ్, శివాలయం వీధి, నూజివీడు రోడ్, విజయవాడ రోడ్, శివాజీవీధి, బట్టీల ఏరియా, యాదవుల బజార్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తారని ట్రాన్స్‌కో ఏఈ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులకు అసౌకర్యం లేకుండా ఇతర సబ్‌స్టేషన్ల నుంచి సరఫరా చేస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఇబ్రహీంపట్నం రైతు బజార్ పక్కన కోఆపరేటివ్ బ్యాంకు సందులో చెత్త ఉంటోందన్న సమస్య ఇంతవరకూ పరిష్కారం కాలేదు. **- షరీఫ్, ఇబ్రహీంపట్నం.**

✔ అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తూనే ఉన్నాం. సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని కూడా శుభ్రం చేయిస్తాం. **- మధు, పారిశుద్ధ్య మేస్త్రీ**

స్పందనకు వందనం

◆ కొండపల్లి బొడ్డు రాయి కూడలిలో ఆవులు సంచరిస్తూ జనాల్ని పొడుస్తున్నాయంటూ స్థానికులు చేసిన ఫిర్యాదుపై పారిశుద్ధ్య మేస్త్రీ శ్రీను స్పందించారు. ఆ ప్రాంతంలోని ఆవుల యజమానులను సమావేశ పరచారు. ఆవులను రహదారుల పైకి వదలవద్దని హెచ్చరించారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

◆ గుంటుపల్లి జాతీయ రహదారిలోని డ్రెయినేజీలో పూడికలు తొలగించక మురుగు పేరుకుపోయి దోమలు బెడద ఎక్కువైందని స్థానికులు తెలిపిన సమస్యపై గ్రామ కార్యదర్శి మురళీ స్పందించారు. గురువారం ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య తొలగించారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

◆ పాత తిరువూరులోని డ్రెయినేజీల్లో మట్టి పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు తాళ్లూరి శ్రీనివాస్ 'మేమున్నాం మీకు తోడుగా'కు ఫిర్యాదు చేయగా పురపాలక శానిటరీ అధికారి సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని 2వ వార్డులోని బస్టాండ్ వెనుక ఉన్న డ్రెయినేజీలో చెత్త పేరుకుపోయి మురుగు నిలిచిపోయింది. దీనికితోడు పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికుడైన షాహిన్ పాషా 'మేమున్నాం మీకు తోడుగా'కు ఫిర్యాదు చేయగా పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

కల్లంలో నీరు.. కళ్లలో కన్నీరు


చేలల్లో నిలిచిన నీటితో ఇబ్బందులు

మైలవరం, న్యూస్‌టుడే

ఎడతెరిపిలేని వర్షం.. మెట్ట పంటలపై ప్రభావం చూపుతోంది. పల్లపు ప్రాంతాల్లో పంటలు ఇప్పటికే అధిక తేమతో దెబ్బతింటుండగా, పూత మీద ఉన్న చేలకు నష్టం వాటిల్లుతోంది. ముసురు వాతావరణం మరింత ముంచేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణ వర్షపాతాన్ని మించి కురవడమే మెట్ట పంటలను దెబ్బతీస్తోందని చెబుతున్నారు.

సుమారు 20 వేల ఎకరాల్లో..

నియోజకవర్గంలో ఈ ఏడాది పత్తి, పెసర సాగు సకాలంలో మొదలయ్యాయి. సుమారు 20 వేల ఎకరాలకు పైబడి పత్తిసాగు చేపట్టారు. జి.కొండూరు మండలంలో జూన్‌లోనే సాగు ప్రారంభించారు. రెండు వారాల ఆలస్యంగా మైలవరం సహా ఇతర మండలాల్లో మొదలు పెట్టారు. ముందస్తుగా నాటిన ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తిస్థాయిలో పంటలు పూత, పిందె దశలో ఉన్నాయి. వాతావరణం అనుకూలిస్తే మరో నెల రోజుల్లో పత్తితీతలు తీస్తామని ఆనందిస్తుండగా గడిచిన రెండు వారాల నుంచి భారీ వర్షాలతో పాటు, ముసురు వాతావరణంతో చేలల్లో నీరు నిలిచిపోతోంది.


పత్తి మొక్కల మధ్య వర్షపు నీరు

పూతకూ అవస్థలే..

ఇప్పటికే చాలా చోట్ల పల్లపు ప్రాంతాల్లోని పత్తి, పెసర చేలల్లో నీరు నిలిచే ఉంది. దాంతో మొక్కల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. పైగా పూత దశలో ముసురు వాతావరణంతో చీడపీడలతో రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నీటి నిల్వలేకుండా చేయాలన్నా జల్లులు పడుతుండడంతో సాధ్యం కావడంలేదని చెబుతున్నారు. దాంతో తొలి తీతకు కావాల్సిన పిందె కట్టుకూ ఇబ్బందేనని భావిస్తున్నారు. మరోవైపు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే పూర్తిగా నష్టం వాటిల్లే ప్రమాదముందంటున్నారు. పూత, కాయ దశలో ఉన్న పెసర చేలకూ వాతావరణం నష్టాన్ని చేకూర్చుతోంది. ఇప్పటికే కాయలున్న చేలల్లో బూజు తెగులు పొంచి ఉందని కర్షకులు ఆందోళనలో ఉన్నారు.

ఆందోళన చెందకండి
- సంధ్యారాణి, వ్యవసాయాధికారిణి, మైలవరం

పల్లపు ప్రాంతాల్లోనే కొంత నీరు నిలిచే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు చేలల్లో నిల్వకుండా చేసుకోవాలి. వర్షాలు తగ్గాక, యూరియా, పొటాష్ వేస్తే ఇబ్బంది ఉండదు. ముదురు సాగు చేసిన ప్రాంతాల్లోనే పూతకు ఇబ్బంది ఉండే అవకాశం ఉన్నా, మైలవరం ప్రాంతంలో ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు


వరద ఉద్ధృతి, ఫెర్రీ పరిస్థితులను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ చైతన్య

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వరదల్లో ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా జిల్లా యంత్రాంగం అంతా సమాయత్తంగా పని చేస్తోందని సబ్ కలెక్టర్ చైతన్య అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ, పవిత్ర సంగమం ప్రాంతాల్లో వరద ఉద్ధృతిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో మాట్లాడారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, అన్ని ప్రాంతాలను అనుక్షణం పరిశీలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తీసుకున్న చర్యల గురించి తహసీల్దారు వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక నడక మార్గం ఏర్పాటు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక నారాయణనగర్ వద్ద బుడమేరు వాగు దాటి పొలాలకు వెళ్లేందుకు తాత్కాలిక నడకదారిని తెలుగుయువత నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగుకు ప్రవాహం పెరగడంతో గతంలో వేసిన గ్రావెల్ కొట్టుకుపోయింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సూచన మేరకు తాత్కాలిక ఏర్పాట్లు చేశామని లితీష్ తెలిపారు. శాశ్వతంగా వాగుపై వంతెన కోసం ఆయకట్టు ప్రాంత రైతులు చేస్తున్న విజ్ఞప్తులు ప్రభుత్వాలు మారుతున్నా కార్యరూపం దాల్చకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రతిభతోనే ఉన్నత అవకాశాలు

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చాటడం ద్వారా ఉన్నత అవకాశాలు సాధించవచ్చని స్థానిక వీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.హైమావతి పేర్కొన్నారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం కళాశాలలో 'మెరుగైన భారతదేశాన్ని నిర్మించడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో కె.పవన్ మహేష్(ద్వితీయ బైపీసీ), కె.నందిని(ప్రథమ హెచ్‌ఈసీ), పి.ఉదయశ్రీ(ద్వితీయ ఒకేషనల్) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులు పి.రాధాకృష్ణ, ఎం.హరికృష్ణ, బి.ఎలిజబెత్‌లు బహుమతులు అందజేసి, అభినందించారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులు

సృజన వెలికితీతకు పోటీలు దోహదం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లోని సృజనను వెలికి తీసేందుకు ప్రతిభా పాటవ పోటీలు ఎంతగానో తోడ్పడతాయని శ్రీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ మేడా మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆ పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంభాషణ్' నుంచి 'ఏఐ వరకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ప్రయాణం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో రెడ్డి గురుప్రసాద్(9వ), ఎం.వేదశ్రీ(8వ), వై.సుప్రియ(9వ) తరగతి విద్యార్థులు మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు చైర్మన్, ప్రిన్సిపల్ వి.రమణ కుమార్, డైరెక్టర్ శ్రీహర్షదీప్తి బహుమతులు అందజేశారు.


విజేతలతో స్కూల్ ఛైర్మన్ మేడా మోహన్ రావు, ప్రిన్సిపల్ వి.రమణ కుమార్

రైతులకు పారదర్శక సేవలు అందించాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: రైతులకు పారదర్శకతతో కూడిన మెరుగైన సేవలు అందించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. కొత్తూరుతాడేపల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా ధూళిపాళ్ల రమేష్, సభ్యులుగా బడుగు ఏడుకొండలు, గర్నేపూడి జమలయ్యల ప్రమాణస్వీకార కార్యక్రమం నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ..సొసైటీల ద్వారా కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ..రైతులకు రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసే ఎరువులు, విత్తనాలు తదితర సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రుణాలు, పథకాలు అందించాలన్నారు. నాయకులు బొమ్మసాని సుబ్బారావు, అక్కల గాంధీ, బొర్రా పున్నారావు, చేబ్రోలు సాయి, పాల్గొన్నారు.


పీఏసీఎస్ ఛైర్మన్, సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యేలు గద్దె, వసంత, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం

గొల్లపూడి: పైడూరుపాడు పీఏసీఎస్ ఛైర్మన్‌గా దాసన నాగవర్ధనరావు, సభ్యులుగా చప్పిడి వెంకట్రావు, రాట్నాల వెంకటేశ్వరరావుల ప్రమాణస్వీకార కార్యక్రమం గ్రామంలో గురువారం జరిగింది. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం నాయకులు నరేంద్ర, సాంబశివరావు, మందా మురళీ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం చేయండి

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని విజయవాడ డీఎల్‌పీవో రాఘవన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని జి.కొండూరు, పినపాక గ్రామాల్లో చేపట్టిన సర్వే పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వామిత్వ సర్వేలో పాల్గొన్న జిల్లా మాస్టర్ ట్రైనర్, ఈవో హరికృష్ణ కుమార్ మాట్లాడుతూ..మెరుగైన సాంకేతికతతో గ్రామీణ గృహాల కోసం ఆస్తి రికార్డులను మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. వివాదాలకు తావు లేకుండా ఆస్తి హక్కు పత్రాలు అందజేస్తామన్నారు.

'నా భర్తను విడిపించండి'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వీటీపీఎస్ కో-ఆపరేటివ్ సబ్బుల్లో తన భర్తను అపహరించారని వీటీపీఎస్ కో-ఆపరేటివ్ బంకులో పనిచేసే గోపాలకృష్ణ భార్య టి.రాజ్యలక్ష్మి ఆరోపించారు. బంకులో రూ.10లక్షలు గల్లంతు, నరసం చిద్దిళ్ల గోపాలకృష్ణ మాయమయ్యారని పది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో తన భర్తను సబ్బుల్లో దాచేశారని రాజ్యలక్ష్మి గురువారం మీడియా ముందు వాపోయారు. ఆయనకేమీ తెలియదని, కొన్నేళ్ల నుంచి అక్కడే పని చేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం గుంతలు విషయం బయటకు రావడంతో ఆ నెపం తన భర్తపై వేసి ఆయనను దాచేశారని వాపోయారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకుని భర్తను విడిపించాలని కోరారు.

ముత్యాలమ్మకు బోనాలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: శ్రావణమాసం పురస్కరించుకుని రుద్రవరం గ్రామంలోని ముత్యాలమ్మతల్లి దేవాలయంలో గురువారం మహిళలు పొంగళ్లు, బంతికి పసుపు కుంకుమలతో బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు గురువారం బోనాలు సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్, నాభిశిలకు పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులు, పిండి వంటలు, చీరెలు, జాకెట్లు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు.

పడుతూ.. లేస్తూ ప్రయాణాలు



చెవుటూరు వడ్డెర కాలనీలో రహదారి బురదకయ్యగా మారి రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు మండిపడుతున్నారు. ఈ మార్గంలో పాదచారులు పడుతూ లేస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారని వాపోతున్నారు. అధికారులకు మొర పెట్టుకున్నా కనీసం తట్ట మట్టి కూడా వేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కృష్ణా జలాల సరఫరా, వీధి దీపాలు కూడా లేకపోవడంతో పరిస్థితి దుర్భరంగా ఉందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరైన మౌలిక వసతులు అందించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

అధ్వాన దారి.. అవస్థలే మరి


గుంతలమయమైన కొండపల్లి హైస్కూల్ రోడ్డు

కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న రోడ్డుకు మోక్షం కలగడం లేదు. రహదారి ఆసాంతం గుంతలమయమైనా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. కొన్నేళ్ల కిందట తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. కొండపల్లి నుంచి పారిశ్రామికవాడకు వెళ్లాలన్నా, జాతీయ రహదారి 65పైకి చేరుకోవాలన్నా ఇదే దిక్కు. కొన్నేళ్లుగా రైల్వే వంతెన నిర్మించడం వాయిదా పడడంతో ఈ రోడ్డు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. ఆర్టీసీ సిటీ సర్వీసు బస్సులు రాకపోకల సందర్భంలో తీవ్ర ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు పురపాలిక అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుంది. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

హమ్మయ్యా.. గుంతలు దాటితే చాలు


గుంతల్లోని బురదను దాటేందుకు విద్యార్థుల అవస్థలు

మండలంలోని కోకిలంపాడులో అధ్వాన రహదారులకు అద్దం పడుతున్న దృశ్యమిది. రహదారి సౌకర్యం లేక గ్రామస్థులు నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. గ్రామం ప్రారంభం నుంచి చివరి వరకు సుమారు 3 ఫర్లాంగు దూరం రోడ్డుపై గుంతలు పడి అందులో మురుగు నిలవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు అవస్థలు పడుతున్నారు. గుంతలను దాటి బడికి వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న తిప్పలు చెప్పనలవికాదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గుంతలు పూడ్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కోకిలంపాడు(తిరువూరు)**

చట్టాలపై అవగాహన తప్పనిసరి

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహనతో ఉండాలని, తద్వారా తమకు ఇతరుల నుంచి ఇబ్బందులు ఎదురైనప్పుడు చట్టపరంగా రక్షణ పొందే అవకాశం ఉంటుందని ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ సూచించారు. పోక్సోచట్టం, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, మహిళలపై అఘాయిత్యాలపై పట్టణంలోని నాగార్జున జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థులకు ఇతరుల నుంచి ప్రమాదాలు, దాడులు ఎదురైనప్పుడు వారి నుంచి తప్పించుకునేందుకు ఆత్మరక్షణ విద్యను నేర్పించారు. కళాశాల ఛైర్మన్ దిరిశాల హనుమంతరావు, ప్రిన్సిపల్ కె.శేషగిరిరావు, డైరెక్టర్ పి.సూరిబాబు, ఏఎస్సై వై.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య నేర్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని జి.కొండూరు ఎస్సై కె సతీష్‌కుమార్ కోరారు. చెవుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, రోడ్డు భద్రత చర్యలపై శిక్షణ ఎస్సై గౌరీశ్వరి అవగాహన కల్పించారు. మరో శిక్షణ ఎస్సై గౌతమ్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీఎన్‌జే లక్ష్మీ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరాలు నేడు

మైలవరం, న్యూస్‌టుడే: లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ వై.జగన్మోహనరావు మెమోరియల్ చిల్డ్రన్ ఐ కేర్, లయన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో ఈ నెల 22న పలు పాఠశాలల్లో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ నాయకులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, ఎస్ఎస్‌కే హైస్కూల్, వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉత్సాహంగా క్వాంటమ్‌వ్యాలీ హ్యాకథాన్

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో గురువారం నిర్వహించిన అమరావతి క్వాంటమ్‌వ్యాలీ హ్యాకథాన్-2025లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆన్‌లైన్ బూట్ క్యాంపులో కళాశాలకు చెందిన 30 జట్లలో 180 మంది విద్యార్థులు, 13 మంది అధ్యాపకులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. కార్యక్రమం నిర్వహణతో క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుందని ఆయన వివరించారు.


పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

తిరువూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బోసుబొమ్మ కూడలి వద్ద ధర్నా చేశారు. రెవెన్యూ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. జీవో నంబరు 77 రద్దు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న కళాశాల ఫీజులు, తల్లికి వందనం సొమ్ములు విడుదల చేయాలని నినాదాలు చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మొటిక్స్ అందించే సొమ్మును కూడా పెంచాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బి.వెంకటేశ్వరరావు, సాయి, పవన్, మోహన్, శరణ్య, దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు బోసుబొమ్మ కూడలిలో ధర్నా

అవీ ఇవీ

ప్రత్యేక ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బీవీ రామకృష్ణ నాయక్ కోరారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు క్యాంపులను నిర్వహిస్తున్నామని నూతన ఆధార్, బయోమెట్రిక్ అప్డేట్, పుట్టినతేదీ, చిరునామా, మొబైల్ నంబర్ మార్పు తదితర సేవలందిస్తున్నట్లు చెప్పారు.

బుడమేరు పటిష్ఠంగానే ఉంది

కొండపల్లి, న్యూస్‌టుడే: బుడమేరు వరద నీటి వల్ల పరిసర ప్రాంతాల వారికి ఎటువంటి ప్రమాదం లేదని పురపాలిక ఛైర్మన్ సీహెచ్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి శాంతినగర్ బుడమేరు రిటైనింగ్‌వాల్, వరద నీటి పరిస్థితిపై ఇరిగేషన్ అధికార్లతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ బుడమేరు రిటైనింగ్ వాల్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని వరద నీటిపై వస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు. అనూహ్య పరిణామాలు చోటుచేసుకోకుండా అధికార గణం పూర్తి అప్రమత్తంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ శ్రీను, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నెమలి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు అధికారులు, అర్చకులు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు పూజా ద్రవ్యాలతో వరలక్ష్మి వ్రతంలో పాల్గొనవచ్చని చెప్పారు.

కష్టాల్లో అండగా నిలవడమే ధ్యేయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు రూ.18,43,388 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం, రుద్రవరం పీఏసీఎస్‌ల అధ్యక్షులు వి.సుబ్బారెడ్డి, ఎం.సాంబశివరావు, నాయకులు ఎస్‌కె.కరీముల్లా వి.రత్తారెడ్డి, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సత్కారం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం గ్రామంలోని వివిధ రంగాలకు చెందిన వృద్ధులను శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. శిర్డీసాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజుపేటలో ఐడియాస్ సేవా సంస్థ నిర్వాహకుడు అవ్వారి శౌరి ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు ప్రవాసాంధ్రుడు అవ్వారి కిరణ్ అందించిన వితరణతో ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందజేశారు.

రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధం

- జాయింట్ ఎల్‌పీఎం నంబర్లతోనే ముద్రణ
- ఫొటోలు, పేర్లు, విస్తీర్ణంలోనూ తేడాలు
- రీసర్వే సమస్యలు పరిష్కరించకుండానే.. అచ్చువేయించిన రెవెన్యూశాఖ
- కొత్తవి ఇచ్చినా..రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే



సరిహద్దు రాళ్లనే కాదు, రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలపైనా నాటి ముఖ్యమంత్రి జగన్ తన బొమ్మలేసుకున్నారు. హడావుడిగా సర్వే చేయడంతోపాటు విస్తీర్ణంలో తేడాలు, పేర్లలో తప్పులు ఉన్నా పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక జగన్ బొమ్మను తొలగించి..రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలను త్వరలోనే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇది రైతులకు సంతోషం కలిగించే అంశమే అయినా వాటిలో తప్పులు చూస్తేనే.. ఆందోళన కలుగుతోంది. గత ప్రభుత్వంలో చేసిన తప్పుల్ని సరిదిద్దకుండానే కొత్త పుస్తకాల్ని ప్రింట్ చేయించారు. ఇప్పటికే 22 లక్షలకు పైగా పట్టాదారు పాస్‌పుస్తకాలు జిల్లాలకు చేరాయి. వాటిని పరిశీలిస్తే 50 శాతం తప్పులే ఉన్నట్లు తేలింది. జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సమస్యలూ ఎక్కువే. ఇద్దరు ముగ్గురు రైతుల పేర్లతో ఐదు, పదెకరాలు నమోదు చేశారు. వాటిని విభజించలేదు. ఇవన్నీ సరిచేసుకోవాలంటే మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే.

వెబ్‌ల్యాండ్‌లో తప్పులు... ఏడాదైనా సరిచేయకుండా

రీసర్వే సమయంలో వెబ్‌ల్యాండ్‌లో కుప్పలకొద్దీ తప్పులు నమోదయ్యాయి. విస్తీర్ణాల్లోనూ పెద్దఎత్తున తేడాలొచ్చాయి. ఒక రైతుకు 1.20 ఎకరాలు ఉంటే ఎకరం నమోదు చేశారు. మరో రైతుకు ఎకరం ఉంటే 1.20 ఎకరాలు ఉన్నట్లు రాశారు. సరిచేయాలని అర్జీలు పెట్టుకున్నా ఇప్పటికీ పరిష్కారం కాలేదు. రైతుల పేర్లలోనూ తప్పులు దొర్లాయి. ఇలాంటివి అనేకం ఉన్నా అలాగే ప్రింటింగ్‌కు ఇచ్చేశారు.

ప్రధానంగా గుర్తించిన కొన్ని తప్పులు

- చనిపోయిన వారి పేర్లతోనే పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రింట్ చేశారు. వారసులు వాటిని తీసుకుని మళ్లీ రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి కొత్తవి తీసుకోవాలి.
- మగవారి పేర్లను ఆడవారిగా, ఆడవారి పేర్లను మగవారిగా మార్చేశారు. కొందరి పేర్లు సగమే ముద్రించి వదిలేశారు.
- ఆధార్, మొబైల్ నంబర్లలో తప్పులు ఉన్నాయి.
- కొన్నిచోట్ల కౌలు చేసే వారి పేర్లతో పుస్తకాలు తయారు చేశారు.
- వీటిని ఇలాగే రైతులకు ఇస్తే.. భూములు అమ్ముకోవాలన్నా, రుణం తీసుకోవాలన్నా ఇబ్బందులే. సరి చేయించుకోవాలంటే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే.

ప్రింటింగ్‌లోనూ తప్పులే

ఒక రైతు పేరుతో ఉన్న పుస్తకంలో మరో రైతు ఫొటో వచ్చింది. పేర్లు మారిపోయాయి. 40వేల పుస్తకాల్లో సమాచారం తప్పుగా ఉంది. 25వేలకు పైగా పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఫొటోలు తేడాలున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోనే 8వేలకు పైగా ఉన్నాయి. పశ్చిమగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, వైఎస్సార్ కడప, విశాఖపట్నం, కాకినాడ, అనంతపురం తదితర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. వాటిని అలాగే రైతులకు పంపిణీ చేస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీంతో సరిదిద్దే చర్యలు చేపట్టారు.

రైతుల అంగీకారం తీసుకుంటే..

గతంలో రెవెన్యూ రికార్డులను వెబ్‌ల్యాండ్‌లోకి నమోదు చేసే సమయంలో రైతులకు ఒక పత్రం ఇచ్చారు. అందులో భూ యజమానుల పేర్లు, సర్వే నంబరు, సబ్‌డివిజన్, విస్తీర్ణం, ఎలా సంక్రమించింది? భూస్వభావం తదితర వివరాలన్నీ ముద్రించారు. తప్పులు ఉంటే సరిచేసి ఇవ్వాలని కోరారు. పత్రాలపై రైతుల సంతకాలు (అంగీకారం) తీసుకున్నాకే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. అయితే ఈ దఫా అధికారుల వద్ద ఉన్న రీసర్వే రికార్డులు, సమాచారం ప్రకారమే పట్టాదారు పాస్‌పుస్తకాలు ముద్రించారు. అందుకే పెద్ద ఎత్తున తప్పులు దొర్లాయని చెబుతున్నారు.

\- ఈనాడు, అమరావతి

వార్షిక ఫాస్టాగ్ పాస్‌లతో రయ్.. రయ్!

- తొలి 6 రోజుల్లోనే రాష్ట్రంలో 2.5 లక్షల రాకపోకలు

ఈనాడు, అమరావతి: వార్షిక ఫాస్టాగ్ పాస్‌లు ప్రవేశపెట్టిన తొలి ఆరు రోజుల్లోనే రాష్ట్రంలోని వివిధ టోల్‌ప్లాజాల మీదుగా 2.5 లక్షల వాహనాలు రాకపోకలు సాగించాయి. రూ.3 వేల విలువైన వార్షిక ఫాస్టాగ్ పాస్‌తో కార్లు, జీపులు, వ్యాన్లు వంటి వ్యక్తిగత వాహనాలు జాతీయ రహదారులపైనున్న టోల్‌ప్లాజాల మీదుగా ఏడాదిలో 200 ట్రిప్పులు వెళ్లేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. దీన్ని ఈ నెల 15న ప్రారంభించింది. మన రాష్ట్రంలో 78 టోల్ ప్లాజాల పరిధిలో ఈ నెల 15 నుంచి 20 వరకు ఈ పాస్‌ల ద్వారా వాహనదారులు 2,49,268 ట్రిప్పులు ప్రయాణించారు. ఇందులో 15న 15,598 ట్రిప్పులు నమోదుకాగా, 17న (ఆదివారం) అత్యధికంగా 59,058 ట్రిప్పులకు పెరిగాయి.

పాస్‌ల కొనుగోళ్లలో తెలుగు రాష్ట్రాల ముందంజ

వార్షిక ఫాస్టాగ్ పాస్‌ల కొనుగోళ్లలో దేశంలో తమిళనాడు వాహనదారులు మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ ఐదు, తెలంగాణ ఏడో స్థానంలో ఉన్నాయి. ఈ నెల 18 వరకు దేశవ్యాప్తంగా 5.40 లక్షల వార్షిక టోల్‌పాస్‌లు యాక్టివేట్ అయ్యాయి. వాటిలో తమిళనాడు 65,982 ఉన్నాయి. ఏపీలో 43,052, తెలంగాణలో 31,597 ఉన్నట్లు తేలింది. గురువారానికి దేశవ్యాప్తంగా అమ్ముడైన వార్షిక పాస్‌ల సంఖ్య 7.5 లక్షలకు చేరింది. వీటిలో ఏపీ, తెలంగాణల నుంచి ఎన్ని ఉన్నాయన్నది సమాచారం రాలేదు.

ఏరోజు ఎన్ని వాహనాలు?

తేదీ	రాకపోకలు
ఆగస్టు 15	15,598
16	26,478
17	59,058
18	54,887
19	44,330
20	48,917

■ వార్షిక ఫాస్టాగ్ పాస్‌లు రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారులపైనున్న 78 టోల్ ప్లాజాల్లో చెల్లుతాయి. అయితే చెన్నై-కోల్‌కతా హైవేపై కొవ్వూరు- రాజమహేంద్రవరం వద్ద గోదావరిపైనున్న గామన్ వంతెన టోల్‌ప్లాజా, కత్తిపూడి-ఒంగోలు హైవేలో కృష్ణా నదిపై పులిగడ్డ- రేపల్లె మధ్య ఉన్న వంతెన టోల్‌ప్లాజా, అద్దంకి- నార్కట్‌పల్లి రోడ్‌లోని రెండు టోల్‌ప్లాజాల్లో ఇవి పనిచేయవు. ఈ నాలుగు టోల్ ప్లాజాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీసీపీ సరిత, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, కలెక్టర్ లక్ష్మీశ, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు, జేసీ ఎస్.ఇలక్కియ, డీఆర్వో లక్ష్మీనరసింహం

ప్రపంచ రికార్డు లక్ష్యంగా.. 26న విజయవాడలో మట్టి గణపతుల తయారీ

ఈనాడు, అమరావతి: పర్యావరణహిత గణపతి విగ్రహాలను వేల సంఖ్యలో ఒకేసారి తయారుచేసి ప్రపంచ రికార్డును నెలకొల్పేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26న విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మైదానం, పలు పాఠశాలల వేదికగా మట్టి గణనాథుల తయారీకి సన్నాహాలు చేస్తున్నారు. పర్యావరణహితంగా వేడుకలు నిర్వహించుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను గురువారం ఆవిష్కరించారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఇళ్ల వద్దే పర్యావరణహితంగా ప్రతిమలను తయారుచేసి వాటి ఫొటోలను 91549 70454 నంబరుకు వాట్సప్ చేయాలని కలెక్టర్ సూచించారు.

14 మంది అధికారులకు ఐపీఎస్‌లుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పోలీసు సర్వీసుకు చెందిన 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీలకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి లభించింది. బి.లక్ష్మీనారాయణ, కె.ఈశ్వరరావు, కె.చౌడేశ్వరి, ఇ.సుప్రజ, కేవీ శ్రీనివాసరావు, కె.లావణ్య లక్ష్మి, ఎ.సురేష్‌బాబు, డి.హిమావతి, కె.లతా మాధురి, పి.వెంకటరత్నం, కె.కృష్ణ ప్రసన్న, ఎం.సత్తిబాబు, కరీముల్లా షరీఫ్, పి.శ్రీనివాస్‌లు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

కాకాణి బెయిలు షరతు సవరణ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో బెయిలు ఇచ్చినప్పుడు విధించిన షరతును సవరించాలని కోరుతూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. కాకాణిపై నమోదైన కేసుల వివరాలు, ఏ కేసులలో కోర్టులు షరతులు విధించాయి, ఏ పోలీసు స్టేషన్‌కు ఎప్పుడు హాజరుకావాలి, తదితర వివరాలను తమ ముందు ఉంచాలని పోలీసులకు, కాకాణి తరఫు న్యాయవాదికి హైకోర్టు సూచించింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు కాకాణి తరఫు సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ క్వార్ట్జ్ కేసులో దర్యాప్తు పూర్తయి, దిగువ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసేంత వరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించవద్దని ఇదే కోర్టు షరతు విధించిందన్నారు. ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని మరో షరతు పెట్టిందని గుర్తుచేశారు. నెల్లూరు జిల్లాలో ప్రవేశించకూడదనే షరతు కారణంగా ఆయా కేసుల్లో ఐఓల ముందు కాకాణి హాజరుకాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

తెదేపా నాయకుల హత్యలో పిన్నెల్లి సోదరుల పాత్ర

- అందుకు ఆధారాలున్నాయి
- పోలీసుల తరఫున హైకోర్టులో వాదనలు వినిపించిన ఏజీ
- ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్యలో వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల పాత్ర ఉందని, అందుకు ఆధారాలున్నాయని పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం హైకోర్టులో వాదనలు వినిపించారు. "హత్య వెనుక పిటిషనర్ల కుట్ర, ప్రోద్బలం ఉన్నాయి. నిందితులు ఓ రెస్టారెంట్‌లో సమావేశమై హత్యకు కుట్రపన్నారు. హత్యలో పాల్గొన్న వ్యక్తులతో పిన్నెల్లి సోదరులు ఫోన్‌లో మాట్లాడుతుంటారు. ఇందుకు సాంకేతిక, ఫోన్‌కాల్ రికార్డు ఆధారాలున్నాయి. సర్పంచ్ పదవికి పోటీచేస్తే తాము మద్దతిస్తామని మొదటి నిందితుడికి పిటిషనర్లు హామీ ఇచ్చారు. వాస్తవాలను వెలికితీయాలంటే వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి(ఏ7)ని కస్టడీలోకి తీసుకొని విచారించాలి. వారు ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులు. బెయిలిస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారు. వారి ముందస్తు బెయిలు పిటిషన్లను కొట్టేయాలి" అని కోరారు. గురువారం జరిగిన విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ప్రకటించారు. పిటిషనర్లపై తొందరపాటు చర్యలొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

■ పిన్నెల్లి సోదరుల తరఫున సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెదేపాలో ఆధిపత్యపోరు కారణంగా ఈ హత్యలు జరిగాయన్నారు. పిటిషనర్లకు ఎలాంటి పాత్ర లేదని, రాజకీయ కక్షతో వారిని ఈ కేసులో ఇరికించారని.. అందువల్ల ముందస్తు బెయిలివ్వాలని కోరారు.

■ ఫిర్యాదుదారుడు తోట ఆంజనేయులు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. 'ముందస్తు బెయిలు మంజూరు చేసే ముందు.. నేర తీవ్రత, నిందితుల పూర్వచరిత్ర తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్నికల్లో రామకృష్ణారెడ్డి ఈవీఎంను పగలగొట్టారు. గుండ్లపాడులో 2022లో జరిగిన ఓ హత్యకేసులో పిటిషనర్ల పాత్ర ఉంది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎఫ్ఐఆర్‌లతో పేర్లు లేకుండా చేసుకున్నారు. ఆ కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోసం మేజిస్ట్రేట్ వద్ద పోలీసులు పిటిషన్ వేశారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(ఏ7) ఎన్నికల తర్వాత పరారీలో ఉన్నారు. పలు కేసులలో నిందితుడు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని పిటిషన్లను కొట్టేయండి' అని కోరారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి బలవన్మరణం



నరసింహనాయుడు

వేంపల్లె, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గురువారం ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు చెందిన రాజులమ్మ, అప్పలనాయుడు దంపతుల కుమారుడు నరసింహనాయుడు(17) ఈ క్యాంపస్‌లోని ఒంగోలు ట్రిపుల్ ఐటీ విభాగంలో పీయూసీ-2 చదువుతున్నాడు. తండ్రి అప్పలనాయుడు అనారోగ్యంతో చాన్నాళ్ల క్రితమే మృతిచెందారు. నరసింహనాయుడు చదువులో 7.5 జీపీఏతో మెరుగ్గానే ఉన్నాడు. అయితే, ఎవరితోనూ కలిసేవాడు కాదు. గురువారం వేకువజామున మరుగుదొడ్డిలో కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సహచర విద్యార్థులు గమనించి, అధికారులకు సమాచారమిచ్చారు. అక్కడే 'లైఫ్ ఈజ్ బోరింగ్.. ఐ వాంట్ టు డై' అని రాసి ఉన్న లేఖను గుర్తించారు. డైరెక్టర్ కుమారస్వామిగుప్తా, ఏవో రవికుమార్, ఇతర అధికారులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె వైద్య విధాన ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి తల్లికి సమాచారమిచ్చారు. ఈ ఘటనపై మంత్రి నారా లోకేశ్.. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు తోటి విద్యార్థులను విచారించి కేసు నమోదు చేశారు.

తితిదే గురించి మాట్లాడే నైతికత కరుణాకరరెడ్డికి లేదు

యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్

ఈనాడు, అమరావతి: తితిదే గురించి మాట్లాడే నైతిక అర్హతే వైకాపాకు, ఆ పార్టీ నేత భూమన కరుణాకరరెడ్డికి లేదని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ మండిపడ్డారు. తిరుమల పవిత్రతను కాపాడిన ఘనత తెదేపాకే దక్కుతుందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "గతంలో వైఎస్సార్, జగన్‌రెడ్డి పాలనలో తితిదే నిర్వహణను దారుణ స్థాయికి తీసుకెళ్లారు. అన్న ప్రసాదాల్లో నాణ్యత లోపించింది. నిధుల్ని దుర్వినియోగం చేశారు. కరుణాకరరెడ్డి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు సివిల్ కాంట్రాక్టుల ముసుగులో కమీషన్లు దోచుకున్నారు" అని ఆరోపించారు.

రెవెన్యూకు 2 స్కోచ్ అవార్డులు

రాష్ట్ర రెవెన్యూ శాఖ జాతీయ స్థాయిలో రెండు స్కోచ్ అవార్డులు సాధించింది. 2025 సంవత్సరానికి ఓఆర్‌సీఎంఎస్(ఆన్‌లైన్ రెవెన్యూ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్), రీ సర్వే 2.0 కార్యక్రమాల్లో అత్యుత్తమ పనితీరు చూపి, మెరుగైన సేవలు అందించినందుకు ఈ అవార్డులు దక్కాయి. సెప్టెంబరు 20న దిల్లీలో జరిగే స్కోచ్ సదస్సులో వీటిని అందజేయనున్నారు. రెవెన్యూ వ్యవస్థలో ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలకు ఈ గుర్తింపు లభించిందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్లకు రూ.250 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రూ.250 కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

సైట్ ఇంజినీర్ల సేవల పొడిగింపు

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న 75 మంది ఒప్పంద సైట్ ఇంజినీర్ల సేవలు మరో ఏడాదిపాటు (2026 మార్చి 31 వరకు) పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది.

హైకోర్టులో ఏజీపీల నియామకం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు ఎనిమిది మంది సహాయ ప్రభుత్వ న్యాయవాదులు(ఏజీపీ) నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం జీవో జారీ చేశారు. ఏజీపీలుగా నియమితులైన వారిలో చల్లా శ్రీనివాస్, కందకట్ల ఉజ్వలాదేవి, బొక్కా సమీర, పాలడుగు గణేష్, రుద్ర మల్లికార్జునరావు, ఉప్పలపాటి లోవరాజు, గాజుల నవీన్, సాయి గోపిమనోజ్‌కృష్ణ ఉన్నారు.

శ్రీకాకుళం జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టాలి

శ్రీకాకుళం జిల్లాకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

ఐదేళ్లలో ఏఐబీపీ కింద ఏపీకి సాయం సున్నా

- ప్రాజెక్టులు నిదానంగా సాగడం, రాష్ట్ర వాటా ఖర్చు చేయకపోవడమే కారణం
- లోక్‌సభలో కేంద్రం వెల్లడి

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన- సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం (పీఎంకేఎస్‌వై- ఏఐబీపీ) కింద ఆంధ్రప్రదేశ్ నుంచి 8 ప్రాజెక్టులు ఉన్నప్పటికీ 2019-25 మధ్య కాలంలో కేంద్ర సాయం కింద ఎలాంటి నిధులూ విడుదల చేయలేదని కేంద్ర జలశక్తిశాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తెలిపారు. అందుకు కారణం ఇందులో గుండ్లకమ్మ రిజర్వాయర్, ముసురుమిల్లి ప్రాజెక్టుల పురోగతి నిదానంగా సాగడంతోపాటు, అంతకుముందు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన వాటాకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 40% ఖర్చు చేయకపోడమేనని చెప్పారు. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కూడా నిదానంగా సాగినట్లు తెలిపారు. తోటపల్లి బ్యారేజ్, తాటిపూడి, పుష్కర ఎత్తిపోతల పథకాలు, ఎర్రకాల్వ ప్రాజెక్టులకు కేంద్ర సాయం ఏమీ బకాయి లేదని వెల్లడించారు. ఈ పథకం కింద ఏపీ ప్రభుత్వం వరికపూడిసెల ప్రాజెక్టుతోపాటు ఇతర కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలేవీ పంపలేదని చెప్పారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి 2025 మార్చి వరకు రూ.20,658.71 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. గురువారం లోక్‌సభలో విజయనగరం తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

కృష్ణా ట్రైబ్యునల్ గడువు ఏడాది పొడిగింపు

కృష్ణా ట్రైబ్యునల్ గడువును వచ్చే ఏడాది ఆగస్టు వరకు పొడిగించినట్లు జలశక్తిశాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్‌చౌదరి తెలిపారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు.

వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చడానికి మద్దతివ్వలేదు

2017 నాటి డాక్టర్ పీడీ సత్యపాల్‌కుమార్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాల్మీకి, బోయలు 25.80 లక్షల మంది ఉన్నారని.. వారిని ఎస్టీల్లో చేర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి దుర్గాదాస్ ఉయికె తెలిపారు. అయితే ఆ ప్రతిపాదనలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మద్దతు పలకలేదన్నారు. లోక్‌సభలో తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, అంబికా లక్ష్మీనారాయణలు అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు.

ఐదేళ్లలో చమురు, గ్యాస్ రాయల్టీ రూ.1,318 కోట్లు

చమురు, గ్యాస్ ఉత్పత్తి రాయల్టీ కింద ఆంధ్రప్రదేశ్‌కు 2020-25 మధ్యకాలంలో రూ.1,318 కోట్ల ఆదాయం వచ్చినట్లు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్‌గోపి తెలిపారు. గురువారం లోక్‌సభలో విజయలక్ష్మీదేవి అనే సభ్యురాలు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ద్వారా ఈ విషయం వెల్లడైంది.

రూ.3,653 కోట్లతో బద్వేల్- నెల్లూరు ఎన్‌హెచ్ విస్తరణ

బద్వేల్- నెల్లూరు జాతీయ రహదారి-67ని గోపవరం నుంచి ఎన్‌హెచ్16లోని గురువిందపూడి వరకు బీఓటీ పద్ధతిలో నాలుగు వరుసల రహదారిగా విస్తరించనున్నట్లు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ జవాబిచ్చారు. 108.13 కి.మీ. ఈ మార్గాన్ని రూ.3,653 కోట్లతో విస్తరించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్‌లకు ఇంటర్ కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి ఏపీకి రూ.12,152 కోట్లు

జాతీయ రహదారుల అభివృద్ధి కోసం 2025-26లో ఏపీకి రూ.12,152 కోట్లు కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. దీంతో మొత్తం 457 కిలోమీటర్ల పొడవైన 28 పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. దీనికితోడు ఎన్‌హెచ్ఏఐ రూ.26,453 కోట్లతో 383 కి.మీ. పొడవైన 3 ప్రాజెక్టులను చేపట్టాలని ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో పలు రహదారుల నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కడప- రంగంపేట క్రాస్ సెక్షన్, హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో కర్నూలు- కడప సెక్షన్ రహదారులు ప్రస్తుతం డీపీఆర్ దశలో ఉన్నట్లు వివరించారు.

ఆక్యుపెన్సీ ధ్రువపత్రం కోసం మరోసారి దరఖాస్తు చేసుకోండి

- వైకాపా కార్యాలయాల విషయంలో హైకోర్టు సూచన

ఈనాడు, అమరావతి: ఏలూరు, మచిలీపట్నంలోని వైకాపా కార్యాలయాలకు ఆక్యుపెన్సీ ధ్రువపత్రం పొందే విషయంలో భౌతికంగా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లకు హైకోర్టు సూచించింది. ఆ దరఖాస్తులపై చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని ఏలూరు, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లను ఆదేశించింది. ఆ భవనాల విషయంలో తొందరపాటు చర్యలొద్దని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ఏలూరు, మచిలీపట్నంలోని వైకాపా కార్యాలయాలకు అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇవ్వడం లేదని పేర్కొంటూ ఏలూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, కృష్ణా జిల్లా వైకాపా అధ్యక్షుడు పేర్ని నాని వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలపై హైకోర్టు తాజాగా విచారణ జరిపింది.

మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘాలపై నిషేధం పొడిగింపు

ఈనాడు, అమరావతి: మావోయిస్టు పార్టీ, దాని అనుబంధ సంఘాలు, సంస్థలపై ప్రస్తుతం కొనసాగుతున్న నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. విప్లవ కార్మిక సమాఖ్య (వికాస), సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) రాడికల్ యూత్ లీగ్ (ఆర్‌వైఎల్), రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ), రైతు కూలీ సంఘం (ఆర్‌సీఎస్)/ గ్రామీణ పేదల సంఘం (జీపీఎస్), ఆల్ ఇండియా రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎస్ఎఫ్), మావోయిస్టు పార్టీ, రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఆర్‌డీఎఫ్) సంస్థలపై నిషేధాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక నేరాల దర్యాప్తులో బ్యాంకర్ల సహకారం అవసరం

- సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్ సహా ఇతర ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు న్యాయం అందించేందుకు బ్యాంకర్ల సహకారం ఎంతో అవసరమని సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ అన్నారు. దర్యాప్తు అధికారులు కోరే సమాచారాన్ని, డాక్యుమెంట్లను వీలైనంత వేగంగా అందించాలని కోరారు. మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో గురువారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆర్థిక నేరాలతో ప్రమేయమున్న వారిని గుర్తించేందుకు దర్యాప్తు అధికారులు కోరిన కేవైసీ డాక్యుమెంట్లు అందివ్వాలి. మోసపూరిత కార్యకలాపాల్లో పాల్గొన్న వారిని గుర్తించేందుకు బ్యాంకుల్లోని సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వాలి. అనుమానాస్పద లావాదేవీల నివేదికలు సమర్పించాలి' అని బ్యాంకర్లను కోరారు.

వైకాపా ఎంపీ అనుచరుల వేధింపులు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి : వైకాపా ఎంపీ గురుమూర్తి ప్రోద్బలంతో ఆయన అనుచరులు అక్రమ కేసులు పెట్టి తనను వేధిస్తున్నారని తిరుపతి జిల్లా నాగలాపురం మండలం చిన్నపట్టుకు చెందిన పి.సుధాకర్ వాపోయారు. తప్పుడు కేసులు ఎత్తేయాలని మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో గురువారం వినతిపత్రం ఇచ్చారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఏపీ గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

■ సీసీ రహదారి నిర్మించిన స్థలం తనదేనని, మాట వినకపోతే దారి మూసేస్తానని బెదిరిస్తున్న వైకాపా జడ్పీటీసీ సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురానికి చెందిన బాధితులు ఫిర్యాదు చేశారు.

■ గ్రామ కంఠం భూమిని ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా కొమరోలు మండలానికి చెందిన విజయలక్ష్మి కోరారు.

వైద్యారోగ్య శాఖలో భారీగా పదోన్నతులు

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించింది. వైద్య విద్య, సెకండరీ హెల్త్, ప్రజారోగ్యం, ఔషధ నియంత్రణ శాఖల పరిధిలో అర్హులైన వైద్యులు, ఇతర అధికారులు 223 మందికి పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. ఖాళీల భర్తీకి శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సిఫార్సులకు ఆమోదం తెలపాలని సంబంధిత విభాగాధిపతులను ఆదేశించింది. ఖాళీగా ఉన్న ఆరు ఏడీఎంఈ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. సర్వీసు నిబంధనలు సడలించి అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించే వెసులుబాటును కల్పించింది. దాంతో 77 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి దక్కనుంది. 110 మంది డిప్యూటీ సివిల్ సర్జన్లు/సివిల్ అసిస్టెంట్ సర్జన్లను సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతి కల్పించనుంది. డ్రగ్ కంట్రోల్ విభాగంలో నలుగురు అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా, ఇద్దరు డీడీలకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి ఇవ్వనుంది. ఆయుష్ సంచాలకుల కార్యాలయంలో ఖాళీగా ఉన్న అదనపు సంచాలకుల (యునాని) పోస్టు భర్తీకి పంపిన ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించింది. ఆయుర్వేద విభాగంలోనూ పదోన్నతులకు అవకాశం కల్పించింది. హెల్త్ డిస్ట్రిక్ట్ మాస్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్లకు హెల్త్ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లుగా పదోన్నతులకు స్క్రీనింగ్ కమిటీ సిఫార్సు చేసిన 12 మంది పేర్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రజారోగ్య విభాగంలో 22 ఏళ్లుగా డిప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతులు లేకపోవడంతో సమస్యను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ అనుమతితో ఎనిమిది మంది డీడీలకు జేడీలుగా పదోన్నతి కల్పించారు.

సర్వే శాఖలో నలుగురికి జేడీలుగా పోస్టింగ్

ఈనాడు, అమరావతి: సర్వే, భూ రికార్డుల శాఖలో నలుగురు అధికారులకు తాత్కాలిక పదోన్నతులు కల్పించి జాయింట్ డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తాడేపల్లిలోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో కె.ఝాన్సీరాణి, కర్నూలులోని సర్వే, భూ రికార్డుల కార్యాలయ జేడీగా ఎ.వెంకటేశ్వరరావు, కాకినాడ సర్వే, భూ రికార్డుల కార్యాలయ జేడీగా వీఎస్ఎన్ కుమార్, ప్రధాన కార్యాలయంలో జేడీగా కెజియా కుమారిని నియమిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులిచ్చారు.

చిరంజీవి ఎందరికో స్ఫూర్తిప్రదాత

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: సినీనటుడు చిరంజీవికి ఆయన తమ్ముడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చిరంజీవి అసాధారణ విజయాలతో ఎల్లలు దాటే కీర్తి ప్రతిష్ఠలు సాధించడం నాలాంటి ఎందరికో స్ఫూర్తి. కీర్తికి పొంగిపోలేదు. కువిమర్శలకు కుంగిపోనూ లేదు. అన్నింటినీ భరించే శక్తి చిరంజీవి నైజం. అందుకే ఆయన విశ్వంభరుడు. విజయాన్ని వినమ్రతతో, అపజయాన్ని సవాలుగా స్వీకరించే పట్టుదల అన్నయ్య నుంచే నేర్చుకున్నా. ఆయనకు తమ్ముడిగా పుట్టడం ఒక అదృష్టమైతే, ఆయన కష్టాన్ని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరగడం ఒక అనుభవం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పితృ సమానుడైన అన్నయ్యకు, మాతృ సమానురాలైన వదినకు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.

రంగు, రూపం, లింగం... ఇలా టెక్ రంగంలో మహిళలకు ఎన్ని రకాల వివక్షలో! నిందలూ, అవమానాలూ వీటికి అదనం. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇవన్నీ చూసిన చైత్ర వేదులపల్లి... స్త్రీలకూ సాంకేతిక ఫలాలు అందించాలనుకున్నారు. 'విమెన్ ఇన్ క్లౌడ్' ద్వారా ఆర్థిక వ్యవస్థలో వాళ్లనూ భాగం చేస్తున్నారు. ఆ ప్రస్థానాన్ని 'వసుంధర'తో పంచుకున్నారిలా...

మా సేవల్ని మైక్రోసాఫ్ట్ మెచ్చింది!


చైత్ర

పెళ్లి తర్వాత అమెరికాలో అడుగు పెట్టి... మూడేళ్లు ఇంట్లోనే ఉన్నా. అమ్మానాన్నలు నన్ను అలానే చూడాలనుకున్నారు. నాన్న మేజర్(రిటైర్డ్) కేవీఎస్‌రావు, అమ్మ శారద. గుంటూరుకు చెందినవాళ్లమైనా, నాన్న ఉద్యోగం రీత్యా ఇండియాలోని వేర్వేరు నగరాల్లో పెరిగాను. బెంగళూరులో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. 21 ఏళ్లకే రామకృష్ణదత్‌తో పెళ్లి. అప్పటికే అమెరికాలో స్థిరపడ్డారాయన. మావారినీ, ఇంటినీ బాగా చూసుకోవడమే నా పని. వంట బాగా చేసేదాన్ని. ఎందరు అతిథులు వచ్చినా ఏ లోటూ లేకుండా పక్కాగా ప్లాన్ చేసేదాన్ని.

టెక్ రంగంలోకి

నా పనితీరుని గమనించిన రామ్... 'నీ ప్రతిభ ఇంటికే పరిమితం కాకూడదు' అని చెప్పడంతో కెరియర్ గురించి ఆలోచించా. అది 1995... 100కోట్ల మందికి ఐటీ సేవలు చేరతాయని మైక్రోసాఫ్ట్ చెబుతుండేది. దాంతో టెక్, సాఫ్ట్‌వేర్ అంశాలు ఆకర్షించాయి. డేటాబేస్, విండోస్‌కి సంబంధించిన క్లాసులకు హాజరయ్యా. 1996లో పీసీ కొన్నా. మావారి విద్యా రుణాలు అలాగే మిగిలి ఉంటే ప్రణాళికలు వేసి వాటిని తీర్చేశా. ఆయన స్నేహితులకూ ఈ విషయంలో సాయపడ్డాను. ఎక్సెల్ స్ప్రెడ్‌షీట్స్, చార్ట్స్ సాయంతో ఇవన్నీ చేయగలిగా. 1996లో ఒరాకిల్‌లో చేరా.

మైక్రోసాఫ్ట్ ఉద్యోగిగా...

రెండేళ్ల ఉద్యోగ అనుభవంతో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం వచ్చింది. లైసెన్సింగ్, ప్రైసింగ్ విభాగాల్లో పనిచేశా. సంస్థకు 40 విభిన్న ఉత్పత్తులు ఉండేవి. వాటిని ఒకే ఉత్పత్తిగా మార్చి విజయవంతంగా మార్కెట్ చేశాం. నాలుగేళ్లకే మా విభాగంలో డైరెక్టర్ స్థాయికి చేరాను. ఆర్థిక మాంద్యంవల్ల 2010లో కొనుగోళ్లు తగ్గాయి. వాటిని గాడిలో పెట్టి 1.6బిలియన్ డాలర్ల ఆదాయం తీసుకురావడంలో కీలకంగా ఉన్నా. పెద్ద ఆలోచనలు, సాహసోపేతమైన వ్యూహాలు... సీనియర్ల నుంచి చాలా నేర్చుకున్నా.

బిలియన్ డాలర్ల లక్ష్యం 'విక్'

ఒక దశలో పని రొటీన్‌గా అనిపించడంతో ఏడాది పాటు సెలవు తీసుకుని... ఇండియా వచ్చి కొన్నాళ్లున్నా. తిరిగి వెళ్లాక ఏం చేయాలన్న స్పష్టత కోసం టెక్ సంస్థల వ్యవస్థాపకులతో మాట్లాడేదాన్ని. పెద్ద కంపెనీలకు ఆర్థిక వనరులున్నాయి. వాళ్లకి నూతన ఆలోచనలు, సేవలు అందించే భాగస్వాములు కావాలి. మహిళలకు ఆ సామర్థ్యం ఉంది. కానీ వాళ్లతో పరిచయం లేదు. వీళ్ల మధ్య అంతరాన్ని పూడ్చే లక్ష్యంతో పెట్టిందే 'విమెన్ ఇన్ క్లౌడ్(విక్)'. దీన్లో వ్యాపారులూ, వ్యవస్థాపకులూ, ఉద్యోగులూ... ఎవరైనా సభ్యులుగా చేరొచ్చు. మహిళా వ్యవస్థాపకులు తెచ్చిన ఉత్పత్తుల్ని కంపెనీలకు పరిచయం చేసి, వ్యాపార ఒప్పందాల్లో సాయపడతాం. 2030 నాటికి బిలియన్ డాలర్ల ఆర్థిక ఒప్పందాలు లక్ష్యంగా 2018లో దీన్ని ప్రారంభించాం. ఇప్పటికే అందులో సగానికి చేరుకున్నాం.

సినిమాలూ తీస్తున్నాం

'విక్' ద్వారా తక్కువ మొత్తానికే నాయకత్వ శిక్షణ, ఏఐ తదితర నైపుణ్యాల్ని నేర్పిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాలకు చెందిన 1.5లక్షల మంది విక్‌లో భాగం. 150 మందికి పెట్టుబడుల్లోనూ సాయపడ్డాం. మొత్తంగా 5600 స్కాలర్‌షిప్‌లు అందించాం. వీటిని ఇండియాలోనూ ఇచ్చాం. నైపుణ్య శిక్షణ విభాగంలో 'టాప్ సప్లయిర్స్ డ్రైవింగ్ కమ్యూనిటీ'గా విక్‌ను మైక్రోసాఫ్ట్ గుర్తించింది. సత్య నాదెళ్ల ప్రశంసలూ అందుకున్నాం. విక్ భాగస్వామ్యంతో సినిమాలూ తీస్తున్నాం. 'అమెరికన్ వారియర్' నిర్మాణంలో భాగమయ్యాం. 'ఎల్ఓసీ' నేపథ్యంలో మరొకటి తీస్తున్నాం. టెక్‌లో లింగ వివక్ష గురించి మేం నిర్మించిన 'ఐకాన్స్' డాక్యుమెంటరీ గతేడాది ఆస్కార్‌కు నామినేట్ అయింది. సినిమా నిర్మాణంలో ఏఐని ఉపయోగించి నిర్మాణ ఖర్చుల్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. టెక్‌లో మహిళల విజయగాథల్ని హ్యాండ్‌బుక్‌గా తెస్తున్నాం.

జీవితం మారథాన్... లక్ష్యం స్ప్రింట్

ధైర్యం, ఆత్మవిశ్వాసంలో నానమ్మ, అమ్మమ్మ, అమ్మ స్ఫూర్తి. నిజానికి ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్ కావాలన్నది నా లక్ష్యం. అందుకు తగ్గట్టు సిద్ధమైనా కుదరలేదు. మాకు ఇద్దరు అబ్బాయిలు. నేను మైక్రోసాఫ్ట్‌లో ఉన్నప్పుడే రామ్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఎంబీఏ, ఎం.ఎస్. చేయలేదు కానీ సంగీతం, టెక్ అంశం.. ఏదో ఒక నైపుణ్యాన్ని ప్రతి నెలా నేర్చుకుంటా. విభిన్నంగా ఆలోచించడం, భారీ లక్ష్యాలు పెట్టుకోవడం... నా బలాలు. క్లౌడ్ కంప్యూటింగ్ సేవల సంస్థ 'మేలా'ను స్థాపించా. వివిధ కంపెనీల్లో బోర్డు సభ్యురాలిగానూ ఉన్నా. 'ఫోర్బ్స్ నెక్స్ట్ 1000' జాబితాలో చోటు దక్కింది. జీవితం మారథాన్ లాంటిదే. కానీ లక్ష్యాల్ని స్ప్రింట్‌లుగా భావించి పరుగు తీస్తేనే విజయం దక్కేది.

వసుంధర

vasundhara@eenadu.in

నయా ట్రెండ్

నన్ను నన్నుగా ప్రేమిస్తేనే..!



ఇన్‌స్టా దగ్గర్నుంచి... మ్యాట్రిమోనీ సైట్ల వరకు పెట్టే ఫొటో ఏదైనా పర్‌ఫెక్ట్‌గా ఉండాలనే అనుకుంటారు అమ్మాయిలు. అందుకే ఒకటికి రెండుసార్లు చెక్ చేసి, అవసరమైతే ఫిల్టర్లు వాడి ఓకే అనిపించాకే పోస్ట్ చేస్తారు. వేడుకలప్పుడే కాదు, కాలేజీ, ఆఫీసు... అంతెందుకు, ఇంటి నుంచి బయట అడుగుపెడుతున్నా నీట్‌గా ఉన్నామా అని తప్పక చూసుకుంటారు. కానీ అన్నివేళలా అలాగే ఉంటామా ఏంటి? అనారోగ్యం, మూడ్ బాలేనప్పుడు అంతే పర్‌ఫెక్ట్‌గా కనిపించం కదా? అంటే అప్పుడు మనం ఎవరికీ నచ్చనట్లేనా? ఇదే భయం పట్టుకుంది నేటి తరం అమ్మాయిలకి. అందుకే ఏం చేస్తున్నారో తెలుసా? అందంగా సిద్ధమైనవి కాదు, సాదాసీదాగా ఉన్న ఫొటోలనే పంచుకుంటున్నారు. అవసరమైతే అలా ఉండేలా మార్పులూ చేస్తున్నారట. 'నీ లోపాలివి' అని ఎవరైనా చెబితే అవి స్పష్టంగా కనిపించేలా చేస్తున్నారట. ఎందుకిలా అంటే... నన్ను నన్నుగా ప్రేమించేవాళ్లు కావాలి. అందంగా, స్టైలిష్‌గా కనిపించినప్పుడే కాదు ఏ సమయంలోనైనా, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా నన్ను నన్నుగా స్వీకరించగలిగేవాళ్లు కావాలి. మనస్తత్వానికీ ఆలోచనాతీరుకీ విలువివ్వ గలగాలి. అది పర్‌ఫెక్ట్ లుక్‌తో సాధ్యమవదు. లోపాలూ కనిపించేలా చేయాలి. అప్పుడూ నచ్చితేనే ఆ బంధం కలకాలం సాగుతుంది అంటున్నారు. పైగా దీనివల్ల అందరిముందూ, సోషల్‌మీడియాలోనూ పనిగట్టుకుని పద్ధతిగా కనిపించాల్సిన పనీ ఉండదు. ఇది డిజిటల్ డీటాక్స్‌గానూ పనికొస్తుందని చెబుతున్నారు. దీనికి ఓ పేరూ పెట్టారు. అదే... రివర్స్ క్యాట్ ఫిషింగ్. మీకేం అనిపించింది ఈ ట్రెండ్ మరి?

ఆ రెండూ ఒకటే!

చరిత్రలో 'ఆమె'



అందాల సీతాకోక చిలుక... ఒళ్లు గగుర్పొడిచే గొంగళి పురుగు నుంచే వస్తుందని నేడు ప్రీ స్కూల్ చిన్నారులూ చెప్పగలరు. కానీ 1670ల వరకూ ఈ రెండిటినీ వేర్వేరు జీవులుగానే శాస్త్రవేత్తలూ భావించారు. ఈ విషయాన్ని తొలిగా గుర్తించింది జర్మనీకి చెందిన మరియా సిబిల్లా మెరియన్. ఈమెకి చిన్నప్పటి నుంచీ కీటకాలంటే చాలా ఇష్టం. పదమూడేళ్ల వయసు నుంచీ వాటిని సేకరించడం, అధ్యయనం చేయడం, బొమ్మలు గీయడం చేసేది. ఆ క్రమంలోనే గొంగళిపురుగు సీతాకోకచిలుకగా మారుతుందని తెలుసుకుంది. తరవాత కీటకాల జీవిత చక్రం గురించిన తన పరిశోధనలను రెండు సంపుటాలుగా తీసుకొచ్చింది ప్రకృతి శాస్త్రవేత్త. అవి కీటక శాస్త్ర పురోగతికి ఎంతో తోడ్పడ్డాయి.



వేరుశనగ పొట్టుతో వినాయకుడు!

పర్యావరణహిత వినాయక విగ్రహాలంటే అందరికీ గుర్తుకొచ్చేది మట్టితో తయారు చేసేవే. కానీ వీటిని నిమజ్జనం చేసినప్పుడు జలవనరుల్లో పూడిక పేరుకుపోతుంది. దీన్ని గుర్తించిన శ్రీజ... మరో పరిష్కారాన్ని చూపింది. అదేమిటంటే...


శ్రీజ



శ్రీజది గద్వాల జిల్లాలోని చింతలకుంట. మట్టితో చేసే వినాయకుడు పర్యావరణ హితమే అయినా చెరువులు, నదుల్లో పూడిక పేరుకోవడానికి కారణమవుతాయి. దానికి ప్రత్యామ్నాయం చూపాలనుకుని వేరుశనగ పొట్టు, వ్యవసాయ వ్యర్థాలతో విగ్రహాల తయారీ ప్రారంభించింది. 'వీటిని నిమజ్జనం చేస్తే జలచరాలకు ఆహారంగా సాయపడతాయి. జలవనరులకూ ఎలాంటి నష్టం ఉండదు' అంటోంది శ్రీజ. ఈమె ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. 'శ్రీజ గ్రీన్ గెలాక్సీ' పేరుతో అంకుర సంస్థను స్థాపించి... రూ.20 లక్షలతో మూడు యంత్రాలను సమకూర్చుకుంది. మొదట్లో వేరుశనగ పొట్టు, వ్యవసాయ వ్యర్థాలతో మొక్కలు నాటుకునేందుకు వీలుగా కుండీలు, టీ కప్పులు తయారుచేసేది. వీటితోనే వినాయక ప్రతిమల్ని ఎందుకు తయారుచేయకూడదన్న ఆలోచన వచ్చాక ఈ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా యంత్రాల్లో మార్పులు చేయించుకుంది. ప్రస్తుతం ప్రతి పది నిమిషాలకు రెండు విగ్రహాలు తయారవుతున్నాయి. ఈ వినాయక చవితికి 2 వేల విగ్రహాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుందీ అమ్మాయి. అర అడుగు ఎత్తు ఉండే వీటిని రూ.200కు అమ్ముతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'ఆగస్ట్ ఫెస్ట్-2025'లో ఈ పర్యావరణహిత గణేశ్ విగ్రహాలను శ్రీజ ప్రదర్శించింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈమె ప్రయత్నాన్ని ప్రశంసించారు. డబ్బులిచ్చి విగ్రహాన్ని కూడా కొనుగోలు చేశారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే... ఇంకా ఎన్నో ఉత్పత్తులను తయారు చేస్తానంటోంది శ్రీజ.

– బాబన్న, కృష్ణవేణి చౌక్(గద్వాల)

అద్దంలో... కుందనపు బొమ్మ!

క్లిక్... క్లిక్...



మిర్రర్ సెల్ఫీ... ఆధునిక అమ్మాయి నేస్తమే ఇది. కానీ దీని ఉనికి మాత్రం ఎప్పటిదో! ఒక్కసారి పాత ఆల్బమ్ తిరగేయండి. పట్టు పరికిణీ- ఓణీ లేదంటే ఫుల్ జాకెట్టు... పొడవుగా సవరం వేసి మరీ అల్లిన జడ. దానికి అమర్చిన అందమైన పూలజడ. చెవులకు బుట్టలు, దాని వెంటే చెంప సవరాలు.. మెడలో నగలు! వీటన్నింటితో అద్దం ముందు నిలబెట్టి తీయించుకున్న అమ్మదో, పిన్నిదో ఫొటో తప్పక కనిపిస్తుంది. ముందు అమ్మాయి, అద్దంలో జడ లేదంటే... అద్దంలో ముఖం, వెనకవైపుగా జడ కనిపించేలా ముచ్చటగా తీయించుకునేవారు. ఆ అలంకరణలో ఉన్న అమ్మాయిని చూస్తూ మురిసిపోతూ అమ్మతోనో, బామ్మతోనో 'నా బంగారు తల్లి, కుందనపు బొమ్మ' అనిపించుకున్న అనుభూతిని ఊహించుకోండి. 'వావ్' అనిపించడం లేదా? అంతటి సౌందర్యం ఏ సెల్ఫీ మాత్రం బంధించగలదు? అందుకే కెమెరాతో క్లిక్ మనిపించుకుంటున్నారు. 'ఆఫ్‌బీట్ మిర్రర్ ఫొటోషూట్' అంటూ ప్రత్యేకంగా చేయించుకుంటున్నారు. తలలో పూలు తురుముకుంటూ... చెవులకు దిద్దులు పెడుతూ... కళ్లకు కాటుక అద్దుతూ... అలంకరించుకున్న అందాన్ని తనివితీరా చూసుకుంటూ... ఎన్నెన్ని ఫోజులో. సహజత్వానికి చిరునామాలా లేవూ? చూస్తుంటేనే మనసు దోచేస్తాయంటే కాదనగలమా? సింపుల్ లుక్‌లోనూ తెగ ఆకట్టుకుంటున్నాయి. కాబట్టే నేటి అమ్మాయిలు భారతీయ సంప్రదాయం... చీర లేదా ఓణీలో ఈ ట్రెండ్‌ని అనుసరించేస్తున్నారు. కోరి మరీ ఫొటోలు తీయించుకుంటున్నారు. మీకూ అలాంటి ఓ జ్ఞాపకం కావాలనుందా? మిర్రర్, ఫార్ మిర్రర్, లైట్ షిమ్మర్, ప్రొఫైల్ షాట్ అంటూ బోలెడు రకాలున్నాయి. వాటిల్లో నచ్చిందేదో ఎంచుకుంటే సరి.









లింక్డిన్ సాయంతో కెరియర్‌ని ఉన్నతంగా నిర్మించుకోవాలని ఎవరికి ఉండదు? అయితే, అందుకు తగ్గట్టు జాగ్రత్తలు తీసుకుంటున్నారా?

లింక్డిన్ ప్రొఫైల్ ఎలా ఉంది?

1. డిస్‌ప్లే పిక్...

చాలామంది ఫేస్‌బుక్, ఇన్‌స్టాల మాదిరిగానే లింక్డిన్‌నీ సోషల్ మీడియా వేదిక అనుకుంటారు. అందుకని క్యాజువల్ ఫొటోని ప్రొఫైల్ పిక్‌గా పెడతారు. లేదంటే అసలు ఫొటోనే పెట్టరు. అలా కాకుండా, ప్రొఫెషనల్ లుక్ ఉండే ఒక పాస్‌పోర్ట్ ఫొటోని డీపీగా పెట్టుకోండి.

2. హెడ్ లైన్...

పేరు కింద ఉండే పరిచయ వాక్యమే హెడ్ లైన్. దీన్లో మీ కాలేజీ పేరు, కంపెనీ హోదాకంటే కూడా మీకున్న నైపుణ్యాల గురించి రాయాలి. వాటిద్వారానే మీ అవసరం సంస్థలకు ఉందో లేదో తెలుస్తుంది.

3. అబౌట్ సెక్షన్

దీన్లో మీ చరిత్రకంటే కూడా అనుభవం, చేసిన ముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రత్యేక నైపుణ్యాలు, సర్టిఫికేషన్స్, లక్ష్యాల గురించి రాయాలి.

4. కనెక్షన్స్...

ఇక్కడ అర్థవంతమైన నెట్‌వర్కింగ్ ముఖ్యం. మిగిలిన సోషల్ మీడియాల మాదిరిగా ఇక్కడ ఎవరికిపడితే వాళ్లకు కనెక్షన్ రిక్వెస్టులు పంపకూడదు. మీ వృత్తికి, దాని అనుబంధ రంగాల్లో ఉన్నవారికి మాత్రమే పంపాలి. రిక్వెస్ట్‌తోపాటు ఆ వ్యక్తి నెట్‌వర్క్‌లో ఎందుకు భాగం కావాలనుకుంటున్నారో వివరించాలి.

5. విద్యార్హతలు...

ఇక్కడ డిగ్రీలు చెప్పడానికే పరిమితం కావొద్దు. నిజంగా మీరు చేసిన ప్రాజెక్టులు, ఫ్రీలాన్సింగ్, ఇంటర్న్‌షిప్ వర్క్, పని అనుభవం ఈ వివరాలు చెప్పాలి.

ఈ జాగ్రత్తలన్నీ తీసుకున్నప్పుడే లింక్డిన్‌లో మీ ఉనికి తెలిసేది. రిక్రూటర్లు స్క్రోలింగ్ ఆపి, మీ ప్రొఫైల్‌ని గమనించేది.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

గిరిజన మహిళలు... పోషకాల పంటలు!

నెలల పిల్లలు రక్తహీనతతోనూ... ఐదేళ్ల చిన్నారుల్లో 40శాతం మంది తక్కువ బరువుతోనూ బాధపడుతున్నారు. ఇక మహిళలు, గర్భిణుల సంగతైతే చెప్పనక్కర్లేదు. పోషకాహార లోపం, దీర్ఘకాల, వారసత్వ వ్యాధులతో ఎటు చూసినా అనారోగ్య సమస్యలే... ఈ పరిస్థితుల్ని అధిగమించడానికి అక్కడి మహిళలంతా ఏం చేశారంటే...

ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో గిరిజన గ్రామాలే ఎక్కువ. అసలే కరవు పీడిత ప్రాంతం... దానికి తోడు అనారోగ్యాలు. అవగాహనా లోపంతో అనారోగ్య సమస్యల్ని శాపాలుగా భావించే వారే ఎక్కువ. ఇలా అగమ్యగోచరంగా ఉన్న వాళ్ల జీవనశైలిలో ఒక నివేదిక పెను మార్పులు తెచ్చింది. 2023లో ఎమ్ఎస్ స్వామినాథన్ ఫౌండేషన్... కొరాపుట్‌లోని కొన్ని గ్రామాల్లో హెల్త్ సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో గిరిజనుల్లో సగానికి పైగా అనారోగ్యాలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. దీనికంతటికీ కారణం పోషకాహారలోపమని తేలింది. అడవిలో దొరికే ఆకులు, అలమలే వారికి ఆహారం మరి. దీనివల్ల తరానికి తరం తుడిచిపెట్టుకుపోయే పరిస్థితిలో ఉంది. అది మారాలంటే స్థానికుల్లో, సమస్యపై అవగాహన రావాలి. అందుకే మహిళలందరినీ ఓ చోట చేర్చిందా సంస్థ. వారిలో చైతన్యం కలిగిస్తూనే, ప్రభుత్వ పథకాల్ని వినియోగించుకుని సేంద్రియ వ్యవసాయం చేయడం ఎలానో నేర్పింది.

2వేల మంది మహిళలు...

పది మంది మహిళలతో మొదలైంది ఈ ప్రయాణం. వీళ్లంతా గృహిణులే. పెరట్లో, చుట్టు పక్కల, వ్యవసాయ భూముల్లో... ఇలా తమకు వీలైనన్నిచోట్ల పండ్లు, కూరగాయలు, వరి లాంటివి పండించడం మొదలుపెట్టారు. ఎన్జీవోలు, ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన శిక్షణను అందిపుచ్చుకున్నారు. రెండు సెంట్ల భూమైనా, ఎకరాలు సేద్యం చేస్తున్నా... అంతా సేంద్రియ పద్ధతిలోనే పండాలని నిశ్చయించుకున్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకుని... అనతి కాలంలోనే సేద్యాన్ని ప్రారంభించారు. వారి కృషి, దిగుబడి, సమస్యల్ని అధిగమించే తీరు చూసిన చుట్టుపక్కల మహిళలు ఒక్కొక్కరుగా పని నేర్చుకోవడం మొదలుపెట్టారు.



ఇప్పుడు 2వేల మందికి పైగా మహిళలు సేంద్రియ వ్యవసాయాన్ని చేస్తున్నారు. బెడ్‌లను ఏర్పాటు చేసుకుని తక్కువ స్థలంలోనే ఇంటికి కావాల్సిన కూరగాయలన్నింటినీ పండిస్తున్నారు. దాంతో ఎక్కడ చూసినా న్యూట్రీ గార్డెన్లతో సస్యశ్యామలంగా ఉన్నాయా గ్రామాలు. ఇదంతా అక్కడి మహిళల కృషికి నిదర్శనమే. దీంతో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి ప్రయత్నిస్తూనే... అధిక దిగుబడి వచ్చినప్పుడు ఆర్థికంగానూ లబ్ధి పొందుతున్నారు. తరవాతి తరాలు కూడా ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలనే ఆలోచనతో... స్థానిక పాఠశాలల్లోనూ వ్యవసాయ పద్ధతుల్ని పాఠాలుగా నేర్పుతున్నారు.

బంగారం - వెండి



21న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,460	92,700	1,17,096
విజయవాడ	99,085	92,300	1,16,300
ప్రొద్దుటూరు	1,00,600	92,550	1,16,200
రాజమహేంద్రవరం	1,00,750	92,300	1,26,000
విశాఖపట్నం	1,00,330	92,300	1,25,000
తమిళనాడు	-----	92,300	1,26,000

నిద్రలేస్తూనే టీ, కాఫీ కోసం వంటింట్లో అడుగుపెడతారు మహిళలు. వీటిని ఎప్పుడు, ఎలా తాగితే లాభం... ఎంతసేపు మరిగించాలీ అన్న దానిమీదా రకరకాల పరిశోధనలు వచ్చాయి. అవేంటంటే...

టీ ఇలా...

తాజా అధ్యయనాల ప్రకారం రోజులో రెండు నుంచి నాలుగు కప్పుల టీ తాగితే ధమనులు ఆరోగ్యంగా ఉంటాయి. ఫలితంగా మతిమరుపు, గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ఒక కప్పు తాగితే మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుందనీ, మూడు కప్పులు తాగితే జీవితకాలం పెరిగే అవకాశం ఉందనీ చెబుతున్నాయి. గ్రీన్, బ్లాక్, వైట్... అన్ని రకాల టీల్లోనూ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలున్న ఫైటోకెమికల్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయంటున్నారు ఆస్ట్రేలియాలోని న్యూ కేజల్ యూనివర్సిటీ పరిశోధకులు. అయితే టీ తయారుచేసే విధానంలో తేడాలవల్ల ప్రయోజనాలు అటూఇటూగా మారతాయి. భిన్న రకాల టీలు తాగడం వల్ల విభిన్న పాలీఫినాల్స్ శరీరానికి అందుతాయి. టీని మరిగించే సమయాన్నిబట్టి దానిలోని పోషకాలు లభిస్తాయి. సాధారణంగా టీ రకం ఏదైనా రెండు నిమిషాలే మరిగించాలి. అయితే బ్లాక్ టీని అయిదు నిమిషాలపాటు మరిగిస్తే దాన్లోని యాంటీ ఆక్సిడెంట్లను అధిక స్థాయిలో పొందొచ్చుట. అలాగని, గ్రీన్ టీని ఎక్కువసేపు వేడినీళ్లలో వేసి ఉంచితే యాంటీ ఆక్సిడెంట్లు తగ్గిపోతాయట!



కాఫీ అలా!

కాఫీ ప్రయోజనాల గురించి చాలా అధ్యయనాలే చెబుతున్నాయి. అయితే, హార్వర్డ్, ట్యులేన్ యూనివర్సిటీలకు చెందిన శాస్త్రవేత్తల పరిశోధన ప్రకారం కాఫీని ఏ సమయంలో తాగామనే దాన్నిబట్టి దాని ప్రయోజనాలు ఉంటాయంటున్నారు. 40వేల మంది ఆహార అలవాట్లు, వారి ఆరోగ్య పరిస్థితిని గమనించి పరిశోధన వివరాల్ని తెలిపారు. కాఫీని ఉదయం పూట మాత్రమే తాగేవాళ్లలో గుండె జబ్బులతోపాటు, భిన్న రకాలుగా ప్రాణహాని తగ్గుతున్నట్లుగా తేల్చారు. రెండు కప్పులు తాగితే ప్రయోజనాలు ఇంకాస్త ఎక్కువగా ఉంటాయంటున్నారు. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏంటంటే... కాఫీని అసలే తాగకుండా ఉండేవాళ్లతో పోల్చితే, రోజంతా కాఫీ తాగేవాళ్లలో ఈ లాభాలేవీ కనిపించలేదు. ఇది ఒక పరిశీలన మాత్రమేననీ దీన్ని 100శాతం కచ్చితంగా చెప్పలేమనీ అంటున్నారు. అయితే, ఉదయంపూట శరీరంలో ఇన్‌ఫ్లమేషన్(వాపు) స్థాయులు అధికంగా ఉండటంవల్ల... కాఫీలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ రసాయనాలు ప్రభావవంతంగా పనిచేయడమే దీనికి కారణం కావొచ్చంటున్నారు.

వ్యాయామం చెయ్.. నోరా ఫతేహిలా తయారవ్వు

హింసిస్తున్న భర్తపై మహిళ కేసు



ఘజియాబాద్: బాలీవుడ్ నటి నోరా ఫతేహీ లాంటి శరీరాకృతి ఉండాలని, రోజూ 3 గంటలు వ్యాయామం చేసి సన్నబడాలని తన భర్త హింసిస్తున్నాడంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన మహిళకు ఆరునెలల క్రితం వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తితో వివాహం జరిగింది. పెళ్లికి రూ.76 లక్షలు ఖర్చు చేసినప్పటికీ, అదనంగా వరకట్నం కావాలంటూ తన భర్త వేధిస్తున్నాడని బాధితురాలు పేర్కొంది. రావాల్సి ఉన్నా వంటూ భర్త తనను అవమానిస్తున్నాడని, రోజూ 3 గంటలు వ్యాయామం చేసి నోరా ఫతేహిలా నాజూగ్గా మారాలని బలవంత పెడుతున్నాడని వాపోయింది. కొన్నిరోజుల క్రితం తన అత్తామామలు తనకు గర్భస్రావం అయ్యేందుకు మాత్రలు మింగించారంటూ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంకో లడ్డూ కావాలి నాయనా..

సీఎం హెల్ప్‌లైన్‌కు వింత ఫిర్యాదు



భింద్: మధ్యప్రదేశ్‌కు చెందిన కమలేశ్ కుశ్వాహ్ అనే వ్యక్తి ముఖ్యమంత్రి హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి వింత ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు నవోదా గ్రామంలో నిర్వహించిన వేడుకలో రెండు లడ్డూలు కాకుండా ఒక లడ్డూనే పంచారని అధికారులకు చెప్పారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం తెలిసిన తర్వాత మరోసారి గ్రామస్థులకు పంచడానికి కిలో లడ్డూలు కొని తెప్పించారు. అయితే కమలేశ్ మాత్రం వాటిని తీసుకోవడానికి నిరాకరించారని పంచాయతీ కార్యదర్శి చెప్పారు. అతనికి విచిత్ర ఫిర్యాదులు చేయడం అలవాటుగా మారిందని, ఇప్పటివరకూ సీఎం హెల్ప్‌లైన్ నంబరుకు 107 ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.

లంచ్ బాక్సులో తుపాకీ.. టీచర్‌పై కాల్పులు

చెంపదెబ్బ కొట్టినందుకు విద్యార్థి పగ



ఆసుపత్రిలో గగన్‌దీప్ సింగ్

ఈటీవీ భారత్: చెంపదెబ్బ కొట్టిన టీచర్‌పై పగ పెంచుకున్న ఓ విద్యార్థి ఆతడిపై కాల్పులు జరిపాడు. లంచ్ బాక్సులో తుపాకీ తీసుకొచ్చి తరగతి గదిలోనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. ఉత్తరాఖండ్ ఉధమ్‌సింగ్ నగర్ జిల్లాలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గగన్‌దీప్ సింగ్ కోహ్లి వారం క్రితం ఓ విద్యార్థిని చెంపదెబ్బ కొట్టారు. దీన్ని అవమానంగా భావించిన విద్యార్థి గగన్‌దీప్‌పై పగతో రగిలిపోయాడు. ఈ క్రమంలోనే బుధవారం ఎవరికీ అనుమానం రాకుండా లంచ్‌బాక్సులో తుపాకీ తీసుకొచ్చాడు. గగన్‌దీప్ తరగతి గది నుంచి బయటకు వెళ్తున్న సమయంలో ఆతడి వీపుపై కాల్చాడు. గగన్‌దీప్ మెడ వరకూ తూటా దూసుకెళ్లడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాల్పులు జరిపిన విద్యార్థిని, అతడి తండ్రిని పోలీసులు విచారిస్తున్నారు.

రేఖా గుప్తాకు 'జడ్' కేటగిరీ భద్రత

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి నేపథ్యంలో.. ఆమెకు 'జడ్' కేటగిరీ భద్రతను కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. గుప్తా అధికారిక నివాసంతోపాటు సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గ్‌లో ఉన్న క్యాంపు కార్యాలయంలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన వీఐపీ భద్రతా దళం (వీఎస్‌జీ) ఆమెకు రక్షణ కల్పించనున్నట్లు సంబంధిత



అధికారులు గురువారం తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా, గాంధీ కుటుంబానికి ఈ బలగాలే పహారా కాస్తున్నాయి. 22-25 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు రాత్రింబవళ్లు సీఎంకు రక్షణ కల్పిస్తారు. మరోవైపు ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడికి పాల్పడిన నిందితుడికి ద్వారకా మేజిస్ట్రేట్ కోర్టు ఐదు రోజుల పోలీసు కస్టడీ విధించింది.

■ సీఎంపై దాడి నేపథ్యంలో దిల్లీకి కొత్త కమిషనర్‌ను నియమించారు. ప్రస్తుత దిల్లీ పోలీసు కమిషనరు ఎస్.బి.కె.సింగ్ స్థానంలో 1992 బ్యాచ్ అధికారి అయిన సతీశ్ గోల్చాను నియమిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది.




ప్రయోగాలు చేయడం, చదవడం ఆపొద్దు

మీరు జీవితంలో విజయం సాధించాలని బలంగా కోరుకుంటున్నారా..? అయితే నేర్చుకోవడం, నైపుణ్యాలను పెంచుకోవడం ఎప్పుడూ ఆపకండి. అందుకోసం ఎక్కువగా పుస్తకాలు చదువుతూ, ప్రయోగాలు చేస్తూ ఉండండి. మిమ్మల్ని సంపన్నులుగా మార్చే శక్తి వాటిలో దాగి ఉంటుంది.

– జీన్ పాట్రీస్, వ్యాపారవేత్త

కోర్టులు చేతులు కట్టేసుకోవాలా?

- రాష్ట్రాల బిల్లుల ఆమోదం వివాదంలో కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



దిల్లీ: రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు నిర్దేశించిన వివాదంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదోపవాదనలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. రాజ్యాంగ వ్యవస్థలు తమ విధులను నిర్వర్తించని పరిస్థితుల్లో న్యాయస్థానాలు చేతులు కట్టేసుకుని కూర్చోవాలా? జోక్యం చేసుకునే అధికారం కోర్టులకు లేదా? సమస్యకు పరిష్కారం సూచించడంలో తప్పేమిటంటూ కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. విచారణ సందర్భంగా గురువారం లోతైన వాదనలు జరిగాయి. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపడంలో గవర్నర్లు జాప్యం చేస్తే రాష్ట్రాలు న్యాయస్థానాలను ఆశ్రయించడానికి బదులు సంప్రదింపులతో రాజకీయ పరిష్కార మార్గాలను అన్వేషించాలని తుషార్ మెహతా పేర్కొన్నారు. జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ.. 'ఒక్కో గవర్నరు తీరు ఒక్కో విధంగా ఉంటోంది. బిల్లులకు సమ్మతి తెలపకుండా నిరవధికంగా జాప్యం చేస్తుంటే ఇబ్బందులు పడే రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నాయి. అలాంటి సందర్భాల్లో న్యాయస్థానం స్పందించకుండా ఉండాలా?' అని ప్రశ్నించారు. తుషార్ మెహతా జవాబిస్తూ.. 'ముఖ్యమంత్రులు..కోర్టుల వద్దకు పరుగులు తీయడం మానుకుని గవర్నర్‌తో భేటీ కావడం, ప్రధాని, రాష్ట్రపతిలను కలిసి చర్చించడం ద్వారా పరిష్కరించుకోవాలి' అని తెలిపారు. బిల్లుల ఆమోదానికి గవర్నర్లు, రాష్ట్రపతికి రాజ్యాంగం కాలవ్యవధి నిర్దేశించలేదన్నారు. తమిళనాడు బిల్లుల వివాదంలో సుప్రీంకోర్టు నేరుగా రాష్ట్రపతికి గడువు విధించకుండా..అలాంటి నిబంధనలను రాజ్యాంగంలో పొందుపరచాలని పార్లమెంటుకు సూచించాల్సిందని మెహతా అభిప్రాయపడ్డారు. 'ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ నిరవధికంగా తన వద్దే నిలిపివేయడం అంటే చట్టసభలను క్రియాశూన్యం చేయటమే. అలాగైతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంద'ని సీజేఐ జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. ఈ నెల 26న తిరిగి విచారణ కొనసాగనుంది.

ఉద్యోగంలో ఉంటూ చనిపోతే

రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా: ఈపీఎఫ్‌ఓ

ఈటీవీ భారత్: సర్వీసులో ఉన్నప్పుడు చందాదారులు చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను 'ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ' (ఈపీఎఫ్‌ఓ) రూ.8.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచింది. కొత్త నిబంధన ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ ఎక్స్‌గ్రేషియా ఏటా 5% పెరుగుతుందని వెల్లడించింది.

సగంమందికి అరకొరగానే పింఛన్

ఈపీఎఫ్‌వో ఆధ్వర్యంలో నడుస్తున్న 'ఉద్యోగుల పింఛన్ పథకం (ఈపీఎస్)- 1995' కింద ప్రతి ఇద్దరు పింఛన్‌దారుల్లో ఒకరికి అందేది నెలకు రూ.1,500 కంటే తక్కువేనని ప్రభుత్వం వెల్లడించింది. 81.48 లక్షల మంది పింఛనర్లలో కేవలం 53,541 మందికే రూ.6,000 పైబడి అందుతోందని తెలిపింది. కేంద్ర కార్మిక-ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె ఈ విషయాన్ని రాజ్యసభకు గురువారం లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు. నిర్వహణలో లేని ఖాతాల్లో పీఎఫ్ సొమ్ము రూ.10,898 కోట్లు ఉందన్నారు.

మైక్రోసాఫ్ట్‌లో 'ఇజ్రాయెల్' ఆందోళనలు

ఇంటర్నెట్ డెస్క్: మైక్రోసాఫ్ట్ కంపెనీ రూపొందించిన సాంకేతికతను ఉపయోగించి గాజాలో ఇజ్రాయెల్ సైన్యం దారుణాలకు పాల్పడుతోందంటూ ఆ సంస్థలోని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వాషింగ్టన్ రెడ్‌మండ్‌లోని మైక్రోసాఫ్ట్ కార్యాలయ ప్రాంగణంలో 35 మందితో కూడిన ఓ బృందం గత రెండు రోజులుగా ఆందోళనకు దిగింది. కంపెనీ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు 18 మందిని అరెస్టు చేశారు. ఇందులో కంపెనీ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. కంపెనీ రూపొందించిన ఓ సాఫ్ట్‌వేర్ సాయంతో గాజా, వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనియన్ల ఫోన్ కాల్ డేటాను ఇజ్రాయెల్ సైన్యం నిక్షిప్తం చేస్తోందంటూ బ్రిటన్‌కు చెందిన వార్తాపత్రిక ఇటీవల ఓ కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన టెక్ దిగ్గజం.. ఆ ఆరోపణలపై అత్యవసర సమీక్ష చేపడుతున్నట్లు, ఇందుకోసం ఓ కన్సల్టింగ్ సంస్థను కూడా నియమించుకున్నట్లు ప్రకటించింది.

కేరళలో సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత

తిరువనంతపురం: దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళ ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యత విషయంలోనూ చరిత్ర సృష్టించినట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించిన ప్రథమ రాష్ట్రంగా కేరళ



నిలిచినట్లు ఆయన ప్రకటించారు. తిరువనంతపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. దేశంలో 38శాతం కుటుంబాలే డిజిటల్ అక్షరాస్యత సాధించాయని, ఇలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను పొందిన రాష్ట్రంగా కేరళ ప్రత్యేకత చాటుకోవడం గర్వకారణమని విజయన్ పేర్కొన్నారు.

మా కంటే చైనానే ఎక్కువ కొంటోంది

- సుంకాలేమో మాపై
- అమెరికా తర్కమేంటో అర్థం కాలేదు
- రష్యా చమురు కొనుగోళ్లపై జైశంకర్



మాస్కోలో పుతిన్‌తో జైశంకర్

దిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై మాస్కో వేదికగా విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. రష్యా నుంచి అత్యధిక చమురు కొనుగోలు చేస్తున్న దేశం భారత్ కాదని.. చైనా అని పేర్కొన్నారు. అంతేకాదు.. మాస్కో నుంచి అత్యధిక స్థాయిలో ఎల్పీజీ దిగుమతి చేసుకుంటున్న దేశం కూడా భారత్ కాదని, ఐరోపా యూనియన్ అని వెల్లడించారు. మూడు రోజుల పర్యటనకు మాస్కో వెళ్లిన జైశంకర్ గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలిశారు. ఆ దేశ విదేశాంగమంత్రి సెర్గీ లవ్రోవ్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు జైశంకర్ ఘాటుగా స్పందించారు. ప్రపంచ ఇంధన ధరల స్థిరీకరణకు భారత్ సాయాన్ని అమెరికా కోరిందని, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలని కూడా అగ్రరాజ్యమే సూచించిందని అన్నారు. 2022 తర్వాత రష్యాతో వాణిజ్యం అత్యధికంగా జరిపిన దేశం కూడా భారత్ కాదని అన్నారు. అయినా మాపైనే ఎక్కువ సుంకాలు విధించడంలోని తర్కమేంటో అర్థం కావడం లేదని జైశంకర్ పేర్కొన్నారు.

రాకెట్ వెనుక పరుగెత్తుతున్నట్లే అనిపించింది

- ఐఎస్ఎస్ మిషన్ అనుభవం అమూల్యం: శుభాంశు శుక్లా



దిల్లీ: శిక్షణ సమయంలో నేర్చుకున్న దాని కంటే అంతరిక్షంలో అనుభవం భిన్నంగా ఉంటుందని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తెలిపారు. అతి త్వరలోనే ఎవరో ఒకరు భారత గడ్డపై నుంచి స్వదేశీ రాకెట్‌లో అంతరిక్షానికి వెళ్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తన అంతరిక్ష యాత్ర అనుభవాలను పంచుకున్నారు. 'యాక్సియం-4 మిషన్‌లో నేర్చుకున్న పాఠాలు.. భారత గగన్‌యాన్ మిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయి. ఎంత శిక్షణ తీసుకున్నా, రాకెట్‌లో కూర్చున్నప్పుడు కలిగే అనుభూతి పూర్తి భిన్నంగా ఉంటుంది. నిజానికి అంతరిక్ష యాత్ర ప్రారంభమైన మొదటి కొన్ని సెకన్లపాటు రాకెట్ వెనుక పరిగెత్తుతున్నట్లే అనిపించింది. దానిని అందుకోవడానికి నాకు కొంత సమయం పట్టింది. అప్పటి నుంచి భూమి మీదకు తిరిగి వచ్చే వరకూ అనుభవం అమూల్యమైనది' అని శుక్లా పేర్కొన్నారు. 'కొన్ని నెలల్లో దీపావళి వస్తుంది. ఆ సమయంలోనే రాముడు అయోధ్యకు చేరుకున్నారు. అంతకంటే ముందుగానే రాముడు (శుభాంశు) మన వద్దకు వచ్చేశారు. ఈ రోజు దీపావళిలా ఉంది. శుక్లా కంటే నేను పెద్దవాడిని. అయినప్పటికీ ఈ రాముడికి లక్ష్మణుడిలా ఉండడానికే నేను ఇష్టపడతాను' అని గగన్‌యాన్ బృందానికి కెప్టెన్, యాక్సియం-4 మిషన్ కోసం శుక్లాకు బ్యాకప్ వ్యోమగామిగా ఉన్న ప్రశాంత్ నాయర్ పేర్కొన్నారు.

అమెరికా మోస్ట్ వాంటెడ్ మహిళ భారత్‌లో అరెస్టు

- ఎఫ్‌బీఐ టాప్ 10 జాబితాలో నిందితురాలి పేరు



న్యూయార్క్: అమెరికా మోస్ట్ వాంటెడ్ టాప్ 10 జాబితాలో ఉన్న ఓ నిందితురాలు భారత్‌లో ఎఫ్‌బీఐ చేతికి చిక్కింది. ఆరేళ్ల తన కుమారుడిని కడతేర్చిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సిండీ రోడ్రిగూజ్ సింగ్ (40)ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వెల్లడించారు. ఆమెను అమెరికాకు తీసుకురానున్నామని, త్వరలోనే న్యాయస్థానం ముందు నిలబెడతామని అన్నారు. అమెరికా న్యాయశాఖ, భారత అధికారులు, ఇంటర్‌పోల్ సమన్వయంతోనే ఇది సాధ్యమైందని పటేల్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఆమె ఆచూకీ తెలిపిన వారికి రూ.2.18 కోట్లు రివార్డును గతంలో ఎఫ్‌బీఐ ప్రకటించింది. ఓ అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం...సిండీ కుమారుడు నియోల్ రోడ్రిజ్ అల్వారేజ్ దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి సహా పలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. 2022 అక్టోబరు నుంచి అతడు కనిపించకుండా పోయాడు. 2023 మార్చిలో అతడి యోగక్షేమాలను తనిఖీ చేయడానికి వచ్చిన సంక్షేమ శాఖకు నియోల్ కనిపించలేదు. బాలుడు వాళ్ల కన్న తండ్రి స్వస్థలం మెక్సికోకు 2022 నవంబరులోనే వెళ్లిపోయాడని సిండీ అధికారులకు అబద్ధం చెప్పింది. ఈ తర్వాత రెండు రోజులకే భారత సంతతికి చెందిన మరో భర్త, ఆరుగురు చిన్నారులతో విమానం ఎక్కి పరారైంది. అయితే ఆ చిన్నారుల్లో నియోల్ లేడని, అసలు అతడు విమానమే ఎక్కలేదని పోలీసులు గుర్తించారు. కొద్ది రోజులకే ఆమెపై టెక్సాస్ జిల్లా కోర్టులో కేసును దాఖలు చేశారు. గతేడాది ఇంటర్‌పోల్ అన్ని దేశాలకు రెడ్ నోటీసును జారీ చేయడంతో సిండీ జాడ తెలిసింది.



ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజాలోని డెయిర్ అల్-బలాలో ధ్వంసమైన శరణార్థి శిబిరం

ఇజ్రాయెల్ దాడుల్లో 36 మంది మృతి

డెయిర్ అల్-బలా: గాజాపై గురువారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 36 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 14 మంది ఆహారం కోసం ఎదురుచూస్తున్నవారు ఉన్నారు. మరోవైపు డెయిర్ అల్-బలాలో టెంటు క్యాంపుపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దాడికి కొద్ది ముందుగా దానిని ఖాళీ చేయాలని హెచ్చరించడంతో ప్రాణాపాయం తప్పింది.

గాజా సిటీ ఆక్రమణ వ్యూహం

గాజా సిటీని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయెల్ సిద్ధమవుతోంది. ఈ విస్తృత సైనిక చర్య కోసం 60వేల మంది సాధారణ పౌరుల్ని సైన్యంలోకి ఇజ్రాయెల్ చేర్చుకోబోతోంది. ఇప్పటికే సైన్యం కోసం పని చేస్తున్న 20వేల మంది రిజర్విస్టుల సర్వీసును పొడిగించనుంది.

కాంగ్రెస్ నాయకత్వంలో అభద్రత: మోదీ

దిల్లీ: కాంగ్రెస్ నాయకత్వంలో అభద్రతా భావం ఉందని, దానివల్లనే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చర్చలో పాల్గొనే అవకాశం ఆ పార్టీ యువ ఎంపీలకు లభించలేదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. నిరసనల మధ్యనే పలు బిల్లుల్ని ఆమోదించుకోవాల్సి రావడం నిరాశ కలిగించిందన్నారు. లోక్‌సభ నిరవధికంగా వాయిదాపడిన తర్వాత సంప్రదాయం ప్రకారం స్పీకర్ ఓంబిర్లా కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారని సమాచారం. దీనికి విపక్షాలు గైర్హాజరయ్యాయి. లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ పేరును ప్రధాని నేరుగా ప్రస్తావించకపోయినా ఆయన్ని ఉద్దేశించే వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. సమాజంలో అనేకమందిపై ప్రభావం చూపిస్తున్న ఆన్‌లైన్ గేముల్ని నిషేధించే బిల్లు సానుకూల ఫలితాన్ని తీసుకురానుందని, దానిపైనా చర్చ జరపలేకపోయామని మోదీ చెప్పారు. అనేక ముఖ్యమైన బిల్లుల్ని ఈసారి తీసుకువస్తే అన్నింటిపైనా ఇలాగే జరిగిందన్నారు. కాంగ్రెస్‌లో కొందరు నేతలు ఆ పార్టీలో నిర్ణయాలను ప్రభావితం చేయగలరని, వారిని దారిలోకి తీసుకురావడం కష్టమవుతోందని ఈ సమావేశంలో ఒకరు ప్రస్తావించారు. ఇలాంటి వారు పార్టీ నాయకత్వాన్ని అభద్రత భావాన్ని కలిగిస్తూ ఉండవచ్చని మోదీ వ్యాఖ్యానించినట్లు సమాచారం. సభా వ్యవహారాల సంఘం సమావేశానికి వచ్చిన కాంగ్రెస్ నేతలు అక్కడ కుదిరిన నిర్ణయాలను అమలు చేయలేకపోతున్నారని, వారిపై ఒత్తిళ్లు వస్తూ ఉండొచ్చని మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. సమావేశాలు ముగిశాక స్పీకరు ఇచ్చే తేనీటి విందును విపక్షం బహిష్కరించడం అరుదని చెప్పారు.



పార్లమెంటు సమావేశాలు ముగిసిన అనంతరం స్పీకర్ ఓం బిర్లాతో భేటీ అయిన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా

దిల్లీలో 100 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని 100 స్కూళ్లకు ఈ-మెయిల్స్ ద్వారా మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. ప్రసాద్ నగర్‌లోని ఆంధ్రా స్కూల్ సహా 100 పాఠశాలలకు గురువారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే బాంబు నిర్వీర్యదళాలతో సహా పోలీసు బృందాలు, అగ్నిమాపక సిబ్బంది ఈ ప్రాంగణాలకు చేరుకొని సోదాలు నిర్వహించారు. నాలుగు రోజుల వ్యవధిలో స్కూళ్లకు ఇలా బాంబు బెదిరింపులు రావడం ఇది మూడోసారి. ఈ నెల 18న 32 స్కూళ్లకు, 20న 50 పాఠశాలలకు ఈ విధమైన బెదిరింపులు వచ్చాయి.

పావురంతో బెదిరింపు సందేశం

జమ్ము రైల్వేస్టేషన్‌ను పేల్చేస్తామని బెదిరింపు

జమ్ము: భారత్-పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని ఆర్ఎస్ పురాలో బెదిరింపు సందేశంతో వచ్చిన ఓ పావురాన్ని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ పావురం కాళ్లకు కట్టి ఉన్న ఓ లేఖలో జమ్ము రైల్వేస్టేషన్‌ను పేల్చివేస్తామన్న హెచ్చరికలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 18న రాత్రి 9 గంటల ప్రాంతంలో ఖాట్మారియాలో ఆ పావురం దొరికింది. 'కశ్మీర్ మాది. సమయం వచ్చింది. అది వస్తుంది' అని ఉర్దూలో, 'జమ్ము రైల్వేస్టేషన్ ఈఐడీ బ్లాస్ట్' అని ఆ లేఖలో ఆంగ్లంలో రాసి ఉంది. జమ్ముకశ్మీర్ పోలీసులకు దీనిపై సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు జమ్ము రైల్వేస్టేషన్ సహా పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ పావురం ఇక్కడికి ఎలా వచ్చింది అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్ల టాయిలెట్లలో నీళ్ల సమస్యపై ఏడాదిలో లక్ష ఫిర్యాదులు

దిల్లీ: రైళ్ల టాయిలెట్లు, వాష్ బేసిన్లలో నీళ్లు లేవంటూ 2022-23లో లక్షకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించింది. దూరప్రాంత రైళ్లలో పరిశుభ్రతకు సంబంధించి 2018-23 మధ్య రైల్వే పనితీరుపై వివరాలు దీనిలో రూపొందించింది. ఒక్క 2022-23లోనే 1,00,280 ఫిర్యాదులు రాగా వీటిలో 33,937 కేసులను సకాలంలో పరిష్కరించినట్లు తెలిపింది. నిర్దేశిత స్టేషన్లలో నీరు నింపడంలో వైఫల్యం కారణంగానే ఈ సమస్య తలెత్తుతున్నట్లు వెల్లడించింది.

■ ఆటోమేటిక్ కోచ్ వాషింగ్ ప్లాంట్లు పూర్తిస్థాయిలో వినియోగంలో లేవని పేర్కొంది. నిర్వహణ వైఫల్యం వల్ల 'క్లీన్ ట్రైన్ స్టేషన్' కార్యక్రమం పూర్తిస్థాయి సేవలు అందించలేకపోతోందని విమర్శించింది. ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సర్వీసులపై మాత్రం ప్రయాణికులు సంతృప్తితో ఉన్నట్లు తెలిపింది.

■ బయో టాయిలెట్ పరిశుభ్రతపై 50శాతం మాత్రమే సంతృప్తి వ్యక్తంచేశారు. రెండు జోన్లలో ఇది 10శాతం కంటే తక్కువగా ఉంది.

■ రైళ్లలో పరిశుభ్రత పనులకు తుది కేటాయింపుల కంటే వాస్తవిక ఖర్చులు కొన్ని జోన్లలో ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కోచ్‌లలో కచ్చితమైన పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలని సూచించింది.

కేరళలో పాఠశాల వద్ద బాంబుల కలకలం

- విద్యార్థి ఆడుకుంటూ విసరడంతో పేలుడు
- ఇద్దరికి గాయాలు

పాలక్కాడ్: కేరళలోని పాలక్కాడ్ జిల్లా వడకన్‌తారాలోని ఓ పాఠశాల వెలుపల పేలుడు పదార్థాలు దొరకడం కలకలం రేపింది. వాటిని ఆటవస్తువుల్లాగా భావించిన ఓ విద్యార్థి ఒక బాంబును విసిరేయడంతో అది పేలి ఇద్దరికి గాయాలయ్యాయి. నారాయణన్ (10) అనే విద్యార్థి బుధవారం సాయంత్రం ఆడుకుంటూ బయటకు వచ్చి.. బకెట్‌లో ఉన్న పేలుడు పదార్థాలను చూశాడు. వాటిల్లో ఒకదాన్ని విసిరేయగా.. పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నారాయణన్‌తో పాటు మరో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాల సిబ్బంది, స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీలు నిర్వహించగా.. బకెట్‌లో మరో నాలుగు పేలుడు పదార్థాలు లభించాయి. అవి అడవి పందులను భయపెట్టడానికి వాడే బాంబులుగా తెలుస్తోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పొగాకు ఉత్పత్తులపై మరింత పన్ను వేయండి

- పార్లమెంటరీ కమిటీ సిఫార్సు

దిల్లీ: పొగాకు ఉత్పత్తులపై 'అధిక ముప్పు' సెస్‌తోపాటు భారీగా పన్నులు వేయాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. వాటిద్వారా వచ్చే ఆదాయాన్ని క్యాన్సర్ పరిశోధనకు, చికిత్సకు వినియోగించాలని పేర్కొంది. పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, అయితే క్షేత్ర స్థాయి పరిస్థితులు.. మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని నారాయణ్ దాస్ గుప్తా నేతృత్వంలోని స్థాయీ సంఘం స్పష్టం చేసింది. క్యాన్సర్ రోగులకు భారతీయ సంప్రదాయ వైద్య పరిజ్ఞాన ఆధారిత చికిత్సను అందుబాటులోకి తెచ్చేందుకు ఆయుష్ వైద్య వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని సూచించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు.. క్యాన్సర్‌ను నోటిఫయబుల్ వ్యాధిగా (తప్పనిసరిగా సమాచారం ప్రభుత్వానికి తెలియజేయాల్సిన వ్యాధి) పరిగణించేలా నిబంధన రూపొందించాలని సిఫార్సు చేసింది.

ఔషధాల ధరలను నియంత్రించాలి

క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే అనేక ఔషధాలు నేటికీ ధరల నియంత్రణ వ్యవస్థ పరిధిలో లేవని, నియంత్రణ ఆదేశాలను విస్తృతం చేసి వీలైనన్ని ఎక్కువ ఔషధాలను దాని పరిధిలోకి తేవాలని పార్లమెంటరీ సంఘం సూచించింది. ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాల పరిధిలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ప్రామాణికమైన ధరలతో కూడిన ప్యాకేజీలను రూపొందించాలని సిఫార్సు చేసింది.

■ మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌కు కారణమైన హ్యూమన్ ప్యాపిలోమా వైరస్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగం చేయాలని స్థాయీ సంఘం కోరింది.

స్వతంత్రంగా ఉంటానని అనకూడదు

భార్యాభర్తల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

దిల్లీ: వివాహబంధంలో కొనసాగుతూ భాగస్వామి నుంచి స్వతంత్రంగా జీవించాలని భర్తగానీ, భార్య గానీ కోరుకోవడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. స్వతంత్రంగా ఉండాలనుకుంటే వివాహ బంధంలోకే ప్రవేశించకూడదని ఓ భార్యాభర్తల కేసులో జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం గురువారం వ్యాఖ్యానించింది. "మేం ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. వివాహబంధంలో ఉంటూ భాగస్వామి నుంచి స్వతంత్రంగా జీవిస్తామని ఏ భర్తా, భార్య అనకూడదు. అది అసాధ్యం. వివాహం అంటే ఏమిటి..? ఇద్దరు వ్యక్తుల మనసులు కలియడం. స్వతంత్రంగా ఎలా జీవిస్తారు" అని ప్రశ్నించింది. మైనర్ పిల్లల కోసమైనా విభేదాలను పరిష్కరించుకోవాలని భార్యాభర్తలకు ధర్మాసనం సూచించింది.

ఉక్రెయిన్‌పై రష్యా భారీదాడి

- అమెరికా యాజమాన్యంలోని ప్లాంటుపైనా గురి




ఉక్రెయిన్‌లోని జకార్‌పట్టియాలో ఓ ఫ్యాక్టరీలో అలముకున్న పొగ

కీవ్: మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ఓవైపు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న వేళ.. ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడుతోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి ఏకంగా 574 డ్రోన్లు, 40 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. ఉక్రెయిన్ భూభాగంలో అమెరికా యాజమాన్యంలోని ఓ ఎలక్ట్రానిక్స్ కర్మాగారంపైనా గురిపెట్టడంతో శాంతి చర్చల్లో అనిశ్చితి మరింత పెరిగింది. అధ్యక్షుడిగా బైడెన్ ఉన్నప్పుడు ఉక్రెయిన్‌కు తగినన్ని ఆయుధాలివ్వలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. చొరబాటుకు ప్రయత్నిస్తున్న దేశంపై దాడి చేయకుండా యుద్ధంలో గెలవలేమన్నారు. శాంతి ఒప్పందం షరతులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలిసేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ సిద్ధమేనని రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లవ్రోవ్ తెలిపారు. ఉక్రెయిన్ భద్రతను కాపాడటానికి ఐరోపాయే ప్రధాన బాధ్యతను తీసుకోవాలని అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ తెలిపారు. భౌగోళికంగా దగ్గరగా ఉండటంతో పాటు ప్రత్యక్ష భద్రతా ప్రయోజనాల కారణంగా ఉక్రెయిన్ భద్రత విషయంలో ప్రాథమిక బాధ్యత ఐరోపాదేశాలపై ఉందని నొక్కి చెప్పారు.

నిద్రలో మూత్ర విసర్జన చేసినందుకు దండన

- హాస్టల్ విద్యార్థులకు ఇనుప రాడ్డుతో వాతలు

బాడ్‌మేర్: నిద్రలో మూత్ర విసర్జన చేసుకోవడమే ఆ విద్యార్థుల పాలిట పాపంగా మారింది. వారిని దండించేందుకు హాస్టల్ వార్డెన్ వేడి చేసిన ఇనుప రాడ్డుతో శరీరంపై కాల్చి వాతలుపెట్టాడు. ఓ విద్యార్థి వసతిగృహం నుంచి పారిపోయి తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ పాశవిక ఘటన వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్ బాడ్‌మేర్ జిల్లా హర్‌పలియా గ్రామంలోని గురుకుల విద్యా సంస్థలో ఈ ఘటన చోటుచేసుకుంది. నారాయణగిరి అనే టీచర్ ఈ నెల 17న 10, 11 ఏళ్ల వయసున్న ఇద్దరు విద్యార్థులపై ఈ అనాగరిక చర్యకు పాల్పడినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దంటూ నిందితుడు బాధిత విద్యార్థులను బెదిరించినట్లు వెల్లడించారు. నిందితుణ్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏషియా పసిఫిక్ అండ్ మధ్య ప్రాచ్య దేశాల మోలర్-మేర్స్క్ ఎండీ జోనాథన్ గోల్డ్‌నర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్. చిత్రంలో దీపాలి నేగి, వివేక్ శర్మ, గిరీష్ అగర్వాల్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఏపీ మారిటైంబోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య

రాష్ట్రానికి 'మోలర్-మేర్స్క్' సంస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఆసక్తి వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఏపీ మారిటైం బోర్డుతో అవగాహన ఒప్పందాన్ని సంస్థ గురువారం కుదుర్చుకుంది. సుమారు 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంస్థ తెలిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్ సదస్సులో సంస్థ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమై.. రాష్ట్రంలో పోర్టు లాజిస్టిక్ కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. అప్పట్నుంచి అధికారులు సంప్రదిస్తుండడంతో రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అంగీకరించింది. దీర్ఘకాలిక పెట్టుబడులకు ఏపీ మారిటైం బోర్డుతో కలిసి ఫీజిబులిటీ అధ్యయనం చేస్తుంది. పెట్టుబడులపై నిర్ణయం తీసుకునేందుకు వీలుగా మారిటైం బోర్డు, ఏపీఎం సంస్థ తరఫున ఇద్దరేసి సభ్యులతో సంయుక్త కార్యనిర్వాహక బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ బృందం స్వల్పకాలిక, దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాలను రూపొందిస్తుంది.

■ ఏపీఎం సంస్థ 130కి పైగా దేశాల్లో పోర్టు ఆధారిత కార్యకలాపాల నిర్వహణ సప్లై చైన్ అభివృద్ధి చేసింది. లక్షమందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రస్తుతం గుజరాత్‌లోని పిపావావ్, ముంబయిలోని గేట్‌వే టెర్మినల్ పోర్టులలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

జీఎస్టీ సంస్కరణలకు జై

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోనుంది. హైఎండ్ కార్లవంటి అత్యంత లగ్జరీ వస్తువులపై అవసరమైతే 40శాతం ప్రత్యేక పన్ను పరిధిలోకి తేవొచ్చని కొందరు సభ్యులు సూచించారు.

■ 12, 28శాతం శ్లాబులను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామని సామ్రాట్ చౌదరి తెలిపారు. దీంతోపాటు కొన్ని సిఫార్సులు చేశామని వివరించారు.

ఎరువులు ఏమైనట్లు?

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమలో ప్రధాన పంట వేరుశనగ కేవలం 4.45 లక్షల ఎకరాలు (సాధారణంలో 32%) మాత్రమే సాగైంది. నాగార్జునసాగర్ ఆయకట్టులో వరి నాట్లు మొదలే కాలేదు. ఖరీఫ్ అవసరాలకు 16.76 లక్షల టన్నుల ఎరువులు కేటాయించగా, ఇప్పటికే 11.45 లక్షల టన్నుల అమ్మకాలు పూర్తయ్యాయి. సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ సమయం ఉంది. ఓ పక్క పంటల సాగు తక్కువగా ఉన్నా, ఎరువులు మాత్రం తెగ అమ్ముడైపోతున్నాయి. అదేమంటే, రైతులు ముందే కొనుక్కుని దాచుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. అలాంటివారు 5 శాతమైనా ఉండరని క్షేత్రస్థాయి వాస్తవాలు సూచిస్తున్నాయి.

ఎక్కడ చూసినా ఎక్కువ ధరలే

■ ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొవ్వ, నందిగామ, గుడివాడ, పామర్రు, కంకిపాడు, మచిలీపట్నం ప్రాంతాల్లో వ్యాపారులు ఎరువులకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. పురుగు మందులు కొంటేనే యూరియా బస్తా అని లింకులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

■ కాకినాడ జిల్లా గండేపల్లి సహకార సంఘానికి యూరియా చేరడమే ఆలస్యం.. వెంటనే అయిపోయింది. పెద్దాపురం పీఏసీఎస్‌కు 170 టన్నులు కేటాయిస్తే, 2 రోజుల్లోనే ఖాళీ అయ్యింది.

■ విజయనగరం జిల్లాలో వరి నాట్లు ముమ్మరమైన ప్రస్తుత తరుణంలో ఎరువుల కొరత వేధిస్తోంది. 6 వేల టన్నుల యూరియా అవసరం కాగా, 850 టన్నులు మాత్రమే ఉంది. రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు లేవు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక్కో బస్తాపై రూ.200 అధికంగా వసూలు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఖరీఫ్‌లో ఎరువుల అవసరం, అమ్మకాలు (టన్నుల్లో)

విషయం	మొత్తం ఎరువులు	యూరియా
కేటాయింపు	16,76,000	6,22,000
ఖరీఫ్‌లో ఇప్పటికే వచ్చింది (పాత నిల్వలతో కలిపి)	17,83,821	6,34,791
ఇప్పటి వరకు అమ్మకం	11,45,167	4,76,148
నిల్వలు	6,38,654	1,58,643

మార్క్‌ఫెడ్‌కు కోటా పెంచొచ్చుగా!

ప్రైవేటు వ్యాపారులైతే యూరియా రవాణా ఖర్చులు సొంతంగా భరించాలి. ఆ మేరకు లాభా లేసుకుని బస్తాకు రూ.100-200 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అదే మార్క్‌ఫెడ్ రవాణా ఖర్చుల్ని ప్రభుత్వమే భరిస్తుంది. అందుకే సొసైటీలు, డీసీఎంఎస్, ఆర్‌ఎస్‌కేల్లో ఎమ్మార్పీ ధరకు విక్రయిస్తున్నారు. రైతులూ వస్తున్నారు. రాష్ట్రానికొచ్చే ఎరువుల్లో 50% మార్క్‌ఫెడ్‌కు, 50% ప్రైవేటు దుకాణదారులకు కేటాయిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కు కోటా పెంచితే రైతులకు ఎరువులు వాస్తవ ధరతో అందుబాటులో ఉంటాయి. రవాణా ఖర్చుల రూపంలో ప్రభుత్వంపై అదనంగా రూ.10-15 కోట్ల భారం పడినా, రైతులకు ఒనగూరే లబ్ధితో పోల్చితే ఇదేమంత కష్టం కాదు.

ఖరీఫ్ సాగు (ఆగస్టు 20 నాటికి ఎకరాల్లో)

సాధారణ సాగు విస్తీర్ణం	77,90,000
2024 ఆగస్టు 20 నాటికి సాగు	49,42,000
2025 ఆగస్టు 20 నాటికి సాగు	50,75,000
ఈ ఏడాది సాధారణ విస్తీర్ణంలో సాగైంది	65%

పది రోజుల్లో రాష్ట్రానికి 31,632 టన్నుల యూరియా

ఈనాడు, అమరావతి: వచ్చే 10 రోజుల్లో రాష్ట్రానికి 31,632 టన్నుల యూరియా వస్తుందని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఇందులో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాకు 2,800 టన్నులు, విజయనగరానికి 2,475, నంద్యాలకు 2,325, కృష్ణాకు 2,200, కర్నూలుకు 2,100, తూర్పుగోదావరికి 2,090, పార్వతీపురం మన్యంకు 2,000 టన్నుల చొప్పున కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నెల 22 నుంచే ఈ నిల్వలు జిల్లాలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. అలాగే 24న కరేకల్ పోర్టు నుంచి 7,800 టన్నులు, 25న గంగవరం పోర్టుకు వచ్చే నౌక నుంచి 18,000 టన్నులు, 28న కాకినాడ పోర్టుకు వచ్చే నౌక నుంచి 25 వేల టన్నుల ఎరువుల్ని రాష్ట్ర అవసరాలకు కేటాయించారని వివరించారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారి రశీదు ఇవ్వడంతో నామినేషన్ ప్రక్రియ ముగిసింది. కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం, ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్, సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్‌గోపాల్‌యాదవ్, డీఎంకే నాయకుడు తిరుచ్చి శివ, టీఎంసీ ఎంపీ శతాబ్దిరాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్‌రౌత్, సీపీఎం ఎంపీ జాన్‌బ్రిటాస్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పార్లమెంటు ఆవరణలోని మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ్ భాయ్‌పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ, బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబాఫూలే, జయప్రకాశ్ నారాయణ్‌ల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. గురువారంతో నామినేషన్లకు గడువు ముగిసింది. శుక్రవారం వాటి పరిశీలన ఉంటుంది.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

– జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు నామినేషన్ దాఖలు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రతి పౌరుడి గౌరవ మర్యాదలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ, భిన్నత్వంలో ఏకత్వంలోనే ఈ దేశ నిజమైన బలం దాగి ఉందని విశ్వసిస్తున్నాను. ఈ ఎన్నిక కేవలం ఒక వ్యక్తిది కాదు. మన జాతి నిర్మాతలు కలలుగన్న భారత్ ఆలోచనను పునరుద్ఘాటించడమే దీని ప్రధాన లక్ష్యం. ఉపరాష్ట్రపతి పార్లమెంటు ప్రజాస్వామ్య అత్యున్నత సంప్రదాయాలను రక్షించే బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. నేను ఎన్నికైతే నిష్పక్షపాతంగా, గౌరవ పూర్వకంగా, సభాసంప్రదాయాలకు అనుగుణంగా, చర్చలకు ప్రాధాన్యమిస్తూ విధులు నిర్వహిస్తాన'ని ఆయన తెలిపారు.

■ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతిస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ నేత కేజ్రీవాల్ ప్రకటించారు.

కొత్త పార్లమెంటు భవనంలో ఇదే తొలి ఎన్నిక

కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి పోలింగ్ జరుగనుంది. 2022 వరకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలన్నీ పాత పార్లమెంటు భవనంలోనే జరిగాయి. కొత్త పార్లమెంటు భవనం 2023 మే 28న ప్రారంభమైంది. ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ అందులో జరిగే తొలి పోలింగ్ కానుంది.

■ ఉపరాష్ట్రపతి ఎన్నికల పరిశీలకులుగా మరో ఇద్దరు అధికారులను నియమించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

పార్లమెంటు నిరవధిక వాయిదా

దిల్లీ: పార్లమెంటు నిరవధికంగా వాయిదా పడింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)పై ఉభయసభల్లోనూ చివరిరోజూ విపక్షాల నిరసనలు కొనసాగాయి. ఈసారి సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ అసహనం వ్యక్తంచేశారు. ప్రణాళిక ప్రకారం ప్రతిరోజూ సభలకు అంతరాయం కలిగిస్తున్నారని తప్పుబట్టారు. గురువారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు నిరసన స్వరం వినిపించాయి. సభను తొలుత గంటసేపు వాయిదా వేశారు. తర్వాత కూడా పరిస్థితి మారకపోవడంతో నిరవధికంగా వాయిదా వేశారు. నినాదాలివ్వడం, తగాదాలకు దిగడం, నినాద ఫలకాలు ప్రదర్శించడం వంటివి పార్లమెంటు గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని స్పీకర్ విచారం వ్యక్తంచేశారు. నెలరోజులు కొనసాగిన ఈ సమావేశాల్లో పెద్దగా చర్చలు జరగలేదని, దీనిపై అందరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకర సంప్రదాయాలను పాటించేందుకు సహకరించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.



గురువారం లోక్‌సభలో ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

విపక్షాల నిరసనలు, గందరగోళం మధ్య.. చర్చకు ఆస్కారం లేకుండానే ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. నేరాభియోగాలుంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర-రాష్ట్ర మంత్రులకు ఉద్వాసన పలకవచ్చన్న బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపడానికి సమ్మతి తెలిపి, వాయిదా పడింది. విపక్షాలు అదేపనిగా అంతరాయాలు కలిగించి సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయని హరివంశ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈసారి కేవలం 41.15 గంటలసేపు సభ పనిచేసిందని, ఉత్పాదకత 38.88 శాతంగా ఉండడం నిరాశ కలిగించిందని తెలిపారు. జులై 21న మొదలైన ఈ సమావేశాల్లో 14 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టగలిగింది. వీటిలో 12 బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. రాజ్యసభ మొత్తం 15 బిల్లులపై నిర్ణయాలు తీసుకుంది. లోక్‌సభలో 84 గంటల సమయం వృథా అయింది. ప్రస్తుత లోక్‌సభలో ఇదే అత్యధికం.

■ ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించడం సమాజాన్ని వివిధ దుష్పరిణామాల నుంచి కాపాడుతుందని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

తాత్కాలిక సదరం ధ్రువపత్రాలపై నెల నెలా పింఛన్లు ఇవ్వండి

- అర్హత కలిగిన దివ్యాంగులు, ఆరోగ్య పింఛనుదారులకిచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోండి
- అర్హులైన ఏ ఒక్కరికీ పింఛను రద్దుకాదు
- పింఛను పథకంపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తాత్కాలిక సదరం ధ్రువీకరణ పత్రాల ద్వారా దివ్యాంగులు, ఆరోగ్య పింఛన్లు పొందే అర్హులకు... ఎప్పటిలాగే నెలనెలా పింఛను ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వారికి పంపిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేశారు. 'అర్హులకు పింఛన్లు యథావిధిగా కొనసాగుతాయి. దివ్యాంగులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు' అని సూచించారు. గురువారం ఆయన సచివాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై అధికారులతో సమీక్షించారు. గత ప్రభుత్వంలో అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకుని.. పింఛను పొందుతున్నవారిపై ఇటీవల అధికారులు పునఃపరిశీలన చేశారు. ఈ వివరాలను సీఎం ముందు ఉంచారు. అన్నివిధాలా ఆరోగ్యంగా ఉన్నవారు, వైకల్యం లేనివారు కూడా పింఛను పొందుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందని చెప్పారు. ప్రత్యేక వైద్యబృందాలను నియమించి అనర్హులకూ పింఛన్లు అందుతున్నాయనే విషయాన్ని నిర్ధారించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'నకిలీ పింఛన్లనే తొలగించాలి. అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ పింఛనుదారుకూ పింఛను రద్దు కాకూడదు' అని స్పష్టం చేశారు.

నేడు కేంద్ర ఆర్థిక మంత్రితో సీఎం భేటీ

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాత్రి దిల్లీ చేరుకున్నారు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక వనరులు, వివిధ ప్రాజెక్టులకు అనుమతుల గురించి ఆమెతో చర్చిస్తారు. ఆ తర్వాత 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాతో సమావేశమవుతారు. అక్టోబర్‌లో ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు అదనపు నిధులు కేటాయించేలా సిఫార్సు చేయమని ఆయన్ను కోరే అవకాశం ఉంది. సాయంత్రం దిల్లీలో జరిగే ఎనమిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం ప్రోగ్రాంలో చంద్రబాబు పాల్గొని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత కేంద్ర సాంకేతికశాఖ కార్యదర్శి అభయ్ కరందికర్‌ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించనున్నారు.

లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుల ఎంపికకు అధిష్ఠానం కసరత్తు

23న మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం

ఈనాడు, అమరావతి: తెదేపా లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుల ఎంపికకు పార్టీ అధిష్ఠానం కసరత్తు తుది దశకు చేరింది. దీనికి సంబంధించి ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఎంపిక చేసిన ఎమ్మెల్యేలతో శనివారం సాయంత్రం పార్టీ అధినేత చంద్రబాబు సమావేశం కానున్నారు. మొత్తం 75 మంది ఈ సమావేశానికి హాజరవుతారు. పార్టీ లోక్‌సభ అధ్యక్షుల ఎంపికకు సమన్వయకర్తలుగా ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున ఈ నెల 24, 25, 26 తేదీల్లో వెళ్లనున్నారు. స్థానిక పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యేలతో చర్చించి గరిష్ఠంగా ముగ్గురిని ఎంపిక చేసి..వారి పేర్లను అధిష్ఠానానికి అందిస్తారు. ఇందులో ఒకరిని పార్టీ ఎంపిక చేస్తుంది. దీనికి సంబంధించిన విధివిధానాలను శనివారం జరిగే సమావేశంలో చర్చిస్తారు.

నాలా చట్టం రద్దు

(మొదటి పేజీ తరువాయి)

పూలింగ్ విధానంలోని జోన్లలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి, ఏడేళ్ల నిర్వహణ పనులకు ఈపీసీ విధానంలో టెండర్లు ఆహ్వానించేందుకు ఆమోదం. ఈ జోన్లలో అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనను రూ.904 కోట్లతో చేపట్టేందుకు పాలనామోద ప్రతిపాదనలకు పచ్చజెండా. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో మంచినీటి వసతుల కల్పనకు 43, 44 ప్యాకేజీల్లో ఎల్-1 బిడ్డర్లకు పనులు అప్పగించేందుకు ఆమోదం.

కొనసాగుతున్న వీసీల నియామకం

- జేఎన్‌టీయూ గురజాడ, యోగి వేమన సెర్చ్ కమిటీల సమావేశాలు పెండింగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల నియామక ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. గతేడాది సెప్టెంబరు 8న 17 వర్సిటీల వీసీల నియామకానికి మొదట ప్రకటన ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18న 9 వర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో యోగి వేమన వర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే పణితి ప్రకాశ్‌బాబుకు కేంద్ర వర్సిటీకి అవకాశం రావడంతో రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రతిభావంతులైన వీసీ అభ్యర్థుల కోసం ఉన్నత విద్యాశాఖ అన్వేషిస్తోంది. అయితే ఈ పేరుతో తీవ్ర జాప్యం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో 17 మంది వీసీలు పదవులకు రాజీనామాలు చేశారు. ఇది జరిగి ఏడాది దాటిపోయినా ఇప్పటికీ 9 వర్సిటీలకు కొత్తవారిని నియమించలేదు. దీంతో ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు.

సెర్చ్ కమిటీల సమావేశాలే కాలేదు..

వీసీల ఎంపిక కోసం సెర్చ్ కమిటీలు మూడు పేర్లను ఎంపిక చేసి, ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాయి. ఈ సమావేశాలను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తోంది.

■ ద్రవిడ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు.

■ జేఎన్‌టీయూ గురజాడ- విజయనగరం, యోగి వేమన విశ్వవిద్యాలయాల కమిటీలు సమావేశం కావాల్సి ఉంది.

■ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సెర్చ్ కమిటీలోని యూజీసీ నామినీ గతంలో ఒక వర్సిటీకి వీసీగా ఉండగా.. ఇప్పుడు ఆయన ఐఐఎంకు డైరెక్టర్‌గా వెళ్లారు. సంబంధిత జీఓలో మార్పు చేశాకే ఆ కమిటీ సమావేశమవుతుంది.

వాటిని ఏం చేస్తారో?

ఆంధ్రకేసరి, వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఉర్దూ విశ్వవిద్యాలయాలకు సెర్చ్ కమిటీలు సమావేశమై వీసీ అభ్యర్థుల పేర్లను సిఫార్సు చేశాయి. అయితే వీరిలో ఉన్నత విద్యాశాఖ కోరుకుంటున్న ప్రతిభ కలిగిన అభ్యర్థులు లేనట్లు తెలిసింది. ఈ జాబితాను ఆమోదిస్తారా లేదా ప్రతిభావంతుల ఎంపిక కోసం సెర్చ్ కమిటీ మరోసారి సమావేశం కావడమా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రధాన వర్సిటీలకు ఎంపిక పూర్తి

రాష్ట్రంలోని ప్రధాన వర్సిటీలైన శ్రీవేంకటేశ్వర, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాలకు సంబంధించి సెర్చ్ కమిటీ సమావేశమై మూడేసి పేర్లను సిఫార్సు చేసింది. వీరంతా ప్రతిభావంతులేనని సమాచారం. రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) వీసీ, ముగ్గురు డైరెక్టర్లు కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే రాజీనామా చేశారు. ప్రభుత్వం ఆమోదించకపోవడంతో వారే కొనసాగుతున్నారు. వీరి నియామకాలకు ఇటీవల ప్రకటన ఇచ్చారు. నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది.

సినీ కార్మికుల సమ్మెకు తెర

- తెలంగాణ సీఎం రేవంత్ జోక్యం.. కార్మికశాఖ ఆధ్వర్యంలో చర్చలు

ఈనాడు, హైదరాబాద్: సినీ కార్మికుల సమ్మెకి తెరపడింది. వేతనాలతోపాటు ఇతర అంశాలపై నిర్మాతలు, కార్మిక సంఘాల మధ్య అంగీకారం కుదరడంతో శుక్రవారం నుంచి చిత్రీకరణలు పునఃప్రారంభం కానున్నాయి. కార్మికసంఘాలు 30% వేతనాల పెంపు కోరుతూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం విదితమే. కొన్ని రోజులుగా సమస్య కొలిక్కి రాకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో గురువారం కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్, ఎఫ్.డి.సి ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు, నిర్మాతలు, చలన చిత్ర వాణిజ్య మండలికి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.

● 30% వేతనాల్ని పెంచాలని కార్మికులు డిమాండ్ చేయగా, రోజుకి రూ.2 వేల లోపు వేతనాలు పొందుతున్న వారికి మూడేళ్లలో దశలవారీగా 22.5%, రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వేతనాలు పొందుతున్న కార్మికులకి 17.5% పెంచేందుకు నిర్మాతలు అంగీకరించారు. నిర్మాతలు కోరుకుంటున్న వర్కింగ్ కండిషన్ల విషయంలోనూ ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది.



మాట్లాడుతున్న కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్, చిత్రంలో కార్మిక సమాఖ్య అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, ఎఫ్.డి.సి. ఛైర్మన్ దిల్‌రాజు

మావోయిస్టులు సునీత, హరీశ్ లొంగుబాటు

- ఆర్థికసాయం అందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- జనజీవన స్రవంతిలో కలిస్తే పునరావాసం కల్పిస్తామని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్ నాగోల్, న్యూస్‌టుడే: మావోయిస్టులు లొంగిపోయే పక్షంలో తెలంగాణ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని రాచకొండ కమిషనరేట్ సీపీ జి.సుధీర్‌బాబు హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీలో కొనసాగిన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకరాల సునీత (62), ఏరియా కమిటీ సభ్యుడు హరీశ్(35) గురువారం రాచకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా సునీతకు రూ.20 లక్షలు, హరీశ్‌కు రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని సీపీ అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో వారి వివరాలు వెల్లడించారు.

■ కాకరాల సునీత ఎలియాస్ బద్రి/లక్ష్మీ/గురుస్మితి/సరోజ్/శారద 1985లో రాజమండ్రిలో ఇంటర్ చదివే రోజుల్లో ఆర్‌ఎస్‌యూ వైపు ఆకర్షితులయ్యారు. ఆమె తండ్రి కాకరాల సత్యనారాయణ విప్లవ రచయితల సంఘం నేత. వరవరరావు, గద్దర్ తరచూ ఆయన్ను కలిసేందుకు వెళ్లేవారు. ఈ క్రమంలో సునీత 1986లో పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. 2025 జూన్ 5న అన్నపురం నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్‌లో ఆమె భర్త మరణించారు.

■ చెన్నూరి హరీశ్ ఎలియాస్ రామన్న, ఎలియాస్ శ్రీను భూపాలపల్లి జిల్లా వాసి. 2006లో ఏటూరునాగారంలోని టీసీ సంక్షేమ హాస్టల్‌లో పదోతరగతి చదివాడు. ఆ సమయంలోనే మావోయిస్టు పార్టీ వైపు ఆకర్షితుడయ్యారు. 2024 డిసెంబరులో టేకుమెట్ల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో బుల్లెట్ గాయమైంది. 2025 జూన్‌లో ఇర్పగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లోనూ పాల్గొన్నాడు' అని సీపీ వివరించారు. మావోయిస్టు పార్టీలో కీలకంగా ఉన్న సునీత చెల్లెలు మాధవి కూడా లొంగిపోవాలని కోరారు.

మట్టి మహా గణపతి!



విజయవాడలోని విద్యాధరపురం బస్‌డిపో పక్కన 72 అడుగుల మహా గణపతి రూపుదిద్దుకుంటున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద గణపతి విగ్రహాల్లో ఒకటైన ఈ ప్రతిమను పూర్తిగా పర్యావరణ హితంగా తయారు చేస్తున్నారు. మట్టితో చేసి, సహజ సిద్ధ రంగులతో అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సింహాసనంపై కూర్చొని వరాలందిస్తున్న ఈ 'కార్యసిద్ధి మహాశక్తి గణపతి'కి రెండు వైపులా నగరేశ్వరస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహాలను రూపొందిస్తున్నారు. 40 మంది కళాకారులు 2 నెలలుగా తయారీలో నిమగ్నమయ్యారు. – ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, విద్యాధరపురం

రాజ్ కెసిరెడ్డి ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

షాబాద్ మండలం మాచంపల్లి, దామర్లపల్లి గ్రామాల్లో తన పేరిట 27.06 ఎకరాలు, తన తల్లి సుభాషిణిరెడ్డి పేరిట 3.14 ఎకరాలు.. మొత్తంగా 30.20 ఎకరాల భూమి కొన్నట్లు సిట్ గుర్తించింది. వీటి పుస్తక ధర రూ.8.83 కోట్లు. మార్కెట్ విలువ రూ.35-40 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. మద్యం కుంభకోణంలో సంపాదించిన సొత్తుతో రాజ్ కెసిరెడ్డి ఈ భూముల్ని కొన్నట్లు సిట్ తేల్చింది. నగదు రూపంలోనే వీటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించి, ఈ భూముల జప్తునకు చర్యలు చేపట్టింది.

■ రాజ్ కెసిరెడ్డి తన బినామీ కంపెనీ అయిన ఈషాన్వీ ఇన్‌ఫ్రా పేరిట హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన గచ్చిబౌలిలో 2022 జూన్‌లో 326 చదరపు గజాల స్థలం కొన్నారు. రూ.1.46 కోట్లకు కొన్నట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. చెక్కు/ఆర్టీజీఎస్ ద్వారా ఈషాన్వీ ఇన్‌ఫ్రా నుంచి ఈ మొత్తం చెల్లించినట్లు చూపించారు. ఆ కంపెనీ ఖాతాలోకి ఈ మొత్తం ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి సమకూరింది? అనేదానిపై సిట్ ఆరా తీయగా.. విక్రయదారుకు అసలు ఆ సొమ్ము చెల్లించినట్లే లేదు. దీన్నిబట్టి ఇది మద్యం ముడుపుల సొమ్మును వైట్‌లోకి మార్చుకునేందుకు చేసిన లావాదేవీ అని సిట్ గుర్తించింది. రాజ్ కెసిరెడ్డి తన పీఏ పైలా దిలీప్ (ఏ-30)కు ఆథరైజ్ చేసి, ఈ లావాదేవీ నిర్వహించినట్లు సిట్ తేల్చింది. ఈ స్థలం మార్కెట్ విలువ రూ.10 కోట్ల పైనే ఉంటుంది.

హైదరాబాద్ శివార్లలో 100 ఎకరాలకు పైగా కొనుగోలు

రాజ్ కెసిరెడ్డి మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తుతో హైదరాబాద్ సమీపంలోని షాబాద్ మండలం మాచంపల్లి, దామర్లపల్లి గ్రామాల్లో తను, తన తల్లి, బినామీ కంపెనీల పేరిట అనేక మంది విక్రయదారుల నుంచి 100 ఎకరాలకు పైగా భూములు కొన్నారు. ఈ క్రమంలోనే కౌశిక్‌కుమార్ అగర్వాల్ అనే ఓ విక్రయదారుకు తన బినామీ కంపెనీ యూఎన్‌ఐ కార్పొరేట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా నుంచి రాజ్ కెసిరెడ్డి రూ.3 కోట్లు పంపించారు. ఇదీ మద్యం ముడుపుల సొమ్మేనని సిట్ దర్యాప్తులో తేలింది. దీంతో విక్రయదారు ఆ మొత్తాన్ని తిరిగి వెనక్కి పంపించేశారు. ప్రస్తుతం యూఎన్‌ఐ కార్పొరేట్ సొల్యూషన్స్ సంస్థకు సంబంధించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలో ఉన్న ఆ రూ.3 కోట్ల జప్తునకు సిట్ చర్యలు చేపట్టింది.

ప్రభుత్వం జప్తు చేయనున్న భూములివి..

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లిలో రాజ్ కెసిరెడ్డి పేరిట కొన్న భూములు

కొన్న తేదీ	భూమి (ఎకరాల్లో)	పుస్తక విలువ (రూ.కోట్లలో)
26.08.2021	3.32	1.14
26.08.2021	5	1.50
8.10.2021	13	3.90
7.12.2021	2.34	0.85
20.12.2021	2	0.60
20.12.2021	0.20	0.25
మొత్తం	27.06	8.24

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచంపల్లి, దామర్లపల్లి గ్రామాల్లో రాజ్ కెసిరెడ్డి తల్లి పేరిట కొనుగోలు చేసిన భూములు

కొన్న తేదీ	భూమి (ఎకరాల్లో)	పుస్తక విలువ (రూ.కోట్లలో)
26.08.2021	1.20	0.45
19.02.2022	1.16	0.10
19.02.2022	0.14	0.02
19.02.2022	0.04	0.01
మొత్తం	3.14	0.59

నవ యువ రాకెట్లు

ఈనాడు – హైదరాబాద్

బ్యాడ్మింటన్‌లో భవిష్యత్ ఛాంపియన్లను అందించే టోర్నీ.. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్! సైనా నెహ్వాల్ సహా ప్రపంచ అగ్రశ్రేణి షట్లర్లు తయారైన అత్యున్నత వేదిక. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, బీడబ్ల్యూఎఫ్ సూపర్ టోర్నీలలో అదరగొట్టే స్టార్ క్రీడాకారులంతా అక్కడి నుంచి వచ్చిన వాళ్లే. ప్రతి ఏడాది ప్రపంచంలోని యువ షట్లర్లు తలపడే అత్యున్నత వేదికలో సత్తాచాటేందుకు భారత బృందం కూడా సిద్ధమవగా.. తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు క్రీడాకారులు ప్రతిష్ఠాత్మక టోర్నీలో బరిలో దిగుతున్నారు. వెన్నెల కలగొట్ల, తలశిల టంకర జ్ఞాన దత్తు, కీర్తి మంచాల (తెలంగాణ).. అరిగెల భార్గవ రామ్- గొబ్బూరు విశ్వతేజ్, విష్ణు కేదార్ కోడె (ఆంధ్రప్రదేశ్)లకు భారత జూనియర్ జట్టులో చోటు లభించింది. ఈ ఏడాది అక్టోబరు 6 నుంచి 19 వరకు గువాహటిలో ఈ టోర్నీ జరగనుంది. 2008లో చివరి సారిగా ప్రపంచ జూనియర్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వగా.. అప్పుడు సైనా నెహ్వాల్ స్వర్ణం, గురుసాయిదత్ కాంస్య పతకాలతో అదరగొట్టారు. సమారు 17 ఏళ్ల తర్వాత సొంతగడ్డపై మరోసారి జరుగనున్న ప్రతిష్ఠాత్మక ప్రపంచ టోర్నీలో పతకాలతో సత్తాచాటాలని తెలుగు క్రీడాకారులు ఉవ్విళ్లూరుతున్నారు.

భవిష్యత్ ఆశాకిరణం


వెన్నెల

భారత బ్యాడ్మింటన్ ఆశా కిరణాల్లో 17 ఏళ్ల వెన్నెల కలగొట్ల ఒకరు. 2015లో ఏడేళ్ల వయసులో రాకెట్ పట్టిన వెన్నెల సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న వెన్నెల.. గత పదేళ్లలో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో అదరగొట్టింది. ఈ ఏడాది ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తాచాటింది. ఈ టోర్నీలో గత 13 ఏళ్లలో పతకం సాధించిన భారత రెండో క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. సింగిల్స్‌తో పాటు డబుల్స్‌పైనా వెన్నెల తనదైన ముద్ర వేస్తోంది. ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రిలో వరుసగా రెండేళ్లు (2022, 2023) మహిళల డబుల్స్‌లో వెన్నెల జోడీ విజేతగా నిలిచింది. ఒకసారి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ కూడా సొంతం చేసుకుంది. ఈ ఏడాది అఖిల భారత జూనియర్ ర్యాంకింగ్ టోర్నీలో సింగిల్స్‌లో రన్నరప్.. డబుల్స్‌లో టైటిల్ సాధించింది. 2025లో హైదరాబాద్, పంచకుల (హరియాణా)లో. . 2024లో భువనేశ్వర్, బెంగళూరులలో జరిగిన ర్యాంకింగ్ టోర్నీల్లోనూ వెన్నెల జోడీ డబుల్స్ టైటిళ్లు గెలుచుకుంది.

అందరి దృష్టి


జ్ఞాన దత్తు

కోచ్ వెంకట్ దగ్గర ఓనమాలు నేర్చుకున్న తలశిల టంకర జ్ఞాన దత్తుపై ప్రస్తుతం అందరి దృష్టి కేంద్రీకృతమైంది. దేశంలో అండర్-19 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న జ్ఞాన దత్తు బాలుర సింగిల్స్‌లో మంచి ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. యువ ప్రతిభావంతుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2022లో థాయ్‌లాండ్‌లో ఆసియా సబ్ జూనియర్ (అండర్-15) బాలుర సింగిల్స్‌లో కాంస్య పతకంతో జ్ఞాన దత్తు అందరినీ ఆకర్షించాడు. నిరుడు చైనాలో ఆసియా సబ్ జూనియర్ టోర్నీలో మరోసారి మెరిశాడు. అండర్-17 బాలుర సింగిల్స్‌లో కాంస్యం గెలుపొందాడు. 2024లో చెన్నై జాతీయ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్‌లో విజేతగా నిలిచి సంచలనం సృష్టించాడు.

ప్రపంచ నంబర్‌వన్ జోడీ


భార్గవ రామ్, విశ్వతేజ్

భారత స్టార్ జోడీ సాత్విక్ సాయి రాజ్- చిరాగ్ శెట్టి తర్వాత ఆ స్థాయిలో అంచనాలున్న జంట.. భార్గవ రామ్- విశ్వతేజ్. ప్రస్తుతం భార్గవ రామ్- విశ్వతేజ్ జోడీ ప్రపంచ జూనియర్ పురుషుల ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిద్దరు ప్రస్తుతం గువాహటిలోని జాతీయ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎన్‌సీఈ)లో కోచ్‌లు ఇవాన్ సోజోనోవ్, సాన్యం శుక్లా, సౌరభ్‌శర్మ దగ్గర శిక్షణ తీసుకుంటున్నారు. ఎనిమిదేళ్లుగా కలిసి ఆడుతున్న వీరిద్దరు.. ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో మూడు పతకాలు సాధించారు. ఈ ఏడాది ఎస్తోనియా ఇంటర్నేషనల్ టోర్నీలో భార్గవ రామ్- విశ్వతేజ్ జోడీ రజతం గెలుచుకుంది. 2023, 2024లలో అఖిల భారత జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి టోర్నీలలో వరుసగా రెండేళ్లు బాలుర డబుల్స్‌లో ఈ జోడీ విజేతగా నిలిచింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్, ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్, ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో భార్గవ రామ్- విశ్వతేజ్ జోడీ భారత్ తరఫున బరిలో దిగింది. జాతీయ స్థాయిలో వీరిద్దరి ఆధిపత్యానికి తిరుగులేదు. ఇప్పటి వరకు 17 పతకాలు సాధించారు.

దూసుకొస్తోంది..


కీర్తి

భారత జూనియర్ విభాగంలో దూసుకొస్తున్న యువ రాకెట్ 16 ఏళ్ల కీర్తి మంచాల. 2017లో బ్యాడ్మింటన్‌లో అరంగేట్రం చేసిన కీర్తి ప్రస్తుతం గువాహటిలోని జాతీయ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఎన్‌సీఈ)లో శిక్షణ తీసుకుంటోంది. ఈ ఏడాది కర్ణాటకలో జరిగిన అఖిల భారత జూనియర్ ర్యాంకింగ్ టోర్నీలో ఆమె విజేతగా నిలిచింది. నిరుడు జాతీయ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-17 బాలికల విభాగంలో కాంస్యం, సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, అఖిల భారత సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీ (హైదరాబాద్)లో అండర్-17లో బంగారు పతకాలు కైవసం చేసుకుంది. గోవాలో జాతీయ అండర్-17 ర్యాంకింగ్ టోర్నీలో కాంస్యం నెగ్గింది. 2023లో అఖిల భారత ర్యాంకింగ్ టోర్నీల్లో నాలుగు కాంస్య పతకాలు గెలుపొందింది. 2022లోనూ జాతీయ స్థాయిలో నాలుగు కాంస్యాలు సాధించింది.


డబుల్స్‌లో మేటి


విష్ణు కేదార్

భారత జూనియర్స్ విభాగం పురుషుల డబుల్స్‌లో గట్టిగా వినిపిస్తున్న మరో పేరు విష్ణు కేదార్ కోడె. విష్ణు- మిథిలీష్ కృష్ణన్ (పుదుచ్చేరి) జోడీ జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తోంది. జాతీయ జూనియర్ బాలుర డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మిథిలీష్ ప్రథమ, విష్ణు ద్వితీయ స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ ఏడాది హరియాణాలో జరిగిన అఖిల భారత జూనియర్ ర్యాంకింగ్ టోర్నీలో అండర్-19 బాలుర డబుల్స్‌లో విష్ణు- మిథిలీష్ జోడీ విజేతగా నిలిచింది. జర్మనీ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి, డచ్ జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లలో ప్రిక్వార్టర్‌ఫైనల్ చేరుకుంది.

ఛాంపియన్


భారత్-ఎ జట్టులో రోహిత్!


రోహిత్

ముంబయి: టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డేల్లో కొనసాగుతాడా? ఆస్ట్రేలియా పర్యటనకు కెప్టెన్‌గా వెళ్తాడా? క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతున్న ఈ ప్రశ్నలకు జవాబు చెప్పడం కష్టమే. కానీ.. రోహిత్ ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నాడని తెలిసింది. ఐపీఎల్ తర్వాత మ్యాచ్ ప్రాక్టీస్‌కు దూరమైన భారత వన్డే కెప్టెన్.. ఆస్ట్రేలియాతో సిరీస్ ముందు భారత్-ఎ తరఫున ఆడే అవకాశముంది. సెప్టెంబరు 30, అక్టోబరు 3, అక్టోబరు 5న కాన్పూర్‌లో ఆస్ట్రేలియా-ఎ జట్టుతో వన్డేల్లో తలపడే భారత జట్టులో రోహిత్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రదర్శన ఆధారంగా రోహిత్ వన్డేల్లో కొనసాగడంపై నిర్ణయం తీసుకోవచ్చు.

అర్జున్ జట్టుకు పసిడి

ఆసియా షూటింగ్


అర్జున్

షెమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. గురువారం సీనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో అర్జున్ బబుతా, రుద్రాంక్ష్ సింగ్, కిరణ్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణం కైవసం చేసుకుంది. 1892.5 పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. చైనా (1889.2) రజతం.. కొరియా (1885.7) కాంస్యం గెలుచుకున్నాయి. జూనియర్ బాలుర 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో అభినవ్ షా పసిడి డబుల్ సాధించాడు. టీమ్ విభాగంలో భారత్ (అభినవ్, హిమాంశు, నరేన్) 1890.1 పాయింట్లతో పసిడి నెగ్గింది. చైనా (1885.1) రజతం, కొరియా (1882.9) కాంస్యం గెలిచాయి. 10 మీటర్ల వ్యక్తిగత విభాగంలో అభినవ్ స్వర్ణం నెగ్గాడు. ఫైనల్లో 250.4 పాయింట్లతో అతడు అగ్రస్థానంలో నిలిచాడు. హ్యాన్ సియో (కొరియా, 250.3) రజతం, షియాన్ (చైనా, 229.2) కాంస్యం ఖాతాలో వేసుకున్నారు. మహిళల జూనియర్ స్కీట్ విభాగంలో స్వర్ణ, రజతాలు భారత్ ఖాతాలోనే చేరాయి. మాన్సి రఘువంశీ పసిడి నెగ్గగా.. యశస్వి రాఠోడ్ రజతం సాధించింది. ఫైనల్లో మాన్సి 53 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. యశస్వి (52) ఒక్క పాయింట్ తేడాతో రెండో స్థానానికి పరిమితమైంది. లిడియా బషరోవా (కజకిస్థాన్, 40) కాంస్యం దక్కించుకుంది. ఇదే ఈవెంట్లో మరో భారత షూటర్ అగ్రిమ కన్వర్ (15) ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. స్కీట్ జూనియర్ పురుషుల కేటగిరిలో హర్‌మెహర్ సింగ్ రజతం గెలుచుకున్నాడు. తుదిపోరులో 53 పాయింట్లతో అతడు రెండో స్థానంలో నిలిచాడు. జ్యోతిరాదిత్య సింగ్ (43) కాంస్యం నెగ్గాడు. సెడెల్‌నికోవ్ (కజకిస్థాన్, 53)కు స్వర్ణం దక్కింది.

వచ్చే ఏడాది వరకు అగార్కరే



ముంబయి: భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ పదవీ కాలాన్ని బీసీసీఐ మరో ఏడాది పొడిగించింది. వచ్చే ఏడాది జూన్ వరకు ఛైర్మన్‌గా అతడే కొనసాగనున్నాడు. భారత క్రికెట్లో సంధి దశను విజయవంతంగా అధిగమించడంతో పాటు.. భారత జట్టుకు కీలక విజయాలు సాధించేలా జట్లను ఎంపిక చేసినందుకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. 2023 జులైలో అతడు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యాడు. ఆ ఏడాది వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన భారత జట్టు.. 2024లో టీ20 ప్రపంచకప్ గెలుచుకుంది. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీలోనూ విజేతగా నిలిచింది. స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు.. టీ20, టెస్టు క్రికెట్ నుంచి రిటైరైనా, అశ్విన్ అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికినా ఆ ప్రభావం జట్టుపై పడకుండా చూడటంలో సెలక్షన్ కమిటీది కీలకపాత్ర.

ప్రియ, రీనాలకు రజతాలు

- పసిడి పోరుకు కాజల్
- ప్రపంచ అండర్-20 రెజ్లింగ్

సామ్‌కోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రీనా (55 కేజీ), ప్రియ (76 కేజీ) రజతాలు గెలిచారు. ఫైనల్లో రీనా 2-10తో ఎవరెస్ట్ లిడెకర్ (అమెరికా) చేతిలో ఓడింది. ప్రియ 0-4తో నాడియా (ఉక్రెయిన్)కు తలొంచింది. మరోవైపు కాజల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 72 కేజీల విభాగం సెమీఫైనల్లో కాజల్ 13-6తో జేస్మిన్ రాబిన్‌సన్ (అమెరికా)ను ఓడించింది. మరోవైపు శ్రుతి (50 కేజీ), సారిక (53 కేజీ) కాంస్యాల కోసం పోరాడనున్నారు. రినా ఒగావా (జపాన్)తో సెమీస్‌లో శ్రుతి ఓడిపోయింది. సాంకేతిక ఆధిపత్యంతో ఒగావా.. శ్రుతిపై పైచేయి సాధించింది. అనస్తాసియా పోల్స్కా (ఉక్రెయిన్) చేతిలో సారిక పరాజయం చవిచూసింది. ఈ టోర్నీలో తపస్య (57 కేజీ) పసిడి ఖాతా తెరవగా.. సృష్టి (68 కేజీ) రజతం సొంతం చేసుకుంది. గ్రీకో రోమన్ పురుషుల విభాగంలో సూరజ్ (60 కేజీ) సెమీఫైనల్ చేరాడు. ప్రిన్స్ (82 కేజీ) క్వార్టర్‌ఫైనల్లో ఇంటిముఖం పట్టాడు.

మంబయి కెప్టెన్సీకి రహానె వీడ్కోలు

ముంబయి: టీమ్‌ఇండియా వెటరన్ బ్యాటర్ అజింక్య రహానె ముంబయి కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. రంజీ త్వరలోనే ఆరంభంకానున్న నేపథ్యంలో అతడు తన నిర్ణయాన్ని గురువారం సెలక్టర్లకు చెప్పాడు. నాయకుడిగా కొత్తవారికి అవకాశం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 201 మ్యాచ్‌ల్లో 14 వేలకు పైగా పరుగులు చేసిన రహానె ముంబయి జట్టులో బ్యాటర్‌గా కొనసాగనున్నాడు. రహానె సారథ్యంలోనే 2023-24 సీజన్‌లో ముంబయి రంజీ ఛాంపియన్‌గా ఆవిర్భవించింది. 2024-25 ఇరానీ కప్‌లోనూ విజేతగా నిలిచింది.

400 మీటర్లలో విశాల్ జాతీయ రికార్డు

చెన్నై: తమిళనాడు అథ్లెట్ విశాల్ తెన్నరసు జాతీయ రికార్డు నెలకొల్పాడు. గురువారం అంతర్ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 400 మీటర్ల పరుగులో విశాల్ 45.12 సెకన్లలో లక్ష్యాన్ని చేరి స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ క్రమంలో మహ్మద్ అనాస్ (45.21 సె) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. రాజేశ్ రమేశ్ (46.04 సె), విక్రాంత్ (46.17 సె) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. జాతీయ రికార్డు సాధించినా ప్రపంచ ఛాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని (44.85 సె.) మాత్రం విశాల్ అందుకోలేకపోయాడు. ఈ ఏడాది ఫెడరేషన్ కప్‌లోనూ పసిడి గెలిచిన విశాల్.. ఆగస్టు 10న జరిగిన కాంటినెంటల్ అథ్లెటిక్స్‌లోనూ స్వర్ణంతో మెరిశాడు.

గిల్ వెనుక బ్రాండ్ బాజా



దిల్లీ: అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న భారత టెస్టు జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ప్రకటనదారులకు కూడా ఇష్టుడిగా మారుతున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తర్వాత గిల్‌కే బ్రాండ్ విలువ ఎక్కువ ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "భారత్, ఇంగ్లాండ్ సిరీస్ తర్వాత గిల్ బ్రాండ్ విలువ 30 నుంచి 40 శాతం పెరిగింది. అతని బ్రాండ్ ఫీజును 25 నుంచి 50 శాతం పెంచే అవకాశముంది" అని సీనియర్ స్పోర్ట్స్ విశ్లేషకుడు నీరజ్ ఝా తెలిపాడు. గతంలో నెలకు 3-4 బ్రాండ్‌లు మాత్రమే గిల్‌ను సంప్రదించేవని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇప్పుడా సంఖ్య 10-15కు పెరిగింది. ప్రస్తుతం గిల్ ఏడాదికి ఒక్కో బ్రాండ్‌కు రూ.4 కోట్లు నుంచి రూ.5 కోట్లు తీసుకుంటున్నాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ తర్వాత ఆ మొత్తం రూ.6 కోట్లు నుంచి రూ.8 కోట్లకు పెరగనున్నట్లు ఐఓఎస్ స్పోర్ట్స్ సీఈఓ నీరవ్ తోమర్ చెప్పాడు. ప్రస్తుతం గిల్‌కు 20 బ్రాండ్‌లతో ఒప్పందాలు ఉన్నాయి. ఆ సంఖ్య కూడా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. 2024లో వాణిజ్య ఒప్పందాల ద్వారా గిల్ రూ.40 కోట్లు ఆర్జించినట్లు సమాచారం.

సలీమా సారథ్యంలో..

దిల్లీ: మహిళల ఆసియాకప్ హాకీ టోర్నమెంట్లో పాల్గొనే భారత జట్టుకు సలీమా టెటె సారథ్యం వహించనుంది. సెప్టెంబర్ 5న చైనాలోని హాంగ్జౌలో ఈ కప్ ఆరంభంకానుంది. ఈ టోర్నీలో విజేతగా నిలిచే జట్టు 2026 ప్రపంచ కప్ బెర్తు దక్కించుకోనుంది. పూల్-బిలో ఉన్న జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్‌తో కలిసి భారత్ ఆడనుంది. సెప్టెంబర్ 8న సింగపూర్‌తో తొలి మ్యాచ్‌లో తలపడనుంది. **భారత జట్టు:** సలీమా (కెప్టెన్), బన్సారి, బిచుదేవి, మనీషా, ఉదిత, జ్యోతి, సుమన్ దేవి, నిక్కీ ప్రదాన్, ఇషిక, నేహా, వైష్ణవి, షర్మిల దేవి, లాల్‌రెమ్‌సియామి, సనెలిటా, బ్యూటీ, ముంతాజ్, దీపిక, సంగీత.

స్టార్లను తోసిరాజని..

ఎరాని జోడీదే టైటిల్

రెండే రోజులు.. 16 జోడీలు.. స్టార్ ప్లేయర్లు.. భారీ ప్రైజ్‌మనీ.. నిబంధనల్లో మార్పులు..! యుఎస్ ఓపెన్ సింగిల్స్ డ్రాకు ముందే ప్రయోగాత్మకంగా నిర్వహించిన మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లో డిఫెండింగ్ ఛాంపియన్ సారా ఎరాని-వావసోరి జంట టైటిల్ నిలబెట్టుకుంది. స్టార్లు జోడీగా మారి బరిలో దిగినా.. డబుల్స్ స్పెషలిస్టులు ఎరాని-వవాసోరిలదే పైచేయి అయింది.


సారా ఎరాని, ఆంద్రియా వావసోరి

న్యూయార్క్: క్రికెట్లో టీ20 మాదిరే వేగంగా ముగిసిపోయిన మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీలో ఫలితం వచ్చేసింది. జకోవిచ్, అల్కరాస్, స్వైటెక్ లాంటి స్టార్లు బరిలో ఉన్నా.. సారా ఎరాని-ఆంద్రియా వావసోరి (ఇటలీ) జంటే విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన తుదిపోరులో ఎరాని ద్వయం 6-3, 5-7, 10-6తో ఇగా స్వైటెక్ (పోలెండ్)-కాస్పర్ రూడ్ (నార్వే) జోడీని ఓడించింది. తొలి సెట్ కోల్పోయినా.. రెండో సెట్లో గెలిచి స్వైటెక్ జోడీ పోటీలో నిలిచింది. అయితే కీలక సమయంలో తడబడింది. నువ్వానేనా అన్నట్టుగా సాగిన టైబ్రేకర్‌లో మొదట ఎరాని ద్వయం 4-0తో ఆధిక్యంలోకి వెళ్లగా.. తర్వాత స్వైటెక్ జోడీ పుంజుకుంది. 4-5తో ప్రత్యర్థికి సమీపంగా వచ్చింది. తర్వాత తడబడి మ్యాచ్‌తో పాటు టైటిల్‌ను చేజార్చుకుంది. వావసోరి కొట్టిన ఓ క్రాస్‌కోర్టు షాట్‌ను నెట్ సమీపంలో స్వైటెక్ అందుకోలేకపోవడంతో ఎరాని జంట సంబరాల్లో మునిగిపోయింది.

"కొత్త నిబంధనల కారణంగా ఈ టోర్నీలో ఆడలేకపోయిన డబుల్స్ ప్లేయర్లందరికి ఈ విజయం అంకితం. టైటిల్ నిలబెట్టుకోవడం ఎంతో సంతోషంగా ఉంది" – సారా ఎరాని

- 2019లో బెథాని మాటెక్ సాండ్స్-జేమీ ముర్రే తర్వాత యుఎస్ ఓపెన్లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకున్న ఘనత ఎరాని-వావసోరి జోడీకే దక్కింది.
- టైటిల్ గెలిచిన ఎరాని జంటకు 8 కోట్ల 72 లక్షల భారీ ప్రైజ్‌మనీ లభించింది. రన్నరప్ స్వైటెక్ జోడీకి రూ. 3 కోట్ల 48 లక్షలు దక్కాయి.

జకోవిచ్, అల్కరాస్ ఒకే పార్శ్వంలో..

న్యూయార్క్: దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్‌కు యుఎస్ ఓపెన్లో క్లిష్టమైన డ్రానే పడింది. అతడున్న పార్శ్వంలోనే స్పెయిన్ కెరటం కార్లోస్ అల్కరాస్ కూడా ఉన్నాడు. సెమీస్‌లో నొవాక్‌కు అల్కరాస్ ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఈనెల 24న ఆరంభం కాబోతున్న ఈ టోర్నీలో ఏడో సీడ్‌గా బరిలో ఉన్న జకోవిచ్.. తొలి రౌండ్లో లియార్నర్ థిన్ (అమెరికా)తో తలపడనున్నాడు. రెండోసీడ్ అల్కరాస్.. తొలి రౌండ్లో రిలీ ఒపెల్కా (అమెరికా)తో ఆడనున్నాడు. టాప్ సీడ్ సినర్.. కొప్రివా (చెక్)తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంకకు టాప్ సీడింగ్ దక్కగా.. స్వైటెక్ రెండో సీడ్‌గా బరిలో ఉంది. 45 ఏళ్ల వీనస్ విలియమ్స్ తొలి రౌండ్లో ముచోవాతో తలపడనుంది.

పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు పచ్చజెండా

ఆసియా కప్‌లో ఆడేందుకు క్రీడా శాఖ అనుమతి

దిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు ఉండవని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నూతన క్రీడా విధానం ప్రకారం తటస్థ వేదికలపై కూడా పాక్‌తో భారత్ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోదని వెల్లడించింది. అయితే ఆసియా కప్‌లో భారత్ పాల్గొనేందుకు వెసలుబాటు కల్పించింది. బహుళ జట్లు పాల్గొంటున్న టోర్నీ కాబట్టి ఆసియా కప్‌లో భారత్ పాల్గొనకుండా ఆపబోమని పేర్కొంది. పాక్‌తో అంతర్జాతీయ క్రీడలకు సంబంధించిన నూతన క్రీడా విధానాన్ని క్రీడా మంత్రిత్వ శాఖ ఆవిష్కరించింది. భారత క్రీడాకారులు పాక్‌లో పర్యటించకుండా నిషేధం విధించినట్లు క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ విధానం తక్షణం అమల్లోకి వస్తుందని చెప్పాయి. బహుళ దేశాల టోర్నీ కోసం పాక్‌లో భారత్ పర్యటించాల్సి వచ్చినప్పుడు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నాయి. "భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు ఉండవు. ద్వైపాక్షిక సిరీస్‌లను అమెరికాలో నిర్వహించాలనుకున్నా భారత్ ఆడదు. పాక్‌లో జరిగే టోర్నీల్లో భారత జట్లు పాల్గొనవు. పాక్ జట్లకు భారత్ పర్యటించేందుకు అనుమతి ఉండదు. బహుళ జట్ల టోర్నీ కాబట్టి ఆసియా కప్‌లో పాల్గొనకుండా భారత్‌ను అడ్డుకోం. ఇలాంటి టోర్నీలకు పాక్ ఆతిథ్యమిస్తే తప్ప భారత జట్లను నిలువరించం. ఈ విషయంలో ఎలాంటి అస్పష్టత లేదు" అని క్రీడా శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

యోయోకు తోడుగా బ్రాంకో!

ఈనాడు క్రీడావిభాగం

టీమ్‌ఇండియాలో అత్యంత ఫిట్‌గా ఉండే ఆటగాడు ఎవరు? ప్రస్తుతం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టమే. ఎప్పుడు ఎవరు గాయపడతారో తెలియని పరిస్థితి! ఫాస్ట్‌బౌలర్ల విషయంలో నిలకడగా సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడే ఆటగాడే కనిపించడం లేదు. ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రి హయాంలో ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చిన భారత జట్టు.. ఆ తర్వాత ఆటగాళ్లకు కాస్త స్వేచ్ఛనిచ్చింది. తరుచుగా ఆటగాళ్లు గాయపడుతుండటంతో కోచ్ గౌతమ్ గంభీర్ తిరిగి ఫిట్‌నెస్ విషయంలో కఠినంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను తేల్చేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న యోయో టెస్టుతో పాటు.. బ్రాంకో టెస్టునూ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాడు. టీమ్ ఇండియాకు ఈ ఏడాది జూన్‌లో కొత్తగా వచ్చిన స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అడ్రియాన్ లి రాక్స్ ఈ పరీక్షను జట్టుకు పరిచయం చేశాడు. ఇకపై ఓ ఆటగాడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడని ధ్రువీకరించాలంటే అతడు.. యోయోతో పాటు బ్రాంకో టెస్టునూ పాసవ్వాల్సిందే. మరి ఈ కొత్త పరీక్ష గురించి తెలుసుకుందామా..!

పరీక్ష ఇలా..



- బ్రాంకో అంటే పరుగు పరీక్ష. ఎక్కువగా రగ్బీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను నిర్ణయించేందుకు ఉపయోగిస్తారు. దీని ద్వారా ప్లేయర్ల శారీరక సామర్థ్యం, వేగం, మానసిక దృఢత్వంపై ఓ అంచనాకు రావొచ్చు. తేలిగ్గానే కనిపిస్తుంది.. కానీ చాలా కష్టమైనది.
- 20, 40, 60 మీటర్ల దూరాల మధ్య పరుగెత్తాల్సి ఉంటుంది. తొలుత 20 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యానికి చేరుకున్నాక.. తిరిగి వెనక్కి రావాలి. ఆ తర్వాత 40 మీటర్లు.. అది పూర్తయ్యాక 60 మీటర్ల వరకు వెళ్లి తిరిగి రావాల్సి ఉంటుంది. ఇలా మూడు లక్ష్యాలను పూర్తి చేస్తే సెట్ పూర్తవుతుంది. ఒక సెట్‌లో భాగంగా 240 మీటర్లు పరుగెత్తాల్సివుంటుంది.
- బ్రాంకో పూర్తి పరీక్షలో ఆగకుండా 5 సెట్లను పూర్తి చేయాలి. అంటే ఒక అథ్లెట్ విరామం లేకుండా 1200 మీటర్లు పరుగెత్తాలి. ఎంత వేగంగా పూర్తి చేస్తే అంత ఫిట్‌గా ఉన్నట్లు.
- రగ్బీలో ఉన్నఫలంగా మలుపులు తీసుకోవాల్సివుంటుంది కాబట్టి.. ఈ పరీక్షనే నమ్ముకుంటారు. అగ్రశ్రేణి జట్టు న్యూజిలాండ్ తమ ఆటగాళ్ల ఫిట్‌నెస్ కోసం ఈ పరీక్షనే ఉపయోగిస్తుంది. క్రికెట్లో కూడా ఈ పరీక్షకు ఇప్పుడు ప్రాధాన్యత పెరుగుతోంది.
- ఈ టెస్టులో పాసవ్వడానికి టీమ్‌ఇండియా ఆటగాళ్లకు ఆరు నిమిషాలను ప్రమాణంగా నిర్ణయించారు. రగ్బీ ఆటగాళ్లతో పోల్చుకుంటే ఇది తక్కువే. సాధారణంగా ఫిట్‌గా ఉన్న రగ్బీ ఆటగాళ్లు 4 నిమిషాల 30 సెకన్లలో ఈ టెస్టును పూర్తిచేస్తారు.
- యోయో టెస్టు ఇలా: 20 మీటర్ల దూరంలో రెండు మార్కులను ఏర్పాటు చేస్తారు. ఆటగాళ్లు ఆ మార్కుల మధ్య దూరాన్ని బీప్ శబ్దం వచ్చేలోపు పూర్తిచేయాలి. ఇలా క్రమంగా 20 మీటర్ల లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిన సమయాన్ని తగ్గిస్తూ వెళ్తారు. ఆటగాడు పూర్తిచేయలేక ఆగిపోయేసరికి అతడు పూర్తి చేసిన లక్ష్యాల ఆధారంగా స్కోరును లెక్కగడతారు.



బైకుల సంత

కూరగాయల సంత.. పశువులు, మేకల సంతలు అన్నిచోట్లా జరుగుతుంటాయి. ఆరేళ్లుగా తెలంగాణలోని కామారెడ్డిలో ప్రతి గురువారం బైకుల సంతనూ నిర్వహిస్తున్నారు. ఇక్కడి సీఎస్ఐ చర్చి మైదానంలో నిర్వహిస్తున్న ఈ బైకుల అంగడికి వివిధ ప్రాంతాల నుంచి విక్రయదారులు.. తమ ద్విచక్ర వాహనాలను తీసుకువస్తారు. నిర్వాహకుడు.. వాటి పేపర్లు అన్నీ సక్రమంగా ఉందీ లేనిదీ తనిఖీ చేశాకే విక్రయానికి పెడతారు. ఇందుకోసం ఫీజుగా రూ.50 తీసుకుంటారు. ఔత్సాహికులు ఇష్టమైన వాహనాన్ని, ధర నచ్చితే కొనుగోలు చేస్తారు. ఇలా బైకు క్రయవిక్రయాలు నిర్వహించినందుకు నిర్వాహకుడు కొంత కమీషన్ తీసుకుంటారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి బైక్‌ల కొనుగోలుదారులు వస్తుంటారు. ప్రతివారం ఈ అంగడిలో 50 బైక్‌ల వరకు విక్రయాలు జరుగుతుంటాయి. – న్యూస్‌టుడే, కామారెడ్డి



సంపాదనే సర్వస్వం అనుకోవద్దు

మీ బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బు ఉందన్నది ముఖ్యమే. కానీ మీ కుటుంబం, స్నేహితులు, ఆనందం, ఆరోగ్యం, స్ఫూర్తి అంతకంటే చాలా ముఖ్యమైనవి. అవే అసలైన సంపద. డబ్బు సంపాదనే సర్వస్వం అనుకోకండి.

– కెవిన్ జాబో, కాపీరైటర్

ఈ ఆట... ఆపేద్దాం!



ఆటలు మైదానాల్లో ఆడితే అందం...ఆరోగ్యం. అదే మొబైల్‌లో ఆడితే... తీవ్రమైన అనారోగ్యం. ఇప్పుడు పిల్లల పాలిట శాపంగా మారుతున్న సమస్య పేరు ఇంటర్‌నెట్ గేమింగ్ డిజార్డర్ (ఐజీడీ). సరదాతో మొదలై... సంక్లిష్టంగా మారే ఐజీడీ బారిన పడకుండా ఏం చేయాలి?

ఆన్‌లైన్ గేమింగ్ సరదా స్థాయి దాటి చాలా కాలమైంది. సెల్‌ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్లు, గేమింగ్ కన్సోల్స్‌లో గేమ్‌లు ఆడే అలవాటు వ్యసనంగా మారి చివరకు ఇంటర్‌నెట్ గేమింగ్ డిజార్డర్(ఐజీడీ)గా పరిణమిస్తున్నట్లు తాజా సర్వేలు చెబుతున్నాయి. దేశంలో కళాశాల విద్యార్థుల్లో 5.3 శాతం.. టీనేజ్ స్కూల్ పిల్లల్లో 3.25-4.25 శాతం.. వైద్య విద్యార్థుల్లో 6.98 శాతం ఐజీడీ బారిన పడినట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనివల్ల వారు శారీరక, మానసిక ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు పెరుగుతున్నాయి. మరోవైపు కంపెనీలు తరచూ కొత్త గేమ్‌లను కొనుగోలు చేయాలని పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్‌నెట్ గేమింగ్ డిజార్డర్ బారిన పడుతున్న టీనేజీ పిల్లల్లో భారతీయులే అత్యధికమని తాజా పరిశోధనలు వెల్లడిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. తల్లిదండ్రులు తొలిదశలోనే గుర్తించి జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని కేంద్రప్రభుత్వం ఇటీవల అడ్వయిజరీని కూడా జారీ చేసింది.

తల్లిదండ్రులూ పారాహుషార్!

ఐజీడీ బారిన పడిన పిల్లల వ్యవహారశైలిలో స్పష్టమైన మార్పు కనిపిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఒకవేళ అసాధారణ లక్షణాలు ఉంటే మాత్రం వెంటనే అప్రమత్తమవ్వాలి...

- పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నప్పుడు.
- తమ ఆన్‌లైన్ కార్యకలాపాల గురించి గోప్యత పాటిస్తున్నప్పుడు.
- తల్లిదండ్రులు చూసేందుకు ప్రయత్నిస్తే స్క్రీన్‌లను మార్చేస్తుంటే.
- ఆన్‌లైన్ వినియోగించాక ఊరికే కోప్పడుతుంటే.
- పిల్లల డివైజ్‌లలో కొత్త ఫోన్ నంబర్లు లేదా ఈ-మెయిల్స్ విపరీతంగా పెరిగినప్పుడు. జాగ్రత్తపడాలి.

నిఘా పెట్టొచ్చు!

గేమింగ్ కన్సోల్స్‌లో పేరెంటల్ కంట్రోల్‌లను యాక్టివేట్ చేస్తే పిల్లలు ఏమేం చేస్తున్నారో తల్లిదండ్రులు నేరుగా గమనించొచ్చు. కొన్ని ప్రముఖ గేమింగ్ కన్సోల్స్‌లో తల్లిదండ్రుల నియంత్రణలను యాక్టివేట్ చేసే విధానాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అవగాహన కల్పిస్తోంది.

ప్లేస్టేషన్‌లో...

- మీ ఖాతాలో అకౌంట్ మేనేజ్‌మెంట్‌ను సైన్ఇన్ చేసి ఫ్యామిలీ మేనేజ్‌మెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. సభ్యుడి(పిల్లాడి)ని మొదటిసారి జోడిస్తున్నట్లయితే 'సెట్ అప్ నౌ' ఆప్షన్‌తో పాటు జోడించాలి..
- రెండోసారి సభ్యుడిని జోడించేందుకు 'ఫ్యామిలీ మెంబర్‌ను జోడించు' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- పిల్లాడి పుట్టిన తేదీని నమోదు చేసి 'నెక్ట్స్' ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
- అక్కడ కనిపించే చట్టపరమైన నిబంధనలను సమీక్షించిన తర్వాత అంగీకరించాలి. తల్లిదండ్రుల నియంత్రణలను సెటప్ చేయడానికి తెరపై కనిపించే సూచనలను అనుసరించాలి.

ఎక్స్‌బాక్స్

- సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఖాతాను ఎంచుకున్న అనంతరం ఫ్యామిలీ సెట్టింగ్‌లను ఎంచుకోవాలి.
- స్క్రీన్ సమయం, యాప్ యాక్సెస్, వయసు పరిమితులను సెట్ చేసుకోవాలి.
- కంటెంట్‌ను బ్లాక్ చేయడానికి ఫిల్టర్‌లను ఎనేబుల్ చేయాలి.

నింటెండో స్విచ్

- మీ ఫోన్‌లో నింటెండో స్విచ్ తల్లిదండ్రుల నియంత్రణ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్‌ను కన్సోల్‌కు లింక్ చేయాలి.
- గేమ్‌లు, సంభాషణల కోసం సమయ పరిమితులు, వయస్సు పరిమితులు, కంటెంట్ ఫిల్టర్‌ను సెట్ చేయాలి.

ఐజీడీతో సమస్యలు చాలా..



శారీరకంగా...

- తలనొప్పి
- మెడనొప్పి
- కనురెప్పలు ఎక్కువగా కదలించడం
- కంటి అలసట
- మణికట్టు, కీళ్ల మధ్య నొప్పులు

మానసికంగా...

- యాంగ్జైటీ (ఆందోళన)
- డిప్రెషన్ (కుంగుబాటు)

సెల్‌ఫోన్ వినియోగాన్ని నియంత్రించాల్సిందే..

కచ్చితమైన సమయపాలన : చిన్నారుల సెల్‌ఫోన్ సమయంపై కచ్చితమైన నియంత్రణ ఉండాలి. రెండేళ్లలోపు పిల్లలకు స్క్రీన్‌టైం అసలే ఉండకూడదు. 2-12 ఏళ్లలోపు పిల్లలకైతే రోజుకు గంట.. టీనేజ్ పిల్లలకు 2 గంటల కన్నా ఎక్కువ స్క్రీన్‌టైం లేకుండా చూడాలి.

ఎస్ఏఆర్ స్థాయి : కిలోగ్రామ్ శరీర కణజాలం శోషించుకునే రేడియేషన్ మొత్తాన్ని స్పెసిఫిక్ అబ్జార్ప్షన్ రేట్ (ఎస్ఏఆర్) తెలియజేస్తుంది. సెల్‌ఫోన్‌లో ఎస్ఏఆర్ స్థాయి 1.6 వాట్స్/కేజీ ఉండాలి. అప్పుడే దాన్ని వినియోగించే చిన్నారులకు రేడియేషన్ ముప్పు తప్పుతుంది. సెల్‌ఫోన్‌లో ఎస్ఏఆర్ స్థాయి తెలుసుకోవాలంటే *#07# అని టైప్ చేయాలి.

- ఈనాడు, హైదరాబాద్

ప్రభాకర్ సార్ పాఠం చెబితే ఇలా ఉంటుంది



తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్.. . తరగతి గదిలో పాఠం చెప్పడంతో పాటు.. విద్యార్థులను క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్లి వాటిని ప్రత్యక్షంగా చూపే ప్రయత్నం చేస్తుంటారు. గురువారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు తెలుగు పుస్తకంలోని 'అసామాన్యులు' పాఠంలో కులవృత్తులకు సంబంధించిన అంశాన్ని బోధించారు. ఈక్రమంలో స్థానికంగా మట్టికుండలు, పాదరక్షలు తయారుచేసే వారి వద్దకు విద్యార్థులను తీసుకువెళ్లి వాటి తయారీ, కులవృత్తుల ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులు సైతం ఆసక్తిగా తిలకించారు. కుండలను తయారుచేశారు.

– న్యూస్‌టుడే, మద్దిరాల గ్రామీణం



సూపర్‌మామ్ ఫరహా!

అనగనగా అందాల నల్లమల అడవి. అందులో ఒక ఆడ పులి.. పేరు ఫరహా(ఎఫ్-6). ఒకప్పుడు ఒంటరిగా తిరిగిన ఈ పులి నేడు ఓ పెద్ద వంశానికి 'సూపర్‌మామ్'గా మారింది. మూడు తరాలు కలిపి 'ఫరహా' కుటుంబంలోని పులుల సంఖ్య 13కి చేరింది. ఒకే వంశంలో ఇన్ని పులులు ఉండటం అరుదైన విషయం.

ఎఫ్-6 పులికి 2019 నుంచి సంతానోత్పత్తి మొదలైంది. తొలుత రెండు పులులకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఒకటి, ఒకటి, నాలుగో విడత మూడు.. కలిపి మొత్తం 7 పులులకు జన్మనిచ్చింది. ఇందులో నాలుగు ఆడవి. మూడు మగవి.

ఎఫ్-6 సంతానంలో ఒక టైన బౌరమ్మ (ఎఫ్-18) ఆరు పులులకు జన్మనిచ్చింది. 2022లో ఏకంగా నాలుగు పులులు..2024లో రెండింటికి.

అమ్రాబాద్ టైగర్ రిజర్వులో మొత్తం 36 పులులు ఉంటే..అందులో దాదాపు మూడోవంతుకు పైగా ఫరహా వంశానివే ఉన్నాయి.

ఒక వైపు ఫరహా సంతానం.. మరోవైపు ఎఫ్-18 సంతానం.. ఇంకా వాటి పిల్లలు.. మూడు తరాల ముచ్చటతో అమ్రాబాద్ అడవులు సందడిగా మారాయి.



హైదరాబాద్-శ్రీశైలం రహదారిలో ఫరహాబాద్ గేట్ నుంచి అటవీశాఖ సందర్శకుల్ని ఫరహాబాద్ వ్యూపాయింట్‌కు జీపులో తీసుకెళుతుంది. ఈ మార్గంలోనే సూపర్‌మామ్ ఫరహా పెద్దపులి తిరుగుతుంది. అందుకే ఆ పులికి ఈ పేరు వచ్చింది. సఫారీకి వెళ్లినప్పుడు సందర్శకులకు ఈ పులి కన్పించే అవకాశం ఉంది. ఆ పులి వయసిప్పుడు 9-10 ఏళ్లు.

ఎఫ్-18 బౌరమ్మ గతంలో బౌరాపూర్ ప్రాంతంలో కన్పించడంతో ఆ పేరు వచ్చింది. అయితే ఆ పులి ఇప్పుడు లింగాల అటవీరేంజ్‌లో తిరుగుతోంది.

– ఈనాడు, హైదరాబాద్

అనుకరించినా ఆకర్షణే!



ఫ్రాన్స్‌లో ప్రముఖ కట్టడమైన ఐఫిల్ టవర్ ఎత్తు 1083 అడుగులు. 135 ఏళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది ఈ అద్భుత నిర్మాణం. దీన్ని అనుకరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా, మన దేశంలోనూ ఎన్నో నిర్మాణాలు వచ్చాయి. తెలంగాణలోని వరంగల్ నగరపాలక సంస్థ సైతం దీన్ని అనుకరిస్తూ 30 అడుగుల ఎత్తుతో నమూనా ఐఫిల్ టవర్‌ను నిర్మించింది. హనుమకొండ నగరంలోని బాలసముద్రం కూడలిలో.. అమృత్ పథకంలో భాగంగా రూ.19 లక్షల వ్యయంతో దీన్ని తీర్చిదిద్దారు. టవర్ నిర్మాణంతో కూడలికే కొత్త అందం వచ్చిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు దీపాల అలంకరణతో రాత్రి సమయంలో బంగారు వర్ణంలో మెరిసిపోతూ నగరవాసులకు కనువిందు చేస్తోంది. వారాంతంలో జనం సందడి పెరిగి పర్యాటక ప్రదేశంగా మారుతోంది. – ఈనాడు, హనుమకొండ

మీ పాదాల కోసం టెక్



పాదాలు స్కాన్ చేసే యంత్రం

పాదాల వైకల్యం ఉన్న వాళ్లకు సరైన జోళ్లు దొరకడం చాలా కష్టం. కీళ్ల నొప్పులతో బాధపడేవారు, ఆర్థోపెడిక్ సమస్యలు ఎదుర్కొనే వాళ్లు, మధుమేహ బాధితులదీ ఇదే పరిస్థితి. ఇలాంటి వారి కష్టాలు తీర్చేందుకే విశాఖలోని మెడ్‌టెక్ జోన్ వివిధ రకాల పాదరక్షలు తీసుకొస్తోంది. ఇక్కడి అసిస్టివ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) శాస్త్రీయ అంచనాతో చెప్పులు, బూట్లు తయారు చేస్తోంది. వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పాదాలను స్కానింగ్ చేసి, సాంకేతికతతో సమస్యను గుర్తించి.. ఆ లోపాలను సరిచేసేలా పాదరక్షలు రూపొందిస్తోంది.

ఒత్తిడి పడకుండా..



ఒత్తిడి మడమ వైపు పడాలా లేక వేళ్ల వైపా అని శాస్త్రీయంగా తెలుసుకొని వీటిని రూపొందిస్తారు. బరువు పడే భాగమే నేలకు తాకుతుంది. మిగతాది గాల్లో తేలి ఉండేలా తయారు చేస్తున్నారు.

గాయం నయమయ్యేందుకు..



కాలిలో ఆనెలు (కార్న్స్) ఉన్నా, పాదాలకు గాయాలు ఉన్నా ఈ 'వుండ్‌కేర్ షూ' ఉపశమనం కలిగిస్తాయి. గాయం ఉన్న చోట ఒత్తిడి లేకుండా సోల్ రూపొందిస్తారు. వీటిని ఎవరైనా వినియోగించవచ్చు. గాయాలు ఉన్నవారికి ప్రయోజనం. నీటిలో ఎక్కువ తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

మధుమేహ బాధితులకు ప్రత్యేకం..



మధుమేహ బాధితులు గాయాలు, ఇన్‌ఫెక్షన్లు బారిన పడకుండా ఇవి కాపాడుతాయి. గాయాలపై ఒత్తిడి పడకుండా వీటిని డిజైన్ చేస్తారు. అతుకులు లేకుండా, లోతు ఎక్కువగా ఉండేలా, మృదువైన, తేలికైన ఇన్‌సోల్స్‌తో రూపొందిస్తారు. 25 ఏళ్లు దాటిన వారెవరైనా వినియోగించవచ్చు.

త్రీడీ సాంకేతికతతో 'ఇన్‌సోల్స్'..



నడిచేటప్పుడు పాదం అంతటా ఒత్తిడి సమానంగా పడేలా ఈ ఇన్‌సోల్స్ ఉపకరిస్తాయి. వ్యక్తుల అవసరాలను బట్టి త్రీడీ ఫుట్ స్కానింగ్ టెక్నాలజీతో రూపొందిస్తున్నారు. వీటిని బూట్లలో వేసుకోవాలి. ఇన్‌సోల్స్ అవసరమైన వారిని ప్రత్యేక యంత్రంపై నిల్చోబెట్టి పాదంపై ఎక్కడ భారంపడుతుందో గుర్తిస్తారు. ఆ మేరకు మౌల్డ్ తీసుకొని, వీటిని తయారు చేస్తారు.

చిన్నారుల కోసం



పాదాల అమరిక సరిగా లేని, నడక అసాధారణంగా ఉన్న పిల్లల కోసమే ఈ ప్రత్యేక పాదరక్షలు. కొంత మంది పిల్లల్లో పుట్టినప్పటి నుంచే కాలి చీలమండ నుంచి పాదం లోపలి వైపునకు మడత పడుతుంది. అలాంటి వారికి చికిత్స అందించాకా.. ఈ డీబీ స్ప్లింట్ పాదరక్షలు వాడితే ఫలితం ఉంటుంది.


–ఈనాడు, విశాఖపట్నం

బేతాళపురం బడి.. కొత్త ఒరవడి



'మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చేరండి. .ఉచితంగా సైకిల్ పొందండి' అంటూ శ్రీకాకుళం జిల్లా మందస మండలం బేతాళపురం గ్రామస్థులు ప్రకటించారు. సమీప గ్రామాల నుంచి చేరిన 41 మందికి గురువారం సైకిళ్లు అందజేశారు. ప్రభుత్వ బడిని బలోపేతం చేయడానికి గ్రామాభివృద్ధి కమిటీ నిధులతో సైకిళ్లను సమకూరుస్తున్నామని స్థానిక యువత తెలిపింది. –న్యూస్‌టుడే, మందస

కడలి గర్భంలో కరుణామయుడు



ఏసు క్రీస్తు.. సముద్రాన్నే చర్చిగా చేసుకున్న ప్రాంతాన్ని కన్నారా.. నీటి అడుగున సగర్వంగా ఆయన నిలిచి ఉన్న దృశ్యాన్ని చూశారా.. చూడాలంటే ఇటలీకి వెళ్లాల్సిందే.. శాన్‌ఫ్రటూసో తీరం సమీపంలోని మధ్యధరా సముద్రంలో ఉన్న కమోగ్లీలో 1954 ఆగస్టు 22న కంచుతో తయారు చేసిన 2.5 మీటర్ల ఎత్తైన జీసస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 17 మీటర్ల లోతున ఉన్న ఈ విగ్రహాన్ని నౌకాదళం స్కూబా డైవర్‌తో తాజాగా ఇలా శుద్ధి చేయించారు. గతంలో 2003లో విగ్రహాన్ని బయటకు తీసి శుద్ధి చేసి మళ్లీ అక్కడే ఏర్పాటు చేశారు.






ఎస్ - ఆటో

వినూత్నంగా ఆలోచిస్తే ఖర్చులు ఆదా చేయవచ్చు అనడానికి మరో ఉదాహరణ ఈ ఆటో. కాకినాడ జిల్లా అచ్యుతాపురానికి చెందిన భాస్కరరావు ఆటో డ్రైవర్. డీజిల్ ఖర్చు ఎక్కువవుతోందని 3 నెలల కిందట ఈ-ఆటోను కొనుగోలు చేశారు. నెల తిరిగేసరికి దీనికి ఛార్జింగ్ బిల్లు బాగానే వచ్చేది. దీంతో మరింత ఖర్చు తగ్గించుకునేందుకు సోలార్ టెక్నీషియన్‌గా పని చేసే మిత్రుడి సాయంతో ఆటో పైభాగాన సౌరఫలకాలు ఏర్పాటు చేసి, ఎస్-ఆటో (సోలార్ ఆటో) కింద మార్చేశారు. దీనికి రూ.30 వేల ఖర్చయింది. ప్యానల్స్‌తో ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 8 గంటలపాటు నిరంతరాయంగా ప్రయాణించవచ్చని భాస్కరరావు చెబుతున్నారు. బిల్లు గతంలో కంటే బాగా తగ్గిందని, వర్షాలప్పుడు మాత్రం ఛార్జింగ్ పెడతానని వివరించారు.

– న్యూస్‌టుడే, కాకినాడ (సాంబమూర్తినగర్)



అందాల గట్టు..

కొండ అంచున ఆవాసం.. దిగువన కృష్ణమ్మ ప్రవాహంతో.. ఆకట్టుకుంటోంది లింగాలగట్టు గ్రామం. శ్రీశైలం వద్ద కృష్ణా నదిపై అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో ఏపీ వైపు ఉంది ఈ ఊరు. తెలంగాణ వైపు ఉన్న ఎడమ పాతాళగంగ నుంచి చూస్తే ఇలా కనిపించింది. ఇక్కడ సుమారు 250 కుటుంబాలు ఉండగా.. అందరూ చేపల వేటతోనే ఉపాధి పొందుతున్నారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్)

బుజ్జాయికి అదో బాధ!



మీ ఇంట్లో చిన్నపిల్లలున్నారా? వారికి డైపర్లు వాడుతున్నారా? ర్యాషెస్ వచ్చి వారు ఇబ్బంది పడుతున్నారా? అయితే మీరు వాటిని సరిగ్గా వినియోగించనట్లే!



ఆధునిక కాలంలో పిల్లల్లో డైపర్ల వినియోగం పెరిగింది. అయితే వీటిని ఎన్నిసార్లు మార్చాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అన్న విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల పిల్లల్లో దద్దుర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్ సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు పాత కాటన్ చీరలతో బొంతల్లా కుట్టి పక్కబట్టలపై వేసి తరచూ మారుస్తుండేవాళ్లు. ఉతికి వినియోగిస్తుండేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి భిన్నం. వీలైనంత వరకు డైపర్ విరామం పాటించడం, ఎప్పటికప్పుడు వాటిని మారుస్తుండటం, గాలి తగిలే, తేమ ఉండని నాణ్యమైన డైపర్లు వినియోగించడం ముఖ్యం.

మూడు గంటలకొకసారి

- సాధారణంగా 18 నుంచి 20 నెలల వయసు వచ్చే వరకు వీటిని వాడొచ్చు అని చెబుతున్నారు. గరిష్ఠంగా 2 ఏళ్ల వరకు వాడొచ్చు.
- కాటన్ డైపర్లు మంచివి. డిస్పోజబుల్ డైపర్లు ప్రయాణాల సమయంలో వాడవచ్చు. ప్రత్యేకంగా మూడు గంటలకోసారి వాటిని మార్చాల్సి ఉంటుంది. అవసరాన్ని బట్టి పిల్లలు వినియోగించిన తీరును బట్టి కొన్నిసార్లు ఈలోపే మార్చుకోవాల్సి వస్తుంది.
- డైపర్లు గంటల కొద్దీ మార్చకుండా అలా ఉంచేస్తే చిన్నారులకు ఇబ్బందులు తప్పవు. వాడినవే మళ్లీ మళ్లీ వాడినా శరీరం ఒరుసుకుపోతుంది. దురదలు, దద్దుర్లు వస్తాయి. మార్చకుండా అలా వదిలేస్తే మూత్రం అక్కడ నిల్వ ఉండి గజ్జలకు పుళ్లు పడే ప్రమాదమూ ఉంటుంది.

విరామం ముఖ్యం

- పిల్లలకు డైపర్ విప్పి మళ్లీ వెంటనే వేయకూడదు. కొంతసేపు విరామం ఇవ్వాలి. దాని వల్ల అవయవాలకు గాలి తగులుతుంది. మార్చినప్పుడల్లా వేడినీళ్లతో కడిగేసి సున్నితంగా కాటన్ బట్టతో అద్దాలి. తుడవకూడదు. వైప్స్ వాడకూడదు.



- దద్దుర్లు రాకుండా సంబంధిత క్రీమ్ రాయాలి.
- కాటన్ డైపర్లు మంచివి. గాలి రాకపోకలకు వీలుంటుంది.
- ఈ డైపర్లు మరీ లూజ్‌గా, మరీ బిగుతుగా ఉండకూడదు.

డయేరియా సమస్య గుర్తించడంలో ఇబ్బందులు

– డాక్టర్ విఠల్ రావు, చిన్న పిల్లల వైద్య నిపుణులు

మూత్రం పరిమాణం, రంగును బట్టి డయేరియా తీవ్రత అంచనా వేయాల్సి ఉంటుంది. డైపర్ల వినియోగం వల్ల అది గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చికిత్సలో సమస్యలు వస్తున్నాయి. డీహైడ్రేషన్ ఎంత వరకు ఉందో గుర్తించడం సమస్య అవుతోంది. పిల్లల్లో 2 ఏళ్లు వచ్చిన తర్వాత ఇక డైపర్లు ఆపేయాలి. వారికి సమయాలు అలవాటు చేయాలి. లేకపోతే సమయానికి మూత్రం వచ్చే అలవాటు పోతుంది. డైపర్లు మార్చకుండా వాటినే ఎక్కువ సేపు కొనసాగించడం వల్ల ఆరోగ్య సమస్యలూ వస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి

నగరాల చుట్టూ.. థీమ్ బేస్డ్ పట్టణాలు!

- విశాఖలో సిద్ధమవుతున్న వెయ్యి ఎకరాలు
- మిగిలిన నగరాల్లో మరో 1,500 ఎకరాల గుర్తింపు

ఈనాడు, అమరావతి: నగరాల్లో జనాభా పెరగడంతో వాటి చుట్టూ కొత్త పట్టణ నిర్మాణాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రచిస్తోంది. భావి అవసరాల మేరకు ఇప్పటి నుంచే తగిన సదుపాయాలు కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా నీతి ఆయోగ్ ఎంపిక చేసిన గ్రోత్ సిటీల్లో ఒకటైన విశాఖపట్నంలో 'థీమ్ బేస్డ్' పట్టణాల నిర్మాణానికి కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం వెయ్యి ఎకరాల భూ సేకరణ చేపట్టనుంది. ఇదే నమూనాను మిగతా నగరాల్లోనూ అమలు చేయనుంది. ఇందుకోసం 1,500 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలు, ప్రాజెక్టులపై రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాలు, ఆస్తుల నిర్వహణ సంస్థ (ఏపీయూఐఏఎంఎల్) అధ్యయనం చేస్తోంది.

'థీమ్ బేస్డ్' పట్టణ నిర్మాణాలు అంటే?

రాష్ట్రంలో పెద్ద నగరాల్లో ఒకటైన విశాఖ జనాభా 2011 లెక్కల ప్రకారం 18 లక్షలు కాగా, ప్రస్తుతం 21 లక్షలకు పైగా ఉన్నట్లు అంచనా. ముమ్మందు ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున విశాఖ చుట్టూ ఉన్న అనకాపల్లి, విజయనగరం తదితర ప్రాంతాల్లో స్థిరమైన, వినూత్న రీతిలో థీమ్ బేస్డ్ పట్టణాలు అభివృద్ధి చేయనున్నారు. వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించి ఐటీ, వైద్యం, పర్యాటకం, వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు.. ఇలా విభిన్న రంగాల్లో ప్రైవేట్ సంస్థల నుంచి పెట్టుబడులు ఆహ్వానించనున్నారు.

విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో 1,000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించారు. ప్రైవేట్ భూముల కోసం భూసమీకరణ పథకం అమలు చేయనున్నారు.

తొలి దశలో 6 నగరాల పరిధిలో..


విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, కడప, శ్రీకాకుళం నగరాలకు అనుబంధంగా కూడా థీమ్ బేస్డ్ పట్టణ నిర్మాణాల కోసం ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేస్తున్నారు. ఈ 12 నగరాల్లో కలిపి 1,500 ఎకరాల భూములను ప్రాథమికంగా గుర్తించారు. వీటిలోనూ ప్రభుత్వ, ప్రైవేట్ భూములున్నాయి. తొలి దశలో విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, కర్నూలులో థీమ్ బేస్డ్ పట్టణ నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఇందుకు అవసరమయ్యే నిధుల కోసం కొంత భూమిలో పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో లేఅవుట్లు వేసి ప్రజలకు స్థలాలు విక్రయిస్తారు. ఐటీ, పర్యాటకం, వినోద సంబంధిత ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయిస్తారు. నీతి ఆయోగ్ సిఫార్సులపై 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' సాధించడం కోసం కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖతో రాష్ట్ర అధికారులు సంప్రదింపులు జరిపారు. నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్రాలకు సాయాన్ని మరింతగా పెంచేందుకు కేంద్రమే ఈ ఏడాది బడ్జెట్‌లో అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్ కింద కొత్తగా రూ.లక్ష కోట్లు కేటాయించింది. ఏపీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పైగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ నిధులు వస్తే థీమ్ బేస్డ్ పట్టణ నిర్మాణాలు సులువవుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ సంజయ్ కరోల్. చిత్రంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయం వద్దకు కుటుంబ సభ్యులతో విచ్చేసిన న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.



పార్టీ పెద్దల ఆదేశాల మేరకే మాట్లాడా

- తాడేపల్లి పోలీసుల విచారణలో అంబటి మురళీకృష్ణ
- 13 ప్రశ్నలు సంధించిన పోలీసులు



తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరవుతున్న అంబటి మురళీకృష్ణ తదితరులు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, మంగళగిరి: 'అమరావతిని లేపడానికి పొన్నూరును ముంచేశారు' అంటూ వైకాపా పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేసు నమోదుచేసిన పోలీసులు.. మురళీకృష్ణను గురువారం విచారణకు పిలిచారు. గంటన్నరపాటు ఆయనకు 13 ప్రశ్నలు సంధించారు. 12వ తేదీ వర్షం పడగా 13వ తేదీ ఉదయాన్నే కాలువలకు నీరు ఆపేస్తే కొండవీటి వాగు నీరు కాలువలకు వదిలారని మీరు ఎలా చెప్పగలరని ప్రశ్నించినట్లు సమాచారం. కొండవీటి వాగు వరదనీటిని మోటార్ల ద్వారా కృష్ణానదిలోకి పంపింగ్ చేశామని జలవనరులశాఖ చెబుతుంటే కాలువలకు వదిలారని ఎలా అసత్య ఆరోపణలు చేశారు?.. కొండవీటి వాగు లిఫ్ట్‌స్కీం మోటార్లు ఆన్ చేసిన విషయాన్ని మీరు చూశారా? వరదనీటిని కాలువలకు వదలడం మీరు చూశారా?.. చూసుంటే ఇరిగేషన్ అధికారులకు చెప్పారా? గుంటూరు ఛానల్ హెడ్ రెగ్యులేటర్ మూసి ఉందా, తెరిచి ఉందా అనే విషయాన్ని మీరు చూశారా? చేబ్రోలు, తాడికొండ, మంగళగిరి, పెదకాకాని మండలాల్లో ఎంత వర్షపాతం పడిందో మీకు తెలుసా? చేబ్రోలులో 299 మి.మీ., పెదకాకానిలో 260 మి.మీ. వర్షపాతం నమోదైన విషయం మీకు తెలుసా?.. అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది.

అరకొరగానే సమాధానాలు

పోలీసుల ప్రశ్నలకు అంబటి మురళీకృష్ణ అరకొరగానే సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. కొన్నింటికి తెలియదనే జవాబు చెప్పడంతోపాటు.. సామాజిక మాధ్యమాలపై ఆధారపడి పార్టీ పెద్దల ఆదేశాల మేరకు మాట్లాడానని చెప్పినట్లు తెలిసింది. మురళీకృష్ణ చెప్పిన విషయాలు కోర్టుకు తెలియజేస్తామని, అవసరమనిపిస్తే మరోసారి విచారణకు పిలుస్తామని తాడేపల్లి పోలీసులు తెలిపారు. సాక్షి యాజమాన్యానికీ నోటీసులు ఇచ్చి విచారణకు పిలుస్తామని వివరించారు. పోలీసుల విచారణ అనంతరం మురళీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ. . తన వ్యాఖ్యల వెనుక దురుద్దేశం లేదని చెప్పారు. రాజధాని జాతీయసంపద అని.. ఆ నిర్మాణం సక్రమంగా జరగాలనేదే తన కోరికన్నారు. ప్రభుత్వంపై చవకబారు ఆరోపణలు చేయాలనేది తన ఉద్దేశం కాదని.. వరదల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం జరగాలనేది తన అభిమతమని వివరించారు.

కళలకు ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహం

శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు



మూవీమాస్టర్స్ గ్రంథంతో రఘురామకృష్ణరాజు, మండలి బుద్ధప్రసాద్, ఎస్.వి.రామారావు తదితరులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వం కళలు, కళాకారులను ప్రోత్సహించడన్నుగా నిలుస్తోందని ఏపీ శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు అన్నారు. రచయిత ఎస్వీ రామారావు రచించిన 'మూవీ మాస్టర్స్' గ్రంథావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ నానక్‌రాంగూడ ఔట్లర్ హోటల్‌లో ఆయన నిర్వహించిన సంబంధంలో గురువారం రాత్రి నిర్వహించారు. రఘురామ తొలి గ్రంథాన్ని స్వీకరించి, మాట్లాడారు. లలితకళలను ప్రోత్సహించేందుకు తన నియోజకవర్గం ఉండిలో ఓ థియేటర్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. రచయిత ఎస్వీ రామారావు శ్రమించి సినీ చరిత్రపై పలు గ్రంథాలు రాశారని, వాటన్నింటికన్నా విలువైన సమాచారం ఇందులో నిక్షిప్తం చేశారన్నారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. పాతతరం నటీనటులు, దర్శకులు, టెక్నీషియన్ల వివరాలను ఈ తరానికి తెలిపే పుస్తకంగా మూవీ మాస్టర్స్ నిలుస్తుందన్నారు. కిన్నెర రఘురాం, రచయిత ఎస్వీ రామారావు, సారిపల్లి కొండలరావు, లంక లక్ష్మీనారాయణ మాట్లాడారు.

2026 ఎన్నికల్లో టీవీకే, డీఎంకేల మధ్యే పోటీ

- తమిళనాడులో భాజపా కాలుమోపలేదు
- పార్టీ మహానాడులో టీవీకే అధ్యక్షుడు విజయ్



చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: సినిమా అవకాశాల తర్వాత విశ్రాంతి కోసం రాజకీయాల్లోకి రాలేదని, అన్నింటికీ సిద్ధమయ్యే ఇందులోకి దిగానని సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. తమిళనాడులో 2026లో టీవీకే, డీఎంకే పార్టీల మధ్యే పోటీ ఉంటుందని తెలిపారు. పార్టీ రెండో మహానాడును మదురై జిల్లా పారపత్తిలో గురువారం నిర్వహించారు. దీనికి లక్షల మంది కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ మూడోసారి పదవి చేపట్టింది ప్రజలకు మంచి చేయడానికా లేదా ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడానికా అని ప్రశ్నించారు. తమిళ జాలర్లు శ్రీలంక నౌకాదళ దాడికి గురవుతున్నారని, వారి భద్రతకు కచ్చతీవును తిరిగి పొందాలని కోరారు. నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తామర ఆకులో నీరు నిలవదని, తమిళనాడు ప్రజలు భాజపాకు ఓటు వేయరని చెప్పారు. ఎంజీఆర్ ఉన్నంత వరకు ముఖ్యమంత్రి సీటు కావాలని ఎవరూ కల కూడా కనలేదని, ఆయన ప్రారంభించిన పార్టీ ఇప్పుడు ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. భాజపా ఏ వేషం వేసుకొచ్చినా రాష్ట్రంలో కాలుపెట్టలేదని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో తననే అభ్యర్థిగా భావించి ప్రజలు ఓటు వేయాలని విజయ్ కోరారు. రాష్ట్రంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలకు వస్తే రహస్య సమావేశాలు జరుగుతాయని డీఎంకేను ఉద్దేశించి విమర్శించారు. ఇది చాలా తప్పు అని అన్నారు. తప్పు చేస్తే స్టాలిన్‌ను కూడా వదలనని చెప్పారు. టీవీకేకు సిద్ధాంత శత్రువు భాజపా, రాజకీయ శత్రువు డీఎంకే అన్నారు. భాజపాతో పొత్తు పెట్టుకోవడానికి టీవీకే అవినీతి పార్టీ కాదని తెలిపారు.

అటవీశాఖ ఉద్యోగులపై దాడి.. ఎమ్మెల్యేపై కేసు

- ఏ1గా జనసేన శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌ఛార్జి



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో జనసేన నేత రౌతు అశోక్

ఈనాడు, కర్నూలు, శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలం సమీపంలోని శిఖరం చెక్‌పోస్ట్ దగ్గర అటవీశాఖ ఉద్యోగి కరీముల్లాపై దాడి ఘటనలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిపై శ్రీశైలం పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కేసు నమోదుచేశారు. ఆయన్ను ఏ2గా చూపారు. వాహనంలో దాడి చేసిన తర్వాత అటవీశాఖ ఉద్యోగులను శ్రీశైలంలోని 'గొట్టిపాటి నిలయం' అతిథిగృహంలో బంధించారు. ఈ అతిథిగృహాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిర్మించి ఆలయానికి బహూకరించారు. దాని నిర్వహణలో మంత్రికి సంబంధం లేదు. కొందరు ప్రముఖులు వచ్చినప్పుడు ఆ అతిథిగృహాన్ని కేటాయించాలని అడుగుతుంటారు. మంగళవారం రాత్రి ఆ అతిథిగృహాన్ని కేటాయించాలని శ్రీశైలం ఎమ్మెల్యే కోరడంతో ఆయనకు కేటాయించారు. అదే గృహంలో తమను బంధించి దాడిచేశారని అటవీశాఖ ఉద్యోగులు పోలీసులకు వివరించారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రమేయం: అటవీశాఖ ఉద్యోగులపై దాడి కేసులో శ్రీశైలం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రౌతు అశోక్ ప్రధాన నిందితుడని (ఏ1) తేల్చారు. అశోక్ జనసేన నాయకుడైనా.. ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉంటారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యేతోపాటు ఆయనా ఉన్నారని, ఉద్యోగులపై దాడిచేశారని బాధితులు పోలీసులకు వివరించారు. దీంతో గురువారం అశోక్‌ను పిలిపించి విచారణ చేశారు. ఎమ్మెల్యే వాహనంలో మరికొందరు ఉన్నా వారెవరిపైనా కేసు నమోదుకాలేదు.

అమెరికాలో 5.5 కోట్ల మంది విదేశీయుల వీసాల పరిశీలన

ట్రంప్ ప్రభుత్వం వెల్లడి

వాషింగ్టన్: అమెరికాలో ఉన్న సుమారు 5.5 కోట్ల మంది విదేశీయుల వీసా పత్రాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం గురువారం పేర్కొంది. ఎవరైనా వీసా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారా అన్నది నిర్ధారించడానికి ఈ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపింది. నేరాలు, ఉగ్రవాద చర్యలకు పాల్పడినా, ఉగ్రసంస్థలకు మద్దతిచ్చినా, వీసా కాల పరిమితిని మించి అమెరికాలో నివసిస్తున్నా, ప్రజాభద్రతకు భంగం కలిగించినా అలాంటి వ్యక్తులను స్వదేశాలకు తిప్పి పంపించే చర్యల్లో భాగంగా ఈ కసరత్తు చేస్తున్నట్లు పేర్కొంది.

'తల్లికి వందనం..బిడ్డకు జీవితం' గీతావిష్కరణ

ఈనాడు, అమరావతి: 'తల్లికి వందనం' పథకంపై ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రచించి, పాడిన 'తల్లికి వందనం.. బిడ్డకు జీవితం' పాటను గురువారం ఆవిష్కరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టీడీ జనార్దన్ ఈ పాటను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సేవలను పాట రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు గోపాలకృష్ణను అభినందించినట్లు తెలిపారు.

ఈతకు వెళ్లి ముగ్గురు ఎంబీఏ విద్యార్థుల మృతి

అన్నమయ్య జిల్లాలో విషాదం



చంద్రశేఖర్‌రెడ్డి ★ దిలీప్‌కుమార్ ★ కేశవ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రాజంపేట మండలం బాలరాజుపల్లి వద్ద చెయ్యేరు నదిలో ఈతకు దిగి ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చదువుతున్న 8 మంది విద్యార్థులు ఈత కొడదామని గురువారం కళాశాల నుంచి చెయ్యేరు నదికి వెళ్లారు. ఇందులో రాజంపేటకు చెందిన దిలీప్(22), వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల వాసి పి.కేశవ(22), ఒంటిమిట్టకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(22) ఇసుక ఊబిలో కూరుకుపోయి మృత్యువాత పడగా.. మిగిలిన ఐదు మంది ప్రాణాలతో బయటపడ్డారు.

రాజధానిలోనూ బీఎస్ఎన్ఎల్ సేవల్ని విస్తరిస్తాం

- ఏపీ సర్కిల్‌లో నెలకు రూ.400కే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్
- సీజీఎం శేషాచలం వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న శేషాచలం. చిత్రంలో ఉన్నతాధికారులు ఎల్.శ్రీను, రవికుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలోనూ బీఎస్ఎన్ఎల్ సేవల్ని విస్తరిస్తామని, దీనికి గానుత్వరలో టవర్లు ఏర్పాటు చేస్తామని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం తెలిపారు. వినియోగదారుల కోసం ఏపీ సర్కిల్‌లో నెలకు రూ. 400లకే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ తెచ్చామని, ఇందులో ఇంటర్నెట్, టీవీ, ఫోన్ సదుపాయాల్ని కల్పిస్తున్నామని వివరించారు. రాబోయే మూడు నెలల్లో 5జీ సేవల్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేయనున్నట్టు వెల్లడించారు. విజయవాడలోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఈ ప్లాన్‌లో ఈటీవీ సహా 400కు పైగా ఛానళ్లు, తొమ్మిదికి పైగా ఓటీటీలు ఉంటాయి. దేశవ్యాప్తంగా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. 20 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ వేగం అందిస్తున్నాం. దీని కోసం ఆన్‌లైన్ విధానం, సమీపంలోని బీఎస్ఎన్ఎల్ సర్వీస్ సెంటర్లను సంప్రదించొచ్చు. బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులు కేవలం రూ.140 చెల్లించి ఈ సేవలు పొందొచ్చు. లోకల్ కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్...టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్టనర్లుగా(టీఐపీ) నమోదు చేసుకోవచ్చు. దీని గురించి అవగాహన కల్పించేందుకు మేళాలు నిర్వహిస్తాం" అని శేషాచలం వివరించారు. ఇటీవల ప్రకటించిన ఫ్రీడమ్ ప్లాన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని, వినియోగదారుల సంఖ్య 3 రెట్లు పెరిగిందని తెలిపారు. అంత్యోదయ మిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,380 4జీ టవర్లను అప్‌డేట్ చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్లు బుంగ రవికుమార్, ఎల్.శ్రీను, జీఎంలు మురళీకృష్ణ, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా తరఫున యుద్ధంలోకి దిగు

- వైద్య విద్య కోసం వెళ్లిన తమిళనాడు విద్యార్థిపై హుకుం
- సైనిక దుస్తుల్లో చూసి తల్లిదండ్రుల ఆందోళన



సైనిక దుస్తుల్లో కిశోర్

చెన్నై(దేశచెన్నై), న్యూస్‌టుడే: వైద్య విద్య నభ్యసించేందుకు రష్యా వెళ్లిన తమ కుమారుడు.. సైనిక దుస్తుల్లో కనిపించడం చూసి తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. తమిళనాడులోని కడలూర్ జిల్లా శ్రీముష్ణం సమీప పాలయంగోట కీళపాడి గ్రామానికి చెందిన శరవణన్, భామా దంపతుల కుమారుడు కిశోర్(23) 2021లో వైద్య విద్య కోసం రష్యా వెళ్లాడు. రెండేళ్ల తర్వాత తనతో పాటు గదిలో ఉన్న ఓ స్నేహితుడితో కలిసి పార్ట్‌టైం జాబ్ కింద కొరియర్ సర్వీస్‌లో చేరాడు. 2023లో నిషేధిత మత్తు పదార్థాలను కిశోర్ డెలివరీ చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు రష్యా పోలీసులు అతనితో పాటు ముగ్గురిని అరెస్టు చేశారు. తనను చీకటి గదిలో బంధించి పోలీసులు చిత్రహింసలకు గురి చేసినట్లు కిశోర్ కొద్ది నెలల కిందట తల్లిదండ్రులకు ఫోన్‌లో తెలిపాడు. తనకు మిలిటరీ దుస్తులు ఇచ్చి శిక్షణ ఇస్తున్నారని, ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొనాలని ఒత్తిడి తెస్తున్నారని కిశోర్ ఆ వీడియోలో వాపోయాడు. అందులో కుమారుడు రష్యా మిలిటరీ దుస్తుల్లో ఉన్న దృశ్యాలు, ఫొటోలు చూసి తల్లిదండ్రులు షాక్ అయ్యారు. కడలూర్ కలెక్టరేట్‌కు వచ్చిన శరవణన్, భామా దంపతులు.. తమ కుమారుడిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరారు.







కూనవరం మండలం ఉదయభాస్కర్ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో టీవీని తీసుకొస్తున్న యువకుడు ★ గండిపోశమ్మ ఆలయ శిఖరం కూడా కనిపించకుండా ప్రవహిస్తున్న గోదావరి వరద ★ అయోధ్యలంక నుంచి పి.గన్నవరం మండలం నడిగాడివైపు పడవలో కొబ్బరిబొండాలు తీసుకొచ్చి ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

గోదావరిలో కొనసాగుతున్న వరద ఉద్ధృతి

- విలీన మండలాలు, లంక గ్రామాల్లో ఇక్కట్లు

వరరామచంద్రాపురం, కూనవరం, దేవీపట్నం, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ధవళేశ్వరం, పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. విలీన మండలాల్లోని నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు పలుచోట్ల రహదారులపైకి గురువారం వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా వడ్డిగూడెం, శ్రీరామగిరి, జీడిగుప్ప, తుమ్మిలేరు- పోచవరం, చిన్న మట్టపల్లి, రామవరం పంచాయతీలోని గ్రామాల ప్రజలు ముంపుతో ఇబ్బందులు పడ్డారు. అధికారుల సమాచారం ప్రకారం వరరామచంద్రాపురం మండలంలో 300 కుటుంబాలు పునరావాస కేంద్రాలకు వెళ్లాయి. దేవీపట్నం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. గురువారం సాయంత్రానికి గండిపోశమ్మ అమ్మవారి ఆలయం పూర్తిగా మునిగిపోయింది. పోశమ్మగండి నుంచి గోదావరిలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

★ గురువారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.90 అడుగులకు చేరింది. 175 గేట్లు పూర్తిగా పైకెత్తి 11,51,758 క్యూసెక్కుల వరదను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అర్ధరాత్రికి రెండో ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 52.01 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. నది మధ్యలో లంక ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి.

శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్ల ద్వారా నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే, ఈనాడు, అమరావతి: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. జలాశయం 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 18 అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 4,20,370 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,065 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.90 అడుగులు, నీటినిల్వ 198.3623 టీఎంసీలుగా నమోదైంది.

ప్రకాశం బ్యారేజీకి 5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం: ఎగువన కురుస్తున్న వర్షాల ధాటికి... కృష్ణమ్మ ఉరకలెత్తి ప్రవహించింది. గురువారం ఉదయం 5 గంటలకు ప్రకాశం బ్యారేజీకి వచ్చే వరద 5,04,969 క్యూసెక్కులకు చేరింది. 4,93,822 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. సాయంత్రం 5 గంటలకు గరిష్ఠంగా బ్యారేజీకి 5,15,240 క్యూసెక్కులు రాగా.. 5,00,213 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. రాత్రి 7 గంటలకు బ్యారేజీకి వచ్చే వరద మళ్లీ 6,391 క్యూసెక్కులు తగ్గి 5,08,849 క్యూసెక్కులుగా ఉంది. దిగువకు 4,93,822 క్యూసెక్కులు విడిచిపెట్టారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద ఉద్ధృతితో అవనిగడ్డ, చల్లపల్లి, తోట్లవల్లూరు మండలాల్లోని లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు నీట మునిగాయి. అవనిగడ్డ మండలం ఎడ్లంకలో 200 ఎకరాల్లో కూరగాయల పంటలను వరద ముంచెత్తింది.





దానిమ్మ క్రాప్ 'కవర్'!

కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన రైతు బందేనవాజ్ నాలుగెకరాల్లో దానిమ్మ వేశారు. తోటంతా ప్రస్తుతం కాయలు కాసింది. ఈ దశలో కాయలపై మచ్చలు ఏర్పడితే ఆశించిన ధర రాదు. దీంతో అధికారుల సూచనల మేరకు చెట్లకు క్రాప్ కవర్‌ను ఇలా పరదాలు కట్టారు. ఇందుకు ఎకరాకు రూ.లక్ష వెచ్చించినట్లు రైతు తెలిపారు. 'ఇలా చేయడం వల్ల తెగుళ్లు, దోమలు ఒక వరుస నుంచి మరో వరుసకు వ్యాపించవు. ఎండ నుంచి కూడా కాయలకు రక్షణ లభిస్తుంది. నాణ్యమైన దిగుబడి వస్తుంది' అని ఉద్యానవన అధికారి మదన్‌మోహన్ తెలిపారు.

– ఈనాడు, కర్నూలు; న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

EENADU Vol: 52, Issue: 13 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

క్రమం తప్పకుండా ఆదాయం వస్తున్నప్పుడు రుణ వాయిదాల చెల్లింపు సజావుగానే సాగుతుంది. ఒక్కసారి ఉద్యోగం కోల్పోవడం లేదా సంపాదన ఆగిపోయిన సందర్భంలో ఈఎంఐలు, కార్డు బిల్లులు చెల్లించడం కష్టం కావచ్చు. ఒక్క నెల వాయిదాలు ఆలస్యమైనా క్రెడిట్ స్కోరుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇలాంటప్పుడు ఏం జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

ఆదాయం ఆగిందా?
క్రెడిట్ స్కోరుతో జాగ్రత్త



✦ ఆదాయం ఆగినప్పుడు ముందుగా మీ రుణ బాధ్యతలను పరిశీలించండి. క్రెడిట్ స్కోరుపై అధిక ప్రభావం చూపించే వాటి చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఉదాహరణకు గృహ, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు బిల్లులు. వీటిని ఆలస్యం చేస్తే వెంటనే క్రెడిట్ బ్యూరోలకు సమాచారం చేరుతుంది. మీ దగ్గర కొంత డబ్బు ఉంటే, వాటిని అధిక వడ్డీ రుణ వాయిదాలను చెల్లించేందుకు ఉపయోగించండి.

✦ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న రుణగ్రహీతల కోసం మారటోరియం లేదా ఈఎంఐ తగ్గింపులాంటి వెసులుబాట్లను అందిస్తుంటాయి. మీ బ్యాంకును సంప్రదించి, మీకు ఆదాయం ఆగిపోయిన విషయాన్ని చెప్పండి. రుణాన్ని మీ ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా మార్చాలని కోరండి. దీనివల్ల మీ క్రెడిట్ స్కోరుపై ఆలస్యపు చెల్లింపుల ప్రభావం పడదు. మీ ఖాతా 'డీఫాల్ట్' కాకుండా ఉంటుంది.

✦ ఉద్యోగం లేనప్పుడు రోజువారీ ఖర్చుల కోసం క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలపై ఆధారపడకపోవడమే మంచిది. ఇది మీ క్రెడిట్ వినియోగ నిష్పత్తిని పెంచుతుంది. మీ క్రెడిట్ పరిమితిలో 30-40 శాతానికి మించి ఉపయోగించకూడదు. ఎక్కువగా ఉంటే, మీరు ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్నారని రుణ సంస్థలు భావిస్తాయి. అవసరమైన వాటికి మాత్రమే ఖర్చు చేయండి. అత్యవసర నిధిని వాడుకునే ప్రయత్నం చేయండి. ఈ సమయంలో కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకోవడం మంచిది కాదు.

✦ ఉద్యోగం కోల్పోవడం, ఆదాయం ఆగిపోవడంలాంటివన్నీ స్వల్పకాలమే. ఈ సమయంలో కాస్త అప్రమత్తంగా లేకపోతే కొన్నేళ్లుగా మీరు జాగ్రత్తగా కాపాడుకున్న స్కోరు దెబ్బతింటుంది. భవిష్యత్తులో దీన్ని తిరిగి సాధించడం అంత తేలిక కాదు. కాబట్టి, వీలైనంత వరకూ ఆర్థిక క్రమశిక్షణతో ఉండి, చెల్లింపులు ఆగకుండా చూసుకోవాలి. అప్పుడే మీ ఆర్థిక స్థితి బలపడిన తర్వాత తక్కువ వడ్డీ రేట్లతో కొత్త రుణాలు పొందడం సులభం అవుతుంది.



పెద్దలకూ ఉండాలి
ఆర్థిక ప్రణాళిక

పదవీ విరమణ చేశాం.. ఇక ఆర్థిక విషయాల గురించి ప్రణాళిక వేయాల్సిన అవసరం ఏమిటి అని చాలామంది ఆలోచిస్తుంటారు. నిజానికి ఇప్పుడే వాటి అవసరం ఎక్కువగా ఉంటుంది. వస్తున్న ఆదాయం పరిమితంగా ఉండే నేపథ్యంలో ఇది ఎంతో కీలకం. దీంతోపాటు ఆర్థిక మోసాల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలి.

ఉద్యోగం చేస్తున్నన్ని రోజులూ క్రమం తప్పకుండా ఆదాయం వస్తుంది. ఒకసారి విశ్రాంత జీవితంలోకి వచ్చాక.. కొన్ని ప్రత్యేక ఆర్థిక సవాళ్లు ఎదురవుతుంటాయి. ఖర్చులను నిర్వహించడం అందరికీ సులభం కాకపోవచ్చు. తగినంత పొదుపు మొత్తం ఉంటేనే ఇది సాధ్యం.

ఎస్‌డబ్ల్యూపీతో..

మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసి, నిర్ణీత మొత్తాన్ని నెలవారీగా వెనక్కి తీసుకునే పద్ధతే ఎస్‌డబ్ల్యూపీ. పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం అందుకునే ఏర్పాటు చేసుకోవడం అన్నమాట. మీ దగ్గరున్న పదవీ విరమణ నిధిని మంచి పనితీరున్న బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ లేదా హైబ్రిడ్ ఫండ్లలో మదుపు చేసి, ఆ తర్వాత నెలకు కొంత మొత్తం తీసుకోవచ్చు. ఉదాహరణకు మీ దగ్గర రూ.25 లక్షలు ఉన్నాయనుకుందాం. దీనిని 10 శాతం రాబడి వచ్చేలా మదుపు చేశారనుకుందాం. ఏటా 6 శాతం వెనక్కి తీసుకుంటే.. నెలకు రూ.12,500 అవుతుంది. ఈ వచ్చే మొత్తాన్ని ఏటా 6 శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్తే.. 25 ఏళ్లపాటు (300 నెలలు) తీసుకున్న తర్వాత కూడా మీ నిధి దాదాపు రూ.14.5 లక్షల వరకూ ఉంటుంది. ఇలాగే కొనసాగిస్తే.. మరో 29 నెలలపాటు (329 నెలలు) ఈ మొత్తం సర్దుబాటు అవుతుంది. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే.. మ్యూచువల్ ఫండ్లలో నష్టభయం ఉంటుంది. మార్కెట్లు పడిపోతున్నప్పుడు ఎస్‌డబ్ల్యూపీ శాతాన్ని తగ్గించుకోవడం మంచిది.

సురక్షితంగా..

నష్టభయం తట్టుకోలేని వారు సురక్షితమైన పథకాల్లో మదుపు చేయడం మంచిది. పోస్టాఫీసు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ పథకం ఇందుకు మంచి మార్గం. ఇందులో 8.2 శాతం వార్షిక వడ్డీ వస్తుంది. మూడు నెలలకోసారి వడ్డీని చెల్లిస్తారు. ఇందులో రూ.30లక్షల వరకూ జమ చేసుకోవచ్చు. వ్యవధి అయిదేళ్లు. ఆ తర్వాత మూడేళ్ల చొప్పున ఎన్నిసార్లయినా కొనసాగించుకోవచ్చు. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లనూ పరిశీలించవచ్చు. జీవిత బీమా సంస్థలు అందించే యాన్యుటీ పాలసీలూ ఉంటాయి.

ఎంత మొత్తం అవసరం...

పదవీ విరమణ తర్వాత దాదాపు 25 ఏళ్ల వరకూ ఖర్చులకు ప్రణాళిక వేసుకోవాలి. ఉదాహరణకు మీ వయసు 60 ఏళ్లు అనుకుందాం. మరో 25 ఏళ్లపాటు ఖర్చుల కోసం నెలకు రూ.30,000 కావాలి అనుకుందాం. ద్రవ్యోల్బణం 5 శాతం, రాబడి 8 శాతం అంచనాతో ఇప్పుడు మీ దగ్గర దాదాపు రూ.64 లక్షల వరకూ ఉండాలి. ఈ మొత్తాన్ని ఎంతో జాగ్రత్తగా పెట్టుబడి పెట్టుకోవాలి. మీ ఖర్చులు ఇంకా ఎక్కువగా ఉంటే.. పదవీ విరమణ నిధి పెంచుకోవాలి.

బీమాగా ఉండాలి

మలి వయసులో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం అధికం. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా పాలసీలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. ఇప్పటికే మీకున్న పాలసీలను కొనసాగిస్తూ ఉండండి. లేకపోతే పలు బీమా సంస్థలు పెద్దల కోసం ప్రత్యేక పాలసీలను అందిస్తున్నాయి. వీటిని ఎంచుకునే ప్రయత్నం చేయండి. ప్రీమియం కాస్త అధికంగా ఉంటుంది. కనీసం రూ.5లక్షల పాలసీ ఉండాలి. మీపై ఆర్థిక బాధ్యతలు ఉంటేనే టర్మ్ పాలసీని కొనసాగించండి. తీవ్ర వ్యాధులు వస్తే పరిహారం వచ్చేలా క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ ఉండాలి. బృంద ఆరోగ్య బీమా పాలసీ నుంచి సొంత పాలసీకి మారండి.

స్పష్టత ఉండాలి..

మీ ఆర్థిక ఆస్తులన్నీ ఒక చోటకు తీసుకురండి. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. ఇలా మీ నగదు పెట్టుబడులన్నీ లెక్క తీయండి. మీకున్న స్థిరాస్తుల వివరాలనూ పరిశీలించండి. మీ ఆస్తులు, బాధ్యతల గురించి ఒక స్పష్టమైన అంచనాకు రావాలి. పింఛను, అద్దె, యాన్యుటీల వంటి మూలాల నుంచి మీకు వస్తున్న ఆదాయం ఎంతో చూసుకోండి. దీని వల్ల మీకు వాస్తవంగా ఎంత మొత్తం వస్తుందన్నది తెలుస్తుంది. ఆ తర్వాతే ఎంత మేరకు ఖర్చులకు కేటాయించాలి. ఎంత భవిష్యత్తు అవసరాల కోసం దాచుకోవాలి అనేది అర్థం అవుతుంది. మీ ఆర్థిక ప్రణాళికలో ఈ లెక్కలు తేల్చడమే అత్యంత ముఖ్యం.

ఇవీ చూసుకోండి..

▲ కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తాన్ని అత్యవసర నిధిగా బ్యాంకు పొదుపు ఖాతాలో నిల్వ చేసుకోండి.

▲ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు. చిన్న అనారోగ్యం మీ పొదుపు మొత్తాన్ని తగ్గించి వేస్తుంది.

▲ వీలునామా రాయడమూ మంచిదేనని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

▲ అత్యధిక నష్టభయం ఉండే పథకాల జోలికి వెళ్లొద్దు. అధిక వడ్డీ ఆశ చూపించే వారిని నమ్మొద్దు.

▲ సైబర్ నేరాల తీరుపై అవగాహన పెంచుకోవాలి. వాటి బారిన పడి, డబ్బు పోగొట్టుకోవద్దు.

సిరి

siri@eenadu.net

రిఫండు రాలేదా?

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసి, రిఫండు కోసం ఎదురుచూస్తున్నారా? ఐటీఆర్‌లను ప్రాసెస్ చేసి, రిఫండును వేగంగా ఇచ్చేందుకు ఐటీ విభాగం కృషి చేస్తున్నప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల రిఫండు ఆలస్యం అవుతోంది.

- రోజుకు లక్షల్లో రిటర్నులు దాఖలు చేస్తుండటంతో రిటర్నుల ధ్రువీకరణకు జాప్యం జరుగుతోంది. ఈ ప్రభావం రిఫండుపై పడుతోంది.
- పన్ను చెల్లింపుదారులు తమ సమాచారం సరిగా ఇవ్వకపోయినా రిఫండు విషయంలో ఇబ్బంది రావచ్చు. ముఖ్యంగా బ్యాంకు ఖాతా సమాచారం. కాబట్టి, మీరు ఒకసారి ఐటీఆర్‌ను తనిఖీ చేసుకోండి.
- చెల్లించాల్సిన పన్ను, మీరు క్లెయిం చేసిన మొత్తంలో అసమానతలు ఉన్నా.. చిక్కులు వస్తాయి. ఒకసారి ఆదాయపు పన్ను పోర్టల్‌కు వెళ్లి, మీకు ఏదైనా నోటీసు వచ్చిందా చూసుకోండి.
- కేవలం రిటర్నులు దాఖలు చేసి, దాన్ని ఇ-వెరిఫై చేయకుండా వదిలేశారా? ఇలాంటప్పుడూ మీ ఐటీఆర్ ఆదాయపు పన్ను విభాగం పరిశీలనలోకి వెళ్లదు.
- అనుమానాస్పద రిటర్నులను తనిఖీ చేసేందుకు పక్కన పెడుతుంటారు. ఇలాంటి వాటిల్లో మీ రిటర్ను ఉండే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా అధిక మొత్తంలో రిఫండుకు దరఖాస్తు చేసినప్పుడు ఇలాంటివి జరుగుతుంటాయి.

నాణ్యమైన కంపెనీల్లో మదుపు

కొత్త పథకం

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా 'యాక్సిస్ నిఫ్టీ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్' అనే పథకాన్ని తీసుకొచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. నిఫ్టీ 500 క్వాలిటీ 50 టీఆర్ఐ సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ వచ్చే నెల 4. కనీస పెట్టుబడి రూ.100. నిఫ్టీ 500 జాబితా నుంచి అత్యంత నాణ్యమైన కంపెనీలను ఎంచుకొని ఈ పథకం పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేస్తారు. దీర్ఘకాలిక మదుపరులకు ఇది అనుకూలంగా ఉంటుంది. నాణ్యమైన కంపెనీలతో పోర్ట్‌ఫోలియో ఉంటుంది. కాబట్టి, రిస్కు తక్కువగా, లాభాలు పరిమితంగా ఉంటాయి.

బంగారం కొనాలంటే

ఏంజెల్ వన్ మ్యూచువల్ ఫండ్.. ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ అనే కొత్త పథకాన్ని ఆవిష్కరించింది. బంగారంపై పెట్టుబడి పెట్టి, లాభాలు ఆర్జించడం ఈ పథకం ప్రధాన వ్యూహం. ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ వచ్చే నెల 2. కనీస పెట్టుబడి రూ.1,000. దేశీయంగా గోల్డ్ ఈటీఎఫ్ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తున్న విషయం విదితమే. గత ఏడాది జులైలో గోల్డ్ ఈటీఎఫ్ పథకాల కింద ఉన్న సొమ్ము రూ.34,455 కోట్లు కాగా, ఈ ఏడాది జులై నాటికి ఇది రూ.67,634 కోట్లకు చేరింది. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలో స్థిరత్వం కోసం కొంత మొత్తాన్ని బంగారంపై పెట్టుబడి పెట్టడం మేలనేది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్ పథకాల ద్వారా సులువుగా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుంది. అలాంటి ఆలోచన ఉన్న మదుపరులు గోల్డ్ ఈటీఎఫ్ పథకాలను పరిశీలించవచ్చు.

ఈటీఎఫ్‌లలో పెట్టుబడి

మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ ఒక వినూత్న ఫండ్ పథకానికి రూపకల్పన చేసింది. మిరే అసెట్ మల్టీ ఫ్యాక్టర్ ప్యాసివ్ ఎఫ్ఓఎఫ్ (ఫండ్ ఆఫ్ ఫండ్) అనే ఈ పథకం దేశీయంగా అందుబాటులో ఉన్న ఈటీఎఫ్ మ్యూచువల్ ఫండ్ పథకాల యూనిట్లలో పెట్టుబడి పెడుతుంది. మొమెంటమ్, ఈక్వల్ వెయిట్, క్వాలిటీ, వాల్యూ... తదితర ప్రమాణాల ప్రకారం ఆయా పథకాలను ఎంచుకుంటుంది. ఏదో ఒక అంశాన్ని కాకుండా విభిన్నమైన పెట్టుబడి ప్రమాణాలను పరిశీలించి పెట్టుబడులపై నిర్ణయం తీసుకుంటారు. ఎఫ్ఎఫ్ఓ చివరి తేదీ ఈ నెల 25. కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి.

క్లెయిం వేళలో
ఇబ్బంది రాకుండా

✦ జీవిత బీమా పాలసీ కోసం ఆదాయ వివరాలు అడిగే అవకాశం ఉంది. దీన్ని బట్టి, మీకు ఎంత విలువైన పాలసీ ఇవ్వాలనే విషయంలో సంస్థలు అంచనాకు వస్తాయి. కాబట్టి, మీ ఆదాయ వివరాలు తప్పుగా చెప్పొద్దు. ఇప్పటికే వేరే బీమా సంస్థ నుంచి పాలసీ తీసుకుంటే ఆ వివరాలూ తెలపండి.

✦ ఆర్థిక వివరాలతో పాటు.. ఆరోగ్య అలవాట్లనూ పేర్కొనాలి. పొగ తాగడం, మద్యం సేవించడంలాంటి అలవాట్లు ఉంటే.. ఆ వివరాలను కచ్చితంగా చెప్పండి. మీ ఎత్తు, బరువు విషయాలనూ తెలియజేయాలి.

జీవిత బీమా.. ఆరోగ్య బీమా ఏదైనా కానీయండి.. కష్టం వచ్చినప్పుడు ఎలాంటి షరతులూ లేకుండా ఆర్థికంగా అండగా నిలబడాలి. ఏటా ప్రీమియం చెల్లిస్తూ.. అవసరంలో అక్కరకు రాకుంటే ఆ పాలసీలు ఉన్నా లేనట్లే. ఒక పాలసీ తీసుకునేప్పుడు బీమా సంస్థలను ఎంత జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటామో.. పాలసీ పత్రాలను నింపేటప్పుడూ అంతే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

కష్టకాలంలో ఆర్థికంగా ఆదుకునేది బీమా.. కానీ, అనుకోని పరిస్థితుల్లో పాలసీని క్లెయిం చేసుకోవాల్సి వస్తే.. బీమా సంస్థ దానిని ఆమోదించకుండా.. క్లెయింను తిరస్కరిస్తే.. ఎంత కష్టం. ఇలాంటి పరిస్థితి ఎదురుకాకూడదంటే.. పాలసీని తీసుకునేటప్పుడే జాగ్రత్తగా ఉండాలి...



తప్పు వివరాలు వద్దు...

ఆరోగ్య, జీవిత బీమా పాలసీలు తీసుకునేటప్పుడు దానికి సంబంధించిన ప్రీమియాన్ని నిర్ణయించేందుకు మీరు అందించిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుంటాయి. తక్కువ ప్రీమియం పడుతుందని కొందరు ఈ వివరాల్లో తప్పుడు సమాచారం ఇస్తుంటారు. పాలసీ ఇచ్చిన తర్వాత.. మీరు తెలియజేసిన సమాచారంలో తప్పులు లేకుండా పూర్తి చేయాలి. ఒక్క ఖాళీని కూడా ఉంచకూడదు. మీకు వర్తించకపోతే.. ఎన్ఏ అని రాయాలి. లేదా అక్కడ కొట్టివేయాలి. ప్రతిపాదిత పత్రాన్ని నింపిన తర్వాత దాని ఫొటోలు తీసుకోండి.

ప్రీమియం చెల్లించకుండా..

పాలసీ అమల్లో ఉన్నప్పుడు మాత్రమే దాని ద్వారా పరిహారం అందుతుంది. పాలసీ తీసుకోవడంతోనే సరిపెట్టకుండా.. దానికి సమయం మించిపోకుండా ప్రీమియం చెల్లించాలి. ఒకవేళ ప్రీమియం చెల్లించకుంటే.. పాలసీ రద్దవుతుంది. రద్దయిన పాలసీ ద్వారా క్లెయిం చేసుకోవడం సాధ్యం కాదు. సకాలంలో ప్రీమియం చెల్లించడం పాలసీదారుడిగా మన బాధ్యతే. బీమా సంస్థ ప్రీమియం చెల్లింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంపిస్తూనే ఉంటుంది. మీ మొబైల్ నంబరు, ఈమెయిల్ మారినప్పుడు ఆ సమాచారాన్ని బీమా సంస్థకు తెలియజేయండి. వీలైనంత వరకూ ప్రీమియం చెల్లింపు కోసం నేరుగా బ్యాంకు ఖాతా నుంచి వెళ్లే ఏర్పాటు చేసుకోండి. గడువు తేదీ నాటికి ప్రీమియం చెల్లించకపోయినా.. బీమా సంస్థలు 15-30 రోజులపాటు వ్యవధి ఇస్తుంటాయి. కానీ, ఇది అన్ని సందర్భాల్లో వాడుకోవద్దు. ముఖ్యంగా ఆరోగ్య బీమా విషయంలో ఒక్క రోజు కూడా ఆలస్యం చేయొద్దు.

ఆలస్యం చేస్తే..

బీమా పాలసీని క్లెయిం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవడంలో ఆలస్యం చేయకూడదు. పాలసీదారుడు మరణించిన సందర్భంలో క్లెయిం కోసం దరఖాస్తు చేసినప్పుడు బీమా సంస్థలు కొంత ప్రాథమిక సర్వే చేస్తుంటాయి. పాలసీ దరఖాస్తు చేయడంలో నామినీ ఆలస్యం చేస్తే.. ఆ క్లెయిం విషయంలో బీమా సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తాయి. ఆరోగ్య బీమా విషయంలోనూ అంతే. ఆసుపత్రిలో చేరిన 24-48 గంటల్లోగా బీమా సంస్థకు విషయాన్ని తెలియజేయాలి. లేకపోతే పరిహారం ఇవ్వడంలో ఇబ్బంది రావచ్చు. కొన్నిసార్లు ముందుగానే ప్రణాళిక వేసుకొని, ఆసుపత్రిలో చేరొచ్చు. ఇలాంటప్పుడు బీమా సంస్థకు సమాచారం ఇచ్చి, వారి నుంచి అనుమతి వచ్చాకే చికిత్స కోసం వెళ్లాలి.

ముందస్తు వ్యాధులంటే..

పాలసీ తీసుకోవడం కన్నా ముందే ఏదైనా వ్యాధులంటే పాలసీ ప్రతిపాదిత పత్రంలో పేర్కొనాలి. ముఖ్యంగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు ఇది తప్పనిసరి. నిర్ణీత వ్యవధి తర్వాత అంటే.. పాలసీ నిబంధనలను బట్టి, 2-4 ఏళ్ల తర్వాత ఈ వ్యాధుల చికిత్సకూ పరిహారం వర్తిస్తుంది. వ్యాధులు ఉన్నప్పటికీ దాచిపెట్టి పాలసీ తీసుకుంటేనే ఇబ్బంది వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో క్లెయింను తిరస్కరించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు కొన్ని యాడ్-ఆన్‌లను ఎంచుకోవడం ద్వారా ముందస్తు వ్యాధులకూ పాలసీ తీసుకున్న రోజునుంచే రక్షణ లభిస్తుంది.

సూచీ ఫండ్లు మంచివేనా?

మార్గదర్శి

నా వయసు 23. నా దగ్గర రూ.2 లక్షలు ఉన్నాయి. వీటిని కనీసం 15 ఏళ్లపాటు ఏదైనా పెట్టుబడి పథకంలో పెట్టాలని ఆలోచనతో ఉన్నాను. నిఫ్టీ 50 ఈటీఎఫ్‌లో మదుపు చేయడం మంచిదని విన్నాను. నిజమేనా? ఇది మంచిదేనా? ప్రత్యామ్నాయం ఉందా? - అఖిల్

❑ ఈక్విటీ ఆధారిత పెట్టుబడుల్లో 15 ఏళ్లపాటు కొనసాగితే మంచి రాబడి వచ్చేందుకు వీలుంది. నిఫ్టీ 50 లాంటి సూచీ ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లను ఎంచుకుంటే దేశంలోని ప్రముఖ 50 కంపెనీల్లో పెట్టుబడి పెట్టినట్లే లెక్క. నష్టభయం తక్కువగా ఉంటుంది. మీకు దీర్ఘకాలిక సమయం ఉంది కాబట్టి, నష్టభయం ఉన్న పథకాలనూ ఎంచుకోవచ్చు. రూ.1,50,000 డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయండి. మిగతా రూ.50వేలను మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్లలో జమ చేయండి. ఇలా చేయడం వల్ల నిఫ్టీ 50 ఆధారిత పెట్టుబడులతో పోలిస్తే అధిక రాబడి వచ్చే వీలుంది.

మా నాన్న పేరు మీద రూ.10లక్షల వరకూ పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాం. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో కాకుండా, ఏదైనా మంచి పథకంలో జమ చేయాలని అనుకుంటున్నాం. ఎక్కువ రాబడినిచ్చే వాటిని సూచించండి? - సుధీర్

❑ పెట్టుబడిపై కాస్త నష్టభయం ఉన్నా ఇబ్బంది లేదు అనుకుంటే ఈ మొత్తాన్ని బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, మల్టీ అసెట్ ఫండ్లలో మదుపు చేయొచ్చు. వీటిలో కొద్దిగా నష్టభయం ఉంటుంది. అయిదేళ్లపాటు మదుపు కొనసాగించాలని అనుకున్నప్పుడే వీటిని ఎంచుకోవాలి.

మా మనవరాలి పేరుమీద కొంత బంగారం కొని ఇద్దామని అనుకుంటున్నాం. నెలకు రూ.10వేల వరకూ పెట్టుబడి పెట్టగలం. 5 ఏళ్ల తర్వాత ఈ డబ్బుతో బంగారం కొని ఇవ్వాలనేది ఆలోచన. - మోహన్

❑ మూడేళ్లుగా బంగారంపై మంచి లాభాలు వచ్చాయి. చాలామంది మదుపరులు బంగారంపైన పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో వచ్చినట్లుగా భవిష్యత్తులో రాబడి వచ్చే వీలు ఉండకపోవచ్చు. మీరు బంగారం కొనాలని అనుకుంటున్నారు. అందువల్ల మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న రూ.10వేలను గోల్డ్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయండి. మీరు బంగారం కావాలనుకున్నప్పుడు డబ్బులు తీసుకొని, కొనొచ్చు. ప్రత్యామ్నాయంగా రూ.5వేలను గోల్డ్ ఫండ్లలోనూ, మరో రూ.5వేలను డైవర్సిఫైడ్ మ్యూచువల్ ఫండ్లలోనూ మదుపు చేయండి. ఈక్విటీలు బంగారంకన్నా మంచి రాబడినిస్తే, అధిక మొత్తంలో డబ్బు జమ అవుతుంది.

నా వయసు 32. పదవీ విరమణను దృష్టిలో పెట్టుకొని, ఏదైనా జీవిత బీమా పాలసీ తీసుకోవాలని అనుకుంటున్నాను. ఇది మంచి ఆలోచనేనా? నెలకు రూ.10వేల వరకూ పెట్టుబడి పెట్టగలను. ప్రణాళిక ఎలా ఉండాలి? - ఆదిత్య

❑ ముందుగా మీపైన ఆధారపడిన వారి ఆర్థిక లక్ష్యాలకు తగిన రక్షణ కల్పించాలి. ఇందుకోసం మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ ద్వారా జీవిత బీమా తీసుకోండి. పదవీ విరమణ పెట్టుబడి కోసం అగ్రెసివ్ హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు. వీటిలో ఎలాంటి లాకిన్ వ్యవధి ఉండదు. నష్టభయం ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే వీలుంటుంది. మీ పదవీ విరమణకు 28 ఏళ్ల సమయం ఉంది అనుకుంటే.. నెలకు రూ.10వేల చొప్పున 28 ఏళ్లపాటు మదుపు చేస్తే సగటు వార్షిక రాబడి 10.5 శాతం అంచనాతో రూ.1,75,69,811 అయ్యేందుకు ఆస్కారం ఉంది.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలు siri@eenadu.net కు మెయిల్ చేయండి)

కార్డులు
అప్పుల ఊబిలో చిక్కుకోకుండా

క్రెడిట్ కార్డుతో ఉన్న సౌలభ్యాలు ఎన్నో. కానీ, కాస్త క్రమశిక్షణ తప్పినా, బాధ్యతాయుతంగా ఉపయోగించకపోయినా.. తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతాయి. ఇలా కాకుండా ఉండాలంటే కొన్ని చిన్న తప్పులను నివారించాల్సిందే. అవేమిటో చూద్దామా..

అతిగా ఖర్చు చేయడం

క్రెడిట్‌కార్డు ఉన్న చాలామంది చేసే అతిపెద్ద తప్పు.. క్రెడిట్ కార్డును సొంత డబ్బుగానే భావించి ఖర్చు చేయడం. కార్డును స్వైప్ చేయడం చాలా సులభం. అనుకున్న వెంటనే కొనుగోళ్లు చేయడమూ తేలికే. ఇవి తరచూ మీ ఆర్థిక సామర్థ్యాన్ని మించితే.. కాలక్రమేణా భరించలేని బిల్లులను పేరుకుపోయేలా చేస్తుంది.

మీ నెలవారీ ఆదాయం ఆధారంగా ఖర్చులకు పరిమితిని నిర్ణయించండి. క్రెడిట్ కార్డును అదనపు డబ్బుగా భావించకుండా, కేవలం చెల్లింపులను సులభతరం చేసే ఉపకరణంగానే వాడుకోండి.

కనీస బాకీ చెల్లిస్తే

కొంతమంది బిల్లు పూర్తిగా కాకుండా కనీస మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఇది రుణ భారాన్ని పెంచుతుందే తప్ప తగ్గించదు. మిగిలిన బాకీపై వడ్డీ వేగంగా పెరుగుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ ఈ రుణం పెరుగుతుంది.

- ఎల్లప్పుడూ పూర్తి బిల్లును చెల్లించేందుకు ప్రయత్నించండి. అది సాధ్యం కాకపోతే, బిల్లు చెల్లించే వరకూ కార్డును ఉపయోగించడం మానేయండి.

రుసుములపై నిర్లక్ష్యం

క్రెడిట్ కార్డుల బాకీపై ఏడాదికి 30-40 శాతం వరకూ వడ్డీ రేట్లు ఉంటాయి. దీంతోపాటు ఆలస్య రుసుములు, జరిమానాలు ఈ భారాన్ని మరింత పెంచుతాయి.

- కార్డు షరతులను పూర్తిగా తెలుసుకోండి. క్రెడిట్ కార్డులను రివార్డు పాయింట్లు, నగదు రహిత చెల్లింపుల కోసం మాత్రమే వాడాలి. దీర్ఘకాలిక రుణం తీసుకున్నట్లుగా చూడొద్దు.

అనేక కార్డులుంటే..

ఒకటి కంటే ఎక్కువ కార్డులు ఉన్నప్పుడు ఆర్థికంగా సౌలభ్యంగానే ఉంటుంది. కానీ, వృథా ఖర్చులు పెరిగేందుకు ఇది కారణం అవుతుంది. చెల్లింపులను మర్చిపోతే అప్పును రెట్టింపు చేస్తుంది. కొందరు రివార్డుల కోసం అనేక కార్డులు తీసుకుంటారు. బిల్లింగ్ తేదీలను సరిగా గుర్తు పెట్టుకోకపోతే, క్రెడిట్ స్కోరుపైనా ప్రభావం చూపుతుంది.

- మీరు సులభంగా నిర్వహించగలిగిన సంఖ్యలోనే కార్డులను తీసుకోండి. బాకీ చెల్లించాల్సిన తేదీలను కచ్చితంగా గుర్తుంచుకోండి. లేదా మీ బ్యాంకు ఖాతాలో నుంచి నేరుగా బిల్లు చెల్లించే ఏర్పాటు చేయండి.



నగదు తీసుకుంటే

క్రెడిట్ కార్డుపై నగదు ఉపసంహరణ అత్యంత ఖరీదైన లావాదేవీ. దీనిపై వెంటనే వడ్డీని వసూలు చేస్తుంది. నగదు ఉపసంహరణ రుసుము ఉంటుంది.

- అత్యవసర పరిస్థితుల్లో, మరీ తప్పదు అనుకున్నప్పుడు మాత్రమే ఈ మార్గాన్ని ఎంచుకోవాలి. అనవసర ఖర్చుల కోసం ఈ వెసులుబాటును ఉపయోగించుకోవద్దు.

తనిఖీ చేయకుంటే

చాలామంది క్రెడిట్ కార్డు నెలవారీ స్టేట్‌మెంట్లను తనిఖీ చేయరు. ఇది పెద్ద పొరపాటు. అనధికార లావాదేవీలను గుర్తించడం కష్టమవుతుంది. మీకు సంబంధం లేని వాటికి బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది.

- నెలవారీగా వచ్చే కార్డు స్టేట్‌మెంట్లను క్షుణ్నంగా తనిఖీ చేయండి. ఖర్చులు ఏం చేశారు అన్న సమాచారంతోపాటు, ఏదైనా తప్పులున్నా సులభంగా గుర్తించేందుకు వీలవుతుంది.



శ్రీయామ్ ల్యాబ్స్‌లో లారస్ సింథసిస్ యూనిట్-1 విలీనం

పునర్వ్యవస్థీకరణకు లారస్ ల్యాబ్స్ బోర్డు ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: లారస్ ల్యాబ్స్ సబ్సిడరీ కంపెనీ అయిన లారస్ సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎల్ఎస్‌పీఎల్) పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైంది. దీనికి లారస్ ల్యాబ్స్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. లారస్ సింథసిస్‌లోని యూనిట్-1ను లారస్ ల్యాబ్స్‌కే చెందిన శ్రీయామ్ ల్యాబ్స్‌లో విలీనం చేస్తారు. లారస్ సింథసిస్‌లోని మిగిలిన వ్యాపారాన్ని మాతృ సంస్థ అయిన లారస్ ల్యాబ్స్‌లో విలీనం చేస్తారు. దీంతో వ్యాపార కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించటానికి వీలుకలుగుతుందని లారస్ ల్యాబ్స్ వివరించింది. ఈ పునర్వ్యవస్థీకరణ వల్ల లారస్ ల్యాబ్స్‌లో వాటాలు, వాటాదార్ల తీరుతెన్నుల్లో(షేర్‌హోల్డింగ్ పాటర్న్) ఎటువంటి మార్పులు ఉండవని లారస్ ల్యాబ్స్ పేర్కొంది.

రూ.1,395 కోట్ల విలువైన షేర్లు విక్రయించనున్న 'అపోలో' ప్రమోటర్ సునీతారెడ్డి?



ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్లలో ఒకరైన సునీతా రెడ్డి రూ.1,395 కోట్ల విలువైన అపోలో హాస్పిటల్స్ షేర్లు విక్రయించనున్నారు. ఈ షేర్లు అపోలో హాస్పిటల్స్ జారీ మూలధనంలో 1.25 శాతం వాటాకు సమానం. ఒక్కో షేరును రూ.7,747 ధరకు విక్రయించనున్నట్లు తెలుస్తోంది. ఈ లావాదేవీకి మోర్గాన్ స్టాన్లీ బ్రోకింగ్ సంస్థగా వ్యవహరించనున్నట్లు సమాచారం. స్టాక్‌మార్కెట్లో బల్క్‌డీల్ పద్ధతిలో ఈ లావాదేవీని నిర్వహిస్తారని తెలుస్తోంది. ఈ షేర్ల కొనుగోలుదార్ల వివరాలు వెల్లడికాలేదు. అపోలో హాస్పిటల్స్‌లో సునీతా రెడ్డికి ప్రస్తుతం 3.36 శాతం వాటా ఉంది. షేర్ల విక్రయం తర్వాత ఆమె వాటా 2.11 శాతానికి తగ్గిపోతుంది. అపోలో హాస్పిటల్స్ షేరు గురువారం బీఎస్ఈలో రూ.7925 ముగింపు ధర పలికింది. గరిష్ఠ ధర రూ.7946 కాగా, కనిష్ఠ ధర రూ.7850 నమోదైంది.

పసిడి 3,600 డాలర్లకు చేరొచ్చు

వెంచురా సెక్యూరిటీస్ అంచనా

కోడి గుడ్లు

22న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (౧౦౦కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	525
గోదావరి	520
విశాఖపట్నం	520
చిత్తూరు	553

దిల్లీ: అంతర్జాతీయ విపణిలో డిసెంబరు నాటికి పసిడి ఔన్సు(31.1 గ్రాములు) ధర 3,600 డాలర్ల (సుమారు రూ.3.13 లక్షలు)కు చేరొచ్చని వెంచురా సెక్యూరిటీస్ అంచనా వేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సవాళ్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటివి పసిడి ధర పెరిగేందుకు దోహదపడతాయని పేర్కొంది. ఆగస్టు 7న గోల్డ్ ఫ్యూచర్స్ 3,534.10 డాలర్లను తాకిన సంగతి తెలిసిందే. దేశీయంగా ఎంసీఎక్స్‌లో అక్టోబరు పసిడి ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రికార్డు స్థాయిలో రూ.1,02,250గా (ఆగస్టు 8న) నమోదైన విషయం విదితమే.

2.5 లక్షల కొత్త ఉద్యోగాలు

- 2030 నాటికి బీఎఫ్ఎస్ఐ రంగంలో
- అడెక్కో ఇండియా నివేదిక

ముంబయి: దేశీయ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగంలో 2030 నాటికి కొత్తగా 2.5 లక్షల శాశ్వత ఉద్యోగాలు లభిస్తాయని వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అడెక్కో నివేదిక వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 8.7 శాతం వృద్ధి నమోదు అయ్యే అవకాశం ఉండగా, 2030కి 10 శాతానికి చేరొచ్చని పేర్కొంది. బీఎఫ్ఎస్ఐ రంగంలో వృద్ధికి రెండో, మూడో అంచె నగరాల్లో ఈ రంగాలకు పెరుగుతున్న గిరాకీ కారణమవుతుందని వివరించింది. నివేదిక ప్రకారం..

✦ బీఎఫ్ఎస్ఐ రంగంలో నైపుణ్య గిరాకీకి మన దేశం శక్తిమంతమైన ఇంజిన్‌గా అభివృద్ధి చెందుతోంది. సుమారు 48 శాతం కొత్త ఉద్యోగాలు ఇప్పుడు రెండో, మూడో అంచె నగరాల నుంచే కనిపిస్తున్నాయి.

✦ 2024-25 తొలి అర్ధభాగంలో నియామక కార్యకలాపాలు అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24) ఇదే కాలంతో పోలిస్తే 27 శాతం పెరిగాయి. ఇది బలమైన వృద్ధిని సూచిస్తోంది.

✦ స్థానిక భాషా ప్రావీణ్యం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే అభ్యర్థులు ఇప్పుడు 2.5 రెట్లు ఎక్కువగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. 10-15 శాతం అధిక వేతనం కూడా లభిస్తుంది.

✦ భారత కుటుంబాలు సంప్రదాయ ఆస్తుల నుంచి యులిప్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, పింఛన్ ఉత్పత్తులు



వంటి మార్కెట్ అనుసంధానిత సాధనాలకు మారుతున్నందున, ఈ రంగంలో ప్రతిభకు గిరాకీ పెరుగుతోంది.

✦ ఈ ఏడాది సంప్రదాయ బీఎఫ్ఎస్ఐ నియామకాల్లో సేల్స్, రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్‌లు, డిజిటల్ ప్రోడక్ట్ మేనేజర్లు, క్రెడిట్ రిస్క్ అనలిస్టులను బ్యాంకులు ఎక్కువగా నియమించుకుంటున్నాయి.

✦ వెల్త్, బీమా సంస్థలు ఆర్థిక ప్రణాళికాదార్లు (ఫైనాన్షియల్ ప్లానర్లు), పెట్టుబడి సలహాదార్లు, డిజిటల్ అండర్‌రైటర్లు, క్లెయిమ్ ఆటోమేషన్ నిపుణుల కోసం ఎక్కువగా చూస్తున్నాయి. ఇండోర్, కోయంబత్తూర్, నాగ్‌పుర్, గువాహటి వంటి మార్కెట్లలో నియామకాలు 15-18 శాతం పెరిగాయి. సూరత్, జైపుర్, లఖ్‌నవూ, భువనేశ్వర్‌లలో 11-13 శాతం పెరుగుదల కనిపించింది.

✦ నమ్మకమైన మార్కెట్ పరిశోధన వర్గాలు, 100కు పైగా క్లయింట్ల నుంచి డేటాను సమీకరించి అడెక్కో గ్రూప్ ఈ నివేదికను రూపొందించింది. గ్లోబల్ టాలెంట్ సొల్యూషన్లను అందించే సంస్థగా అడెక్కో గ్రూప్‌నకు పేరుంది.

2032 కల్లా 135 బి. డాలర్లకు బీఎఫ్ఎస్ఐ జీసీసీ రంగం

బీఎఫ్ఎస్ఐకి సంబంధించిన గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీలు) వేగంగా విస్తరిస్తున్నాయని క్వెస్ కార్ప్ రూపొందించిన 'బీఎఫ్ఎస్ఐ జీసీసీ టాలెంట్ రిపోర్ట్ 2025' తెలిపింది. అయితే ఈ రంగంలో ప్రతిభావంతుల కొరత ఉండటం, నైపుణ్య అంతరాలతో సంస్థలకు నియామక వ్యయాలు పెరుగుతున్నాయని పేర్కొంది. మొత్తం నియామక గిరాకీలో ప్రథమ శ్రేణి నగరాల నుంచే 88 శాతం లభిస్తుండగా.. జైపుర, విశాఖపట్నం, కోచి వంటివి బలమైన వర్ధమాన నియామక కేంద్రాలుగా మారుతున్నాయని నివేదిక తెలిపింది. ఇండోర్, కోయంబత్తూర్ వంటి నగరాల్లో నియామకాలు స్థిరంగా ఉంటున్నాయని వెల్లడించింది. భారత బీఎఫ్ఎస్ఐ జీసీసీ రంగం 2023లో 40-41 బిలియన్ డాలర్ల విలువ కలిగి ఉండగా, 2032 నాటికి 12-13 శాతం వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు (సీఏజీఆర్)తో 125-135 బి.డాలర్లకు చేరే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.

✦ ప్రస్తుతం సుమారు 190 బీఎఫ్ఎస్ఐ జీసీసీలకు మన దేశం నిలయమని, 5,40,000 మంది నిపుణులను ఈ రంగంలోని జీసీసీలు నియమించుకుంటాయని, మొత్తం జీసీసీ నియామకాల్లో ఇది నాలుగో వంతని వివరించింది.

కార్వీ స్టాక్ బ్రోకింగ్ ఖాతాదార్లకు సెబీ వెసులుబాటు

క్లెయిమ్‌ల దాఖలు గడువు పొడిగింపు

దిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) ఖాతాదార్లు తమ క్లెయిములను దాఖలు చేయటానికి నిర్దేశించిన గడువును సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) పొడిగించింది. ఎంతో మంది ఖాతాదార్లకు చెందిన షేర్లు, నిధులు వాడుకొని తిరిగి ఇవ్వకపోవడంతో కార్వీ స్టాక్ బ్రోకింగ్‌ను నవంబరు 23, 2020న ఎన్ఎస్ఈ ఎగవేతదారుగా ప్రకటించింది. తదనంతర పరిణామాల్లో జూన్ 2, 2025 వరకు ఖాతాదార్లు క్లెయిములు దరఖాస్తు చేసుకోవడానికి సెబీ సమయం ఇచ్చింది. తాజాగా ఈ గడువును డిసెంబరు 31వ తేదీ వరకూ పొడిగించింది. దీనికి సంబంధించిన అదనపు వివరాల కోసం టోల్-ఫ్రీ నెంబరు: 18002660050 కు కాల్ చేయవచ్చని లేదా defaultisc@nse.co.in అనే ఇమెయిల్ ఐడీకి మెయిల్ చేయవచ్చని సెబీ వివరించింది.

✦ **రూ.5,000 కోట్ల సమీకరణలో జీఎమ్ఆర్ ఎయిర్‌పోర్ట్స్:** ఈక్విటీ షేర్లు, మార్పిడి రహిత డిబెంచర్లు(ఎన్‌సీడీ) సహా వివిధ సెక్యూరిటీల జారీ ద్వారా రూ.5,000 కోట్లను సమీకరించే ప్రతిపాదనకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

ఇక 'గ్రే మార్కెట్' ఆటలు సాగవా!

- సెబీ నియంత్రణలో అన్‌లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్
- 'ప్రి-ఐపీఓ' ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చే అవకాశం
- సెబీ ఛైర్‌పర్సన్ పాండే సంకేతాలు

ముంబయి: తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) పూర్తయ్యాక.. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీ షేర్లు నమోదవ్వడానికి (లిస్టింగ్) ముందు అన్‌లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్‌ను నిర్వహించేందుకు సెబీ నియంత్రణలో ఒక ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐపీఓ ముగిసిన తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లు నమోదవ్వడానికి కనీసం మూడు రోజుల వ్యవధి ఉంటోంది. అయితే ఈ మూడు రోజుల సమయంలో ఆయా కంపెనీల అన్‌లిస్టెడ్ షేర్లను సెబీ నియంత్రణ పరిధిలో లేని ప్లాట్‌ఫామ్‌లపై ట్రేడింగ్ జరుపుతున్నారు. దీనినే గ్రే మార్కెట్‌గా వ్యవహరిస్తారు. ఇలాంటి నియంత్రణ లేని ప్లాట్‌ఫామ్‌లపై ట్రేడింగ్ ద్వారా పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటే మదుపర్లకు నష్టముప్పు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని నివారించే ఉద్దేశంతోనే తమ నియంత్రణలో ప్రి- ఐపీఓ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ను తేవాలని అనుకుంటున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే సంకేతమిచ్చారు. దీని వల్ల అనియంత్రిత ప్లాట్‌ఫామ్‌లపై ట్రేడింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. అయితే ప్రి-ఐపీఓ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌పై డిపాజిటరీలతో చర్చించారా? అని అడగ్గా.. కేవలం సూత్రప్రాయంగానే మీకు ఈ వివరాలను వెల్లడిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.



డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ సమయం పెంపుపై చర్చిస్తున్నాం: ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్ కార్యకలాపాలను తగ్గించేందుకు మరిన్ని చర్యలు చేపట్టే యోచనలో ఉన్నట్లు పాండే తెలిపారు. డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు తీరిపోయే సమయాన్ని (ఎక్స్‌పైరీ) క్రమక్రమంగా పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో 91 శాతం మంది నష్టాలను చవిచూసినట్లు సెబీ గణాంకాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు సమయం పెంపును దశలవారీగా అమల్లోకి తెచ్చే అంశంపై సంబంధిత వర్గాలతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

✦ డెరివేటివ్స్‌పై వ్యాఖ్యల నేపథ్యంలోఎన్ఎస్ఈలో బీఎస్ఈ షేరు 7.7% నష్టపోయి రూ.2,330.10 వద్ద, ఏంజెల్ వన్ షేరు 6.4% నష్టంతో రూ.2,546.10 వద్ద ముగిశాయి.

రక్షణ ఉత్పత్తుల రంగంలోకి బొండాడ ఇంజినీరింగ్

ఈనాడు, హైదరాబాద్: బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ రక్షణ ఉత్పత్తుల రంగంలోకి అడుగుపెడుతోంది. దీనికోసం ప్రత్యేకంగా బొండాడ డైనమిక్స్ లిమిటెడ్ అనే సబ్సిడరీ కంపెనీని ఏర్పాటు చేసింది. రక్షణ ఉత్పత్తుల విభాగంలో క్రియాశీలక పాత్ర పోషించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బొండాడ ఇంజినీరింగ్ సీఎండీ బి.రాఘవేంద్ర రావు వివరించారు.

అబాట్ నుంచి గ్లూకోజు శాతం తెలుసుకునే పరికరం

దిల్లీ: రక్తంలో గ్లూకోజు శాతం ఎంత ఉందో స్మార్ట్‌ఫోన్లోనే చూసుకోవాలని అనుకుంటున్నారా...? దీనికి ఒక ఎలక్ట్రానిక్ పరికరాన్ని అబాట్ లిమిటెడ్ విడుదల చేసింది. లిబ్రే 2 ప్లస్ అనే సెన్సార్ డివైజ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానిస్తే ప్రతి నిమిషానికోసారి గ్లూకోజు శాతాన్ని తెలుసుకోవచ్చు. షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అబాట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. లిబ్రే 2 ప్లస్‌తో షుగర్ వ్యాధిని సమర్థంగా ఎదుర్కొనవచ్చని అబాట్ రీజినల్ మెడికల్ డైరెక్టర్ కెన్నెత్ లీ వివరించారు.

విప్రో చేతికి హార్మన్ డీటీఎస్ వ్యాపారం

దిల్లీ: శామ్‌సంగ్ సంస్థ హార్మన్‌కు చెందిన డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్ (డీటీఎస్) వ్యాపార విభాగంలో 100 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు డెఫినిటివ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఐటీ సంస్థ విప్రో ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ 375 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,270 కోట్లు). ఒప్పందంలో భాగంగా అమెరికా, ఐరోపా, ఆసియాలో పనిచేస్తున్న 5,600 మంది డీటీఎస్ ఉద్యోగులు.. విప్రోకు బదిలీ కానున్నారు. ఈ లావాదేవీ డిసెంబరు 31కి పూర్తయ్యే అవకాశం ఉంది.

టీవీఎస్ నుంచి త్రిచక్ర విద్యుత్ వాహనం



దిల్లీ: సరకు రవాణా విభాగంలో కొత్త త్రిచక్ర వాహనాన్ని టీవీఎస్ తీసుకొచ్చింది. కింగ్ కార్గో హెచ్‌డీగా వ్యవహరించే దీని ధర రూ.3.85 లక్షలు (ఎక్స్‌షోరూం). తొలుత దీనిని దిల్లీ-ఎన్‌సీఆర్‌లో విడుదల చేయనుంది. ఒక్కసారి ఛార్జింగ్‌తో 156 కి.మీలు ప్రయాణిస్తుందని కంపెనీ చెబుతోంది.

బీఎస్ఎన్ఎల్‌కు రూ.6,982 కోట్ల మూలధన సాయం

దిల్లీ: దేశవ్యాప్తంగా 4జీ నెట్‌వర్క్ సేవలను ప్రారంభించేందుకు ప్రస్తుత సంవత్సరంలో బీఎస్ఎన్ఎల్‌కు అదనంగా రూ.6,982 కోట్ల మూలధన సాయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు పలు విడతల్లో ఇచ్చిన రూ.3.22 లక్షల కోట్లకు ఇది అదనమని రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర టెలికాం శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మూలధన సాయం ప్యాకేజీ కింద నిధులు ఇవ్వడం వల్లే 2020-21 నుంచి నిర్వహణ లాభాలను బీఎస్ఎన్ఎల్ నమోదు చేస్తోందని తెలిపారు. 2024-25 చివరి రెండు త్రైమాసికాల్లో వరుసగా రూ.262 కోట్లు; రూ.280 కోట్లను బీఎస్ఎన్ఎల్ ఆర్జించిందని మంత్రి వెల్లడించారు.


ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఐడీబీఐలో వాటా విక్రయం పూర్తి

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయ ప్రక్రియను పూర్తి చేస్తామనే ఆశాభావాన్ని దీపమ్ కార్యదర్శి అరుణీశ్ చావ్లా వ్యక్తం చేశారు. అర్హులైన బిడ్డర్లకు సంబంధించి సందేహాల నివృత్తి, వివరాల పరిశీలన దాదాపుగా పూర్తికావొచ్చిందని చెప్పారు. ఈ ఏడాది చివరి కల్లా వాటా విక్రయం పూర్తవుతుందని అనుకుంటున్నట్లు తెలిపారు.

తెలంగాణలో బీమాపై అవగాహన ఎక్కువే

ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ

ఈనాడు, హైదరాబాద్: దేశంలో బీమా పాలసీలపై అవగాహన ఎలా ఉందని నిర్వహించిన అధ్యయనంలో తెలంగాణ ముందంజలో ఉంది. ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ (ఐఏసీ-లైఫ్), ఐఎంఆర్‌బీ కాంతార్ సంయుక్తంగా దీన్ని నిర్వహించాయి. దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనపై ఆలోచనలు ఉన్న ప్రాంతంగా తెలంగాణను గుర్తించింది. 'అన్నింటికన్నా ముందు బీమా'ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఐఏసీ-లైఫ్ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తెలంగాణలో 38 శాతం మంది రాబోయే మూడు నెలల్లో జీవిత బీమా పాలసీలను తీసుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. 78 శాతం మందికి బీమాలో పొదుపు పథకాల గురించి అవగాహన ఉంది. పిల్లల బీమా పాలసీల గురించి 54 శాతం మందికి తెలుసు. 87 శాతం మంది హామీతో కూడిన నెలవారీ ఆదాయాన్నిచ్చే పథకాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారని అధ్యయనం తెలిపింది. జీవిత బీమా పాలసీలను దీర్ఘకాలిక సంపద సృష్టికి ఒక సాధనంగా చూస్తున్నారని ఐఏసీ-లైఫ్ కో-ఛైర్‌పర్సన్, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ వెంకటాచలం అన్నారు. దేశంలో 2047 నాటికి అందరికీ బీమా అందించాలనే ఐఆర్‌డీఏఐ లక్ష్యానికి అనుగుణంగా బీమా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ఇందుకోసం వినూత్న ఆవిష్కరణలతో కొత్త పాలసీలను తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు.


వెంకటాచలం

ఆస్తుల నగదీకరణతో ప్రభుత్వానికి రూ.1.43 లక్షల కోట్లు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



దిల్లీ: ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ మార్గాల్లో ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.1,42,758 కోట్లను సమీకరించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభకు గురువారం లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఆస్తుల నగదీకరణ లక్ష్యం రూ.30,000 కోట్లుగా అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రహదారి ఆస్తులను 3 మార్గాల్లో నగదీకరిస్తుంటుంది. టోల్ నిర్వహణ, బదిలీ (టీఓటీ), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్), సెక్యూరిటైజేషన్ పద్ధతుల్లో నగదీకరణ కొనసాగుతుంటుంది.

✦ 2024 మార్చి నుంచి 6 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభించిన రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం ప్రయోగాత్మక ప్రాజెక్టులో 2025 జులై 31 వరకు 4,971 మంది బాధితులకు చికిత్స అందిందని మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల్లో బాధితుడు రూ.1.5 లక్షల వరకు దేశవ్యాప్తంగా ఏదైనా ఎంపిక చేసిన ఆసుపత్రిలో చికిత్స పొందే సదుపాయం ఉంది.

జూన్‌లో కొత్త సభ్యులు 19.37 లక్షలు: ఈఎస్ఐసీ

దిల్లీ: ఈ ఏడాది జూన్‌లో కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) పథకంలోకి దాదాపు 19.37 లక్షల మంది కొత్త సభ్యులు చేరారు. ఈఎస్ఐ పథకంలోకి 34,762 కొత్త సంస్థలు వచ్చి చేరాయని కార్మిక శాఖ వెల్లడించింది. కొత్తగా చేరిన 19.37 లక్షల మందిలో 25 ఏళ్లలోపు వారు 9.58 లక్షలు (మొత్తం రిజిస్ట్రేషన్లలో 49.50%)గా ఉన్నారు. జూన్‌లో మహిళా సభ్యులు నికరంగా 4.13 లక్షల మంది చేరారు. ట్రాన్స్‌జెండర్ ఉద్యోగుల సంఖ్య 87గా ఉంది.

ర్యాపిడోపై రూ.10 లక్షల జరిమానా

దిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వడం, అనైతిక వ్యాపార పద్ధతులు పాటించినందుకు ర్యాపిడోపై రూ.10 లక్షల జరిమానాను సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) విధించింది. '5 నిమిషాల్లో ఆటో లేదా రూ.50 పొందండి' అని కంపెనీ ఇచ్చిన ప్రకటనపై దర్యాప్తు చేసిన సంస్థ, ఇందులో ఎటువంటి నిజం లేదని కనుగొంది. హామీగా ఇచ్చిన విధంగా పరిహారాన్ని ఇవ్వకపోవడంతో, వినియోగదారులకు ఆ మొత్తాన్ని చెల్లించాల్సిందిగా సీసీపీఏ ఆదేశించింది.

వేదాంతా రూ.16 మధ్యంతర డివిడెండ్

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.16 చెల్లించేందుకు బోర్డు ఆమోదం ఇచ్చిందని వేదాంతా గురువారం ప్రకటించింది. డివిడెండ్ కింద కంపెనీ రూ.6,256 కోట్లు ఖర్చుచేయనుంది. ఇందుకు రికార్డు తేదీగా ఆగస్టు 27ను నిర్ణయించింది. ఈ ఏడాదిలో జూన్‌లో సంస్థ రూ.7 మొదటి మధ్యంతర డివిడెండ్‌ను ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఒక్కో షేరుకు కంపెనీ మొత్తం డివిడెండ్ రూ.43.50గా ఉంది.

ఎయిరిండియా, ఏఐ ఎక్స్‌ప్రెస్‌కు రూ.9,568 కోట్ల నష్టం



దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) చివరకు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లు రూ.9,568.4 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు పౌరవిమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌లు వరుసగా రూ.1,983.4 కోట్లు, రూ.58.1 కోట్ల నష్టాన్ని నమోదుచేసినట్లు తెలిపింది. అయితే ఇండిగో మాత్రం రూ.7,587.5 కోట్ల లాభాన్ని గడించిందని స్పష్టం చేసింది. గురువారం విమానయానశాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను వెల్లడించారు.

2025-26లో వృద్ధి రేటు 6.3%

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

దిల్లీ: మన దేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో 6.3 శాతంగా నమోదు కావొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనా వేసిన 6.5 శాతం కంటే ఇది తక్కువ కావడం గమనార్హం. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి 6.8-7 శాతం మధ్య నమోదు కావొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 6.5 శాతం, అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 6.3 శాతం, జనవరి-మార్చి త్రైమాసికంలో 6.1 శాతంగా వృద్ధి నమోదు కావొచ్చని పేర్కొంది. ఆర్‌బీఐ అంచనాలు మాత్రం వరుసగా 6.5%, 6.7%, 6.6%, 6.3 శాతంగా ఉన్నాయి.

ఆరో రోజూ సూచీలకు లాభాలే

సెన్సెక్స్ ▲ 143 — 82001

నిఫ్టీ ▲ 33 — 25084

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.1,247 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.2,546 కోట్లు

ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో వరుసగా ఆరో రోజూ దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఔషధ, స్థిరాస్తి, ఫైనాన్స్ షేర్లు పరుగులు తీయగా, ఎఫ్ఎమ్‌సీజీ, ఇంధన, వాహన షేర్లకు లాభాల స్వీకరణ ఎదురైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 18 పైసలు తగ్గి 87.25 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడి చమురు 0.90% లాభంతో 67.44 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా, షాంఘై లాభపడగా.. టోక్యో, హాంకాంగ్ నష్టపోయాయి. ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.10,000 కోట్లు పెరిగి రూ.456.27 లక్షల కోట్లు (5.25 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 363 పాయింట్ల (క్రితం ముగింపు 81,857.84) లాభంతో 82,220.46 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ, 82,231.17 వద్ద గరిష్ఠాన్ని, 81,921.22 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 142.87 పాయింట్ల లాభంతో 82,000.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.20 పాయింట్లు పెరిగి 25,083.75 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,054.90- 25,153.65 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ ఆన్‌లైన్ మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ తీసుకొచ్చిన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడంతో నజారా టెక్నాలజీస్ మరో 1.31% నష్టపోయి రూ.1205.60 వద్ద ముగిసింది. గత రెండు రోజుల్లో షేరు 14% డీలాపడింది.



✦ సెన్సెక్స్ 30 షేర్లలో 14 పెరిగాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 1.12%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.09%, బజాజ్ ఫైనాన్స్ 0.90%, రిలయన్స్ 0.86%, ఎల్ అండ్ టీ 0.76% లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ 1.51%, ఎటెర్నల్ 1.47%, హెచ్‌యూఎల్ 1.08%, అదానీ పోర్ట్స్ 0.95%, ఎన్‌టీపీసీ 0.91% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి, పరిశ్రమలు, చమురు-గ్యాస్, ఆర్థిక సేవలు 0.61% వరకు పెరిగాయి. విద్యుత్, కమొడిటీస్, వినియోగ, ఎఫ్ఎమ్‌సీజీ, యుటిలిటీస్, వాహన నీరసించాయి.

✦ గ్లోబల్ మార్కెట్ ఇన్‌సైట్స్ ఐటీ సర్వీసెస్ (జీఎంఐటీ)లో 51 శాతం వాటాను రూ.8.5 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సెల్విన్ ట్రేడర్స్ తెలిపింది.

✦ జులైతో ముగిసిన త్రైమాసికంలో వాల్‌మార్ట్ ఇంక్, 7.03 బిలియన్ డాలర్ల లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం 4.50 బి.డాలర్లుగా ఉంది. షేరుపై లాభం 56 సెంట్ల నుంచి 88 సెంట్లకు పెరిగింది. అమ్మకాలు దాదాపు 5 శాతం పెరిగి 177.40 బి.డాలర్లకు చేరింది.

✦ ఫాక్స్‌కాన్ ఇండియా హెడ్ వీ లీని అంతర్జాతీయ స్థానానికి పదోన్నతి కల్పించింది. భారత కార్యకలాపాల హెడ్‌గా రాబర్ట్ వూ నియమితులయ్యారు.

✦ హెచ్‌యూఎల్ సీఎఫ్ఓ రితేశ్ తివారీ, మాతృసంస్థ యునిలీవర్ గ్లోబల్ హెడ్ (ఎం అండ్ ఏ, ట్రెజరీ)గా బదిలీ అయ్యారు.

భారత్‌లో అమెరికా సంస్థ పెట్టుబడి

వచ్చే మూడేళ్లలో భారత్‌లో 2.25 బిలియన్ డాలర్ల (సుమారు రూ.19,600 కోట్ల) పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అమెరికాకు చెందిన ఐటీ సంస్థ కిండ్రిల్ వెల్లడించింది. కృత్రిమ మేధ (ఏఐ) ల్యాబొరేటరీ ఏర్పాటుతో పాటు ఫ్యూచర్-రెడీ టాలెంట్‌ను అభివృద్ధి చేయడానికి ఈ నిధులు వెచ్చించనుంది. ప్రధాని నరేంద్ర మోదీతో సంస్థ ఛైర్మన్, సీఈఓ మార్టిన్ స్కారోటర్ సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడడం విశేషం.

ఐపీఓ సమాచారం

✦ విక్రమ్ సోలార్ ఐపీఓ చివరి రోజు 54.63 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 4,53,61,650 షేర్లను జారీ చేయగా, 2,47,81,57,740 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 142.79 రెట్లు, ఎన్ఐఐల నుంచి 50.90 రెట్లు, రిటైల్ విభాగంలో 7.65 రెట్ల స్పందన వచ్చింది.

✦ శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఐపీఓ చివరి రోజు 58.10 రెట్ల స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా 1,14,08,600 షేర్లను ఆఫర్ చేయగా, 66,27,99,002 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 110.41 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 72.70 రెట్లు, రిటైల్ మదుపర్ల నుంచి 21.94 రెట్ల స్పందన దక్కింది.

✦ జెమ్ ఆరోమాటిక్స్ ఐపీఓ చివరి రోజు 30.27 రెట్ల స్పందన వచ్చింది. ఇష్యూలో భాగంగా 97,82,363 షేర్లను ఆఫర్ చేయగా, 29,61,15202 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 55.28 రెట్లు, ఎన్ఐఐల నుంచి 45.06 రెట్లు, రిటైల్ మదుపర్ల నుంచి 10.31 రెట్ల స్పందన లభించింది.

✦ పటేల్ రిటెయిల్ ఐపీఓ చివరి రోజు 95.70 రెట్ల స్పందన కనిపించింది. ఇష్యూలో భాగంగా 78,15,612 షేర్లను జారీ చేయగా, 74,79,89,402 షేర్లకు బిడ్లు వచ్చాయి. క్యూఐబీ విభాగంలో 272.43 రెట్లు, ఎన్ఐఐల నుంచి 108.17 రెట్లు, రిటైల్ విభాగంలో 42.49 రెట్ల స్పందన దక్కింది.

✦ మంగళ్ ఎలక్ట్రికల్ ఐపీఓ రెండో రోజు 1.98 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 52,53,301 షేర్లను జారీ చేయగా, 1,03,81,202 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి.

ఈనాడు సినిమా

ఆ యుద్ధాన్ని ఆపే లోక రక్షకుడు


చిరంజీవి




ఈటీవీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఛానెల్స్‌లో నేడు ప్రసారం

సినిమా ఎవల్యూషన్‌లో ఆయన రెక్కవిప్పిన రెవల్యూషన్. ఫైట్లలో సాహసానికి మారు పేరు. డ్యాన్స్‌లో కొత్తదనానికి మరో పేరు. బాక్సాఫీస్ హిట్లకు పెట్టింది పేరు. అఖిలాంధ్ర ప్రేక్షకులకు ఆరాధ్యుడు. సెల్యులాయిడ్ కర్షకుడు. అభిమాన లోకానికి ఆకర్షకుడు. చిరంజీవి జీవితం ఓ చరిత్ర. ఓ పాఠం.. ఓ అధ్యాయం.. ఓ అధ్యయనం.. ఓ విశ్వవిద్యాలయం. మేనరిజానికి గ్లామర్.. హీరోయిజానికి గ్రామర్. మాస్-క్లాస్‌ల కలబోత. డిక్షన్‌లో.. యాక్షన్‌లో నవ్యత. ప్రయోగాలలో ప్రత్యేకత. టాలీవుడ్ లెజెండ్. స్టైల్‌కు, స్మైల్‌కు కేరాఫ్ అడ్రస్, స్టార్‌డమ్‌కు పర్మినెంట్ అడ్రస్.. మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు సందర్భంగా ఈటీవీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఛానెల్స్‌లో ఈ నెల 22న ఉదయం 8.30గంటలకు, సాయంత్రం 4.30గం. లకు "టాలీవుడ్ గాడ్‌ఫాదర్' చిరంజీవి @70 ప్రత్యేక కార్యక్రమాన్ని చూసి ఆనందించండి.

"ఒక చందమామ కథలా సాగిపోయే అద్భుత చిత్రం 'విశ్వంభర'. ఇది చిన్నా.. పెద్ద అందర్నీ అలరిస్తుంది" అన్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వశిష్ఠ తెరకెక్కిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష కథానాయిక. ఆషికా రంగనాథన్, కునాల్ కపూర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది వేసవికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈరోజు చిరు పుట్టినరోజు నేపథ్యంలో గురువారం ఈ చిత్రం నుంచి మెగా బ్లాస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. "ఒకరి స్వార్థం యుద్ధంగా మారి అంతులేని భయాన్నిచ్చింది. అంతకు మించిన మరణ శాసనాన్ని రాసింది. కొన ఊపిరితో బతికున్న ఓ సమూహం తాలూకూ నమ్మకం.. అలసిపోని ఆశయానికి ఊపిరిపోసేవాడు వస్తాడని. ఆగని యుద్ధాన్ని యుగాల పాటు పిడికిలి బిగించి చెప్పుకునేలా గొప్పగా ఎదురు చూసింది" అంటూ ఓ శక్తిమంతమైన వాయిస్ ఓవర్‌తో సాగిన ఈ గ్లింప్స్‌తో విశ్వంభర ప్రపంచాన్ని, కథను ఆసక్తికరంగా పరిచయం చేశారు. ఇది విభిన్న లోకాల్లో సాగే కథ. వాటిని.. అందులోని పాత్రల్ని, అక్కడుండే చిత్రమైన జీవుల్ని... అన్నింటినీ విజువల్‌గా చూపిన విధానం అలరించింది. ఆఖర్లో ఓ పెద్ద కనుగుడ్డును చేతిలో పట్టుకుని చిరు ఓ రక్షకుడిలా పరిచయమైన తీరు ఆకర్షణగా నిలిచింది. ఈ గ్లింప్స్‌కు ముందు చిరంజీవి ఈ సినిమా గురించి ఓ ప్రత్యేక వీడియో పంచుకున్నారు. "ఈ సినిమా విడుదల జాప్యానికి సముచితమైన కారణముంది. ఈ చిత్ర ద్వితీయార్ధమంతా గ్రాఫిక్స్‌పై ఆధారపడి ఉంది. దాన్ని అత్యున్నత ప్రమాణాలతో బెస్ట్ క్వాలిటీలో ప్రేక్షకులకు అందివ్వాలన్నదే దర్శక నిర్మాతల ప్రయత్నం. ఎలాంటి విమర్శకులకు తావివ్వకుండా శ్రద్ధాశక్తులతో తీసుకుంటున్న సముచితమైన సమయమిది" అని చిరు ఆ వీడియోలో పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతమందిస్తున్నారు.

నవంబరులో ఆంధ్ర కింగ్ తాలూకా

'ఆంధ్ర కింగ్ తాలూకా' అంటూ సినీప్రియుల్ని పలకరించనున్నారు రామ్ పోతినేని. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా నవంబరు 28న థియేటర్లలోకి రానున్నట్లు గురువారం ప్రకటించారు. "ఇదొక వినూత్నమైన కథతో ప్రేక్షకులకు ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. రామ్ ఇందులో సాగర్ అనే పాత్రలో అలరించనున్నారు. అతను అభిమానించే సూపర్‌స్టార్ హీరో పాత్రలో ఉపేంద్ర కనువిందు చేయనున్నారు. వినోదం, ప్రేమ, యాక్షన్ అంశాల మేళవింపుతో పక్కా కమర్షియల్ చిత్రంలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: వివేక్ - మెర్విన్, ఛాయాగ్రహణం: సిద్ధార్థ నుని.


రామ్

కీర్తి.. కొత్తగా మరొకటి


కీర్తి సురేశ్

కీర్తి సురేశ్ తెలుగులో కొత్త కబురు వినిపించి రెండేళ్లు దాటిపోయింది. త్వరలో రెండు కొత్త చిత్రాల్ని ప్రకటించనున్నట్లు ఆ మధ్య తెలియజేసినా దేనిపైనా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ఇప్పుడామె తమిళంలోనే కొత్తగా మరో సినిమాకి సంతకాలు చేసినట్లు తెలిసింది. డ్రమ్ స్టిక్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రంతో ఓ కొత్త దర్శకుడు తెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ఈ నాయికా ప్రాధాన్య చిత్రంలో దర్శకుడు మిస్కిన్ ఓ ప్రధాన పాత్ర పోషించనున్నారని తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ప్రస్తుతం కీర్తి తమిళంలో నటించిన 'రివాల్వర్ రీటా' విడుదలకు సిద్ధమవుతుండగా.. 'కన్నివెడి' చిత్రీకరణ దశలో ఉంది.

మంచు విష్ణు మైక్రో చిత్రాలు


మంచు విష్ణు

మొబైల్ వినియోగదారులకి... సినిమాటిక్ అనుభవాన్ని పంచేలా మైక్రో డ్రామా చిత్రాల్ని నిర్మించాలని నిర్ణయించారు కథానాయకుడు మంచు విష్ణు. రూ. వంద కోట్ల నిర్మాణ వ్యయంతో ఈ చిత్రాల్ని రూపొందించేలా ఆయన ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. మూడు నుంచి ఏడు నిమిషాల నిడివితో సాగే ఈ ఎపిసోడ్స్ భారతీయ వినోద రంగంలో ఓ కొత్త ట్రెండ్‌ని సృష్టిస్తాయని ఆయన నమ్ముతున్నారు. ఇటీవలే 'కన్నప్ప' సినిమాతో మంచు విష్ణు సందడి చేశారు. మరికొన్ని భారీ చిత్రాల్ని పట్టాలెక్కించే ప్రయత్నంలో ఉన్న ఆయన... కొత్తతరాన్ని దృష్టిలో ఉంచుకుని మైక్రో డ్రామాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

"సినిమా అంటే ఓ సెలబ్రేషన్‌లా ఉండాలి... కమర్షియల్‌గా ఉండాలనే అభిప్రాయాలు వినిపిస్తూ ఉంటాయి. అలాంటి సినిమాలు మనకు కచ్చితంగా అవసరమే! అయితే అప్పుడప్పుడూ ఒక్క క్షణం మనల్ని ఆలోచింపజేసే 'పరదా' తరహా సినిమాలూ రావాలి" అన్నారు అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రధారిగా... ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో రూపొందిన సినిమానే 'పరదా'. సంగీత, దర్శన రాజేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

అప్పుడప్పుడైనా ఇలాంటి సినిమాలు రావాల్సిందే!


అనుపమ

"మన దగ్గర కథల కొరత ఎక్కువ. నేను ఒప్పుకుని చేసిన సినిమాలతో పోలిస్తే నాలుగైదు రెట్లు తిరస్కరించిన కథలే ఎక్కువ. ఏ కథ విన్నా ఒకేలా అనిపించేది. సరిగ్గా ఆ సమయంలోనే 'పరదా' కథ నా దగ్గరికి వచ్చింది. వినగానే చల్లటి గాలి మొహానికి తాకినంత తాజా అనుభూతి కలిగింది. 'పరదా' సినిమాని అందరూ ఇష్టపడవచ్చు, ఇష్టపడకపోవచ్చు కానీ, ఓ కొత్త రకమైన సినిమాని చేశామనే తృప్తి మాత్రం ఎప్పటికీ ఉంటుంది. తెలుగు సినిమాల్లోనే కాదు, భారతీయ సినిమాల్లో ఎప్పుడూ ఇలాంటి కథ రాలేదు. కథ వింటున్నప్పుడు ఎంతో ఆసక్తికరంగా అనిపించింది కానీ... 70 శాతం సన్నివేశాల్లో మొహంపై పరదా కప్పుకుని నటించడం ఎలా అనే సందేహం ఆ తర్వాత కలిగింది. అదే ఈ సినిమాలో నాకు ఎదురైన పెద్ద సవాల్. నా మొహమే నాకు మార్కెట్. కానీ ఆ మొహం చూపించకుండా నటించడమంటే ఆషామాషీ కాదు. కళ్లతోనే కాకుండా, నా శరీరభాషతోనూ, గళంతోనూ నటించగలనని నిరూపించే సినిమానే ఇది. ఇప్పటికే ప్రీమియర్ షోలతో మంచి స్పందన లభిస్తోంది".

◆ "వ్యక్తిగతంగా ఈ కథతో చాలా కనెక్ట్ అయ్యాను. అందుకే ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో చాలా చోట్ల భావోద్వేగంతో మాట్లాడాను. మహిళలకి ఈ కథలోని విషయాలు ఇంకా బాగా అర్థం అవుతాయి. మేమే కాదు, దైనందిన జీవితాల్లో ప్రతి మహిళ ఇందులో ప్రస్తావించిన అంశాలకంటే ఇంకా ఎక్కువ మోతాదులో సమస్యల్ని ఎదుర్కొంటోంది. ఓ కథానాయికగా నాకూ రకరకాల సమస్యలు ఎదువుతుంటాయి. ఇలాంటి ఇబ్బందుల్ని మేం చెప్పకపోతే ఇంకెవరు చెబుతారు? నాయికా ప్రధానమైన కథ అని నేను ఈ సినిమా ఒప్పుకోలేదు. స్నేహం గురించి, ఇంకా ఎన్నో విషయాల గురించి చెప్పే కథ కావడంతోనే ఒప్పుకున్నా. తెలుగులో ఇప్పటివరకూ వచ్చిన కథల్లో ఒక విభిన్నమైన కథ ఇది. కుటుంబంతో కలిసి చూసే సినిమా ఇది. సంగీత, దర్శనతో కలిసి నటించడం మంచి అనుభవం".

◆"తెలుగులో నా ప్రయాణం మొదలై పదేళ్లయింది. కానీ ఇప్పటికీ ఇంకా తొలి సినిమా చేస్తున్నానేమో అనే అభిప్రాయంతో ఉంటా. నాకు తెలియని ఓ కొత్త ఊరికి వచ్చి, ఇంతగా గుర్తింపు పొందుతానని కలలో కూడా అనుకోలేదు. ఇదొక కొత్త అనుభవం. నన్ను తెలుగు ప్రేక్షకులు స్వీకరించడంతోనే తెలుగు నేర్చుకున్నా. కెరీర్ పరంగా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా సరే, ప్రతిసారీ ఓ మంచి సినిమా కోసం తపిస్తుంటానంటే ప్రేక్షకుల ప్రోత్సాహమే కారణం. కొన్నేళ్లుగా విరామం లేకుండా శ్రమిస్తూనే ఉన్నా. అందుకే ఆగస్టు తర్వాత కానీ, కొత్త కథలు వినకూడదని కొన్నాళ్లుగా చేసిన సినిమాలపైనే దృష్టిపెడుతూ వచ్చా. ఇకపై నిదానంగా, నచ్చిన కథల్నే ఎంచుకుని ఒకొక్కటిగా చేయాలని నిర్ణయించుకున్నా. గ్లామర్ పాత్రలా, లేక నటనకి ప్రాధాన్యమున్న పాత్రలా... వీటిలో ఎటువైపు వెళతాను? అనేది నేను ఇప్పుడే చెప్పలేను".

ఈ ఆటలో అందరూ బానిసలే



"హే.. ఇదొక ఆట బాబూ.. ఇందులో అందరూ బానిసలే" అంటున్నారు బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేశ్. మరి ఈయన దేని గురించి మాట్లాడుతున్నారో తెలుసుకోవాలంటే 'ఏక్ చతుర్ నార్' సినిమా చూడాల్సిందే. ఆయన, దివ్య ఖోస్లా కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఈ కామెడీ థ్రిల్లర్‌కు ఉమేశ్ శుక్లా దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే నెల 12న రాబోతుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ప్రతి ఒక్కరూ దానిని అర్థం చేసుకున్నారనే అనుకుంటారు. కానీ ఈ ఆటలను అర్థం చేసుకోవడం అంత సులభం కాదు" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఆసక్తికర సంభాషణలు, సన్నివేశాలతో సాగుతున్న ఈ టీజర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఆశిశ్ వాఘ్, జీషన్ అహ్మద్ నిర్మిస్తున్నారు.

భావోద్వేగాలే 'అర్జున్ చక్రవర్తి' బలం


శ్రీని, విజయ రామరాజు, సిజా, విక్రాంత్ రుద్ర

"చేతిలో ఆయుధంతో.. చుట్టూ సైన్యంతో చేసేది యుద్ధం కాదు. ఖాళీ చేతులతో, కాలే కడుపుతో చేసేదే అసలైన యుద్ధం" అంటున్నారు 'అర్జున్ చక్రవర్తి'. మరి అతనెవరు.. తన కథేంటి? తెలియాలంటే 'అర్జున్ చక్రవర్తి' సినిమా చూడాల్సిందే. విజయ రామరాజు టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని విక్రాంత్ రుద్ర తెరకెక్కించారు. శ్రీని గుబ్బల నిర్మించారు. సిజా రోజ్ కథానాయిక. ఈ సినిమా ఈ నెల 29న థియేటర్లలోకి రానుంది. గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విజయ రామరాజు మాట్లాడుతూ.. "ఈ చిత్రం కోసం నేను చాలా కష్టపడ్డా. సిక్స్ ప్యాక్‌లో షూట్ చేసినప్పుడు రెండు రోజుల పాటు ఏమీ తినలేదు. నా కెరీర్‌లోనే బెస్ట్ సినిమా చేశానని అనిపిస్తోంది" అన్నారు. "ఈ చిత్రం నా తొమ్మిదేళ్ల కల. ఈ సినిమా కోసం హీరో విజయ్ ప్రాణం పెట్టి పని చేశాడు. చాలా సవాళ్లు ఎదుర్కొన్నాడు. మైనస్ డిగ్రీల్లో షర్టు లేకుండా నటించాడు. కచ్చితంగా ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది" అన్నారు దర్శకుడు విక్రాంత్. "కబడ్డీ ఆట నేపథ్యంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది" అన్నారు నిర్మాత శ్రీని గుబ్బల. ఈ కార్యక్రమంలో సిజా రోజ్, అజయ్, దయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'సాంగ్స్ ఆఫ్ ప్యారడైజ్'

కశ్మీర్ నుంచి వస్తోంది ఓ మరపురాని స్వరం

ఎన్నో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో.. ఇప్పుడు మరో సినిమాతో అలరించడానికి సిద్ధమైంది. ప్రముఖ కశ్మీర్ గాయని రాజ్ బేగం జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'సాంగ్స్ ఆఫ్ ప్యారడైజ్'. సబా ఆజాద్, సోనీ రజ్దాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మ్యూజిక్ డ్రామాకు డానిశ్ రెంజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను గురువారం అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా విడుదల తేదీని పంచుకుంది ఓటీటీ సంస్థ. "కశ్మీర్ నుంచి ఓ మరపురాని స్వరం వస్తోంది. ఈ నెల 29న సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యను జోడించింది. సబా, సోనీ.. ఇందులో విభిన్న దశలలో రాజ్ బేగం పాత్రలో కనిపించనున్నారు. షీబా చద్దా, తరుక్ రైనా, లిల్లేట్ దూబే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "సామాజిక ఆంక్షలతో స్త్రీలను బంధించిన సమయంలో రాజ్ బేగం తన సంగీతంతో వారిలో ధైర్యాన్ని నింపింది. భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చింది" అన్నారు.

'ఆత్మకథ'కు శ్రీకారం


సురేశ్, అఖిల

జెమిని సురేశ్, అఖిల నాయర్ జంటగా శ్రీనివాస్ గుండ్రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆత్మకథ'. వారాహి ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లి సంస్థ నిర్మిస్తోంది. ధనరాజ్, మహేశ్ విట్టా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సుబ్బలక్ష్మి క్లాప్ కొట్టగా.. జెమిని కిరణ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ప్రసన్న కుమార్ చిత్ర బృందానికి కథ అందించారు. ఈ సందర్భంగా నటుడు జెమిని సురేశ్ మాట్లాడుతూ.. "హీరోగా నాకిదే తొలి సినిమా. నా 18ఏళ్ల కల నెరవేరబోతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల, సమ్మెట గాంధీ, శ్రేయాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథతో...


పవన్, కావ్య

పవన్ కేసరి, కావ్య కల్యాణ్‌రామ్ జంటగా టి.డి.ఆర్ సినిమాస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. కుంచం శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. తలారి దినకరణ్ రెడ్డి నిర్మాత. గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి దర్శకులు రామ్ అబ్బరాజు క్లాప్‌నివ్వగా, ప్రశాంత్ కుమార్ దిమ్మెల కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ ఇద్దరూ అడిదాల విజయ్‌పాల్‌రెడ్డితో కలిసి చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "స్వచ్ఛమైన ప్రేమకథ ఇది. ప్రతి పాత్ర ఎంతో సహజంగా, అందరి మనసుల్ని హత్తుకునేలా ఉంటుంది. కేరళ, హైదరాబాద్‌ల్లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తాం" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "విభిన్నమైన ఈ కథలో ప్రతి పాత్ర గుర్తుండిపోయేలా ఉంటుంది. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సంగీతం, సాయి విజువల్స్ కథకి ప్రాణం పోస్తాయి" అన్నారు. కావ్య కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "తపన కలిగిన ఒక మంచి బృందం కలిసి చేస్తున్న చిత్రమిది. ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తామని తెలిపారు నిర్మాత. సుగుణ, సుప్రియ, దివిజ ప్రభాకర్, మొయిన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కూర్పు: విప్లవ్, కళ: క్రాంతి ప్రియం, సమర్పణ: తలారి హేమావతిరెడ్డి.

హిట్ కాంబినేషన్ మరోసారి?


సంజయ్ దత్

పిల్లల నిర్లక్ష్యానికి గురవుతూ వృద్ధాప్యంలో ఎంతో మదనపడుతూ జీవిస్తున్న తల్లిదండ్రులు చాలా మందే. వీరి జీవితాల్ని తెరపై ఆవిష్కరిస్తూ.. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఈ కథాంశంతోనే రూపొంది మంచి విజయాన్ని అందుకుంది మరాఠీ చిత్రం 'జునా ఫర్నీచర్'. ఇప్పుడీ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయడానికి సిద్ధమయ్యారు దర్శకుడు మహేశ్ మంజ్రేకర్. ఇందులో ప్రధాన పాత్రలో నటించడానికి బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. "వాస్తవ్, 'పితా', 'కురుక్షేత్ర' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు సంజయ్, మహేశ్ కలయికలో రూపొందినవే. ఇప్పుడీ హిట్ కాంబినేషన్ మరోసారి 'జునా ఫర్నీచర్' హిందీ రీమేక్‌తో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడించనున్నార"ని సంజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఒక్కో అడుగూ వేసుకుంటూ


కృతి సనన్

మరికొద్ది రోజుల్లో 'తేరే ఇష్క్ మే' చిత్రంతో ప్రేమికుడి కోసం పోరాటం చేసే ప్రియురాలిగా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ తార కృతి సనన్. ప్రస్తుతం ఇది ముగింపు దశలో ఉండగానే.. మరో ప్రాజెక్టు కోసం సిద్ధమవుతోందీ భామ. కొన్ని రోజులుగా 'కాక్‌టెయిల్ 2'లో షాహిద్ కపూర్, రష్మికతో కలిసి కృతి కనిపించనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ విషయాన్ని ధ్రువీకరిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కృతి. "ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ఇక్కడికి చేరుకున్నాన"నే అర్థం వచ్చేలా ఓ వ్యాఖ్యను జోడించింది. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొంది మంచి హిట్‌ను అందుకున్న 'కాక్‌టెయిల్'కు సీక్వెల్ ఇది. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఇది సెట్స్ పైకి వెళ్లనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

జనరల్ స్టడీస్ — ఇండియన్ ఎకానమీ

వృథా తగ్గించి.. వృద్ధి సాగించి!

భారత్‌లో పెట్టుబడుల ఉపసంహరణ విధానం

(లక్ష్యాలు – ధోరణులు)

ఆర్థిక సంస్కరణల్లో భాగంగా కేంద్రం చేసిన విధాన నిర్ణయాల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రధానమైంది. దేశాభివృద్ధికి మూల స్తంభాలుగా నిలుస్తాయని భావించి అనేక ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించారు. కానీ నిర్వహణ సామర్థ్యం, పోటీతత్వం కొరవడి అవి క్రమంగా గాడితప్పాయి. తక్కువ ఉత్పత్తి, స్వల్ప రాబడితో ఆర్థిక వ్యవస్థకు భారంగా, ప్రభుత్వానికి నష్టదాయకంగా మారాయి. ఈ పరిస్థితిని చక్కదిద్ది, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడానికి పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై పోటీ పరీక్షార్థులకు కనీస అవగాహన ఉండాలి. ఆ ప్రక్రియలో భాగంగా అనుసరించే విధానాలు, అమలు చేస్తున్న పద్ధతుల గురించి తెలుసుకోవాలి.







ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వం తన ఈక్విటీ వాటాను విక్రయించే ప్రక్రియనే 'పెట్టుబడుల ఉపసంహరణ' అంటారు. ఇందులో యాజమాన్యాన్ని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటు పెట్టుబడిదారులకు లేదా సంస్థలకు బదిలీ చేస్తారు.

ఉపసంహరణ రకాలు: బదిలీ చేసిన యాజమాన్యం పరిధి, అమ్మకపు విధానం ఆధారంగా పెట్టుబడుల ఉపసంహరణలను వివిధ రకాలుగా పేర్కొనవచ్చు.

మైనారిటీ పెట్టుబడుల ఉపసంహరణ: ప్రభుత్వం ఒక సంస్థలో 50% కంటే ఎక్కువ వాటాను ఉంచుకుని, మైనారిటీ వాటా మాత్రమే అమ్ముతుంది. దీంతో నిర్వహణ, కీలక నిర్ణయాలు తీసుకునే ప్రక్రియపై ప్రభుత్వానిదే నియంత్రణ కొనసాగుతుంది.

మెజారిటీ పెట్టుబడుల ఉపసంహరణ: ప్రభుత్వం తన వాటాలో ఎక్కువ భాగాన్ని అమ్మేస్తుంది. యాజమాన్య హక్కులను 50% కంటే తక్కువకు తీసుకొస్తుంది. ఫలితంగా ప్రైవేటు పెట్టుబడిదారులు సంస్థ నిర్వహణ, నియంత్రణను తీసుకుంటారు. కొత్త ఆలోచనలు, మెరుగైన నిర్వహణ పద్ధతుల్లో వ్యాపార సామర్థ్యం మెరుగయ్యే విధంగా చూస్తారు.


జి.వి. రామకృష్ణ

పూర్తి పెట్టుబడుల ఉపసంహరణ: ప్రభుత్వం సంస్థలోని మొత్తం వాటాను విక్రయిస్తుంది. యాజమాన్య హక్కు, నియంత్రణను పూర్తిగా వదులుకుంటుంది. ఈ ప్రక్రియనే 'ప్రైవేటీకరణ' అంటారు. ఇందులో వ్యాపారం పూర్తిగా ప్రైవేటు యాజమాన్యానికి బదిలీ అవుతుంది. ఉదాహరణకు 2021లో ఎయిర్ ఇండియాను పూర్తిగా టాటా గ్రూప్‌నకు బదిలీ చేశారు.

వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ: ప్రభుత్వం మెజారిటీ వాటాను అమ్మడంతోపాటు నిర్వహణ, నియంత్రణను వ్యూహాత్మక భాగస్వామ్యానికి బదిలీ చేస్తుంది. వ్యూహాత్మక పెట్టుబడిదారులను వారి నైపుణ్యం, సంస్థ పనితీరును మెరుగుపరచగలిగే సామర్థ్యం ఆధారంగా ఎంపిక చేస్తారు. ఇది పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి అత్యంత ప్రభావవంతమైన రూపాల్లో ఒకటి.

పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలు

అభివృద్ధికి ఆదాయాన్ని సమకూర్చుకోవడం: విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలకు కావాల్సిన నిధులు సమకూర్చుకోవడానికి పెట్టుబడుల ఉపసంహరణ దోహదపడుతుంది. ఈ నిధులను ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే రంగాల్లో తిరిగి పెట్టుబడి పెడతారు.

ఆర్థిక లోటును తగ్గించడం: ప్రభుత్వం తన రుణాన్ని తగ్గించడానికి, ఆర్థిక అసమతౌల్యతను సరిచేసేందుకు పెట్టుబడుల ఉపసంహరణతో వచ్చే ఆదాయాన్ని ఉపయోగిస్తుంది.

ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం: ప్రైవేటు రంగం ద్వారా మూలధనం, నైపుణ్యాలను పెంచడం ఆర్థికవృద్ధికి దోహదపడుతుంది.

ప్రభుత్వ సంస్థల పనితీరును మెరుగుపరచడం: పోటీ లేకపోవడం, అధికారిక జాప్యాలతో అనేక ప్రభుత్వరంగ సంస్థలు అసమర్థంగా మిగిలిపోయాయి. పెట్టుబడుల ఉపసంహరణ వీటి నిర్వహణ, కార్యాచరణ, పనితీరును మెరుగుపరుస్తుంది.

ప్రభుత్వ ప్రమేయాన్ని తగ్గించడం: వ్యాపారంలో వాటాను, వాణిజ్య సంస్థల నిర్వహణలో ప్రత్యక్ష ప్రమేయాన్ని తగ్గించుకున్న ప్రభుత్వం విధానాల రూపకల్పన, పాలనపై దృష్టి పెడుతుంది.



మార్కెట్ డైనమిక్స్‌ను మెరుగుపరచడం: పెట్టుబడుల ఉపసంహరణ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సమాన అవకాశాలు సృష్టిస్తుంది. ఈ పరిణామం మెరుగైన ఉత్పత్తులు, సేవలు, ధరలకు దారితీస్తుంది.

పెట్టుబడుల ఉపసంహరణ - ఆవశ్యకత: 1991, జులైలో ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాల సూచనల ప్రకారం పీఎస్‌యూలకు వినియోగించిన మూలధనంపై అత్యంత ప్రతికూల రాబడులే వచ్చాయి. అసమర్థ నిర్వహణతో ప్రభుత్వ వనరులు వృథా అయ్యాయి. చివరకు ఇవి ఆస్తులుగా కాకుండా అప్పులుగా మారాయి. లాభాలు నిరంతరం తగ్గుతూ నష్టాల్లోకి పడిపోయాయి. దీంతో ఈ వ్యాపారాల్లో వేగవంతమైన వృద్ధికి ప్రైవేటు రంగం సహకారం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్దిష్ట ప్రాజెక్టుల అవసరాలను తీర్చడానికి, అదనపు నిధులు స్వీకరించడానికి పెట్టుబడుల ఉపసంహరణను ఒక అవకాశంగా మలచుకుంది.

పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ: పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చే ఆదాయానికి ఒక మార్గదర్శకంగా పనిచేయడానికి ప్రభుత్వం 2005లో 'జాతీయ పెట్టుబడి నిధి'ని స్థాపించింది. 2016, ఏప్రిల్ 14 నుంచి ఆర్థిక మంత్రిత్వశాఖ కింద పనిచేసే 'పెట్టుబడి, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం' (DIPAM- దీపం) ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తోంది.

పెట్టుబడుల ఉపసంహరణ పద్ధతులు: స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ), ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతుల్లో ప్రభుత్వ కంపెనీల షేర్లను విక్రయిస్తారు.

వ్యూహాత్మక అమ్మకం: పీఎస్ఈలోని ప్రభుత్వ వాటాలో గణనీయమైన భాగాన్ని లేదా 50 శాతం వరకు విక్రయిస్తారు.

ఇంటిగ్రేటెడ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం (ఐపీపీ): అర్హత ఉన్న సంస్థాగత కొనుగోలుదారులు మాత్రమే ఇందులో పాల్గొంటారు.

సీపీఎస్ఈ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్): ఈ మార్గాన్ని అనుసరించి పెట్టుబడుల ఉపసంహరణ చేస్తారు. ఇది ఒకే ఆఫర్ ద్వారా విభిన్న రంగాల్లోని వివిధ పీఎస్ఈల్లో ప్రభుత్వ వాటాను ఏక కాలంలో విక్రయించడాన్ని అనుమతిస్తుంది.

పెట్టుబడుల ఉపసంహరణ ధోరణులు: 1991 పారిశ్రామిక విధానంలో ప్రభుత్వం ఎంపిక చేసిన పీఎస్ఈల్లో పెట్టుబడుల ఉపసంహరణను ప్రకటించారు. 1996లో జి.వి.రామకృష్ణ ఆధ్వర్యంలో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్ ఏర్పాటైంది. దాని సిఫార్సులను 1999-2004 మధ్య కాలంలో ప్రభుత్వం అమలు చేసింది.



* 1999లో ప్రభుత్వం వ్యూహాత్మక పీఎస్ఈలను బలోపేతం చేయనున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో వ్యూహాత్మకం కాని పీఎస్ఈలను ప్రైవేటీకరించనున్నట్లు పేర్కొంది. 1999, డిసెంబరులో ప్రత్యేకంగా పెట్టుబడుల ఉపసంహరణ శాఖను ఏర్పాటు చేసింది. 1999-2004 మధ్య కాలంలో ప్రభుత్వం అయిదేళ్లలో కేవలం రూ.27,599 కోట్లు సేకరించింది.
* 2004-09 మధ్య సంకీర్ణ రాజకీయాల ఒత్తిళ్లతో పెట్టుబడుల ఉపసంహరణ వేగం మందగించింది. ఈ అయిదేళ్లలో రూ.11,591 కోట్లు మాత్రమే సమకూరాయి.
* 2009-14 మధ్య వేగం పుంజుకోవడంతో పెట్టుబడుల ఉపసంహరణ ఆదాయం రూ.1.2 లక్షల కోట్లకు పెరిగింది.
* 2014 నుంచి ఉపసంహరణ మరింత జోరుగా సాగింది. మొత్తం రూ.4.48 లక్షల కోట్లు సమకూరాయి.
* 2020-21 కేంద్ర బడ్జెట్‌లో పీఎస్ఈల్లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు కొత్త విధానాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగానే 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెండు ప్రభుత్వ బ్యాంకులు, ప్రభుత్వ యాజమాన్యంలోని బీమా కంపెనీల ప్రైవేటీకరణను ప్రతిపాదించారు. ఎల్ఐసీ ఐపీఓ తెచ్చారు.


రచయిత: వమరవల్లి రమణయ్య

తాజా వైఖరులు

* పెట్టుబడుల ఉపసంహరణ విధానంపై ప్రస్తుతం ప్రభుత్వం వైఖరిలో మార్పు వచ్చింది. ఇకపై వార్షిక పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలను నిర్దేశించకుండా ప్రభుత్వరంగ సంస్థల పనితీరును మెరుగుపరిచి వాటి విలువ పెంపుపై దృష్టి సారించాలని నిర్ణయించింది.
* వ్యూహాత్మకమైన పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలోని వాటాల విక్రయంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఒక కంపెనీలోని మెజారిటీ వాటాను ప్రైవేటు సంస్థకు విక్రయిస్తారు.

సృజనాత్మకత పెంచుకోవాలంటే..?

లైఫ్ స్కిల్స్



నూతన సృష్టి ఏదైనా సృజనాత్మక ఆలోచన నుంచే పుడుతుంది. అందుకే జీవన నైపుణ్యాల్లో 'క్రియేటివ్ థింకింగ్' అతి ముఖ్యమైందిగా మారిపోయింది. మెరుపు లాంటి ఆలోచనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే అద్భుతాలు జరుగుతాయి. నేటి సాంకేతిక ప్రపంచంలో సృజనాత్మకతే అసలైన పెట్టుబడిగా మారింది. అది ఏవిధంగా సాధ్యమవుతుందో కళ్లెదుటే కనిపిస్తున్న ఉదాహరణలతో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



■ 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎలక్టోరల్ ఇంటెగ్రిటీ' పేరిట అంతర్జాతీయ ఎన్నికల సమగ్ర సమావేశాన్ని ఇటీవల ఎక్కడ నిర్వహించారు? (భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.)
జ: స్వీడన్

■ భారత్‌లో మొదటి అండర్ వాటర్ మ్యూజియాన్ని ఏ రాష్ట్రంలోని ఐఎన్ఎస్ గుల్దార్ చుట్టుపక్కల ఏర్పాటు చేయాలని ఇటీవల నిర్ణయించారు? (ఐఎన్ఎస్ గుల్దార్ సేవలను 2024, జనవరిలో నిలిపివేశారు. మ్యూజియంతోపాటు కృత్రిమ పగడపు దిబ్బను కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు.)
జ: మహారాష్ట్ర

■ అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: జూన్ 16

■ నాలుగేళ్ల విరామం అనంతరం ఇటీవల భారత్ ఏ దేశంలో భారత రాయబారిగా అలియావతి లాంగ్‌కుమెర్‌ను నియమించింది? (2024, డిసెంబరులో భారత్ తన రాయబార కార్యాలయాన్ని ఈ దేశంలో తిరిగి తెరిచిన నేపథ్యంలో ఈ నియామకాన్ని చేపట్టింది.)
జ: ఉత్తర కొరియా

మరింత సమాచారం

సైన్స్ అండ్ టెక్నాలజీ

బరువైన ఉపగ్రహాలను మోసుకెళ్లే బాహుబలి!

అంతరిక్ష సాంకేతికత, ఉపగ్రహ ప్రయోగాల్లో స్వయంసమృద్ధి సాధించిన అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటి. స్వదేశీ సాంకేతికతతో, తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టే వాహక నౌకలను తయారుచేసింది. ఇస్రో ఇప్పటి వరకు ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎస్ఎస్ఎల్‌వీ లాంటి రాకెట్లను అభివృద్ధి చేసి అనూహ్య విజయాలను సాధించింది. వివిధ వాహక నౌకలు, వాటిలోని రకాలు, సామర్థ్యం, వినియోగించే ఇంధన రకాలు, ప్రత్యేకతల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాన ఉండాలి. పలు ఉపగ్రహాల ప్రత్యేకతలు, అంతరిక్ష ప్రయోగాల్లో మైలురాళ్లుగా నిలిచిన ఘటనలతోపాటు విఫలమైన ప్రయోగాలనూ గుర్తుంచుకోవాలి

ఇస్రో వాహక నౌకల సాంకేతికత



1. కింది వాటిలో పీఎస్ఎల్‌వీ గురించి సరైన వాక్యాలను ఎన్నుకోండి.
ఎ) ఇది భారతదేశ 3వ రకం వాహక నౌక.
బి) దీన్ని ఇప్పటివరకు అత్యధిక సార్లు వినియోగించారు.
సి) అత్యధికంగా విజయాలు సాధించిన నౌక.
డి) దీన్ని ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడానికి వాడతారు.
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) సి, డి 4) ఎ, బి, సి, డి

2. కింది వాక్యాల్లో పీఎస్ఎల్‌వీ గురించి సరికాని వాక్యాలు ఏవి?
ఎ) దీనిలో క్రయోజెనిక్ ఇంజిన్ ఉంటుంది.
బి) ఇది ఘన ఇంధనాన్ని మాత్రమే వినియోగించుకుంటుంది.
సి) భారతదేశం వద్ద ఉన్న అన్ని వాహక నౌకల కంటే ఇది అత్యధిక బరువును మోసుకెళుతుంది.
1) ఎ, బి, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, సి

3. కింది వాటిలో సరైన జతలను ఎన్నుకోండి.

వాహక నౌక	ఉపగ్రహం
ఎ) పీఎస్ఎల్‌వీ -డీ1	- ఐఆర్ఎస్- 1ఈ
బి) పీఎస్ఎల్‌వీ -డీ2	- ఐఆర్ఎస్- పీ2
సి) పీఎస్ఎల్‌వీ -సీ2	- ఐఆర్ఎస్- పీ4

1) ఒక జత 2) రెండు జతలు
3) మూడు జతలు 4) ఏదీకాదు

4. పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ ద్వారా ప్రవేశపెట్టిన ఉపగ్రహాలను సరైన క్రమంలో జతపరచండి.

1) పీఎస్ఎల్‌వీ - సీ4	ఎ) మెఘాట్రాపిక్స్
2) పీఎస్ఎల్‌వీ - సీ18	బి) మెట్‌శాట్ - I
3) పీఎస్ఎల్‌వీ - సీ30	సి) టెలీయోస్
4) పీఎస్ఎల్‌వీ - సీ48	డి) ఆస్ట్రోశాట్
5) పీఎస్ఎల్‌వీ - సీ55	ఇ) రిశాట్ - 2బీ

1) 1-బి, 2-ఎ, 3-డి, 4-ఇ, 5-సి
2) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి, 5-ఇ
3) 1-ఇ, 2-బి, 3-సి, 4-ఎ, 5-డి
4) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి, 5-ఇ

5. కింది వాక్యాలను పరిశీలించి, సరైనవి గుర్తించండి.
ఎ) పీఎస్ఎల్‌వీలో ఏకాంతరంగా ఘన, ద్రవ ఇంధనాలుంటాయి.
బి) పీఎస్ఎల్‌వీలో 2వ దశలో వికాస్ ఇంజిన్‌ను ఉపయోగిస్తున్నారు.
సి) పీఎస్ఎల్‌వీని 'ఉపగ్రహాలను ప్రయోగించడానికి కావాల్సిన పనిగుర్రం' అంటారు.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఏదీకాదు

6. కింది వాటిలో ప్రస్తుతం భారతదేశం ఏ వాహక నౌకలను వినియోగిస్తోంది?
ఎ) ఎస్ఎల్‌వీ బి) ఏఎస్ఎల్‌వీ
సి) పీఎస్ఎల్‌వీ డి) జీఎస్ఎల్‌వీ ఇ) ఎస్ఎస్ఎల్‌వీ
1) ఎ, బి 2) సి, డి, ఇ 3) డి, ఇ 4) ఎ, సి

7. వాహక నౌకలు మోసుకెళ్లే ఉపగ్రహాల బరువు ఆధారంగా కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

1) ఎస్ఎల్‌వీ	ఎ) 150 కి.గ్రా.
2) ఏఎస్ఎల్‌వీ	బి) 40 కి.గ్రా.
3) పీఎస్ఎల్‌వీ	సి) 500 కి.గ్రా.
4) జీఎస్ఎల్‌వీ	డి) 2000 కి.గ్రా.
5) ఎస్ఎస్ఎల్‌వీ	ఇ) 1700 కి.గ్రా.

1) 1-బి, 2-ఎ, 3-ఇ, 4-డి, 5-సి
2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ, 5-ఇ
3) 1-ఇ, 2-బి, 3-సి, 4-డి, 5-ఎ
4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి, 5-ఇ

8. కింది వాటిలో శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎల్‌వీ) ప్రత్యేకతలు?



ఎ) ఇది భారతదేశ మొదటి వాహక నౌక.
బి) నాలుగు దశల ఘన ఇంధనం వినియోగిస్తుంది.
సి) 40 కిలోల బరువును మోసుకెళుతుంది.
డి) ఎస్ఎల్‌వీ -3E2 ద్వారా రోహిణి శాటిలైట్-1 (ఆర్ఎస్-I)ను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
1) ఎ, బి, సి 2) బి, సి
3) సి, డి 4) ఎ, బి, సి, డి

9. జీఎస్ఎల్‌వీ వాహక నౌక గురించి కింది వాటిలో సరికాని వాక్యాలు ఏవి?
ఎ) దీనిద్వారా ఎక్కువగా సమాచార ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెడతారు.
బి) ఇది రెండు టన్నుల వరకు బరువున్న ఉపగ్రహాలను తీసుకెళుతుంది.
సి) ఇందులో ద్రవ ఇంధనం మాత్రమే ఉంటుంది.
1) సి 2) బి 3) ఎ 4) ఎ, బి

10. పీఎస్ఎల్‌వీ – C11 వాహక నౌక గురించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ఇది మొదటి పీఎస్ఎల్‌వీ -XL వాహక నౌక.
బి) దీన్ని 2008, అక్టోబరు 22న ప్రయోగించారు.
సి) దీన్ని ద్వారా చంద్రయాన్ - I ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఏదీకాదు

11. స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) గురించి తప్పుగా ఉన్న వాక్యాలను గుర్తించండి.
ఎ) దీన్ని ఇటీవల అభివృద్ధి చేశారు.
బి) ఇది రెండు టన్నుల బరువును మోసుకెళుతుంది.
సి) దీని ద్వారా సమాచార ఉపగ్రహాలను ప్రయోగిస్తారు.
డి) దీనిలో మూడు దశల ఘన ఇంధనం ఉంటుంది.
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఏదీకాదు

12. జీఎస్ఎల్‌వీ – ఎంకే - III గురించి కింది వాటిలో సరైన వాటిని గుర్తించండి.



ఎ) దీన్ని ఎల్‌వీఎం- 3 అని కూడా అంటారు.
బి) దీని ద్వారా అత్యధిక బరువున్న ఉపగ్రహాలను కక్ష్యలో ఉంచవచ్చు.
సి) దీన్ని 'బాహుబలి రాకెట్' అంటారు.
డి) మొదటి జీఎస్ఎల్‌వీ ఎంకే - III - X ద్వారా కేర్ (CARE) మిషన్‌ను జరిపారు.
1) ఎ, బి, సి 2) బి, సి డి
3) సి, డి 4) ఎ, బి, సి, డి

13. కింది వాటిని సరైన క్రమంలో జతపరచండి.

వాహక నౌక	ప్రవేశపెట్టిన ఉపగ్రహం
1) ఎస్ఎల్‌వీ - 3 - ఈ2	ఎ) ఆస్ట్రోశాట్
2) పీఎస్ఎల్‌వీ - సీ30	బి) రోహిణి శాటిలైట్ - 1
3) జీఎస్ఎల్‌వీ - డీ2	సి) ఆజాది శాట్ - 2
4) ఎస్ఎస్ఎల్‌వీ - డీ2	డి) జీశాట్ - 2

1) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 2) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

14. జీఎస్ఎల్‌వీ – వాహక నౌక గురించి కింది జతల్లో తప్పుగా ఉన్నవి ఎన్ని?
ఎ) జీఎస్ఎల్‌వీ - ఎఫ్9 - సార్క్ ఉపగ్రహం
బి) జీఎస్ఎల్‌వీ - ఎఫ్14 - ఎన్‌వీఎస్ - 02 ఉపగ్రహం
సి) జీఎస్ఎల్‌వీ - డీ1 - చంద్రయాన్ - 1
డి) జీఎస్ఎల్‌వీ - డీ2 - చంద్రయాన్ - 3
1) మూడు జతలు 2) నాలుగు జతలు
3) రెండు జతలు 4) ఏదీకాదు

15. ఇస్రో ఇటీవల కాలంలో పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించిన ఉపగ్రహాలను సరైన క్రమంలో అమర్చండి.

1) పీఎస్ఎల్‌వీ - సీ56	ఎ) ఆదిత్య - ఎల్1
2) పీఎస్ఎల్‌వీ - సీ57	బి) డీఎస్ - ఎస్ఏఆర్
3) పీఎస్ఎల్‌వీ - సీ58	సి) ప్రోబో - 3
4) పీఎస్ఎల్‌వీ - సీ59	డి) ఎక్స్ - పోశాట్

1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి

16. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాలను ఎన్నుకోండి.
ఎ) జీఎస్ఎల్‌వీ ద్వారా జియోస్టేషనరీ కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టవచ్చు.
బి) జీఎస్ఎల్‌వీలో 3వ దశలో క్రయోజెనిక్ ఇంజిన్ ఉంటుంది.
1) ఎ, బి లు సరైనవి.
2) ఎ సరైంది, బి సరికాదు.
3) ఎ సరికాదు, బి సరైంది.
4) ఎ, బి లు సరికావు.

17. జీఎస్ఎల్‌వీ– ఎంకే–III– ఎం2 గురించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) దీన్ని ఎల్‌వీఎం3 - ఎం2 అని కూడా అంటారు.
బి) దీని ద్వారా వన్ వెబ్ సంస్థకు చెందిన 36 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
సి) ఇది ఎల్‌వీఎం - 3 ద్వారా జరిగిన వాణిజ్య ప్రయోగం.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) ఎ, సి

18. కింది వాటిలో విఫలమైన ప్రయోగాలను గుర్తించండి.
ఎ) పీఎస్ఎల్‌వీ - డీ1 బి) పీఎస్ఎల్‌వీ - సి39
సి) జీఎస్ఎల్‌వీ - డీ1 డి) ఎస్ఎల్‌వీ - 3ఈ1
1) ఎ, సి 2) ఎ, బి, సి, డి
3) సి, డి 4) బి, సి

19. పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించిన కింది ఉపగ్రహాల ప్రత్యేకతల గురించి సరైన వాక్యాలను గుర్తించండి.


పీఎస్ఎల్‌వీ - సీ57

ఎ) పీఎస్ఎల్‌వీ - సీ57 ద్వారా ఆదిత్య - ఎల్1 అనే ఉపగ్రహాన్ని ప్రయోగించారు.
బి) పీఎస్ఎల్‌వీ - సీ59 ద్వారా ప్రోబో - 3 మిషన్‌ను నిర్వహించారు.
సి) పీఎస్ఎల్‌వీ - సీ60 ద్వారా స్పాడెక్స్ మిషన్‌ను నిర్వహించారు.
1) ఎ, బి 2) ఎ, సి
3) ఎ, బి, సి 4) బి, సి

20. జీఎస్ఎల్‌వీ – ఎంకె – 3 గురించి ఇచ్చిన జతలను సరైన క్రమంలో అమర్చండి.

1) జీఎస్ఎల్‌వీ - ఎంకే3-ఎక్స్	ఎ) జీశాట్-19 ఉపగ్రహం
2) జీఎస్ఎల్‌వీ - ఎంకే3-డీ1	బి) కేర్ మిషన్
3) జీఎస్ఎల్‌వీ - ఎంకే3-డీ2	సి) చంద్రయాన్-2
4) జీఎస్ఎల్‌వీ - ఎంకే3-ఎం1	డి) జీశాట్-29

1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి

21. ఇస్రో తయారుచేసిన వివిధ వాహక నౌకల్లో వాడిన ఇంధనాల ఆధారంగా కింది వాటిని సరైన క్రమంలో అమర్చండి.

1) ఎస్ఎల్‌వీ	ఎ) 4 దశల ఘన ఇంధనం
2) ఏఎస్ఎల్‌వీ	బి) 4 దశల ఘన, ద్రవ ఇంధనాలు వరుసగా
3) పీఎస్ఎల్‌వీ	సి) 5 దశల ఘన ఇంధనం
4) జీఎస్ఎల్‌వీ	డి) ఘన, ద్రవ, క్రయోజెనిక్ ఇంజిన్
5) ఎస్ఎస్ఎల్‌వీ	ఇ) 3 దశల ఘన ఇంధనం

1) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి, 5-ఇ
2) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ, 5-ఇ
3) 1-ఇ, 2-బి, 3-సి, 4-డి, 5-ఎ
4) 1-ఎ, 2-బి, 3-సి, 4-ఇ, 5-డి

22. కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) పీఎస్ఎల్‌వీలో క్రయోజెనిక్ ఇంజిన్ వాడతారు.
బి) జీఎస్ఎల్‌వీలో కేవలం ఘన ఇంధనం ఉంటుంది.
సి) చంద్రయాన్ - 3ని ఎస్ఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు.
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) ఎ, సి 4) ఏదీకాదు


23. పీఎస్ఎల్‌వీ గురించి కింది వాటిలో సరైన వాక్యాలు?
ఎ) దీనిలో అత్యధికంగా ఐదు వేరియంట్లు ఉన్నాయి.
బి) దీనిద్వారా ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించారు.
సి) దీన్ని ఎక్కువ సార్లు ఉపయోగించారు.
1) ఎ 2) బి
3) ఎ, బి, సి 4) సి


రచయిత: డాక్టర్ బి.నరేశ్

సమాధానాలు

1-4; 2-1; 3-3; 4-1; 5-3; 6-2; 7-1; 8-4; 9-1; 10-3; 11-2; 12-4; 13-1; 14-3; 15-4; 16-1; 17-3; 18-2; 19-3; 20-2; 21-1; 22-2; 23-3.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ
సంక్షేమ యంత్రాంగం



దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అనేక మంది ఉన్నారు. ఈ ప్రజల ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తున్నాయి. అసమానతలను తగ్గించి, అవకాశాల్లో వ్యత్యాసాలను తొలగించాలని, రిజర్వేషన్ల కల్పన కోసం ప్రభుత్వాలు పలు కమిషన్లను ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా కమిషన్లు, నిర్వర్తించే విధులు, వాటి అధికారాలు, చేసిన సిఫార్సులపై పోటీపరీక్షార్థులకు పూర్తి అవగాహన ఉండాలి.

ఇతర వెనుకబడిన వర్గాలు

భారత రాజ్యాంగంలో 'ఇతర వెనుకబడిన వర్గాలు' (ఓబీసీ) అనే పదాన్ని రాజ్యాంగ నిర్మాతలు నిర్వచించలేదు.

- ఈ పదం పాలనాపరమైంది మాత్రమే. వెనుకబడిన వర్గాలు మిశ్రమ వర్గాలకు చెందుతాయి.

వెనుకబాటుతనానికి లక్షణాలు:

1. నిరక్షరాస్యత
2. విద్యలేమి
3. పేదరికం
4. శ్రమదోపిడీ
5. సేవారంగంలో ప్రాతినిధ్యం లేకపోవడం
6. అస్పృశ్యత/ అంటరానితనం

మండల్ కమిషన్

మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో 1979లో బి.పి. మండల్ అధ్యక్షతన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటైంది.

- దీని ప్రధాన ఉద్దేశం - సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిని గుర్తించి, రిజర్వేషన్లు కల్పించడం.

జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ)

ఇందిరా సహానీ కేసులో భాగంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల చట్టం చేశారు. ఇది 1993 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

జాతీయ మానవ హక్కుల కమిషన్

మానవుల ప్రాథమిక జీవనానికి అత్యంత ఆవశ్యకమైనవి మానవ హక్కులు.

- ప్రజాస్వామ్య రాజ్యాల్లో రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులకు భంగం కలిగితే ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేయవచ్చు.
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను 1993 అక్టోబరు 12న ఏర్పాటు చేశారు. ఇది ఒక చట్టబద్ధమైన సంస్థ.

ఓబీసీలకు సంబంధించిన అంశాలు, ఇందిరా సహానీ కేసు 1992, జాతీయ మహిళా కమిషన్, జాతీయ మైనారిటీ కమిషన్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

ఒకే సమ్మేళనంలో చల్లదనం.. పేల్చే స్వభావం!

రోజువారీ జీవితంలో రసాయన సమ్మేళనాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వంటింట్లో వినియోగించే ఉప్పు, బేకింగ్ సోడా లాంటివి ఈ కోవలోకే వస్తాయి. పరిశ్రమలు, వ్యవసాయం, వైద్యం, నిర్మాణ రంగంలో బాగా ఉపయోగపడేవి మరికొన్ని. విభిన్న లక్షణాలున్న ఆయా పదార్థాలు ఆరోగ్యం, పర్యావరణం, ఇతర కీలక రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. కాబట్టి ఈ సమ్మేళనాల రసాయన, సాధారణ నామాలు, వాటిలోని రకాలు, వాటివల్ల ఉపయోగాలపై అవగాహన అవసరం.

రసాయన పదార్థాలు - ఉపయోగాలు

సోడియం క్లోరైడ్, సోడియం హైడ్రాక్సైడ్, పొటాషియం హైడ్రాక్సైడ్, కాల్షియం కార్బోనేట్, క్విక్ లైమ్, స్లేక్డ్ లైమ్, హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నైట్రిక్ ఆమ్లం లాంటి అనేక సమ్మేళనాలను పరిశ్రమల్లో ముడి పదార్థాలుగా ఉపయోగిస్తున్నారు.

✦ అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి పదార్థాలను వ్యవసాయ రంగంలో ఎరువులుగా ఉపయోగిస్తారు. అదేవిధంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, జిప్సంను నిర్మాణ, వైద్య రంగాల్లో ప్రత్యేకంగా ఉపయోగిస్తారు.

సోడియం హైడ్రాక్సైడ్

సాధారణ నామం: కాస్టిక్ సోడా

రసాయన ఫార్ములా: $NaOH$

ఉపయోగాలు: సబ్బులు, డిటర్జెంట్ల తయారీలో ప్రధాన ముడి పదార్థం. కాగితం, వస్త్రాల తయారీలో, పెట్రోల్ శుద్ధి పరిశ్రమలో వాడతారు. ప్రయోగశాలల్లో ఆమ్లాలను తటస్థీకరించడానికి ఉపయోగిస్తారు.

పొటాషియం హైడ్రాక్సైడ్

సాధారణ నామం: కాస్టిక్ పొటాష్

రసాయన ఫార్ములా: KOH

ఉపయోగాలు: మృదువైన సబ్బుల తయారీలో ప్రధాన ముడి పదార్థం. పొటాష్ ఆధారిత ఎరువుల తయారీకి వినియోగిస్తారు. దీన్ని క్షార బ్యాటరీల తయారీలో ఎలక్ట్రోలైట్‌గా ఉపయోగిస్తారు. ప్రయోగశాలల్లో ఆమ్లాల తటస్థీకరణకు, బయోడీజిల్ తయారీలో ఉత్ప్రేరకంగా వినియోగిస్తారు.

సోడియం క్లోరైడ్

సాధారణ నామం: సాధారణ ఉప్పు

రసాయన ఫార్ములా: $NaCl$

ఉపయోగాలు: వంటల్లో రుచి కోసం, ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి, క్లోరిన్, హైడ్రోజన్, సోడియం హైడ్రాక్సైడ్ తయారీకి ఉపయోగిస్తారు.

✦ శరీరంలో ఎలక్ట్రోలైట్ల సమతౌల్యతను కాపాడుతుంది. దీన్ని ముక్కు దిబ్బడ తొలగించడానికి వాడే నాసల్ డ్రాప్‌లు, డీహైడ్రేషన్ నివారణకు వాడే సెలైన్ ద్రావణం తయారీలో వాడతారు.



హైడ్రోక్లోరిక్ ఆమ్లం

సాధారణ నామం: మురియాటిక్ ఆమ్లం, గాస్ట్రిక్ ఆమ్లం

రసాయన ఫార్ములా: HCl

ఉపయోగాలు: లోహాలను శుభ్రం చేయడానికి వాడతారు. PVC (పాలీవినైల్ క్లోరైడ్), ప్లాస్టిక్‌ల తయారీలో ముడి పదార్థంగా ఉపయోగిస్తారు. చర్మ పరిశ్రమలో తోళ్లను శుద్ధి చేయడానికి, ఫ్లోర్ క్లీనర్‌ల తయారీలో వినియోగిస్తారు. జీర్ణాశయంలో సహజంగా ఉండే జఠర రసంలోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఆహారం జీర్ణం కావడానికి సహాయపడుతుంది.

అమ్మోనియం నైట్రేట్

సాధారణ నామం: ఎరువు ఉప్పు

రసాయన ఫార్ములా: NH_4NO_3

ఉపయోగాలు: దీన్ని ఎరువుగా వాడతారు. అధిక నైట్రోజన్‌ను కలిగిన ఎరువు (34%–35% N) కాబట్టి పంటల వృద్ధికి చాలా ఉపయుక్తం.

✦ పేలుడు పదార్థాల తయారీలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఖనిజ పరిశ్రమలో, గనుల తవ్వకాల్లో పేలుడు పదార్థంగా వాడతారు.

✦ నీటిలో కరిగించినప్పుడు ఉష్ణాన్ని గ్రహించుకుంటుంది. కాబట్టి దీన్ని చల్లని ప్యాక్‌ల (Instant Cold Packs) తయారీలో వినియోగిస్తారు.



సోడియం కార్బోనేట్

సాధారణ నామం: వాషింగ్ సోడా

రసాయన ఫార్ములా: $Na_2CO_3.10H_2O$

ఉపయోగాలు: గాజు, సబ్బులు, డిటర్జెంట్ల తయారీలో ప్రధాన ముడి పదార్థం. కాగితం పరిశ్రమలో మలినాలు తొలగించడానికి వాడతారు. వస్త్రాలు శుభ్రం చేయడానికి వాషింగ్ సోడాగా వినియోగిస్తారు. అగ్నిమాపక పరికరాల్లో (Fire Extinguishers) ఉపయోగిస్తారు.

✦ బఫర్ ద్రావణాల తయారీలో, నీటి కాఠిన్యతను తొలగించడానికి దీన్ని వాడతారు.

నైట్రిక్ ఆమ్లం

సాధారణ నామం: ఆక్వా ఫోర్టిస్

రసాయన ఫార్ములా: HNO_3

ఉపయోగాలు: అమ్మోనియం నైట్రేట్ లాంటి ఎరువులు, ప్లాస్టిక్‌లు, ఔషధాల తయారీలో ప్రధాన ముడి పదార్థం.

✦ ట్రైనైట్రోటోలీన్ (TNT), నైట్రోగ్లిసరిన్ (TNG) అనే పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగిస్తారు.

✦ లోహ పరిశ్రమల్లో లోహాన్ని శుభ్రపరిచేందుకు, ఆక్వా రీజియా మిశ్రమంగా గోల్డ్, సిల్వర్ శుద్ధిలో వినియోగిస్తారు.

సల్ఫ్యూరిక్ ఆమ్లం


సాధారణ నామం: ఆయిల్ ఆఫ్ విట్రియోల్

రసాయన ఫార్ములా: H_2SO_4

ఉపయోగాలు: అమ్మోనియం సల్ఫేట్ లాంటి ఎరువుల తయారీలో ముడి పదార్థం. పెట్రోలియం శుద్ధిలో ఉపయోగిస్తారు. అద్దకాలు, పేలుడు పదార్థాలు, ఔషధాల తయారీలో వాడతారు.

✦ లెడ్-యాసిడ్ బ్యాటరీలు, లోహ పరిశ్రమలో లోహాన్ని శుభ్రపరిచే ప్రక్రియలో వినియోగిస్తారు.

✦ ప్రయోగశాలల్లో నిర్జలీకరణ కారకంగా, ఇతర రసాయనాల తయారీలో ముడి పదార్థంగా వాడతారు.



కాల్షియం కార్బోనేట్

సాధారణ నామం: సున్నపురాయి, మార్బుల్, చాక్

రసాయన ఫార్ములా: $CaCO_3$

ఉపయోగాలు: సిమెంట్, గాజు తయారీలో ప్రధాన ముడి పదార్థం. ఇనుము, ఉక్కు పరిశ్రమలో ఫ్లక్స్‌గా ఉపయోగిస్తారు. కాగితం, రబ్బరు, ప్లాస్టిక్ పరిశ్రమల్లో ఫిల్లర్ పదార్థంగా వాడతారు. మట్టిలో ఆమ్లత్వం తగ్గించడానికి, ఎముకల బలానికి వాడే కాల్షియం సప్లిమెంట్స్, చాక్ స్టిక్‌ల తయారీలో ఉపయోగిస్తారు.

కాల్షియం ఆక్సైడ్

సాధారణ నామం: క్విక్ లైమ్

రసాయన ఫార్ములా: CaO

ఉపయోగాలు: సిమెంట్, గాజు తయారీలో ముడి పదార్థంగా, ఉక్కు పరిశ్రమలో ఫ్లక్స్‌గా ఉపయోగిస్తారు. నేల ఆమ్లత్వం తగ్గించడానికి వినియోగిస్తారు.

కాల్షియం హైడ్రాక్సైడ్

సాధారణ నామం: స్లేక్డ్ లైమ్, హైడ్రేటెడ్ లైమ్

రసాయన ఫార్ములా: $Ca(OH)_2$

ఉపయోగాలు: సిమెంట్, మోర్టార్ తయారీలో వాడతారు. చక్కెర పరిశ్రమలో మలినాలు తొలగించి శుద్ధి చేయడానికి ఉపయోగిస్తారు. కాగితం, రంగులు, పెయింట్ల తయారీలో, ఇళ్లు, గోడలకు పూసే వైట్ వాష్‌లో, నీటిలో బ్యాక్టీరియా నివారణ కోసం వాడే బ్లీచింగ్ పౌడర్ తయారీలో ఉపయోగిస్తారు

అమ్మోనియం హైడ్రాక్సైడ్

సాధారణ నామం: ఆక్వా అమ్మోనియా

రసాయన ఫార్ములా: NH_4OH

ఉపయోగాలు: రంగులు, ప్లాస్టిక్‌ల తయారీలో ముడి పదార్థం. యూరియా లాంటి ఎరువుల తయారీలో వినియోగిస్తారు.

✦ గాజు, పింగాణీ, స్టెయిన్‌లెస్ స్టీల్ వస్తువులపై గ్రీజు మరకలు శుభ్రపరిచే ద్రావణాల ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తారు.

✦ పరిశ్రమల్లో pH-విలువలను నియంత్రించడానికి, ప్రిజర్వేటివ్‌గా వాడతారు.

సోడియం బైకార్బోనేట్

సాధారణ నామం: బేకింగ్ సోడా

రసాయన ఫార్ములా: $NaHCO_3$

ఉపయోగాలు: దీన్ని వంటల్లో బేకింగ్ సోడాగా, పానీయాలు, ఆహార పరిశ్రమల్లో pHను కంట్రోల్ చేయడానికి వాడతారు. గృహోపకరణాలను శుభ్రపరిచే పదార్థంగా, యాంటాసిడ్‌గా గ్యాస్ట్రిక్ ఆమ్లాన్ని తగ్గించడానికి ఉపయోగిస్తారు.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

Word of the Day

749

Liability

Telugu meaning: భారం, రుణం

English meaning: The word liability (లయబిలిటీ) is a noun that describes a legal or financial responsibility; it can also mean a disadvantage or burden.

Synonyms: Responsibility, Burden

Antonyms: Asset, Advantage

Usage: 1. His poor communication skills became a liability during the team project.

2. The company had to report all its liabilities and assets in the financial statement.

కరెంట్ అఫైర్స్ - వీడియో లెసన్

పోటీపరీక్షల్లో కీలకమైన కరెంట్ అఫైర్స్‌ను ఈనాడు ఈప్రతిభ ఇప్పుడు **వీడియో లెసన్** రూపంలోనూ మీకు అందిస్తోంది. వారంలో జరిగిన ముఖ్య సంఘటనలను అంశాలవారీగా మీ ముందుకు తీసుకువచ్చింది. ఇవేకాకుండా వీటి నుంచి ఎలాంటి ప్రశ్నలు అడగొచ్చు, ప్రశ్నా సరళి, వేటిని గుర్తుంచుకోవాలనే అంశాలను మీకు అందిస్తోంది.
2025, జులై 15 నుంచి 21 వరకు జరిగిన ముఖ్యమైన విషయాలకు సంబంధించిన వీడియో **'ఈనాడు ఈప్రతిభ' యూట్యూబ్ ఛానల్‌లో** అందుబాటులో ఉంది. చూసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

షోడశ మహాజనపదాలు - రాజధానులు - ప్రస్తుత ప్రాంతం

స్టడీ - జోన్

పూర్వం ప్రజలు నీటివసతి ఉన్న ప్రాంతాల్లో నివాసాలు ఏర్పర్చుకుని చిన్న సమూహాలుగా జీవించేవారు. వీరినే తెగలు అనేవారు. తర్వాతి కాలంలో వీరి సంఖ్య వృద్ధి చెంది గణాలుగా (వివిధ తెగల సమూహం) ఏర్పడ్డారు. వీటికి తెగ పెద్దలు అధిపతులుగా ఉండేవారు. తెగ సంస్కృతి తగ్గిపోవడం, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావడం వల్ల బలమైన పాలకుడి అవసరం ఏర్పడింది. ఇది రాచరిక వ్యవస్థకు దారితీసింది. ఈ విధంగా గణాలు క్రీ.పూ.ఆరో శతాబ్దానికి జనపదాలుగా ఏర్పడ్డాయి. ప్రజలు నివసించే ప్రాంతాలను జనపదాలు అంటారు. ఇవి అభివృద్ధి చెందుతూ మహాజనపదాలుగా అవతరించాయి. వీటినే 'షోడశ (16) మహాజనపదాలు' అంటారు. ఇవి శక్తిమంతమైన సామ్రాజ్యాలకు పునాది వేశాయి.

✦ రుగ్వేదంలో 'జన' అంటే ప్రజలు అని అర్థం. రుగ్వేద కాలంలో ప్రజలు నివసిస్తున్న గ్రామాలే జనపదాలు.

✦ ఈ 16 మహాజనపదాల్లో రాజ్యాల మధ్య తరచూ యుద్ధాలు జరిగేవి. ఈ రాజ్యాలను క్షత్రియ వంశానికి చెందిన రాజులే ఎక్కువగా పాలించారు. ఇవి వింధ్య పర్వతాలకు ఉత్తరంగా, ఈశాన్య సరిహద్దు నుంచి బిహార్ వరకు. తూర్పు గంగా మైదానం నుంచి బెంగాల్ వరకు విస్తరించాయి. ఆ రాజ్యాలు - వాటి రాజధానులు, ప్రస్తుతం ఉన్న ప్రాంతాలను గమనిస్తే..

సంఖ్య	పేరు	రాజధాని	ప్రస్తుత ప్రాంతం
1	కాశీ	వారణాసి	బెనారస్ (యూపీ)
2	కోసల	శ్రావస్తి కుషావటి - ఉత్తరకోసల	ఔద్ (యూపీ)
3	అంగ	చంప	తూర్పు బిహార్
4	మగధ	పాటలీపుత్రం	దక్షిణ బిహార్
5	వజ్జి	వైశాలి	ఉత్తర బిహార్
6	మల్ల	కుశినగరం	గోరఖ్‌పూర్ (యూపీ)
7	చేది	శుక్తిమతి	బుందేల్‌ఖండ్ (ఎంపీ)
8	వత్స	కౌశాంబి	అలహాబాద్ (యూపీ)
9	కురు	ఇంద్రప్రస్థం, హస్తినాపురం	దిల్లీ, మీరట్ (యూపీ)
10	పాంచాల	అహిచ్ఛత్రం, కాంపిల్య	బదాన్, ఫరుకాబాద్ (యూపీ)
11	మత్స్య	విరాటనగరం	బైరాట్ (రాజస్థాన్)
12	శూరసేన	మధురానగరం	మధుర
13	అశ్మక/ అస్మక	పొటాన్/ బోధన్	నిజామాబాద్ (తెలంగాణ)
14	అవంతి	ఉజ్జయిని	మాల్వా (ఎంపీ)
15	గాంధార	తక్షశిల	పాకిస్థాన్, అఫ్గానిస్థాన్
16	కాంభోజ	రాజపురం/ భోజపురం	పశ్చిమోత్తర ప్రాంతం

నోటిఫికేషన్స్

జనరలిస్ట్ ఆఫీసర్లు (స్కేల్ II) పోస్టులు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పుణె దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో 500 జనరలిస్ట్ ఆఫీసర్ (స్కేల్ II) పోస్టుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ఫీజు రూ.1,180. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రొఫెసర్ ఉద్యోగాలు

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) పాండిచ్చేరి, కరైకల్ రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 98. దరఖాస్తు ఫీజు రూ.1500. అర్హులైన అభ్యర్థులు 2025 సెప్టెంబరు 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 22) చివరి తేదీ

✦ యూపీఎస్సీ ఈపీఎఫ్ఓలో 230 అకౌంట్ ఆఫీసర్ ఉద్యోగాలు. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

✦ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 35 పోస్టులు. టెన్త్, డిప్లొమాలో ఉత్తీర్ణులు అర్హులు.

✦ ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీ పోస్టులు. పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

✦ ఇండియన్ ఆర్మీ - 66వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) కోర్సు. బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

SSC Exams Special
General Awareness

Current Affairs

1. Which filmmaker's movie 'Homebound' won the top honours at the Indian Film Festival of Melbourne 2025?
A) Anurag Kashyap
B) Neeraj Ghaywan C) Shoojit Sircar
D) Zoya Akhtar

2. L. Ganesan, who recently passed away at the age of 80, was serving as the Governor of which Indian state?
A) Assam B) Manipur
C) Sikkim D) Nagaland

3. The Board of Control for Cricket in India (BCCI) will first implement the "serious injury replacement substitute" rule in which tournament of the upcoming domestic season?
A) Ranji Trophy
B) Irani Cup C) Duleep Trophy
D) Vijay Hazare Trophy

4. The Himalayan Kingfisher was unveiled as the mascot for the first-ever Khelo India Water Sports Festival. Where will this event be held?
A) Nainital Lake B) Tehri Lake
C) Pangong Lake D) Dal Lake

5. Tanya Hemanth recently won the Women's Singles Title at the Saipan International 2025. This tournament is related to which sport?
A) Table Tennis B) Lawn Tennis
C) Badminton D) Squash

6. Who will assist the Prime Minister in raising the tricolour during the Independence Day celebrations?
A) Flight Lieutenant Shivangi Singh
B) Squadron Leader Avani Chaturvedi
C) Flying Officer Rashika Sharma
D) Wing Commander Bhawana Kanth

General Knowledge

7. Lewis Carroll, author of "Alice's Adventures in Wonderland," was also known for his contribution in which field apart from literature?
A) Physics B) Mathematics
C) Medicine D) Astronomy

8. The Sarangi, a bowed string instrument, is primarily associated with which tradition?
A) Carnatic classical music of South India
B) Hindustani classical music of North India
C) Western classical music
D) Central Asian folk music

9. Mamita dance, performed during the harvest festival, is associated with which Indian state?
A) Assam B) Manipur
C) Tripura D) Meghalaya

General Science

10. Anthracene ($C_{14}H_{10}$) is best described as which of the following?
A) A three-fused benzene ring aromatic hydrocarbon
B) A nitrogen-containing heterocyclic compound
C) An aliphatic saturated hydrocarbon
D) A halogenated organic compound

11. Arne Tiselius received the Nobel Prize in Chemistry in 1948 for his research on which subject?
A) Radioactivity and nuclear fission
B) Photosynthesis in plants
C) Electrophoresis and adsorption analysis
D) Structure of proteins

12. Paramecium is commonly studied as a representative of which group?
A) Algae B) Amoeboid protozoa
C) Fungi D) Ciliated protozoa

13. Craniology is the study of what?
A) Structure of brain
B) Bones of vertebral column
C) Shape and size of skull of different human races
D) Nervous system

Polity

14. The Taxation Law Amendment Act, 2021 was enacted to withdraw tax demands related to which issue?
A) Agricultural subsidies
B) Retrospective taxation on indirect transfer of Indian assets
C) Corporate social responsibility
D) Export duties on petroleum

15. Under which Article of the Indian Constitution can the President be removed through the process of impeachment for violation of the Constitution?
A) Article 56
B) Article 72
C) Article 63
D) Article 61

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

బ్రిటన్‌లో తగ్గుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య

లండన్: ఉన్నత విద్య కోసం తమ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని బ్రిటన్ హోంశాఖ గురువారం విడుదల చేసిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. బ్రిటన్‌లో విద్యార్థి వీసాలు పొందుతున్న దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉండగా భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ ఏడాది జూన్ నాటికి 98,014 మంది భారతీయ విద్యార్థులు బ్రిటన్ వీసాలు పొందగా అవి పొందిన చైనీయుల సంఖ్య 99,919. గత సంవత్సరంతో పోలిస్తే భారతీయ విద్యార్థుల సంఖ్య 11 శాతం, చైనా విద్యార్థుల సంఖ్య 7 శాతం తగ్గాయి. మరోవైపు బ్రిటన్ ప్రవేశ పత్రాలను ఉల్లంఘించిన 2,715 మంది భారతీయుల్ని నిర్బంధించినట్లు హోంశాఖ పేర్కొంది. అనంతరం వారిని బెయిలుపై విడుదల చేశామని తెలిపింది. వర్క్ వీసాలను కుదించిన కారణంగా బ్రిటన్‌కు అక్రమ మార్గాల్లో వచ్చే ప్రవాసుల సంఖ్య 30 శాతం మేరకు పడిపోయింది.

రక్తపు మడుగులో ఒకే కుటుంబంలోని ముగ్గురి మృతదేహాలు

- దిల్లీలో ఘటన

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హత్యకు గురైన ఘటన మైదాన్‌గఢీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలోని మైదాన్‌గఢీలోని ఓ ఇంటి నుంచి రక్తం బయటకు రావడాన్ని గురువారం ఉదయాన్నే గమనించిన స్థానికులు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటిలోకి వెళ్లి చూడగా ఆ ఇంట్లో ఉండే ప్రేమ్ సింగ్ (45), రజని (40), వారి పెద్ద కుమారుడు రితిక్ (24) మృతదేహాలు రక్తపు మడుగులో కనిపించాయి. మృతుల మెడలపై కత్తి గాట్లు, ఇనుపరాడ్‌తో తలలపై కొట్టిన గుర్తులు ఉండటంతో వారిపై దాడిచేసి అత్యంత దారుణంగా హతమార్చినట్లు భావిస్తున్నారు. కుటుంబ సమస్యతో బాధపడుతున్న ప్రేమ్ సింగ్ చిన్న కుమారుడు సిద్ధార్థ్ ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి సిద్ధార్థ్ కనిపించకుండా పోవడంతో అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు.

సామూహిక అత్యాచార ఘటన.. బధిర బాధితురాలి ఆత్మహత్య

ఘాజియాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘాజియాబాద్‌లో ఇటీవల సామూహిక అత్యాచారానికి గురై తీవ్ర మనోవేదన అనుభవించిన మూగ, చెవిటి దళిత యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 23 ఏళ్ల బాధితురాలు ఫ్యానుకు ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఈ నెల 18న ముగ్గురు వ్యక్తులు బాధితురాలిని అపహరించి అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల్లో ఇద్దరిని ఇప్పటికే అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగొచ్చిన బాధితురాలు బుధవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడడం విషాదం నింపింది.

ట్రంప్‌నకు జరిమానా రద్దు

న్యూయార్క్: ఒక సివిల్ కేసుకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు విధించిన భారీ జరిమానాను న్యూయార్క్ అప్పీల్ కోర్టు కొట్టివేసింది. తన సంపద విలువను చాలా ఎక్కువ చేసి చూపారన్న ఆరోపణపై న్యూయార్క్‌కు చెందిన అప్పీలేట్ కోర్టు ట్రంప్‌పై 51.5 కోట్ల డాలర్ల జరిమానా విధించింది. ఈ జరిమానా అమలైతే ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపార సామ్రాజ్యం కుదేలయ్యేది.

'టిబెట్ అటానమస్' వేడుకల్లో పాల్గొన్న జిన్‌పింగ్

బీజింగ్: టిబెట్ స్వతంత్ర ప్రాంత (టీఏఆర్) 60వ వార్షికోత్సవ వేడుకల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాల్గొన్నారు. టిబెట్ రాజధాని లాసాలోని పొటాలా ప్యాలెస్ కూడలిలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి 20,000 మంది హాజరయ్యారు. పొటాలా ప్యాలెస్ దలైలామాకు శీతాకాల విడిది. శతాబ్దాలపాటు రాజకీయ, ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఇది కేంద్రంగా నిలుస్తోంది. 1950లో టిబెట్‌ను స్వాధీనం చేసుకున్న చైనా.. 1965లో టీఏఆర్‌ను ఏర్పాటు చేసింది. దీనిని టిబెట్ జిజాంగ్‌గా ఆ దేశం పిలుస్తోంది. చైనా ఆధిపత్యం నేపథ్యంలో 1959లో దలైలామాతోపాటు భారీ సంఖ్యలో టిబెటన్లు.. భారత్‌కు ఆశ్రయం కోసం వచ్చారు. అప్పటి నుంచి హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఉంటున్నారు. దలైలామా నాయకత్వాన్ని చైనా వ్యతిరేకిస్తోంది.

తైవాన్ విషయంలో భారత్ వివరణతో ఆశ్చర్యపోయాం

- చైనా వ్యాఖ్య

బీజింగ్: చైనాలో తైవాన్ భాగమని దిల్లీలో చర్చల సందర్భంగా విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారంటూ వచ్చిన కథనాలను భారత్ ఖండించడం పట్ల చైనా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 'తైవాన్ అంశంపై మా దేశ సార్వభౌమాధికారాన్ని భారత్‌లో కొందరు తక్కువగా అంచనా వేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరం. చైనా, భారత్ సంబంధాల పురోగతికి ఇది ప్రతిబంధకంగా ఉన్నట్లు కనిపిస్తోంది. తైవాన్ అంశంపై భారత్ వివరణ మమ్మల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయంపై మేం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాం. దీన్ని మా దేశం గట్టిగా వ్యతిరేకిస్తోంది' అని చైనా విదేశాంగ అధికార ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు.

పాక్‌లో చైనా విదేశాంగ మంత్రి

ఇస్లామాబాద్: పరిశ్రమలు, వ్యవసాయం, మైనింగ్ రంగాల్లో మరింతగా సహకరించుకోవాలని చైనా, పాకిస్థాన్ నిర్ణయించాయి. చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్, ఆర్థిక, వాణిజ్య రంగాలపైనా భాగస్వామ్యాన్ని కొనసాగించాలని నిశ్చయించాయి. గురువారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి.. పాక్ మంత్రి ఇషాక్ దార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చాయి. ప్రాంతీయ శాంతి సుస్థిరతలో రెండు దేశాల పాత్ర ఎంతో ఉందని వారు పేర్కొన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు పాక్ కృషి చేస్తోందని వాంగ్ తెలిపారు.

సార్వత్రిక ఫలితాలను తారుమారు చేసిన భాజపా

- ఓట్ల చోరీ రాజ్యాంగంపై దాడి
- ప్రధానమంత్రి కూడా ఓట్లను తస్కరించారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆరోపణలు
- బిహార్‌లో తిరిగి ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర'



యాత్రలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

ముంగేర్, షేక్‌పురా, దిల్లీ: గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలను భాజపా తారుమారు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం (ఈసీ)తో కాషాయ పార్టీ కుమ్మక్కై బిహార్ ప్రజల ఓటు హక్కును హరించేందుకు చేస్తున్న యత్నాన్ని ఇండియా కూటమి అడ్డుకుంటుందని పేర్కొన్నారు. ఒక రోజు విరామం తర్వాత బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'ను గురువారం తిరిగి ప్రారంభించారు. అందులో భాగంగా ముంగేర్‌లో భారీ వర్షంలో నిర్వహించిన సభలో 'ఓట్ల చోరీ'ని రాజ్యాంగంపై దాడిగా రాహుల్ అభివర్ణించారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణ చేపట్టడం ద్వారా ఈసీతో కుమ్మక్కై భాజపా ఓట్ల చోరీకి యత్నిస్తోందన్నారు.

పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కోసమే..

అంతకుముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందన్నారు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా యువతతో సమావేశమైన వీడియోను 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేస్తూ.. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు తమ ఓటు శక్తిని వినియోగించాలని రాహుల్ పిలుపునిచ్చారు. సరైన ఓటరు జాబితాలే స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు పునాదిగా పేర్కొన్నారు. "ప్రియమైన భారత ఓటరులారా.. మిమ్మల్ని సూటిగా ఓ ప్రశ్న అడగదలచుకుంటున్నాను. ఓట్లను దొంగిలించి ఏర్పడిన ప్రభుత్వానికి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశం ఉంటుందా? ఉండదు కదా? వారికి (కేంద్రానికి) మీ ఓట్లతో పనిలేదు కాబట్టి మీ సమస్యలను వారు పట్టించుకోరు. పెద్దనోట్ల రద్దు, కొవిడ్ మహమ్మారి, రైతు ఉద్యమంతో వేలమంది మరణించినా ప్రధానమంత్రి సహాయం అందించలేదు. సానుభూతి చూపించలేదు. ఎందుకంటే? ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోలేదు కాబట్టి. ఓట్లను దోచుకోవడం ద్వారా ఈ సర్కార్ ఏర్పడింది. మీరు (ప్రజలు) జీవించి ఉన్నా, మరణించినా, లేదా బాధపడుతున్నా వారికి(కేంద్రానికి) ఏం పట్టదు. ప్రజలు ఓట్లేసినా లేకున్నా ఓట్ల చోరీ ద్వారా తాము అధికారంలోకి రాగలమన్నది వారి నమ్మకం. మీ కోసం పనిచేసే నిజమైన ప్రభుత్వాన్ని మీరు ఎన్నుకోండి. అది మీ కోసం బాధ్యతగా వ్యవహరిస్తుంది. జవాబుదారీతనంగా ఉంటుంది. మదర్ ఇండియాను, రాజ్యాంగాన్ని, దేశాన్ని మీ ఓటుతో కాపాడండి'' అని దేశ ప్రజలకు రాహుల్ సూచించారు. ఓటర్ అధికార్ యాత్రలో నీతీశ్ కుమార్ ప్రభుత్వంపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శలు గుప్పించారు.

రాహుల్ కారు డ్రైవరుపై ఎఫ్ఐఆర్

బిహార్‌లోని నవాదా జిల్లాలో 'ఓటర్ అధికార్ యాత్ర' సందర్భంగా రాహుల్ గాంధీ కారు డ్రైవరు ఓ కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆ కారు డ్రైవరుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు గురువారం అధికారులు వెల్లడించారు.

ఆ బిల్లు నీతీశ్, చంద్రబాబు కోసం కూడా

- కాంగ్రెస్ నేత కన్నయ్య కుమార్ ఆరోపణ

లఖిసరాయ్: రాజ్యాంగానికి 130వ సవరణ కోసం ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు భాజపా మిత్ర పక్షాలు తోకజాడించకుండా ఉండేందుకేనని కాంగ్రెస్ నేత కన్నయ్య కుమార్ మంగళవారం ఆరోపించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మరోసారి ప్లేటు ఫిరాయించకుండా ఈ బిల్లు ద్వారా అడ్డుకోవాలన్నది వారి ఉద్దేశమన్నారు. "భాజపా తన ప్రత్యర్థులతో పాటు మిత్రులైన నీతీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు వంటి వారిపైనా ఒత్తిడి ఉంచాలని భావిస్తోంది. అలాగే మరో సారి కూటములు మార్చే యత్నానికి ఒడిగడితే కేసు పెట్టి, 30 రోజులపాటు జైల్లో పెట్టి, పదవీచ్యుతుడిని చేస్తామని నీతీశ్‌కు భాజపా సంకేతాన్ని పంపుతోంది. అలా జరిగినప్పుడు జేడీయూకు చెందిన ఎమ్మెల్యేలందరినీ కొనుగోలు చేసి వారితో 'నరేంద్ర మోదీ జిందాబాద్ అని పాట పాడిస్తుంది'' అని కన్నయ్య కుమార్ పేర్కొన్నారు. తీవ్ర అభియోగాలతో అరెస్టు అయితే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులను పదవి నుంచి తప్పించేందుకు ఉద్దేశించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

అర్జెంటీనాకు పారిపోవాలనుకున్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు



జైర్ బోల్సోనారో

ఇంటర్నెట్ డెస్క్: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో అర్జెంటీనాకు పారిపోవాలని అనుకున్నారని, రాజకీయ ఆశ్రయం కోరారని అక్కడి ఫెడరల్ పోలీసులు వెల్లడించారు. వీటికి సంబంధించి ఫోన్ మెసేజ్‌లను గుర్తించినట్లు బుధవారం తెలిపారు. గత ఎన్నికల్లో బోల్సోనారో కుట్ర పన్నారనే ఆరోపణలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో బోల్సోనారో, ఆయన కుమారుడు ఎడ్వర్డోలు న్యాయ విచారణను అడ్డుకున్నారన్న ఆరోపణలపై బ్రెజిల్ ఫెడరల్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుట్ర కేసుకు సంబంధించి 170 పేజీల దర్యాప్తు నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఇందులోని మెసేజింగ్ యాప్, వాయిస్ మెసేజ్‌లు సహా పలు కీలక డాక్యుమెంట్ల పరిశీలనలో రాజకీయ ఆశ్రయం కోసం అర్జెంటీనా అధ్యక్షుడిని అభ్యర్థించినట్లు పోలీసులు గుర్తించారు. బ్రెజిల్‌లో తాను రాజకీయ అణచివేతకు గురవుతున్నానని, ప్రాణభయం ఉందని బోల్సోనారో పేర్కొన్నట్లు తెలిసింది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఫిబ్రవరిలో హంగరీ రాయబార కార్యాలయంలో రెండ్రోజులపాటు తల దాచుకున్నట్లు సమాచారం. అమెరికాలో ఉంటున్న బోల్సోనారో కుమారుడు ఎడ్వర్డో బోల్సోనారో తాజా పరిణామాలపై స్పందించారు. బ్రెజిల్‌లో కొనసాగుతున్న ఏ ప్రక్రియలోనూ తాను జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని స్పష్టంచేశారు.

మనసుకైన గాయాన్ని మరువలేను

- టోల్‌గేటు సిబ్బంది దాడిలో గాయపడ్డ సైనికుడి ఆవేదన

మేరఠ్: సరిహద్దులో ప్రాణాలకు వెరవకుండా విదేశీ శత్రువును ఎదుర్కొనే తాను.. స్వదేశంలో తనపై జరిగిన దాడిని భరించలేకపోతున్నానని గతవారం మేరఠ్‌లో టోల్‌గేటు సిబ్బంది దాడిలో గాయపడిన సైనికుడు కపిల్ పన్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. శరీరానికి తగిలిన గాయాలు త్వరగానే మానిపోతాయిగానీ మనసుకైన గాయం జీవితాంతం మిగిలిపోతుందని గురువారం పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 17న రాత్రి స్వగ్రామం గోట్కా నుంచి కారులో దిల్లీ విమానాశ్రయానికి పన్వర్ వెళుతున్నారు. దిల్లీ నుంచి ఆయన విమానంలో శ్రీనగర్ వెళ్లి విధుల్లో చేరాల్సి ఉంది. టోల్‌గేటువద్ద తన గుర్తింపు కార్డును చూపి తన కారును త్వరగా వెళ్లనివ్వాలని కోరారు. కానీ సిబ్బంది ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో పన్వర్‌తోపాటు అతడి ఇద్దరు స్నేహితులకు గాయాలయ్యాయి. దాడికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది.

టిబెట్‌లో అతిపెద్ద సౌర పార్కు

టలటాన్: ప్రపంచంలోనే అతి పెద్ద సౌర పార్కును టిబెట్‌లో చైనా నిర్మిస్తోంది. 610 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మించే ఈ పార్కు అమెరికాలోని షికాగో నగరమంత సైజులో ఉంటుంది. గత నెలలో దీనికి శ్రీకారం చుట్టింది. సౌర, పవన విద్యుదుత్పాదన ఊపందుకున్నందున ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో చైనా కర్బన ఉద్గారాలు 1 శాతం తగ్గాయి.

భారత్‌ను స్వేచ్ఛాయుత భాగస్వామిగా గుర్తించాలి

- ఐరాసలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ



న్యూయార్క్: భారత్‌తో క్షీణిస్తున్న సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడానికి అమెరికా ప్రాధాన్యం ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో అమెరికా మాజీ రాయబారి, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు నిక్కీ హేలీ కోరారు. భారత్‌ను విలువైన స్వేచ్ఛాయుత ప్రజాస్వామిక భాగస్వామిగా పరిగణించాలని సూచించారు. భారత దిగుమతులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలను విధించడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు ఒత్తిడికి గురయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా న్యూస్ వీక్‌కు రాసిన వ్యాసంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాతో పోటీని అధిగమించాలంటే భారత్‌తో బంధాలను ట్రంప్ తిరిగి గాడిలో పెట్టాలన్నారు. చైనాలా భారత్‌ను ప్రత్యర్థిగా భావించరాదని కోరారు. ఆసియాలో చైనా ఆధిపత్యం తగ్గించేందుకు భారత్‌తో ఏర్పడిన 25 ఏళ్ల బలమైన బంధానికి దూరం కావడం వ్యూహాత్మక విపత్తు అవుతుందని ఆమె అభివర్ణించారు. పొరుగు దేశాలైన భారత్-చైనా మధ్య బలమైన బంధం ఏర్పడటం సులువైన విషయమని, దీన్ని అమెరికా గుర్తించాలని సూచించారు. ప్రజాస్వామిక దేశమైన భారత్ ఎదుగుదలతో కమ్యూనిస్టు నియంత్రిత చైనాకు తప్ప స్వేచ్ఛాయుత ప్రపంచానికి ముప్పు లేదని నిక్కీ హేలీ అభిప్రాయపడ్డారు.

అమెరికా చట్టసభ సభ్యులతో భారత రాయబారి భేటీ

అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా ప్రముఖ చట్టసభ సభ్యులతో గురువారం భేటీ అయ్యారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్ వస్తువులపై 50 శాతం సుంకం విధించిన నేపథ్యంలో వాషింగ్టన్-దిల్లీల మధ్య సంబంధాలు ఒత్తిడికి గురైన తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

జమ్మూకు సీఆర్‌పీఎఫ్ బలగాలు

దిల్లీ: ఉగ్రవాదుల నిర్మూలన వ్యూహంలో భాగంగా జమ్మూ ప్రాంతానికి 3 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లను పంపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు గురువారం తెలిపాయి. ఒక్కో బెటాలియన్‌లో 800 మంది జవాన్లు ఉంటారు. వారికి అత్యాధునిక ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలను ఇస్తారు. ఈ బెటాలియన్లు సైన్యానికి చెందిన మౌలిక వసతులను ఉపయోగించుకుంటాయి. ఉగ్రవాదుల అణచివేతలో రాటుదేలిన జవాన్లతోనే ఈ బెటాలియన్లను కూర్పు చేసి జమ్మూలోని ఉధంపుర్, కథువా జిల్లాలకు పంపుతున్నారు.

అస్సాంలో జర్నలిస్టు అభిసార్ శర్మపై కేసు

గువాహటి: అస్సాం, కేంద్ర ప్రభుత్వాల పరిపాలనను వ్యంగ్యంగా విమర్శిస్తూ యూట్యూబ్‌లో వీడియోలను అప్‌లోడ్ చేశారన్న ఆరోపణలపై పాత్రికేయుడు, యూట్యూబర్ అభిసార్ శర్మపై కేసు నమోదైంది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మత రాజకీయాలను అనుసరిస్తున్నారని విమర్శిస్తూ ఆయన తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియోను అప్‌లోడ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ, ముస్లింల విభజనతోనే మనుగడ సాగిస్తున్నాయని ఆయన వీడియోల్లో వ్యాఖ్యానించారు.

✦ దేశ ద్రోహం ఆరోపణలపై నమోదైన కేసులకు సంబంధించి పాత్రికేయులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్‌లకు గువాహటి పోలీసులు సమన్లు జారీ చేయడాన్ని విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఇది పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనంటూ ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. దీనిపై జైరాం రమేశ్, తిరుచ్చి శివ, రామ్ గోపాల్ యాదవ్, జయా బచ్చన్‌సహా పలువురు విపక్ష నేతలు సంతకాలు చేశారు.



బిహార్‌లోని పట్నా జిల్లాలో గంగానదిపై నిర్మించిన 1.86 కి.మీ పొడవైన కేబుల్ బ్రిడ్జి ఇది. దీన్ని శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు

వైజ్ఞానిక ఒలింపియాడ్‌లో భారత్‌కు 4 బంగారు పతకాలు

దిల్లీ: ఖగోళశాస్త్ర పరిజ్ఞానానికి సంబంధించిన 18వ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఓఏఏ)లో భారత్ నాలుగు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించిందని గురువారం ఒక అధికార ప్రకటన తెలిపింది. ఈ ఒలింపియాడ్‌లో పాల్గొన్న భారత బృందానికి హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ సంస్థ శిక్షణనిచ్చింది. ఒలింపియాడ్‌లో 64 దేశాలకు చెందిన 300 మంది హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధ పరిశ్రమలో గ్యాస్ లీక్... నలుగురి మృతి

ముంబయి: మహారాష్ట్రలో మెడ్లీ ఫార్మా అనే ఔషధ పరిశ్రమ నుంచి నైట్రోజన్ వాయువు లీక్ కావడంతో నాలుగురు కార్మికులు మరణించారు. ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. పాల్ఘర్ జిల్లాలోని బొయిసర్ పారిశ్రామిక పట్టణం తారాపుర్ ఎంఐడీసీలో ఈ ఘటన జరిగింది. మధ్యాహ్నం 2.30 - 3.00 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. నైట్రోజన్ రియాక్షన్ ట్యాంకు నుంచి వాయువు లీక్ కావడంతో ఆరుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురై అందులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

18 ఏళ్లు దాటితే అస్సాంలో 'ఆధార్' కష్టం!

గువాహటి: అస్సాంలో 18 ఏళ్లు పైబడినవారు ఇంతవరకూ ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేయకుండా ఉంటే.. వారు సెప్టెంబరు 1 నుంచి నెల రోజులపాటు దరఖాస్తు చేసుకోవచ్చని, అక్టోబరు 1 నుంచి కొన్ని వర్గాలకు తప్ప అటువంటి వారికి కొత్త కార్డులను జారీ చేయబోమని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలవారితోపాటు తేయాకు తోటల్లో పని చేసే ఆదివాసీలకు మరో సంవత్సరంపాటు ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉంటుందని వివరించారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు పెరిగిన నేపథ్యంలో ఆధార్ కార్డు దరఖాస్తులపై తాజాగా పరిమితి విధిస్తున్నామని హిమంత పేర్కొన్నారు.



దిల్లీలో కేంద్రమంత్రి జేపీ నడ్డాతో భేటీ అయిన కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ. వయనాడ్‌లో ఆరోగ్యరంగ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా నడ్డాను ఆమె కోరారు

మెక్రాన్‌తో మోదీ ఫోన్ సంభాషణ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. తమ సంభాషణ ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాల చుట్టూ సాగిందని ప్రధాని మోదీ ప్రకటించారు. మెక్రాన్‌తో తన చర్చలు బాగా జరిగాయని ప్రధానమంత్రి తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల చర్చలు జరిపిన యూరోపియన్ నేతల బృందంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో పాటు మెక్రాన్ కూడా ఉన్నారు. భారత్-ఫ్రాన్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఇరువురు నేతలూ ఈ సందర్భంగా కంకణ బద్ధులయ్యారు.

భారత్‌పై అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తున్నాం: చైనా

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌పై అమెరికా సుంకాల పెంపును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చైనా పేర్కొంది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆరోపించింది. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'స్వేచ్ఛా వాణిజ్యంవల్ల ఎంతో ప్రయోజనం పొందిన అమెరికా ఇప్పుడు ఆయా దేశాలపై సుంకాలను ప్రయోగిస్తోంది. భారత్‌పై 50 శాతం మేర సుంకాలు విధించింది. వాటిని మరింత పెంచుతామని హెచ్చరిస్తోంది. వీటిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తాం' అని ఫీహాంగ్ పేర్కొన్నారు.

లిపులేఖ్‌పై నేపాల్ వాదన సమర్థనీయం కాదు

- దశాబ్దాలుగా అక్కడ నుంచి వాణిజ్యం సాగుతోంది: భారత్

దిల్లీ: లిపులేఖ్ కనుమ ద్వారా సరిహద్దు వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించాలని భారత్-చైనా నిర్ణయించడంపై నేపాల్ లేవనెత్తిన అభ్యంతరాన్ని మన దేశం బుధవారం తోసిపుచ్చింది. ఆ ప్రాంతంపై కాఠ్‌మాండూ చేస్తున్న వాదన సమర్థనీయం కాదని, చారిత్రక వాస్తవాల ఆధారంగా లేవని పేర్కొంది. లిపులేఖ్ కనుమ సహా మరో రెండు వాణిజ్య కూడళ్ల నుంచి సరిహద్దు వాణిజ్యాన్ని ప్రారంభించాలని భారత్-చైనా మంగళవారం నిర్ణయించాయి. దీనిపై నేపాల్ విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందిస్తూ..ఆ ప్రాంతం తమ దేశంలో అవిభాజ్య భాగమని పేర్కొంది. దీనిని విదేశీ వ్యవహారాలశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తోసిపుచ్చారు. లిపులేఖ్ పాస్ ద్వారా భారత్, చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం 1954లో ప్రారంభమై, దశాబ్దాలుగా కొనసాగుతోందని తెలిపారు. ఇటీవల సంవత్సరాల్లో కొవిడ్, ఇతర పరిణామాల కారణంగా వాణిజ్యానికి అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. ఇప్పుడు దానిని తిరిగి ప్రారంభించడానికి భారత్, చైనాలు అంగీకరించాయని చెప్పారు. 1816 సుగౌలి ఒప్పందం ప్రకారం కాలాపానీ, లింపియాధురతో సహా లిపులేఖ్ తమకే చెందుతుందని నేపాల్ వాదిస్తోంది. ఇదిలా ఉండగా లిపులేఖ్ సమస్యను దౌత్యపరమైన చర్యల ద్వారా పరిష్కరించుకోవాలని నేపాల్ చట్టసభ సభ్యులు కొందరు తమ ప్రభుత్వానికి సూచించారు.

8 కేసుల్లో ఇమ్రాన్‌కు బెయిలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం 8 కేసుల్లో బెయిలు మంజూరు చేసింది. 2023 మే 9న జరిగిన హింసాత్మక సంఘటనలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ విడుదల కావాలంటే ఆయనకు శిక్ష పడ్డ అల్ ఖదీర్ ట్రస్టు కేసులో విముక్తి లభించాల్సి ఉంది.

వైకాపా తీరు దొంగే దొంగ అన్నట్టుంది

ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా వాళ్లు, సాక్షి మీడియా చేస్తున్న దుష్ప్రచారాలు చూస్తే దొంగే దొంగ అన్నట్టు, అవినీతిపరులే అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నట్టు ఉందని ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ మండిపడ్డారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమిని భరించలేకే వైకాపా వాళ్లు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన జోగి రమేశ్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుతో చెట్టాపట్టాలేసుకు తిరిగారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసిన నందిగం సురేశ్‌ను ఎంపీని చేశారు' అని రవిచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

విశాఖ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై ఉపసంఘం సమీక్ష

ఈనాడు, అమరావతి: విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్షించింది. సభ్యులు మంత్రులు టీజీ భరత్, కందుల దుర్గేష్, నారాయణ మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశమయ్యారు. భాగస్వామ్య సదస్సులో భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది.

జనసేన విస్తృత సమావేశానికి కమిటీల ఏర్పాటు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఈ నెల 30న నిర్వహిస్తున్న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జనసేన పార్టీ 20 కమిటీలను ఏర్పాటు చేసింది. ఆయా కమిటీల్లో జనసేన ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లకు బాధ్యతలు అప్పగించింది.

ఆహ్వానం, ప్రతినిధుల రిజిస్ట్రేషన్ కమిటీ: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టి. శివశంకర్

పబ్లిసిటీ కమిటీ: ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

మీడియా సమన్వయ కమిటీ: ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు

ఆతిథ్యం కమిటీ: ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు

వీర మహిళల సమన్వయ కమిటీ: ఎమ్మెల్యే నాగమాధవి, పాలవలస యశస్వి, పి. ఉషా కిరణ్

వైద్య బృందం సమన్వయ కమిటీ: ఎమ్మెల్యే వరప్రసాద్, బొడ్డేపల్లి రఘు

రవాణా సమన్వయ కమిటీ: ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పి.వి.ఎస్.ఎన్.రాజు

ప్రాంగణం సమన్వయ కమిటీ: ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు

ప్రాంగణంలో మౌలిక సౌకర్యాల కమిటీ: ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, పంచకర్ల సందీప్

వసతి సదుపాయాల కమిటీ: ఎమ్మెల్యే పంతం నానాజీ, కొరికాన రవికుమార్

సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ: వంపూరు గంగులయ్య

వాలంటీర్ కమిటీ: ఎమ్మెల్యే అరవ శ్రీధర్, బోడపాటి శివదత్, బి.శ్రీనివాస పట్నాయక్

శ్రీలంకలోని సామూహిక శ్మశానవాటికలో చిన్నారుల వస్తువులు లభ్యం

చెమ్మాని: శ్రీలంకలో దశాబ్దాల క్రితం యుద్ధంతో అతలాకుతలమైన ఉత్తర ప్రాంతంలోని చెమ్మాని సామూహిక శ్మశానవాటికలో ఓ స్కూలు బ్యాగు, ఆట బొమ్మ, పిల్లల నీళ్ల సీసా గురువారం బయటపడ్డాయి. ఇటీవల ఈ ప్రాంతంలో 141 మానవ అస్థిపంజరాలు లభ్యమైన సంగతి తెలిసిందే. వాటిలో కొన్ని పిల్లలకు చెందినవి కూడా ఉన్నాయి. తమిళ మైనార్టీలకు సాంస్కృతిక కేంద్రంగా ఉన్న జాఫ్నా నగర సమీపంలోనే చెమ్మాని ఉంది. యుద్ధ సమయంలో శ్రీలంక సైనికులు తమిళులపై సామూహిక హననానికి పాల్పడినట్లు కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రిక్ శ్మశానవాటికను ఏర్పాటు చేయడానికి జూన్‌లో తవ్వకాలు చేపట్టినప్పుడు కొన్ని మానవ అవశేషాలను కనుగొన్నారు. అప్పటినుంచి ఇక్కడ తవ్వకాలు కొనసాగుతున్నాయి.